మాగజైన్ 
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విశాఖపట్నం
: fb.com/vaartha Digital
Published from Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
24-6-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 144 పేజీలు: 16 వెల: 6.50

**అమెరికా పౌరసత్వం ఇక మరింత ఖరీదు** 5లో

**టిఎంసిలో పెరిగిన ఆధిపత్య పోరు**

# రిటైర్మెంట్ 62కు పెంపు

## ప్రభుత్వరంగ సంస్థలు, గురుకులాలు, సొసైటీ ఉద్యోగుల విరమణ వయసు పెంచిన ప్రభుత్వం

### 11వేల మంది ఉద్యోగులకు పాత పెన్షన్ విధానమే

### రూ. 34 వేల కోట్లు పైగా పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం

### సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో పలు అంశాలపై కీలక నిర్ణయాలు


మంగళవారం సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం దృశ్యం

**విజయవాడ,జూన్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్‌లో 30 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర కేబినెట్ శుభవార్త చెప్పింది. సుదీర్ఘకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న పెన్షన్ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపింది. మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వరంగ సంస్థలు, గురుకుల విద్యాసంస్థలు, సొసైటీ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంపుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మెమో 57 ప్రకారం 2004 సంవత్సరానికి ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన సుమారు 11 వేల మంది ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్ ) నుంచి పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పెట్టుబడుల స్థాపనకు పెద్దపీట వేస్తూ మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఇటీవల పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న దాదాపు రూ.34 వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35 వేల ఉద్యోగాల కల్పన సంబంధించిన నిర్ణయాలకు మంత్రులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

ఇపిబి సమావేశంలో ఆమోదించిన కంపెనీలు, పెట్టుబడుల వివరాలు గమనిస్తే ఎన్టీపీసీ రెన్యూవబుల్ ఎనర్జీ, రూ. 6000 కోట్ల పెట్టుబడి, 750 మందికి ఉద్యోగ అవకాశాలు అనంతపురంలో ఆరాధ్య బయోఫ్యూయెల్ ప్రై.లిమిటెడ్ రూ. 75.78 కోట్ల పెట్టుబడి, 402 మందికి ఉద్యోగాలు, కృష్ణా జిల్లాలో సమయ్ బయో సీఎన్జీ చిత్తూర్ ప్రై.లిమిటెడ్ రూ.120 కోట్లు పెట్టుబడి, 260 ఉద్యోగాలు, చిత్తూరుజిల్లాలో శ్రీవాయు బయోఫ్యూయెల్స్, రూ.67.22 కోట్ల పెట్టుబడి, 150 మందికి ఉద్యోగాలు, కాకినాడ జిల్లాలో. ఆంధ్రా బయో ఎనర్జీ, రూ.96.40 కోట్ల పెట్టుబడి, 518 మందికి ఉద్యోగాలు, అనకాపల్లిజిల్లాలో .విక్సిత్ అగ్రి గ్రీన్ ఎనర్జీ, రూ.141.65 కోట్లపెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు, >>2


రాష్ట్రపతి నుంచి పద్మాలు అందుకుంటున్న కెటి థామస్, నోరి దత్తాత్రేయుడు, మమ్ముట్టి, మురళీమోహన్, రాజేంద్రప్రసాద్

# వికసిత 'పద్మా'లు

### రెండో విడత పురస్కారాలు ప్రదానం చేసిన రాష్ట్రపతి ముర్ము

**పద్మవిభూషణ్:** పి. నారాయణన్, జస్టిస్ కెటి థామస్
**పద్మ భూషణ్:** మమ్ముట్టి, నోరి దత్తాత్రేయుడు, డా. విజయ్ అమృతరాజ్, అల్కాయాజ్ఞిక్ మొ॥
**పద్మశ్రీ:** మురళీమోహన్, రాజేంద్ర ప్రసాద్, మాధవన్, రోహిత్ శర్మ, వెంపటి శశిశేఖర్ మొ॥

**న్యూఢిల్లీ,జూన్ 23:** దేశంలో పద్మ అవార్డుల రెండో విడత ప్రధానం అత్యంత ఘనంగా జరిగింది. రాష్ట్రపతిభవన్‌లోని దర్బారీహాలులోజరిగిన ఈకార్యక్రమంలో మళయాళ పాత్రికేయుడు పి.నారాయణన్, సుప్రీం మాజీ న్యాయమూర్తి జెస్టిస్ కెటి థామస్‌లు పద్మవిభూషణ్‌లు అందుకోగా సినీరంగ ప్రముఖులు ముమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తోపాటు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు డా.విజయ్ అమృత్‌రాజ్, డా.ఎస్కేఎం మేలినాథన్, శిబుసోరెన్ (మరణా >>2

# పరవాడ ఫార్మాసిటీలో భారీ అగ్ని ప్రమాదం


అగ్ని ప్రమాద దృశ్యం

### ఇద్దరు కార్మికులు సజీవదహనం

### దక్షిణ ఎనర్జీ పరిశ్రమలో హఠాత్తుగా చెలరేగిన అగ్నికీలలు

### సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి

### అత్యవసర సహాయచర్యలకు ఆదేశం

**అనకాపల్లి (పరవాడ), జూన్ 23, ప్రభాతవార్త:** పరవాడ ఫార్మాసిటీలో మరో విషాద ఘటన చోటుచేసుకుంది. దక్షిణ ఎనర్జీ పరిశ్రమలో మంగళవారం తెల్లవారుజామున సంభ వించిన భారీ అగ్నిప్రమాదంలో ఇద్దరు కార్మికులు మంటల్లో చిక్కుకుని సజీవదహన మయ్యారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలుపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతు న్నాయి. ఫార్మాసిటీలోని దక్షిణ ఎనర్జీ పరిశ్రమలో ప్లాస్టిక్ పైరోలిసిస్ ఆయిల్, కార్బన్ బ్లాక్, ఇంధన ఆయిల్స్ తయారీ జరుగుతోంది. సోమవారం రాత్రి విధులు నిర్వహిస్తున్న సమయంలో మంగళవారం తెల్లవారుజామున ఒక్కసారిగా అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో చోడవరం మండలం అంబేర్‌పురానికి చెందిన వేపాడ వెంకటేష్ (34), అచ్యుతాపురం మండలం జగ్గన్నపేటకు చెందిన బోడేపు త్రినాథ్ (24) మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే రెండు అగ్నిమాపక వాహ >>2


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దృశ్యం


మంగళవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్ముతో భేటీ అయిన ప్రధాని మోడీ

## రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని మోడీ భేటీ

### కేబినెట్ విస్తరణ కోసమేనా? 2లో

### త్వరలో ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు విస్తరణలో ప్రాధాన్యం

# కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ రాజీనామా

### రాష్ట్రపతి ముర్ము ఆమోదం

### ముగిసిన రాజ్యసభ పదవీకాలం



**న్యూఢిల్లీ, జూన్ 23:** రాజ్యసభ సభ్యత్వ కాలం ముగియడంతో, కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్ మంత్రిమండలికి రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో బిజెపి ఆయనను తిరిగి నామినేట్ చేయలేదు. దీంతో ఆయన తన పదవిని వదులుకోవాల్సి వచ్చింది. కురియన్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించినట్లు రాష్ట్రపతి భవన్ మంగళవారం తెలిపింది. కురియన్ మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమశాఖలో కూడా కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిం >>2

# గేట్లు సిద్ధం.. తుంగ'భద్రం'

### రేపు ప్రారంభించనున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ జూన్ 23 ,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు వర ప్రదాయిని అయిన తుంగభద్ర ప్రాజెక్టు ఇప్పుడు కొత్తగేట్ల అమరికతో సరికొత్త రూపును సంతరించుకుంది. రూ.51 కోట్ల వ్యయంతో మొత్తం 33 గేట్ల ఏర్పాటు పనులు పూర్తికాగా, వీటిని ఈ నెల 25వ తేదీన కర్నాటక ముఖ్యమంత్రి శివకుమార్, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. 73 ఏళ్ల క్రితం నిర్మించిన తుంగభద్ర ప్రాజెక్టు రెండు రాష్ట్రాల్లో లక్షల ఎకరాల ఆయకట్టుకు జీవనాడిగా నిలుస్తోంది. అయితే 2024 ఆగస్టులో వచ్చిన వరద ప్రవాహానికి 19వ గేటు కొట్టుకుపోయింది. అప్పటికప్పుడు నీటి వృధాను అడ్డుకునేందుకు ఎపి ప్రభుత్వ చొరవతో, సిఎం చంద్రబాబు సూచనతో సీనియర్ ఇంజనీర్ కన్నయ్య నాయుడు నేతృత్వం వహించి స్టాప్‌లాక్ గేటును అమర్చారు. స్పిల్ వే గేట్లు అన్నీ మార్చాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక ఇవ్వడంతో 6 నెలల్లో కొత్తగేట్లను పూర్తి చేసి ఎపి కర్ణాటక రాష్ట్రాలు పునరుజ్జీవం పోశాయి. తుంగభద్ర ప్రాజెక్టు ద్వారా లక్షలాది ఎకరాలకు సాగు నీరు, వందల గ్రామాలకు తాగునీరుతో ఎపి, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలకు కీలకంగాఉంది. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే తుంగభద్ర ప్రాజెక్టు >>2

### కిరాణా షాపునుంచి డేటా సెంటర్ దాకా

# సింగిల్ పోర్టల్ ద్వారా పర్మిషన్లు

### ఇక ప్రతినెల ప్రధాన ప్రాజెక్టుల భూమిపూజ, ప్రారంభోత్సవాలు

### 20 లక్షల ఉద్యోగాల కల్పనపై లోకేష్ నేతృత్వంలో మంత్రుల బృందం భేటీ



మంగళవారం 20లక్షల ఉద్యోగాల కల్పనపై లోకేష్ నేతృత్వంలో మంత్రుల బృందం భేటీ దృశ్యం

**విజయవాడ,జూన్23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం, కిరాణా కొట్టు నుంచి డేటా సెంటర్ వరకు సింగిల్ పోర్టల్ ద్వారా అనుమతులు మంజూరు చేసే విధానాన్ని రూపొందించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాల కల్పనకు మంత్రి లోకేష్ నేతృత్వంలో ఏర్పాటైన మంత్రుల బృందం సమావేశం ఉండవల్లి నివాసంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేష్, టిజి భరత్ (ఆన్ లైన్ ద్వారా) హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువచ్చిన 750 భారీ పరిశ్రమలు వివిధ దశల్లోఉన్నాయి, ఇవి పూర్తిస్థాయిలో పట్టాలెక్కితే పెద్దఎత్తున రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి, సాధ్యమైనంత త్వరగా ఆయా పరిశ్రమలు గ్రౌండింగ్‌అయ్యేలా పరిశ్రమలశాఖ, ఎకనమిక్ డెవలప్‌మెంట్‌బోర్డు అధికారులు ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ ప్రత్యేకశ్రద్ధ వహించాలని అన్నారు. పనులను వేగవంతంచేసి ప్రతినెలా ప్రాజెక్టుల భూమిపూజ, ప్రారంభోత్సవాలు ఉండేలా అధికారులు చొరవచూపాలని కోరారు.

**పరిశ్రమల ఆకర్షణకు పెద్దఎత్తున రోడ్ షోలకు ప్రణాళికలు**

నవంబర్‌లో నిర్వహించే పార్టనర్ షిప్ సమ్మిట్ నాటికి సాధ్యమైనంత గరిష్టంగా పరిశ్రమలు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గత సమ్మిట్‌కి >>2

# టాటా వాహనం బోల్తా

### రంగంపేట మండలంలో దుర్ఘటన

### ముగ్గురు కార్మికులు మృతి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి ,జూన్ 23(ప్రభాతవార్త):** తూర్పుగోదావరి జిల్లాలోని రంగంపేట మండలం పరిధిలో ఒడిసిలేరు రంగంపేట మధ్య మంగళవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది నిర్మాణ పనులు ముగించుకుని స్వగ్రామాలకు తిరిగి వస్తున్న కార్మికుల ప్రయాణిస్తున్న టాటా ఏస్ వాహనం టైర్ పంచర్ కావడంతో అదుపుతప్పి బోల్తా పడింది ఈ విషాద ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఎనిమిది మంది గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. కాకినాడజిల్లా సామర్లకోట పట్టణం పిఠాపురం మండలంలోని మల్లం, జల్లూరు గ్రామాలకు చెందిన 11మంది కార్మికులు బాపట్ల జిల్లా కొల్లూరు ప్రాంతానికి నిర్మాణపనుల నిమిత్తం వెళ్లారు రెడీమిక్స్ వాల్స్ నిర్మాణం పనులు పూర్తి చేసుకుని మిగిలిన సామాగ్రితో కలిసి స్వగ్రామంతిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది తెల్లవారు >>2



# కొత్తగా 10 బిసి గురుకులాలు

### ఒక్కో గురుకులంలో 37 పోస్టుల భర్తీకి నిర్ణయం

### ఇటీవలే 6 ఎంజెపిలు కళాశాలలుగా అప్‌గ్రేడ్

### నూతన గురుకులాల ఏర్పాటుపై మంత్రి సవిత హర్షం

**విజయవాడ,జూన్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యతోనే బిసిలు మరింత ఉన్నత స్థానాలకు చేరుకోగలరనేది సీఎం చంద్రబాబు నాయుడు బావన. ఇటీవల ఆరు మహాత్మా జ్యోతిరావు పూలే బిసి గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసింది. ఇపుడు బిసి విద్యార్థులకు మేలు కలిగేలా నూతన విద్య సంస్థలు నెలకొల్పాలని నిర్ణయించారు. రాష్ట్రంలో కొత్తగా పది మహాత్మా జ్యోతిరావు పూలే బిసి గురుకుల పాఠశాలల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.ఈ కొత్త గురుకులాల్లో 37 మంది చొప్పున్న ఉద్యోగులను భర్తీ చేయనున్నారు. ఈమేరకు మంగళవారం సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో జరిగిన కేబినెట్ భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో బిసి బిడ్డలందరూ విద్య అభ్యసించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బడి బయట ఏ బిసి బిడ్డా ఉండకూడదనేది సీఎం చంద్రబాబు ప్రధాన ఉద్దేశం. దీనిలో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక వైపు బిసి హాస్టళ్లు, మరో ఎంజేపీ గురుకులాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోంది. సకాలంలో డైట్‌బిల్లులు, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తోంది. మారుతున్న పరిస్థితులకనుగుణంగా సాంకేతిక విద్యకు కూడా ప్రాధాన్యమిస్తోంది. దీంతో బిసిహాస్టళ్లు, ఎంజెపిస్కూళ్లలో తమ పిల్లలను చేర్పించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపతున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం ఎంజేపీ గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేయడం, కొత్త గురుకులాలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టింది.

**ఇటీవల 6 గురుకులాలు అప్ గ్రేడ్..**

ఎంజేపీ గురుకులాల సీట్లకు డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఇటీవల ఆరు బిసి గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసింది. కొత్తవలస >>2

### సాయి కృష్ణ మిస్సింగ్ కేసు

# మాజీ సిఐ నాగరాజు అరెస్టు



### స్టేషన్‌లో సిసి ఫుటేజిలు మాయం

### మే నుండి జూన్ నెల వరకు రెండు రోజుల ఫుటేజి మాత్రమే ఉంచిన వైనం

### కీలక ఆధారాలు మాయం చేశారనే కోణంలో దర్యాప్తు వేగవంతం

**విజయవాడ క్రైం,జూన్ 23,ప్రభాతవార్త:** గాదె సాయికృష్ణ అదృశ్యం కేసు కీలక మలుపులు తిరుగుతోంది. ఈ కేసులో కృష్ణలంక మాజీ సిఐ నాగరాజును సిట్ బృందం మంగళవారం సింగ్‌నగర్‌లో అదుపులోకి తీసుకుంది.ఉదయం తొలుత కృష్ణలంక స్టేషన్‌ను పరిశీలించిన సిట్ ప్రత్యేక దర్యాప్తు బృందం కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌తో పాటు స్వర్గపురి రికార్డులనుకూడ తనిఖీచేసింది. ఈ తనిఖీలో కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సిసి ఫుటేజి మాయం అవ్వడంతో సిట్ బృందం ఆశ్చర్యపోయింది. సిసి >>2

24-6pg2exHMNWJQE.qxd:24-6pg2exHMNWJQE.qxd 1/1/02 6:37 AM Page 1





అగ్నిప్రమాదంలో కాలిపోయిన యంత్ర పరికరాలు

# భారీ అగ్ని ప్రమాదం

>> నాలు ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. అయితే అప్పటికే ఇద్దరు కార్మికులు మృతిచెందినట్లు అధికారులు నిర్ధారించారు.ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు.జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు కేజీహెచ్ మార్చురీలో మృతదేహాలను పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.మృతుడు వెంకటేష్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉండగా, యువకుడు త్రినాథ్ మృతితో అతని కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా, ప్రమాదానికి గల కారణాలు, భద్రతా లోపాలపై విచారణ కొనసాగుతోంది.పరవాడ ఫార్మాసిటీలో వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో పరిశ్రమల భద్రతపై కార్మిక సంఘాలు, స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**దక్షిణ ఎనర్జీ బాధిత కుటుంబాలకు చెరో రూ.33 లక్షల పరిహారం**

పరవాడ ఫార్మాసిటీలోని దక్షిణ ఎనర్జీ పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదంలో మృతి చెందిన కార్మికులు వేపాడ వెంకటేష్, బోడేపు త్రినాథ్‌రావు కుటుంబాలకు చెరో రూ.33 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించింది.ఈ మేరకు పరిశ్రమ యాజమాన్యం, బాధిత కుటుంబ సభ్యులు, కార్మిక సంఘాల నాయకుల మధ్య జరిగిన చర్చలు సఫలమయ్యాయి. పరిహారంపై ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా యాజమాన్య ప్రతినిధులు మృతుల కుటుంబ సభ్యులకు ఒప్పంద పత్రాలను అందజేశారు. దక్షిణ ఎనర్జీ పరిశ్రమలో సంభవించిన అగ్నిప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందడంతో వారి కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు యాజమాన్యం చెరో రూ.33 లక్షల పరిహారం ప్రకటించడంతో కొంత ఊరటనిచ్చింది. ప్రమాద ఘటనపై పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**దుర్ఘటనపై సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్, మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి**

అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీ అగ్నిప్రమాదం దుర్ఘటనపై సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేసారు.ఘటనపై సిఎం వివరాలను ఆరాతీసారు. హోంమంత్రి అనిత పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఈ దుర్ఘటనపై సిఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితులను ఆదుకోవాలని, గాయపడినవారికి మెరుగైన చికిత్స అందించాలని సిఎం ఆదేశించారు.పరవాడ ఫార్మాసిటీ అగ్నిప్రమాదంపై ఉపముఖ్యమంత్రి పవన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరవాడ ఫార్మాసిటీ అగ్నిప్రమాదంపై మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నామని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు.

పరవాడ ఫార్మాసిటీ అగ్నిప్రమాదంపై హోంమంత్రి అనిత ఆరా తీశారు. కలెక్టర్, ఎస్పీతో ఫోనులో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సహాయచర్యలు వేగవంతం చేయాలని అధికారులను హోంమంత్రి ఆదేశాలు జారీ చేశారు. మంత్రి సుభాష్ పరవాడ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు.

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు కేజీహెచ్ మార్చురీలో మృతదేహాలను పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.మృతుడు వెంకటేష్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉండగా, యువకుడు త్రినాథ్ మృతితో అతని కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

# గేట్లు సిద్ధం.. తుంగ'భద్రం'

>> కింద 1.46 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతోంది. కుడి కాలువ ద్వారా కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు సాగు నీరందుతోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు భద్రతను ఎపి, కర్నాటక రాష్ట్రాలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని గేట్ల ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేశాయి. 25వ తేదీన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని హోస్‌పేటలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

# మాజీ సిఐ నాగరాజు అరెస్టు

>> పుటేజిలో మే నెల నుండి జూన్ నెల వరకు మధ్యలో రెండు రోజులు మినహా మిగిలిన సిసి పుటేజి మొత్తం కనుమరుగయ్యింది. మాజీ సిఐ నాగరాజే ఈ సిసి పుటేజిని మాయం చేసి ఉంటాడని సిట్ బృందం భావిస్తోంది. అనంతరం స్వర్గపురిని చేరుకున్న సిట్ బృందం అక్కడ ఉన్న రికార్డులను పరిశీలించింది.వాటిలో రెండు మృతదేహాలు పంపుతున్నట్లుగా లేఖ వ్రాసి ఒకటే మృతదేహాన్ని కృష్ణలంక అప ్పటి సిఐ నాగరాజు పంపినట్లు రికార్డులలో తేటతెల్లమైంది. అంతేకాక స్టేషన్ నుండి వచ్చిన లెటరులో వయస్సును దిద్దినట్లుగా కనిపించడాన్ని కూడ సిట్ బృందం పరిశీలించింది. మే నెల 23న ఈ ఘటన జరిగినట్లు సిట్ బృందం అనుమానిస్తోంది. దీంతో ఈ కేసులో కీలక ఆధారాలను మాజీ సిఐ నాగరాజు మాయం చేశారని సిట్ బృందం భావిస్తూ ఆ దిశగా దర్యాప్తును వేగవంతం చేసింది. తొలగించిన సిసి పుటేజి భాగాన్ని రికవరీ చేసేందుకు టెక్నికల్‌గా సిట్ బృందం చర్యలు చేపట్టినట్లు సమాచారం. దర్యాప్తుకు సంబంధించిన కీలకాంశాలను ఉన్నతాధికారులకు సిట్ బృందం తెలియచేసినట్లు సమాచారం.సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 18 నెలల పాటు సిసి పుటేజిని భద్రపర్చాల్సి ఉండగా స్టేషన్‌లోనే అవి మాయవవ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**నాగరాజు విచారణ**

మాజీ సిఐ నాగరాజును అదుపులోకి తీసుకున్న సిట్ ప్రత్యేక దర్యాప్తు బృందం అతనిని కూలంకుషంగా విచారణ చేపట్టింది. అసలు ఏం జరిగింది,ఎలా జరిగింది అనే విషయాన్ని సిఐని పలువిధాలుగా ఆధారలు చూపించి సిట్ బృందం విచారించినట్లు సమాచారం. నాగరాజుతో పాటు మరి కొందరు కానిస్టేబుళ్లతో పాటు స్టేషన్‌కు చెందిన పలువురు ఎస్‌ఐలు కూడ ఈ ఘటనలో పాలు పంచుకున్నారని సిట్ దర్యాప్తు బృందం ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.సిసి పుటేజి మాయం కావడం అనే అంశాన్ని దర్యాప్తు బృందం తీవ్రంగా పరిగణిస్తోంది. దాని రికవరీ కోసం తీవ్ర ప్రయత్నం చేస్తోందని సమాచారం.

**సిఐ మద్దతుదారుల ధర్నా**

సిఐ నాగరాజును అదుపులోకి తీసుకోడానికి పోలీసులు సింగ్‌నగర్‌కు వచ్చిన సమయంలో అక్కడ హై డ్రామా చోటు చేసుకుంది. సిఐ మద్దతుదారులంటూ కొంత మంది సిఐను అరెస్ట్ చేయద్దని నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. అడ్డుగా నిలబడిన వారిని పోలీసులు బలవంతంగా తప్పించి సిఐ నాగరాజును అదుపులోకి తీసుకున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కల్గించిన సాయికృష్ణ అదృశ్యం కేసులో అసలు మిస్టరీ మరి కొద్ది రోజుల్లో వీడే అవకాశం ఉంది.దీనిలో సూత్రధారులు,పాత్రధారుల పాత్ర కూడ మరి కొద్ది రోజుల్లో తేటతెల్లమవనుంది.ఇంత దారుణంగా ఒక వ్యక్తిని మాయం చేయడం వెనుక నాగరాజు వెనుక మరిన్ని అదృశ్య శక్తులేవైనా ఉన్నాయా అనే విషయంపై కూడ బృందం లోతుగా విచారిస్తోంది.

# సింగిల్ పోర్టల్ ద్వారా పర్మిషన్లు

>> మించి ఈసారి పెద్దసంఖ్యలో రాష్ట్రానికి పరిశ్రమలను ఆకర్షించేలా విదేశాలతోపాటు దేశవ్యాప్తంగా పెద్దఎత్తున రోడ్ షోల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. గత నెలరోజుల వ్యవధిలో 210 భారీ పరిశ్రమలు తర్వాత దశకు చేరుకున్నాయని అధికారులు చెప్పారు. ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించిన 26 ప్రాజెక్టుల పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రాజెక్టుల పురోగతికి సంబంధించి ప్రతి 15రోజులకోసారి కలెక్టర్లు, జిల్లాస్థాయి అధికారులతో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు సమీక్షి ంచా లని మంత్రి లోకేష్ కోరారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఆయా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన పవర్, వాటర్, మౌలిక సదుపా యాల కల్పనపై దృష్టిసారించాలని సూచించారు. రాష్ట్రంలో భారీగా విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో వివిధ స్టేజిల్లో ఉన్న రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భారీ పరిశ్రమలతోపాటు రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటవుతున్న ఎంఎస్‌ఎంఇలను కూడా ఆన్ బోర్డు చేయాలనిఅన్నారు. త్వరలో భోగాపురం ఎయిర్ పోర్టు అందుబాటు లోకి రానున్న నేపథ్యంలో విశాఖపట్నంలో సాధ్యమైనంత ఎక్కువగా హోటల్ గదులు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని పర్యాటకశాఖ అధికారులకు సూచించారు.

**స్లరీ పైప్ లైన్ పై అధ్యయనం చేయండి..**

స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ మన ప్రభుత్వ ప్రత్యేకతలు, సులభతరమైన సర్వీస్ డెలివరీ అందించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. రాష్ట్రంలో గార్మెంట్ పరిశ్రమలను ఆకర్షించడానికి చేపట్టాల్సిన చర్యలు, అందించాల్సిన ప్రోత్సాహకాలపై సమావేశంలో చర్చించారు. ఎంప్లాయ్ మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్స్ అందించే అంశాన్ని పరిశీలించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న టెక్స్ టైల్ పరిశ్రమలు క్యాప్టివ్ పవర్ ఉత్పత్తి చేసుకునేందుకు ఏడాదిపాటు బ్యాంకింగ్ ఫెసిలిటీ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని అన్నారు.

అనకాపల్లి - విశాఖ - విజయనగరం జిల్లాలు స్టీల్ హబ్‌గా ఆవిష్కృతమవుతున్న నేపథ్యంలో కొత్తగా రాష్ట్రానికి వచ్చేందుకు మరికొన్ని ఉక్కు పరిశ్రమలు ఆసక్తిచూపుతున్నాయి,

ఇందులో ప్రధానమైన ముడిసరుకు సరఫరా కోసం స్లరీ పైప్ లైన్ కావాలని ఆయా సంస్థలు కోరుతున్నాయి, దీనిపై అధికారులు అధ్యయనం చేయాల్సిందిగా మంత్రి లోకేష్ సూచించారు. ఈ సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, పంచాయితీరాజ్, రూరల్ డెవలప్ మెంట్ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, టూరిజం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు సీఈవో షన్మోహన్, స్కిల్ డెవలప్ మెంట్ డైరెక్టర్ గణేష్ కుమార్, ఏపీఐఐసీ ఎండీ ఏఎస్ దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వికసిత 'పద్మా'లు

>> నంతరం), వెల్లపల్లి నటేషన్ పద్మభూషణ్ పురస్కారాలు అందుకున్నారు. తెలుగు రాష్ట్రాలనుంచి సినీ నటులు మాగంటి మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లు పద్మశ్రీ పురస్కారాలు అందుకున్నారు. వీరితోపాటు తమిళనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్‌శర్మ ఇతర పలు రంగాలప్రముఖులకు పద్మ పురస్కారాలు వరించాయి. మొత్తం 131 మందిని పద్మపురస్కారాలకు ఎంపికచేయగా తొలివిడతలో 66 మందికి ఎంపికచేస్తే మిగిలినవారికి మంగళవారం ప్రధానంచేసారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సిపిరాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్; కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పియూష్‌గోయల్, ధర్మేంద్రప్రధాన్, గజేంద్రసింగ్ షెకవాత్ తదితరులు పాల్గొన్నారు. పద్మశ్రీ అవార్డులు పొందినవారిలో నూరుద్దీన్ అహ్మద్, తిరువారూర్ భక్తవత్సలం, డా.కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణ్యన్,బ్రిజ్‌లాల్‌భట్, తరుణ్ భట్టాచార్య, జ్యోతిష్ దేబ్‌నాథ్, డా.జోగేష్ దేవురీ, భిక్యాల లడక్యా ధిండా, డా.అర్మిందా ఫెర్నాండెజ్, డాక్టర్ చంద్రమౌళి గడ్డమనుగు,డాక్టర్ ప్రేమ్‌లాల్ గౌతమ్, డా.రాజాస్తపతి కలియప్ప గౌండర్, డా.పద్మ గుర్మెట్, అశోక్‌కుమార్ హల్దార్, డాక్టర్ సురేష్ హంగావాడి, శ్రీచరణ్ హేంబ్రమ్, డా.శుభా వెంకటేశ ఐయ్యంగార్,టిటి జగన్నాథన్ (మరణానంతరం), సంత్ నిరంజన్‌దాస్‌జీ, ప్రొఫెసర్ వీఝినాథన్ కామకోటి, ప్రొఫెసర్ మంగలా కపూర్,డాక్టర్ అశోక్ ఖాడే, డి. లియుడ్‌మీలా ఖోఖోల్వా, డా.ప్రభాకర్ బసాప్రభుకోరే, శ్రీమతి పోఖిలా లేఖథేపీ,మామిడి రామారెడ్డి(మరణానంతరం), ఆర్‌విఎస్ మణి, శ్రీమంతి కళామండలం విమలా మీనన్, వ్లాదిమీర్ మెస్త్విరిష్‌విలి (మరణానంతరం), మోహన్‌నాగర్, డా.పుణ్యమూర్తి నటేషన్, శర్‌కుమార్‌పాత్ర, గురుసంగ్యసంగ్ పాంగెనేర్,సవితా పూనియా, కవీంద్ర పురకాయస్థ (మరణానంతరం),హగవాన్‌దాస్ రైక్‌వార్(మరణానంతరం), ప్రొఫెసర్ కె.రామస్వామి, శ్రీమతి రంజని, శ్రీమతి గాయత్రి, డా.అనిల్‌కుమార్ ర్తోగి, ప్రొఫెసర్ మహేంద్రనాథ్‌రాయ్,సతీష్‌షా(మరణానంతరం), ప్రొఫెసర్ ప్రతీక్ శర్మ, రోహిత్ గురునాథ్‌శర్మ,సర్దార్ ఇందర్ జీత్ సింగ్‌సిద్ధు, రఘుపత్‌సింగ్(మరణానంతరం), ఖేమ్‌రాజ్ సుంద్రియాల్,డా.భుద్రి తాతి, డా.కుమారస్వామి తంగరాజ్, రబిలాల్ తుడు(మరణారంతరం) నరేష్ చంద్రదేవ్‌వర్మ, వెంపటి శశిశేఖర్, చిరంజిలాల్ యాదవ్‌లు రాష్ట్రపతి చేతులమీదుగా పద్మశ్రీ పురస్కారాలు అందుకున్నారు.

# టాటా వాహనం బోల్తా

>> జామున సుమారు 3 గంటల సమయంలో వాహనం టైర్ పంచర్ కావడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయి వాహనం రోడ్డుపై బోల్తా పడింది ఈ ప్రమాదంలో సామర్లకోటకి చెందిన మసకపల్లి బాబు, మురమళ్ళ రాజు, కాకడ రాజు అనే ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు మిగిలిన 8 మందిని 108 అంబులెన్స్ సహాయంతో పెద్దాపురం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు మరో అరగంటలో తమ గమ్యస్థానాలు చేరుకునే సమయంలో ఈ విషాదం చోటు చేసుకోవడం కుటుంబ సభ్యులను విషాదంలో ముంచెత్తింది సమాచారం అందుకున్న రంగంపేట పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# కొత్తగా 10 బిసి గురుకులాలు

>> (విజయనగరం), ఆత్మకూరు, గోలగముడి (నెల్లూరు), కలికిరి(అన్నమయ్య), ఓనిపెంట (కడప), నాసనకోట (శ్రీ సత్యసాయి జిల్లా) ఎంజేపీ గురుకుల పాఠశాలలను అప్ గ్రేడ్ చేశారు. ఆయా గురుకులాలల్లో తరగతలు సైతం ప్రారంభమయ్యాయి.

**కొత్తగా 10 గురుకులాల ఏర్పాటు**

తాజాగా కొత్త గురుకుల పాఠశాలలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం జరిగిన కేబినెట్ భేటీలో మంత్రమండలి ఆమోదం కూడా తెలిపింది. చ్చెర్ల(శ్రీకాకుళం), నక్కపల్లి(అనకాపల్లి), మాచెర్ల(పల్నాడు), గిద్దలూరు(మార్కాపురం), గుంతకల్లు(అనంతపురం), రాయచోటి (అన్నమయ్య),పత్తికొండ,మంత్రాలయం(కర్నూలు),పెనుకొండ,కదిరి(శ్రీసత్యసాయి)లో ఎంజేపీ గురుకులాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో గురుకులంలో 37 బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈగురుకుల పాఠశాలలో అయిదు బాలికలు, మరోఅయిదు బాలుర పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే తరగతలను ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నూతన ఎంజేపీ గురుకులాల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల్లోని బీసీ బిడ్డలకు మరింత మేలు జరగనుంది.

**సిఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు..**

బడి బయట ఏ ఒక్క బిసి బిడ్డా ఉండకూడదనే సిఎం చంద్రబాబు లక్ష్యాన్ని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. బిసిల విద్యకు ప్రాధాన్యమిస్తూ, కొత్తగా పది ఎంజేపీ గురుకుల పాఠశాలల ఏర్పాటుపై ఆమె హర్షం వ్యక్తంచేశారు. ఈ గురుకులాల ఏర్పాటుతో మరింతమంది పేద బిసి బిడ్డలు చదువుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఎంజేపీ గురుకులాల్లో ఆహార భద్రత, రక్షణతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నారన్నారు. గత నెలలో విడుదలైన టెన్త్, ఇంటర్ ఫలితాల్లో బిసి బిడ్డలు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఇటీవలే ఆరు బిసి గురుకులాలను జూనియర్ కళాశాలలుగా కూటమి ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసిందన్నారు. బిసిల విద్య కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్న సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్ కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు.

## వారం - వర్జ్యం

24-06-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, ఆరుద్ర కార్తె
దశమి సా.6.15
చిత్త మ.2.01
వర్జ్యం : రా.8.12-రా.9.58
దు. ఉ.11.43-మ.12.35
శుభసమయం:ఉ.7.00-8.00
రాహుకాలం - మ.12.00-1.30

## వారాఫలం

**మేషం:** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. మోసకారి మాటలు చెప్పే వారి నుండి దూరంగా ఉండండి.

**వృషభం:** ఎదుటివారిని బాగా అంచనా వేయగలుగుతారు. తద్వారా లాభపడతారు. ఉద్యోగాలపరంగా రాణిస్తారు.వస్త్రలాభం.

**మిథునం:** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు.

**కర్కాటకం :** చర్చాగోష్ఠులలో పాల్గొంటారు. సహోదర, సహోదరీ వర్గం వారికి విశేషంగా సహాయ సహకారాలు అందిస్తారు.

**సింహం:** ఆస్తుల విలువ అనూహ్యంగా పెరుగుతుంది. ఉద్యోగంలో నూతన బాధ్యతలు స్వీకరిస్తారు. వాహన సౌఖ్యం.

**కన్య :** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. పనుల నిదానంగా పూర్తిచేస్తారు. గృహనిర్మాణ యత్నాలు.

**తుల :** వ్యతిరేక వాతావరణంలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. విదేశాలలోని బంధువులకు సాయం అందిస్తారు.

**వృశ్చికం:** దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. విద్యార్థులకు అనుకూలమైన కాలం. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**ధనుస్సు:** ఏ పనిని చేపట్టినా విజయవంతంగా పూర్తి చేస్తారు. పెద్దల సలహాలతో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**మకరం:** వృత్తిలో వత్తిడి ఎక్కువ అవుతుంది. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. వాహనాల కొనుగోలు.

**కుంభం:** వివాదాస్పదమైన అంశాలతో తలదూర్చకండి. "తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ" అన్నారు.

**మీనం :** తియ్యని మాట తీరు ఎంతటి కార్యాన్నయినా సులువు చేస్తుందని గ్రహిస్తారు. సహోద్యోగులతో సామరస్యంగా మెలగుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



మంగళవారం సర్ ప్రక్రియలో పాల్గొని అధికారులకు వివరాలు అందిస్తున్న మంత్రి లోకేష్

# 'సర్' ప్రక్రియలో పాల్గొన్న మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఉండవల్లిలోని తమ నివాసానికి వచ్చిన బూత్ లెవల్ ఆఫీసర్ అడిగిన సమాచారం, డాక్యుమెంట్లను మంత్రి లోకేష్ సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిఒక్కరూ ఈ ప్రక్రియలో పాల్గొనాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సర్ ప్రక్రియలో పాల్గొనే ప్రజలు ఏదైనా డౌట్లు ఉంటే ఆయా వార్డుల్లో నియమితులైన బిఎల్‌ఒలను సంప్రదించాలని, ఇందుకోసం సహకరించేందుకు తెలుగుదేశం పార్టీ తరపున బూత్ లెవల్ ఏజంట్లు కూడా అందుబాటులో ఉంటారని చెప్పారు.

# జార్జ్ కురియన్ రాజీనామా

>> చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సలహా మేరకు, కేంద్ర మంత్రిమండలి నుండి కురియన్ రాజీనామాను భారత రాష్ట్రపతి తక్షణమే అమల్లోకి వచ్చేలా ఆమోదించారని అధికారిక ప్రకటన పేర్కొంది. కేంద్ర ప్రభుత్వంలో క్రైస్తవ వర్గానికి చెందిన ఏకైక మంత్రి బహుశా కురియన్ మాత్రమే. జూన్ 21వ తేదీన ఆయన రాజ్యసభ పదవీకాలం ముగిసింది. కేంద్ర మంత్రులు రవ్‌నీత్ సింగ్ బిట్టు, కురియన్‌ల పదవీకాలం ముగుస్తున్నప్పటికీ, జూన్ 18న జరిగిన రాజ్యసభ ఎన్నికలకు వారిని తిరిగి నామినేట్ చేయలేదు. 65 ఏళ్ల కురియన్ 1980లో బిజెపి ఆవిర్భావం నుండే పార్టీలో సభ్యుడిగా ఉన్నారు. ఆయన బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడిగా, భారతీయ జనతా యువ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడిగా, బిజెపి కేరళ విభాగం ఉపాధ్యక్షుడిగా వివిధ పదవులను చేపట్టారు. భారత సుప్రీంకోర్టులో న్యాయవాదిగా కూడా ప్రాక్టీస్ చేశారు. ఆయన జూన్ 9, 2024న కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అంతకు ముందు, కురియన్ జాతీయ మైనారిటీల కమిషన్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు.

# రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని మోడీ భేటీ

**న్యూఢిల్లీ,జూన్ 23:** రాష్ట్రపతిభవన్‌లో అట్టహాసంగా జరిగిన పద్మ పురస్కారాలప్రధానం అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రధాని నరేంద్రమోడ ీభేటీ కావడం రాజకీయ ప్రాధాన్యతనున సంతరించుకుంది. కేంద్ర మంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణ ప్రచారం జోరుగా సాగుతున్నవేళ ప్రధానిమోడీ భేటీకి ప్రాధాన్యం పెరిగింది. వీరి భేటీకి సంబంధించి చిత్రాలను రాష్ట్రపతి కార్యాలయం ఎక్స్‌వేదికగా విడుదలచేసింది. కేరళ బిజెపినేత జార్జి కురియన్ కేంద్ర సహాయ మంత్రిపదవికి రాజీనామాచేసారు. ఆయన రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం కూడా తెలిపారు. ఈ పరిణామంతో కేంద్ర మంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణ ఉంటుందన్న ప్రచారం జోరందుకుంది. ఇటీవల పలువురు కేంద్ర మంత్రులకు వారి వారి రాష్ట్రాల్లో పార్టీ బాధ్యతలను అప్పగించడం దీనికి మరింత బలం చేకూరింది. కేంద్ర రోడ్డురవాణా సహాయమంత్రి హర్ష్ మల్హోత్రాను ఢిల్లీబిజెపి అధ్యక్షుడుగా పార్టీ అధ్యక్షుడు నితిన్‌నబిన్ నియమించారు. త్వరలో ఎన్నికలకు వస్తున్న రాష్ట్రాలకు మంత్రివర్గంలోప్రాధాన్యం ఇస్తారన్న అంచనాలూన్నాయి. అదేక్రమంలో ఇతర పార్టీలనుంచి బిజెపిలోకి, ఎన్డీయేలోకి వచ్చినవారిని మరికొందరిని కేబినెట్‌లోకి తీసుకుంటారని చర్చలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే పద్మ పురస్కారాల తర్వాతనే మోడీ రాష్ట్రపతితో భేటీ కావడం కేబినెట్ విస్తరణ అంశాలు తెరపైకి వచ్చాయి.

# రిటైర్మెంట్ 62కు పెంపు

>> ఎన్టీఆర్ జిల్లాలో కంట్రోల్ ఎస్ డేటా సెంటర్, రూ.2788.30 కోట్ల పెట్టుబడి, 160 మందికి ఉద్యోగాలు, అనకాపల్లిజిల్లాలో జెట్ ఫ్యాబ్ ఇండియా, రూ.740 కోట్ల పెట్టుబడి, 1049 మందికి ఉద్యోగాలు, తిరుపతి జిల్లాలో, ఇన్ ఫినిక్స్ టెక్నాలజీ సొల్యూషన్స్, రూ.170 కోట్ల పెట్టుబడి, 4000 మందికి ఉద్యోగాలు, విశాఖజిల్లాలో, ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్, రూ.50 కోట్లు, 1000 మందికి ఉద్యోగాలు, విశాఖపట్నం జిల్లాలో లభిస్తాయి.ఇప్యాక్ డ్యూరబుల్, ఇప్యాక్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీస్, రూ.1084.31 కోట్ల పెట్టుబడి, 1600 మందికి ఉద్యోగాలు, నాయుడుపేట, శ్రీసిటీ, తిరుపతి జిల్లాలో ఆంబర్ ఎంటర్ ప్రైజెస్, రూ.445 కోట్ల పెట్టుబడి, 1250 మందికి ఉద్యోగాలు, శ్రీసిటి తిరుపతి జిల్లాలో ఎంసిఎన్ఇఎక్స్ ఇండియా, రూ.347 కోట్లు, 1633 మందికి ఉద్యోగాలు, శ్రీసిటీ తిరుపతి జిల్లాలో లభిస్తాయి.వరుణ్ హాస్పిటాలిటీ ప్రై.లిమిటెడ్, రూ.280.33 కోట్ల పెట్టుబడి, 600 మందికి ఉద్యోగాలు, అమరావతిలో .ఇంద్రోయల్ హాస్పిటాలిటీ సర్వీసెస్,రూ.539 కోట్ల పెట్టుబడి, 600 మందికి ఉద్యోగాలు, అమరావతిలో, విజయనగర్ ఇన్వెస్ట్మెంట్స్ ఇన్‌ఫ్రా, రూ.53.35 కోట్ల పెట్టుబడి, 225 మందికి ఉద్యోగాలు, ఆనందపురం, విశాఖ జిల్లాలో లభిస్తాయి,ద్వైవిక్ హోటల్స్ ప్రైలిమిటెడ్ రూ.186.84 కోట్ల పెట్టుబడి, 500 మందికి ఉద్యోగాలు, అమరావతిలో .శుభసంకల్ప్, రూ.174.52 కోట్లు, 300 మందికి ఉద్యోగాలు లభిస్తాయి, వెసెల్లా 5 స్టార్ హోటల్స్, రిసార్ట్స్ రూ.210.14 కోట్ల పెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు, కర్నూలుజిల్లాలో దుర్గా కండేవ్‌పద్మా హాస్పిటాలిటీ కన్సార్టియం, రూ.163.36 కోట్ల పెట్టుబడి, 400 మందికి ఉద్యోగాలు, విశాఖపట్నం జిల్లాలో వైట్ ఓక్ రిసార్ట్స్ , రూ.79.01 కోట్ల పెట్టుబడి, 250 మందికి ఉద్యోగాలు, విశాఖపట్నం జిల్లాలో లభిస్తాయి.ఎస్‌ఏఎఫ్ ఒన్ ఇండియాఎస్పీ కాంపాక్ట్ లిమిటెడ్ రూ.1900 కోట్ల పెట్టుబడి, 2500 మందికి ఉద్యోగాలు, కాకినాడజిల్లాలో లభిస్తాయి..ప్రోటీరియల్ ఇండియా, రూ.2,250 కోట్లు, 530 మందికి ఉద్యోగాలు, అనకాపల్లిజిల్లాలో లభిస్తాయి..నాన్ మాగ్నెటెక్ ప్రై.లిమిటెడ్, రూ.1250 కోట్లు, 400 మందికి ఉద్యోగాలు, తిరుపతి జిల్లాలో లభిస్తాయి.ఏపీ జెఎస్ డబ్ల్యూ స్టీల్స్ , రూ. 1230.20 కోట్లు, 155 మందికి ఉద్యోగాలు, ప్రకాశం జిల్లాలో లభిస్తాయి..వయోనా ఎనర్జీ, రూ.468 కోట్ల పెట్టుబడి, 1300 మందికి ఉద్యోగాలు, నెల్లూరు జిల్లాలో లభిస్తాయి. బెర్జర్ పెయింట్స్ , రూ.176.82 కోట్ల పెట్టుబడి, 40 మందికి ఉద్యోగాలు, సత్యసాయి జిల్లాలో లభిస్తాయి.డివైస్ ఫార్మా టెక్ రూ.213.9 కోట్ల పెట్టుబడి, 114 మందికి ఉద్యోగాలు, తిరుపతి జిల్లాలో లభిస్తాయి..ప్రసాద్ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, రూ.63.94 కోట్ల పెట్టుబడి, 200 మందికి ఉద్యోగాలు, ఏలూరు జిల్లాలో లభిస్తాయి.రెనాటస్ ప్రొడక్ట్స్ , రూ.350 కోట్లు, 370 మందికి ఉద్యోగాలు, తిరుపతి జిల్లాలో లభిస్తాయి. ప్రీమియర్ ఎనర్జీస్ ఇంగాట్ వేఫర్, రూ.3936.20 కోట్ల పెట్టుబడులు, 540 మందికి ఉద్యోగాలు, తిరుపతి జిల్లాలో లభిస్తాయి.జీరో 21 రెన్యూవబుల్ ఎనర్జీ రూ.525 కోట్ల పెట్టుబడి, 625 మందికి ఉద్యోగాలు, కర్నూలు జిల్లాలో లభిస్తాయి.అనంత్ టెక్నాలజీస్ రూ.1000 కోట్ల పెట్టుబడి 750 మందికి ఉద్యోగాలు నెల్లూరు జిల్లాలో లభిస్తాయి.స్పేస్ ఫీల్డ్స్ ప్రై.లిమిటెడ్, రూ.46.83కోట్ల పెట్టుబడి, 300మందికిఉద్యోగాలు, అనంతపురం జిల్లాలో లభిస్తాయి. ఐకామ్ టెలీ, రూ.895 కోట్ల పెట్టుబడి, 1320 మందికి ఉద్యోగాలు, జగ్గయ్యపేటలో లభిస్తాయి. అవెరాన్ పానల్స్, రూ.1123 కోట్ల పెట్టుబడి, 1200 మందికి ఉద్యోగాలు, గుడిపల్లె, శాంతిపురం చిత్తూరుజిల్లా లభిస్తాయి..సర్లా ఏవియేషన్, రూ.330 కోట్ల పెట్టుబడి, 40 మందికి ఉద్యోగాలు, తిమ్మసముద్రం, అనంతపురం జిల్లా లభిస్తాయి.

న్యూట్రీ ఫీడ్స్ అండ్ ఫార్మ్స్, రూ.216 కోట్ల పెట్టుబడి, 480 మందికి ఉద్యోగాలు, చిత్తూరు జిల్లాలో .పతంజలి ఆయుర్వేద్, రూ.370.10 కోట్ల పెట్టుబడి, 2000 మందికి ఉద్యోగాలు, విజయనగరం జిల్లాలో లభిస్తాయి. అమరావతి క్వాంటం వ్యాలీ లో పెట్టుబడి ప్రతిపాదనలు,.క్యూపిఐ ఏఐ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, రూ.47.16 కోట్లు, 9 మందికి ఉద్యోగాలు, అమరావతిలో లభిస్తాయి..ఇంజిన్యువటీ నెక్సస్ టెక్నాలజీస్, రూ. 0.5 కోట్లు, 21 మందికి ఉద్యోగాలు, అమరావతిలో లభిస్తాయి,.సెంటర్ ఫర్ డెవలప్మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ సి.డాట్ రూ.10 కోట్లు, 5 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.క్యూబిట్ ఫోర్స్, రూ.100 కోట్లు, 100 మందికి ఉద్యోగాలు, అమరావతి క్వాంటం వ్యాలీలో లభిస్తాయి.ఆటోమోనిక్స్, రూ.79.8 కోట్లు, 190 మందికి ఉద్యోగాలు, అమరావతి క్వాంటం వ్యాలీలో లభిస్తాయి..క్రిప్ట్ షీల్డ్, రూ10 కోట్లు, 20 మందికి ఉద్యోగాలు, అమరావతిలో లభిస్తాచి.. క్వాంటం బయో సైన్సెస్, రూ.22.5 కోట్లు, 10 మందికి ఉద్యోగాలు, అమరావతిలో లభిస్తాయి..ఫ్రూగల్ ఏఐ, రూ.2.6 కోట్లు, 6 మందికి ఉద్యోగాలు,అమరావతిలో లభిస్తాయి,.క్యూరియమ్ రూ.0.45 కోట్లు, 5 మందికి ఉద్యోగాలు, అమరావతిలో లభిస్తాయి.క్యూక్రిషి, రూ.25 కోట్లు, 100 మందికి ఉద్యోగాలు, అమరావతిలో లభిస్తాయి..ఎస్ఏఎస్ క్యూట్ ఎలక్ట్రానిక్స్ రూ.60 కోట్లు, 100 మందికి ఉద్యోగాలు, అమరావతిలో లభిస్తాయి..మొత్తం రూ. 30515 కోట్ల పెట్టుబడులతో పాటు 29677 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.ఈ తీర్మానాలన్నింటికి మంత్రి మండలి అనుమతినిచ్చింది.

24-6Pg3exHMNWJQETRP.qxd:24-6Pg3exHMNWJQETRP.qxd 1/1/02 6:15 AM Page 1



# 11వేల కుటుంబాలకు పెన్షన్ భరోసా

● రాష్ట్ర సచివాలయ సంఘం అధ్యక్షులు రామకృష్ణ




**సచివాలయం, జూన్ 23 ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2004 ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ కంటే ముందు ఉద్యోగాల్లో జాయినై, ప్రస్తుతం వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ నుంచి ఓల్డ్ పెన్షన్ స్కీమ్ పరిధిలోనికి తీసుకురావడానికి, వారికి ఆప్షన్ ఇవ్వడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని ఎపి సచివాలయ సంఘం అధ్యక్షులు రామకృష్ణ తెలిపారు. మంగళవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11,000మంది ఉద్యోగులు, వారి కుటుంబాల జీవితాల్లో ఈరోజు ఒక సుదినంగా మారిందని, చరిత్ర సృష్టించడంలో, చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకోవడంలో చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ ముందుంటారని మరోసారి నిరూపితమైందని స్పష్టం చేశారు. రాష్ట్రం ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, ఉద్యోగులకు మంచి చేయాలనే ఏకైక సంకల్పంతో ముఖ్యమంత్రి ఈ భారీ ఆర్థిక భారాన్ని లెక్కచేయకుండా ధైర్యంగా ముందుకు వెళ్ళారని రామకృష్ణ కొనియాడారు. ఈ నిర్ణయం వల్ల ఒక్కో ఉద్యోగికి సుమారు రూ.3 కోట్ల వరకు జీవితకాల లబ్ధి చేకూరుతుందని ఆయన సవివరంగా వివరించారు. సచివాలయ సంఘం తరపున సిఎంకి, మంత్రి వర్గానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఉద్యోగుల పట్ల ఇంతటి ఆదరణ చూపిస్తున్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి తమ సచివాలయ సంఘం ఉద్యోగ లోకం అంతా ఎల్లప్పుడూ అండదండలుగా ఉంటుందని, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలను లబ్దిదారులైన ప్రజలందరికి అత్యంత వేగంగా, సమర్థవంతంగా చేరవేసేలా ఉద్యోగ యంత్రాంగం అంతా రాత్రింబగళ్ళు కష్టపడి ప్రభుత్వానికి అన్ని విధాల సహకరిస్తుందని సచివాలయ సంఘం అధ్యక్షులు రామకృష్ణ స్పష్టం చేశారు.

## కేబినెట్ నిర్ణయంపై ఎపి జెఎసి హర్షం



**శ్రీకాకుళం, జూన్ 23 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎపిజెఎసి), ఎపి ఎన్జీవోస్ అసోసియేషన్ ఉద్యోగుల సంక్షేమం కోసం సాగించిన పోరాటంలో మరో రెండు చారిత్రాత్మక విజయాలు నమోదయ్యాయి. గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల కీలక డిమాండ్లకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం (క్యాబినెట్) ఆమోదం తెలపడం పట్ల ఎపిజెఎసి శ్రీకాకుళం జిల్లా శాఖ తీవ్ర హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఎపి జెఎసి శ్రీకాకుళం జిల్లా చైర్మన్ హనుమంతు సాయిరాం, జిల్లా సెక్రటరీ జనరల్ బి.వెంకటేశ్వర్లు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేస్తూ, క్యాబినెట్ ఆమోదించిన రెండు కీలక నిర్ణయాల వివరాలను వెల్లడించారు. గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల విద్యాలయాల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుండి 62 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జీఓ ఎంఎస్ నెంబర్ 57 ప్రకారం 01-09-2004 కంటే ముందు నోటిఫై చేయబడి, వివిధ కారణాలతో నిలిచిపోయిన సుమారు 11,000 మంది ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) వర్తింపజేసేందుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ చారిత్రాత్మక నిర్ణయాలకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎపి జెఎసి శ్రీకాకుళం జిల్లా పక్షాన జిల్లా చైర్మన్ హనుమంతు సాయిరాం, జిల్లా సెక్రటరీ బి.వెంకటేశ్వర్లు హృదయపూర్వక కృతజ్ఞతలు, శుభాభినందనలు తెలియజేశారు. అలాగే ఈ విజయం సాధించిన జెఎసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## అందుబాటులోకి కార్మిక సంక్షేమ బోర్డు వెబ్‌సైట్

**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త:** కార్మిక సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా, వేగవంతంగా కార్మికులకు చేరవేసేందుకు కార్మికసంక్షేమబోర్డు రూపొందించి వెబ్‌సైట్‌ను రాష్ట్రకార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆవిష్కరించారు. విజయవాడలోని స్వర్ణప్యాలెస్ మీటింగ్‌హాల్లో కార్మిక సంక్షేమబోర్డు 45వ సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఈవెబ్‌సైట్ ద్వారా కార్మికుల నమోదు, సంక్షేమ పథకాల దరఖాస్తులు, లబ్దిదారుల వివరాలు, పథకాల మార్గదర్శకాలు, ఫిర్యాదుల పరిష్కారం వంటి సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కారి ్మకులకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా డిజిటల్ వేదికలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈసమావేశంలో సంక్షేమ పథకాల అమలు, నమోదు ప్రక్రియల సరళీకరణ, కార్మికుల భద్రత, సామాజిక భద్రతా కార్యక్రమాల విస్తరణ తదితర అంశాలపై చర్చించారు. ఈకార్యక్రమంలో కార్మికశాఖ కార్యదర్శి యం.వి.శేషగిరిబాబు, కమీషనర్ గంధం చంద్రుడు, వెల్ఫేర్‌బోర్డు వైస్‌చైర్మన్ వెంకట శివుడ్ యాదవ్, బోర్డు సభ్యులు వై.వెంకటరమణి, ఆరా మహేశ్వరి, అరవరాజు నేలపాల, గదుల సాయి బాబు, బి.విశ్వనాధనాయుడు, డి.నారపరెడ్డి, చింత రేణుకరాజు, నల్లగొప్పుల వెంకటచలపతిరావు, పిడుగు వెంకటరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# ఆస్పత్రిలో ముద్రగడ

## ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన జగన్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి. జూన్ 23 ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సభ్యులు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్య పరిస్థితిపై ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటు న్నారు. గత కొన్ని రోజులుగా అస్వస్థతతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముద్రగడ ఆరోగ్య సమాచారాన్ని ఆయన నిరంతరం అడిగి తెలుసుకుంటున్నారు. ఈ క్రమం లోనే ముద్రగడ తనయుడు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబుతో వై.ఎస్. జగన్ సోమవారం ఫోన్‌లో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ప్రస్తుతం అందుతున్న వైద్య చికిత్స వివరాలను, ఆయన ఆరోగ్య పురోగతిని గిరిబాబును అడిగి తెలుసుకున్న జగన్, కుటుంబ సభ్యులకు కొండంత ధైర్యాన్నిచ్చారు. ముద్రగడ వైద్యానికి అవసరమైన నిపుణులైన వైద్యుల బృందాన్ని కూడా జగన్ ఏర్పాటు చేసినట్లు తెలిసింది. కాగా, మెరుగైన చికిత్స అందుతుండటంతో ముద్రగడ మంగళవారం నాటికి చాలా వరకు కోలుకున్నట్లు సమాచారం అందింది.

**వైద్యులతో నిరంతరం మాట్లాడుతున్నా:** ముద్రగడ ఆరోగ్యంపై కుటుంబ సభ్యులు, అభిమానులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జగన్ పేర్కొన్నారు. ఆయన తప్పకుండా త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో కోలుకుంటా రని ఆశాభావం వ్యక్తంచేశారు. ముద్రగడకు అందుతున్న చికిత్సకు సంబంధిం చి తాను స్వయంగా వైద్యులతో మాట్లాడానని, ఆయన ఆరోగ్య పరిస్థితిని తాను దగ్గరుండి నిరంతరం పర్యవేక్షి స్తున్నానని ఈ సందర్భంగా గిరిబాబుకు వివరించారు. "మీరు నాకు కుటుంబ సభ్యుల్లాంటి వారు. ఎలాంటి ఆందోళన పెట్టుకోవద్దు, ధైర్యంగా ఉండండి"అని జగన్ ముద్రగడ కుటుంబానికి ధైర్యం చెప్పారు. మీకు ఏ చిన్న సహాయం కావాలన్నా నేరుగా తనకు ఫోన్ చేయవచ్చని జగన్ స్పష్టంచేశారు. జగన్ స్వయంగా ఫోన్ చేసి మాట్లాడటంతో ముద్రగడ గిరిబాబుతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు కాస్త ఊరట చెందారు.

# అమరావతిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన




● జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.130 కోట్ల పనులకు అనుమతి

● అమరావతి ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌ల కోసం సిఆర్‌డిఏ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లకు సంబంధించి 95 తాత్కాలిక పోస్టుల మంజూరు

● మంత్రివర్గ సమావేశం నిర్ణయాలు వెల్లడించిన మంత్రి కొలుసు పార్థసారథి

**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి పరిధిలోని ఉండవల్లి ప్రాంతంలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన పనులకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని ఏపీ సమాచార,ప్రజా సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు.మంగళవారం సచివాలయంలోని సమాచార శాఖ సమావేశ ప్రాంగణంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ పార్థసారధి కేబినెట్‌లో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.ఏపీ జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.130 కోట్ల పనులకు మంత్రివర్గం అనుమతినిచ్చింది. అమరావతిలో 5 స్టార్ హోటళ్ళు, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదించిందని మంత్రి వివరించారు. బిసి బిడ్డల విద్యకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పించింది. 10 ఎంజెపి గురుకులాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని ఎచ్చెర్ల (శ్రీకాకుళం), నక్కపల్లి (అనకాపల్లి), మాచర్ల (పల్నాడు), గిద్దలూరు (మార్కాపురం), గుంతకల్లు (అనంతపురం), రాయచోటి (అన్నమయ్య), పత్తికొండ, మంత్రాలయం (కర్నూలు), పెనుకొండ, కదిరి (శ్రీసత్యసాయి)లో ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఐదు బాలికలవి కాగా మరో ఐదు బాలురవి. అదేవిధంగా ఒక్కో గురుకులంలో 37 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే ఇవి ప్రారంభం కానున్నాయని తెలిపారు. అమరావతి ల్యాండ్ పూలింగ్ స్కీమ్ ఒకటి, రెండో దశల కోసం సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లకు సంబంధించి 95 తాత్కాలిక పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం లభించింది. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల పరిధిని 15 కిలోమీటర్లకు హేతుబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ మరియు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను భారీగా ప్రోత్సహించే లక్ష్యంతో 'మెసర్స్ న్యూట్రి ఫీడ్స్ అండ్ ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్', 'మెసర్స్ పతంజలి ఆయుర్వేద లిమిటెడ్' సంస్థలకు ప్రత్యేక ప్యాకేజీ కింద రాయితీలు మంజూరు చేసే సమగ్ర ప్రతిపాదనకు క్రింది విధంగా ఆమోదం తెలిపినట్లు మంత్రి వివరించారు. మెసర్స్ న్యూట్రి ఫీడ్స్ అండ్ ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ చిత్తూరు జిల్లాలో అత్యంత అధునాతన సాంకేతికతతో "ఇంటిగ్రేటెడ్ చికెన్ ప్రాసెసింగ్" కేంద్రాన్ని స్థాపించేందుకు ఈ సంస్థ సమర్పించిన పారిశ్రామిక ప్రతిపాదనకు అంగీకారం తెలపడమైనది. ఈ ప్రాజెక్ట్ ద్వారా సంస్థ మొత్తం రూ. 216.00 కోట్ల పెట్టుబడిని పెట్టడంతో పాటు, స్థానికంగా సుమారు 480 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలను కల్పించనుంది. సదరు సంస్థకు సంబంధిత పాలసీల ప్రకారం ప్రత్యేక రాయితీలను మంజూరు చేయడానికి అనుమతించినట్లు వివరించారు.

# అమరావతిలో భారీ జెయింట్ వీల్

**139 మీటర్లు 28 క్యాప్సూల్స్, భూమి కేటాయింపు**

**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి పరిధిలో 139 మీటర్ల ఎత్తులో భారీ జెయింట్ వీల్ ఏర్పాటు చేయనున్నారు. దీనిలో మొత్తం 28 క్యాప్సూల్స్ ఉండనున్నాయి. ఒక్కో క్యాప్సూల్‌లో 20 నుంచి 25 మంది పట్టేలా ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించి ప్రణాళిక వివరాలను సిఆర్‌డిఎ వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేశారు. అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యాన అమరావతి ఐ జెయింట్ ఐకానిక్ అబ్జర్వేషన్ వీల్ పేరుతో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ కింద డిబిఎఫ్‌ఒటి పద్ధతిలో 30 ఏళ్ల లీజు ఒప్పందం కింద దీన్ని నిర్వహించనున్నారు. అమరావతి (ప్రభుత్వ కార్యాలయాల కాంప్లెక్స్‌కు తూర్పు వైపున) కృష్ణా నది ఒడ్డున ఏర్పాటు చేయనున్నారు. ఇది అమరావతి స్తూపం, ధ్యాన బుద్ధ, అమరేశ్వర ఆలయ పర్యాటక ప్రాంతాలకు సమీపంలో ఉంటుందని ప్రణాళికలో పేర్కొన్నారు. భూమి మట్టం నుండి 139 మీటర్లు (లండన్ ఐ కంటే ఎత్తయినది, భారతదేశంలోనే అత్యంత ఎత్తయిన అబ్జర్వేషన్ వీల్)గా ఉంటుందని పేర్కొన్నారు.

128 మీటర్ల చక్రానికి 28 (పూర్తిగా ఎయిర్‌కండిషన్డ్, మెకానికల్ స్టెబిలైజ్డ్) క్యాప్సూల్స్ ఉండనున్నాయి. ఈ వీల్ ఒక రౌండ్ తిరగడానికి బోర్డింగ్‌తో కలిపి సుమారు 27 నిమిషాలు పట్టనుంది. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నిర్వహించనున్నారు. ఏడాదికి 255 రోజులూ ఆదాయం వస్తుందని తెలిపారు. ప్రాజెక్ట్ ఆర్థికంగా లాభసాటిగా మారేందుకు వీలుగా దీనిని రెండు భాగాలుగా (కేవలం వీల్ ప్రాజెక్ట్, కమర్షియల్ డెవలప్‌మెంట్) విభజించారు.

వీల్ ప్రాజెక్టును ఐదెకరాల్లో రూ. 120 కోట్లతో చేపట్టనున్నారు. తొలి ఏడాది టికెట్ ఆదాయం (2027) రూ. 32.34 కోట్లు ఉంటుందని ప్రాజెక్టు నివేదికలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు అనుబంధంగా ఎకరం స్థలంలో కమర్షియల్ మార్కెట్ పెట్టనున్నారు. వీల్ నిర్వహణలో వచ్చే నష్టాన్ని దీని ద్వారా పూడ్చనున్నారు.ఢిల్లీ ఐ వైఫల్యం నేపథ్యంలో అమరావతి ఐ ప్రాజెక్టులో ఆ లోపాలు లేకుండా నిర్వహించాలని నిర్ణయించినట్లు అందులో పేర్కొన్నారు. అమరావతి కొత్త నగరం కావడం వల్ల ప్రారంభంలో సందర్శకుల సంఖ్య పరిమితంగా ఉండవచ్చని అంచనా వేశారు. వర్షాకాలం (110 రోజులు) ఆదాయం తగ్గుతుందని పేర్కొన్నారు. అదే సమయంలో గంటల ప్రయాణ దూరంలో 1.3 కోట్ల మంది స్థానిక జనాభా, ఏటా రాష్ట్రానికొచ్చే 25.5 కోట్ల పర్యాటకుల భారీ మార్కెట్ కూడా ఉంటుందని వివరించారు.

# ప్రకృతి వ్యవసాయంతో పశుగ్రాస భద్రతకు శ్రీకారం

● పచ్చిమేత కొరత నివారణకు చర్యలు ● కరపత్రాలను విడుదల చేసిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో రానున్న వ్యవసాయ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాల నేపథ్యంలో పశుసంపద రక్షణ, పశుపోషకుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ చేపట్టింది. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ పశువులకు పచ్చిమేత కొరత తలెత్తకుండా చూడాలనే లక్ష్యంతో పశుసంవర్ధక శాఖ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పశుగ్రాసాల సాగును ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా "ప్రిమాన్సూన్ డ్రై సోయింగ్" విధానంపై రూపొందించిన అవగాహన కరపత్రాలను రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం విజయవాడలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావం వ్యవసాయంతో పాటు పశుసంపదపై కూడా పడుతున్న నేపథ్యంలో రైతులు, పశుపోషకులు పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ ప్రకృతి వ్యవసాయ సాంకేతికతలను అనుసరించడం ద్వారా మెరుగైన పశుగ్రాస దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పచ్చి మేత లభ్యత, పశుగ్రాస నిల్వ, తాగునీటి వసతులు, పశుసంరక్షణ చర్యలపై సమగ్ర సమాచారం అందించేందుకు ఈ కరపత్రాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది ద్వారా రైతులు, పశుపోషకులకు ఈ కరపత్రాలను పంపిణీ చేసి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. పశు సంపద పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎలాంటి ప్రతికూల వాతా వరణ పరిస్థితులు ఎదురైనా పశుపోషకులకు అండగా నిలుస్తుందని స్పష్టంచేశారు. పశు సంవర్ధక శాఖ సంచాలకులు డా. టి. దామోదర నాయుడు మాట్లాడుతూ వాతావరణ మార్పుల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించడం ద్వారా పశుసంపదను సంరక్షించుకోవచ్చన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు, పశుపోషకులకు అవగాహన కల్పించేందుకు ఈ కర పత్రాలను ముద్రించి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పీతల సుజాత, పశుసంవర్ధక శాఖ సంచాలకులు డా. టి. దామోదర నాయుడు, శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏలూరు- పోలవరం కాలువల అనుసంధానానికి నిధులు మంజూరు

**ఫలించిన గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ కృషి**

భూములకు సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు గానూ ఏలూరు- పోలవరం కాలువల అనుసంధానినికి ఎట్టకేలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఏలూరు కాలువ ఆయకట్టు చివరి మండలాలైన కృష్ణాజిల్లా ఉంగుటూరు, బాపులపాడు, ఏలూరుజిల్లా పెదపాడు, ఏలూరు మండలాల పరిధిలోని పంటభూములకు ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈనేపథ్యంలో బాపులపాడు మండలంలో పోలవరం కాలువ, ఏలూరు కాలువలు పక్క పక్కనే వెళుతున్నప్పటికీ నీరు ప్రకాశం బ్యారేజ్ వద్దకు చేరుకుని తిరిగి ఈమండలాలకు దాదాపు 100 కిలోమీటర్లు ప్రవహించాల్సి ఉంది. ఈ ప్రాంత రైతుల సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వం బాపులపాడు మండలం బండారుగూడెం వద్ద నుండి పోలవరం కాలువ నీటిని ఏలూరు కాలువకు మళ్ళించేందుకు రూ.15.35కోట్లు నిధులు శంకుస్థాపన చేసారు. తదుపరి వైసిపి ప్రభుత్వం రావటంతో ఈపనులను రద్దుచేసారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ఎన్నికల సమయంలో ఈరెండు కాలువలు అనుసంధానానికి నిధులు మంజూరు చేయించి రైతుల సాగునీటి ఇబ్బందులు తొలగిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం అధికారంలోకి వచ్చిన తరువాత జలవనరులశాఖ ఇంజనీర్లతో తాజాగా అంచనాలు రూపొందించి, జలవనరులశాఖకు ప్రతిపాదనలు అందించారు. ఈప్రాజెక్టు అనుమతులు, నిధుల మంజూరుకు తన వంతు ప్రయత్నాలు చేసారు. నిధుల మంజూరు కోసం పలు ధఫాలు మంత్రి నిమ్మల రామానాయుడును, ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఈరెండు కాలువల అనుసంధానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి నిధులు మంజూరు చేయించారు. పోలవరం కుడికాల్వ 137.290కిలోమీటర్ల వద్ద బండారుగూడెం వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించి గోదావరినీటిని వాగులోకి ఎత్తిపోస్తారు. ఇక్కడి నుండి 3.5కిలోమీటర్లు వాగు ద్వారా ప్రవహించి ఏలూరుకాల్వ 36 కిలోమీటర్ల వద్ద ఏలూరు కాల్వలో కలుస్తుంది. ఈపథకం కోసం ప్రభుత్వం జీవోనెం 335 ద్వారా రూ.38.21కోట్లు మంజూరు చేస్తూ జీవో విడుదల చేసింది. రెండు కాలువల అనుసంధానం వల్ల నాలుగు మండలాల్లోని ప్రజలకు తాగునీరు, సాగునీటి ఇబ్బందుల నుండి ఉపశమనం లభించనుంది. ఈమేరకు సోమవారం గన్నవరం ఎయంసి చైర్మన్ గూడవల్లి నరసింహారావు, ఎన్ఎస్‌పి ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షులు ఆళ్ల గోపాలకృష్ణ, టిడిపి నాయకులు దొంతు చిన్న, గొడ్డళ్ళ చిన్నరామారావు, గూడపాటి తులసీమోహన్, చిరుమామిళ్ళ సూర్యం, తదితరులు మీడియా సమావేశం నిర్వహించి నిధుల మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌కు, నిధులు మంజూరుకు సహకరించి మంత్రి నిమ్మల రామానాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడకు కృతజ్ఞతలు తెలిపారు.

## మాజీ సిఐ నాగరాజుకు అనుకూలంగా ధర్నాలు..

# కూపీ లాగుతున్న ఇంటెలిజెన్స్?

**ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమించిన వారిపై చర్యలకు సన్నద్ధం**

**విజయవాడ (క్రైం),జూన్ 23 ప్రభాతవార్త:** గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ సిఐ నాగరాజుకు అనుకూలంగా అతని మద్దతుదారులు ర్యాలీలతో పాటు నాగరాజు అరెస్టును అడ్డుకోవడానికి యత్నించడంతో వారిపై ప్రభుత్వం కన్నెర్ర చేసింది. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నాగరాజుకు అనుకూలంగా ఉద్యమించిన వారి డేటాను సేకరించమని ఇప్పటికే ఇంటలిజెన్స్ వర్గాలకు ఆదేశాలిచ్చినట్లు సమాచారం. వారి వివరాలు తెలిసిన తర్వాత వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పెద్దలు సిద్ధమైనట్లు తెలియవచ్చింది. వారు నాగరాజు ద్వారా లబ్ది పొందారని, అందువలనే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారని ప్రభుత్వ పెద్దలు ఆలోచిస్తున్నట్లు సమాచారం. మొత్తానికి ఈ హై డ్రామా వెనుక ఉన్న తలకాయల ఆనుపానులు త్వరలో తెలియనున్నాయి.

**నోరు మెదపని సిఐ నాగరాజు... నార్కో అనాలసిస్ టెస్ట్ జరగాల్సిందేనా?:** విచారణలో గాదె సాయికృష్ణ అదృశ్యం విషయంపై ఆరోపణలు ఎదుర్కొంటున్న సిఐ నాగరాజు సిట్ బృందం ఎదుట నోరు విప్పలేదని గుసగుసలు వినవస్తున్నాయి. దాంతో అసలు ఏం జరిగింది,ఎప్పుడు జరిగింది,టాస్క్‌ఫోర్స్ ఎసిపి లతాకుమారి బృందం మార్కాపురం నుండి సాయికృష్ణను తీసుకువచ్చిన అనంతరం సిఐ నాగరాజు ఎందుకు అదుపులోకి తీసుకున్నాడు ఇత్యాది విషయాలపై సిట్ దర్యాప్తు బృందం ఇప్పటికే విచారించింది. అయితే నాగరాజు గాదె సాయికృష్ణ అదృశ్యం గురించి నోరు విప్పక పోవడంతో న్యాయస్థానానికి దీని గురించి ఏం చెప్పాలో అనే విషయంపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. పరిస్థితులను బట్టి న్యాయస్థానం అనుమతితో నార్కో అనాలసిస్ టెస్ట్ చేయిస్తేనే కానిస నాగరాజు నుండి అసలు నిజాలు బయటకు రావని పలువురు అధికారులు యోచిస్తున్నట్లు సమాచారం.ఒక వ్యక్తిని మాయం చేసి ప్రభుత్వానికి మాయని మచ్చ తెచ్చిన నాగరాజు విషయంపై ప్రభుత్వ కూడ సీరియస్‌గా చర్యలు తీసుకోనున్నట్లు తెలియవచ్చింది.

# క్రిమినల్స్‌తో వైసిపి రాజకీయం

● జాగ్రత్త అంటూ మంత్రులకు సిఎం హితబోధ

**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** క్రిమినల్స్‌ను వైసిపి వెనకేసుకొస్తూ రాజకీయం చేస్తోందని సిఎం చంద్రబాబు ఆరోపించారు. కేబినెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు కీలక వ్యాఖ్యలు చేశారు. వైసిపి నేతలు కుల మీటింగ్‌లు పెడుతూ కులాల మధ్య చిచ్చుపెట్టే కుట్రల్ని దీటుగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కర్నూలులో ఇటీవల చోటుచేసుకున్న ఘటనను ప్రస్తావించిన ముఖ్యమంత్రి, గ్రామస్థులే బహిష్కరించిన వ్యక్తులకు వైసిపి మద్దతుగా నిలవడం విచారకరమని వ్యాఖ్యానించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను అనవసర వివాదాల్లోకి లాగేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి సందర్భాల్లో కూటమి ఐక్యతను చాటే విధంగా మంత్రులంతా స్పందించాలని సూచించారు. ప్రభుత్వ పనితీరును మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలంటే ప్రతి మంత్రి అన్ని శాఖలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై కూడా సిఎం కీలక ప్రకటనలు చేశారు. జొన్నగిరి గ్రామాన్ని 'స్వర్ణ గ్రామం'గా నామకరణం చేయాలని ప్రతిపాదించారు. అలాగే జులై 3న కడప స్టీల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనున్నట్లు సిఎం చంద్రబాబు వెల్లడించారు.

# వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా

● ప్రభుత్వ ఉత్తర్వులు జారీ ● తమది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం ● మంత్రి నారా లోకేశ్



మంత్రి మండలి సమావేశంలో నారా లోకేష్

**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** వడ్డెర సహకార సంఘాలకు క్వారీ లీజుల కేటాయింపునకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఎపిఎంఎంసి నియమావళిని గనుల శాఖ సవరించింది. ఖనిజాల కోసం క్వారీ లీజుల్లో వడ్డెర సహకార సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు క్వారీల గనుల లీజుల్లో వడ్డెరులకు ప్రత్యేక ప్రాధాన్యతను కల్పిస్తామని ఎన్నికల సమయంలో వాగ్దానం చేసారు. ఇటీవల మంత్రి మండలి ఈ దిశలో నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో వడ్డెర సహకార సంఘాలకు క్వారీ లీజుల కేటాయింపునకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. మంగళవారం మంత్రివర్గ సమావేశంలో జరిగిన చర్చలో మంత్రి నారా లోకేష్ ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలన్నింటిని అమలు చేస్తోందని, ఈ విషయాన్ని ప్రజల్లో తీసుకుని వెళ్దామన్నారు. గత మంత్రిమండలిలో తీర్మానం మేరకు వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా ఇస్తూ ప్రభుత్వం జిఒ విడుదల చేసింది. తమది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. 'యువగళం పాదయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలు ప్రత్యక్షంగా చూశా. నాటి పాదయాత్ర సమయంలో తమ కులవృత్తిని కొనసాగించేందుకు క్వారీలు కేటాయించాలని వడ్డెర సోదరులు నన్ను కలిశారు. ఆనాడు నేను ఇచ్చిన హామీ మేరకు క్వారీల్లో 33శాతం వాటాను వడ్డెరలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం. 126 జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది' అని అన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంపైట్ల వడ్డెర సంఘాల నేతలు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నేడు కృష్ణా జిల్లాలో మంత్రి లోకేష్ పర్యటన

**గన్నవరం(కృష్ణా), జూన్ 23 ప్రభాతవార్త:** రాష్ట్రవిద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష బుధవారం కృష్ణాజిల్లాలో పర్యటించనున్నారు. ఈమేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేసారు. లోకేష్ పర్యటన వివరాలు షెడ్యూల్ ప్రకారం ఇలా ఉన్నాయి. బుధవారం ఉదయం 10గంటలకు అవనిగడ్డ నియోజకవర్గం మోపిదేవి మండలం కొక్కిలిగడ్డ గ్రామంలో నూతనంగా నిర్మించిన జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ప్రారంభించను న్నారు. ఉదయం 11.10 గంటలకు మోపిదేవి సు బ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 12గంటలకు మోపిదేవి గ్రామంలోని ఎస్.విహార్ హోటల్‌లో అవనిగడ్డ నియోజకవర్గ టిడిపి కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం అవనిగడ్డ మండలం పులిగడ్డ గ్రామంలోని గురుకుల పాఠశాల వద్ద మత్యకారులతో సమావేశం అవుతారు.

## ఆధ్యాత్మికతకు ప్రాంతీయ సరిహద్దులుండవు

**మలేసియాలో ఆధ్యాత్మిక మహాసభలో ఉమర్ ఆలీషా**




**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త:** ఆధ్యాత్మికతకు ప్రాంతీయ సరిహద్దులు ఉండవని అది విశ్వశాంతికి, ప్రపంచ మానువులందరినీ ఒక్కటిగా నిలిపే అఖండ సోదరభావానికి మూలస్తంభమని శ్రీవిశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం 9వ పీఠాధిపతి, రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (యుఏఆర్‌డిటి) చైర్మన్ డాక్టర్ ఉమర్ ఆలీషా పేర్కొన్నారు. మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లోని బ్రిక్స్‌ఫీల్డ్స్ షిరిడీ సాయిబాబా సొసైటీ ప్రాంగణంలో శ్రీవిశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం మలేషియాశాఖ ఆధ్వర్యంలో 5వ ఆధ్యాత్మిక మహాసభ ఆదివారంరాత్రి జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన ఉమర్ ఆలీషా అనుగ్రహ భాషణ చేస్తూ నేటి తరం యువత మూఢనమ్మకాలకులోను కాకుండా వైజ్ఞానిక దృక్పధాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆధ్యాత్మిక వివేకంతో సమాజసేవలో పాలుపంచుకోవాలని కోరారు. అందరూ సోదరభావంతో ముందుకు సాగాలని, కులమతాలకు అతీతరంగా ఐకమత్యంతో ఉండాలని హితవు పలికారు. మానవసేవే మాధవసేవ అని సాటి మానవులకు సేవ చేస్తే అది దైవానికి చేసినట్లే అన్నారు. ప్రతి ఒక్కరూ విలువలతో కూడిన జీవనం సాగించాలని సూచించారు. తమసంస్థ గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు వైద్య, పౌష్టికాహారం పంపిణీ, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈకార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు బి.సరస్వతి కందస్వామి, గిడుగు ఫౌండేషన్ వ్యవస్థాపకులు గిడుగు కాంతికృష్ణ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ మలేషియా మాజీ అధ్యక్షులు డాక్టర్ అచ్చయ్యకుమార్, మలేషియా షిరిడీసాయిసొసైటీ డిప్యూటీ చైర్మన్ రాజ్‌కుమార్, ఇన్సోవాట్జ్ గ్రూప్ వ్యవస్థాపకులు నిఖిల్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)
Rayapudi, Thullur Mandal, Amaravati-522237 (A.P.)
NIT No: MAU61-USI0HB/4/2026-HB/2nd call, Dt: 22-06-2026
E PROCUREMENT TENDER NOTICE (SECOND CALL)
Name of Work: "APCRDA-H&B Maintenance-Operation and Maintenance of Street Lighting in VIP Routes of Amaravati Capital Region and Seed Access Road for one year"
Estimate Amount: Rs. 1,03,50,000/-. The bid can be downloaded on AP e-procurement portal from 24.06.2026 to 09.07.2026 up to 14.00 Hrs. Due date for submission of Bid 09.07.2026 up to 15.00 Hrs, Technical bid opening 09.07.2026 @ 16.00 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in
Sd/- Commissioner, APCRDA, Rayapudi

24-6Pg7exHMNWJQE.qxdo/p:24-6Pg7exHMNWJQE.qxd 1/1/02 6:34 AM Page 1






# ప్రకాశం.. పెట్టుబడుల గమ్యస్థానం!

● పారిశ్రామికవేత్తలను జిల్లా వైపు తిప్పిన ప్రకాశం జిల్లా బిజినెస్ ఎలైట్ మీట్ ● 12 రంగాల పెట్టుబడి దారులు హాజరు ● రూ.320 కోట్ల పెట్టుబడులకు తక్షణ ప్రతిపాదనలు ● మరిన్ని రాబట్టేలా యంత్రాంగం పర్యవేక్షణ ● ప్రజాప్రతినిధుల సహకారంతో సదస్సు సక్సెస్

**ఒంగోలు, జూన్ 23 ప్రభాతవార్త:** వెనుకబాటు ముద్రను తుడిపేసి ప్రకాశం జిల్లా పారిశ్రామికంగా సమగ్ర అభివృద్ధి సాధించేందుకు నిర్వహించిన ప్రకాశం బిజినెస్ ఎలైట్ మీట్-2026 గ్రాండ్ సక్సెస్ అయ్యింది. స్థానికంగా పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను వివరిస్తూ పారిశ్రామికవేత్తల దృష్టిని ప్రకాశం జిల్లా వైపు తిప్పేలా కలెక్టర్ పి.రాజబాబు ప్రత్యేక చొరువ తీసుకోవడంతో పెట్టుబడి దారులు ముందుకు వచ్చారు. ఈనెల 22వ తేదీ రాత్రి ఒంగోలులోని ఎస్‌జీవీఎస్ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన ఈ సదస్సులో 12 రంగాల పెట్టుబడిదారులు పాల్గొన్నారు. సుమారు రూ.320 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు తక్షణమే ఆసక్తి చూపారు. ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని కోరారు. కాగా, మరింతమంది జిల్లా బాట పట్టేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్, జిల్లాలోని ప్రజా ప్రతినిధులు సమన్వయంతో నిర్వహించిన ఈ మొట్టమొదటి సదస్సు మరిన్ని పెట్టుబడులకు నాంది పలకనుంది.



పెట్టుబడులు పెట్టేందుకు జిల్లాలో ఉన్న అవకాశాలను స్వయంగా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ కార్యక్రమంలో వివరించారు. ప్రకాశం జిల్లా.. అవకాశాల జిల్లా అని పేర్కొన్నారు. 2025 సంవత్సరంలో జిల్లా తలసరి ఆదాయం రూ.2,17,511గా ఉందని, జిల్లా స్థూల ఉత్పత్తి రూ.73,331 కోట్లుగా నమోదైందని తెలిపారు. వృద్ధిరేటు 15.3 శాతంగా ఉందన్నారు. రామాయపట్నం పోర్టు, బీపీసీఎల్, ఇండోసోల్ కంపెనీలతో పాటు జిందాల్ స్టీల్ కంపెనీ కూడా ఐరన్ఓర్ తవ్వకాల ప్రతిపాదనతో వచ్చిందన్నారు. మరో వైపు దొనకొండ మండలంలో 25వేల ఎకరాలతో మెగా ఇండస్ట్రీయల్ పార్కు అందుబాటులో ఉందని చెప్పారు. జాతీయ రహదారులు, బెంగుళూరు-కడప- విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవే రవాణా వ్యవస్థ రూపురేఖలను మార్చాయన్నారు. విస్తృత అభివృద్ధి అవకాశం ఉన్న 20 కిలోమీటర్ల కోస్తా తీరం కూడా ప్రకాశం జిల్లా సొంతమన్నారు. ప్రపంచంలోని 50 శాతం నగరాలు సముద్ర తీరం వెంబడే అభివృద్ధి చెందాయని కలెక్టర్ వివరించారు. ఈ వాస్తవాలను, స్థానికంగా ఉన్న అవకాశాలను వినియోగించుకొని పెట్టుబడులతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సోషల్, ఇండస్ట్రీయల్, సర్వీస్ రంగాలలో ఉన్న మౌలిక వసతులను వినియోగించుకుని ప్రకాశం జిల్లా పారిశ్రామిక అభివృద్ధిలో కెటలిస్టుగా మారాలని పెట్టుబడిదారులను కోరారు.

**పాల్గొన్న ప్రముఖులు:** నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ సిఇఓ ఎస్.సుబ్బారావు, ఇండోసోల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బాల చందర్ కృష్ణన్, ఏపీ ప్రాజెక్ట్స్ సీజీఎం శ్రీ పీపీ షాన్ వేర్, ఏపీ రెన్యువబుల్ ఎనర్జీ ఆపరేషన్స్ హెడ్ రాజేష్ పటానియా, రవిశంకర్ గ్రూప్స్ చైర్మన్ కంది రవిశంకర్, నోవాటెల్ హోటల్స్ జనరల్ మేనేజర్లు, మనీష్, అఖిల్, దస్పల్లా హోటల్స్ ఎండీ శరత్‌బాబు, క్రేజీ హైడెట్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ఎండీ శరత్‌బాబు, క్రేజీ హైడెట్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ఎండీ టి.రవికుమార్, ఐకాన్ కన్‌స్ట్రక్షన్స్ ఎండీ కే.విజయ్ కృష్ణ, పీవీపీ కన్‌స్ట్రక్షన్స్ ఎండీ ప్రదీప్ వర్మ, సూర్య ఇంటర్నేషనల్స్ ఎండీ డాక్టర్ పెండ్యాల హరినాథ్ బాబు, ఒకస్ స్కై స్కాపర్స్ రియాల్టీ ప్రైవేటు లిమిటెడ్ ఆపరేషన్స్ మేనేజర్ ఎన్.శివకృష్ణ పాల్గొన్నారు.

**పెట్టుబడుల ప్రతిపాదనలు:** కొత్తపట్నం బీచ్‌లో రూ.75 కోట్లతో వాటర్ అడ్వెంచర్ స్పోర్ట్స్, హోటల్, విల్లా, పర్యాటక అనుబంధ సదుపాయాలను ఏర్పాటు చేస్తామని ఢిల్లీకి చెందిన ఒకస్ గ్రూప్ ప్రతిపాదనతో వచ్చింది.

- పాకలలో రూ.50కోట్లతో బీచ్ రిసార్ట్ ఏర్పాటు చేస్తామని ఆలాస్ ఫుడ్ వరల్డ్ రెస్టారెంట్ సంస్థ ముందుకు వచ్చింది.
- రూ.75 కోట్లతో 500 పడకల మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ కోరింది. దీని ద్వారా ప్రత్యక్షంగా వెయ్యి మందికి పైగా, పరోక్షంగా 500 మందికి పైగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపింది. రూ.100 కోట్లతో సీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని శ్రీ మంజునాథ హేచరీస్ ప్రతిపాదించింది.
- జిల్లాలో రూ.12 కోట్లతో మొక్కజొన్న డ్రయ్యర్ యూనిట్ ఏర్పాటు చేస్తామని, 150 మందికి ఉపాధి లభిస్తుందని, దీని కోసం స్థలం కేటాయించాలని ఒంగోలుకు చెందిన నాగేశ్వరరావు కోరారు. జిల్లాలో రూ.7కోట్లకు పైగా పెట్టుబడితో సోలార్ పవర్ జనరేషన్ యూనిట్, ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్/ వేస్ట్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తానని ఒంగోలుకు చెందిన పెనుబోతు అజిత్ ముందుకు వచ్చారు.

ఈ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్‌రావు, బీఎన్ విజయ్ కుమార్, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, ఏలూరి సాంబశివరావు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, మ్యారీటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, దర్శి టిడిపి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, సబ్ కలెక్టర్ డి.హిమవంశి, ఇతర ఉన్నతాధికారులు, యువ పారిశ్రామిక వేత్త మాగుంట రాఘవరెడ్డి పాల్గొన్నారు.




## దాడులకు, బెదిరింపులకు భయపడం

● వైసిపి జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి

**నెల్లూరు(విద్య), జూన్ 23 ప్రభాతవార్త:** ప్రభుత్వ అవినీతిని ఎదిరించినందుకు కృష్ణచైతన్య విద్య సంస్థలపై దాడులు చెయడం నీతిమాలిన రాజకీయాలకి ప్రత్యక్ష నిదర్శనమని, ఇటువంటి దాడులకు, బెదిరింపులకు తాము బయపడే ప్రశక్తే లేదని వైకాపా జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వైకాపా పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లడుతూ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి విద్యాసంస్థలపై దాడులు చేయడం అంటే ప్రశ్నించే వారిని అణగదొక్కడమేనన్నారు. మెగా డియస్సీలో ప్రభుత్వం చేసిన అక్రమాలను ప్రశ్నించడమే చంద్రశేఖర్ రెడ్డి చేసిన తప్పా అని ప్రశ్నించారు. జిల్లాలో ఉన్న 70 కాలేజీలను వదిలిపెట్టి కేవలం చంద్రశేఖర్ రెడ్డి విద్యా సంస్థలపై దాడులు చేయడం చూస్తుంటే కూటమి ప్రభుత్వ నేతలు రాజకీయాల్లో ఏ స్థాయికి దిగజారిపోయారు అర్థమవుతుందన్నారు. ఈ దాడులు కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యలేనన్నారు. ఇలాంటి వాటికి చంద్రశేఖర్ గాని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గాని భయపడిపోదని ఇంకా రెట్టింపు ఉత్సాహంతో ప్రజా సమస్యలపై పని చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఆనం విజయకుమార్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ, రాజకీయంగా ఎదుర్కోవాలే కానీ ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యంలో సరికాదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## జగన్‌కు దమ్ముంటే.. కాపు నేతను సిఎం అభ్యర్థిగా ప్రకటించాలి: కిరణ్ రాయల్

**తిరుపతి, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర రాజకీయాలు కులాల చుట్టూ తిరగడం దురదృష్టకరయని,రాష్ట్రంలో కాపు సామాజిక వర్గం 25నుండి 27 శాతం ఓటు బ్యాంకుగా ఉందని తిరుపతి జనసేన పార్టీ ఇంచార్జ్ కిరణ్ రాయల్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా కాపుల ఓట్లు కీలకమని అభిప్రాయం వ్యక్తం చేశారు. వైసిపి నేత జగన్‌కు దమ్ముంటే ఐదుగురు కాపు నేతల్లో ఒకరిని సిఎం అభ్యర్థిగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఐదుగురికి ఒక్కో ఏడాది చొప్పున సిఎం పదవి కేటాయించాలని సవాల్ విసిరారు. సిఎం అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా ముందస్తు శుభాకాంక్షలు అంటూ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. కాపు సామాజిక వర్గాన్ని వైసిసి పావులుగా వాడుకుంటోందని, ప్రతి ఘటనకు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను బాధ్యుడిగా చూపడం సరికాదని విరుచుకుపడ్డారు. పెయిడ్ ఆర్టిస్టులతో నిరసన చేయడం భూమన ఫ్యాషన్‌గా మారిందని విమర్శించారు.

## చోరీ కేసును ఛేదించిన పోలీసులు

● రూ.11.88 లక్షల విలువైన సొత్తు రికవరీ



**నెల్లూరు(వైద్యం), జూన్ 23 ప్రభాతవార్త:** నెల్లూరు నగర పరిధిలోని వేదాయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన భారీ గృహ చోరీ కేసును పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు. ఈ ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి, సుమారు రూ.11.88 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. చెడు అలవాట్లకు బానిసై, సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతోనే చోరీలను వృత్తిగా ఎంచుకున్న వ్యక్తి చివరకు మరోసారి కటకటాల పాలయ్యాడు. నెల్లూరు రూరల్ మండలం, రెవెన్యూ కాలనీలోని ఒక మూడు అంతస్తుల భవనంలోని మొదటి అంతస్తులో నివాసం ఉంటున్న యజమానులు తాళం వేసి బయటకు వెళ్ళిన సమయంలో, గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి గ్రిల్ గేటు, కిటికీలను తొలగించి లోపలికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదుతో వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ సౌజన్య దిశానిర్దేశం, టౌన్ ఏఎస్పీ దీక్ష పర్యవేక్షణలో వేదాయపాలెం సీఐ శ్రీనివాసరావు నేతృత్వంలో పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో, ఈ నెల 22న బుజబుజనెల్లూరు హైవే రోడ్డుపై అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఉప్పు శివనారాయణ అనే వ్యక్తిని పోలీసులు గుర్తించారు. పోలీసులను చూడగానే పారిపోయేందుకు ప్రయత్నించిన నిందితుడిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా, చోరీకి గురైన సొత్తు బయటపడింది. నిందితుడి వద్ద నుండి సుమారు 162.5గ్రాములు (విలువ రూ.11,37,500) సుమారు 340 గ్రాములు (విలువ రూ.51,000) వెరసి మొత్తం రూ.11,88,500 విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన అతి తక్కువ సమయంలోనే నిందితుడిని అరెస్టు చేసి, దొంగిలించిన ఆస్తిని పూర్తిగా రికవరీ చేసిన ఏఎస్పీ దీక్షను, వేదాయపాలెం సీఐ శ్రీనివాస రావు ఇతర పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

## కుళ్ళిన మాంసం విక్రయాలపై కేసులు

**తిరుపతి, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** స్మార్ట్‌సిటీ తిరుపతి నగరంలో ఇటీవల వెలుగుచూసిన నిల్వచేసి కుళ్ళిన, దుర్వాసన వస్తున్న మాంసం విక్రయాలపై దాడులు జరిగిన విషయం తెలిసిందే. దీనిపై తిరుపతి నగర ఆరోగ్యఅధికారి డాక్టర్ యువ అన్వేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతి పిపిచావడి దగ్గర ఉన్నటువంటి మటన్ మార్కెట్‌లో వ్యాపారం నిర్వహిస్తున్నటువంటి ఐదుగురు వ్యాపారస్తులపై మంగళవారం తిరుపతి వెస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆరోగ్యానికి హానికరంగా ఉన్న మాంసం నిల్వ ఉంచుకొని అమ్ముతున్నారనే ఘటనపై ఫిర్యాదు అందిదని వెస్ట్ సిఐ పి.రామకృష్ణ తెలిపారు. ఫిర్యాదుపై కేసు నమోదు చేయడం జరిగిందని సిఐ చెప్పారు. పిపిచావడి దగ్గర గల మాంసం మార్కెట్ సుమారు 500 కేజీలు మాంసం హానికరమైనదని గుర్తించారు. కుళ్ళిన మాంసం కలిగివున్న వ్యాపారులు ఎస్ నిషార్ బాష, షేక్ ఎస్ చాంద్ బాష, హబూబాద్ షరీఫ్, ఎస్ రఫీ, ఎస్ మొహిద్దీన్ దుకాణాల్లో భారీగా కుళ్ళిన మాంసం లబించిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## మాజీ సర్పంచ్ ఆత్మహత్య

**హుస్నాబాద్ రూరల్, జూన్ 23, ప్రభాతవార్త:** హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామ మాజీసర్పంచ్ పిట్టల సంపత్ మంగళవారం వ్యవసాయ బావివద్ద ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే సంపత్ ఈ దారుణ నిర్ణయం తీసుకున్నారని ఆయన కుటుంబసభ్యులు, బంధువులు పేర్కొంటున్నారు. ఘటనపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా, సంపత్ ఆత్మహత్యకు గ్రామాభివృద్ధి పనులకు చేసిన ఖర్చుల బిల్లులు రాకపోవడమే ప్రధాన కారణమని పలువురు మాజీ సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు. ఆయన సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామాభివృద్ధి కోసం తనకు సంబంధించిన మామిడి తోటను విక్రయించి వచ్చిన డబ్బుతో అభివృద్ధి పనులు చేపట్టారని, అయితే ఆ పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పటివరకు విడుదల కాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సంపత్ కుటుంబానికి న్యాయం చేయాలని, ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సాయం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లు హుస్నాబాద్- కరీంనగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో కొంతసేపు రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆందోళన కారులతో చర్చించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల ఖచ్చితమైన కారణాలను పోలీసులు విచారణ ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

# విద్యతోనే సమానత్వం, గౌరవం

● డి.సిఎం పవన్ ఆలోచన, మా ఆలోచన ఒకటే ● ఎపి వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్

**నెల్లూరు(వైద్యం), జూన్ 23 ప్రభాతవార్త:** నెల్లూరు పరమేశ్వరి నగర్ నందు గల వక్ఫ్ భూమి నందు నిర్మిస్తున్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణ పనులను ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యులు, వక్ఫ్ సిఇఒ పరిశీలించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ 20 కోట్లు సిఎస్ఆర్ నిధులతో కార్పొరేట్ స్థాయి స్కూల్‌ను నిర్మిస్తున్నామని, వచ్చే ఏడాదికి అందుబాటులోకి తేవాలని శరవేగంగా, పనులు జరుగుతున్నాయని తెలిపారు. తనకు అన్ని జిల్లాల నుంచి స్థలాలు కేటాయించాలని ఫోన్లు చేస్తున్నారని స్థలాలు కేటాయిస్తే తాము కూడా స్కూళ్లు నిర్మిస్తామని ముందుకు వస్తున్నారు అని అన్నారు. తాలేం ఏ హునర్‌తో 250 మంది విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిస్తున్నామని, కేవలం చదువుతూనే సమానత్వం గౌరవం దొరుకుతాయని అన్నారు. వక్ఫ్ భూములు నిరుపయోగంగా ఉంటే ఆక్రమణకు గురవుతున్నాయని, ఆస్తులను నిరుపయోగంగా ఉంచకుండా ఉపయోగంలోకి తీసుకుని వచ్చి ఆదాయాన్ని పెంచుతామని తెలిపారు. స్కూల్ నిర్మాణానికి సహకరించిన మంత్రి నారాయణ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నెల్లూరులో ఉన్న కాలేజీలు మాత్రమే రైడ్ చేయలేదని, వెడత వారం భీమవరంలో నారాయణ కాలేజీని కూడా రైడ్ చేశారని అన్నారు. రూల్స్ పాటిస్తే అంత భయం ఎందుకని అన్నారు. మంత్రి నారాయణ స్వభావం కక్ష సాధింపులు చేసే స్వభావం కాదని, కక్ష సాధింపులు చేస్తూ మీరెవరు వ్యాపారాలు చేయలేరని హెచ్చరించారు. ప్రతిపక్షంలో మమ్మల్ని ఎందుకు కష్టాలు పెట్టారని అన్నారు. ప్రతి విషయంలో నేను ఉన్నాను ముందుకు వచ్చినప్పుడు మిస్టర్ క్లీన్‌గా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. తమ పై రాజకీయ బురద వేయొద్దని, మీ పై ఉన్న బురద కడుక్కోవాలని అన్నారు.

ఏఎస్ పేట దర్గా విషయం పై స్పందన: ఎస్ పేట సజ్జాద హాఫీజ్ పాషా బోర్డుకు వ్యతిరేకంగా 32 కేసులు వేశారని అన్నారు. సజ్జాద పనులు సరిగ్గా చేయడం లేదని అతనికి నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు. గతంలోనే అతనిని మతవల్లిగా తొలగించామని తెలిపారు. పవన్ కల్యాణ్ ఆలోచనే తమ ఆలోచన కూడా అని వివరించారు. ఎంక్వయిరీ పూర్తికాకుండా చర్యలు బహిర్గతం చేయలేమని, వెరీ పూర్తయ్యాక అతని మీద ఖచ్చితంగా చర్యలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు సభ్యులు అక్రమ్, ఖాజా, ఇస్మాయిల్ బేగ్, బెపారి జాకీర్ అహ్మద్ సీఈవో యాకూబ్ ఖాజీ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల ఎత్తివేతకు కుట్ర




ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ ఆర్థిక దోపిడీకి కొమ్ముకాస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

పాఠశాలల రాష్ట్ర బంద్ విజయవంతం

ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల ఎత్తివేతకు కుట్రచేస్తూ, ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల విచ్చలవిడి ఆర్థిక దోపిడీకి కొమ్ముకాస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర కమిటీ మంగళవారం చేపట్టిన పాఠశాలల బంద్ విజయ వంతం అయిందని సంఘం రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు తెలిపారు. ఈ సందర్భం గా మాచెర్ల రాంబాబు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పేద పిల్లలకు విద్యను దూరం చేయడం కోసమే 23000 ప్రభుత్వ పాఠశాలలను మూసి వేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కుట్ర చేస్తున్నాడనీ దుయ్య బట్టారు. ఆదివాసీ గూడెంలలో, గిరిజన తండాల్లో, దళిత వాడల్లోని పిల్లలు చదువుకోవడం ఇష్టంలేదా అని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో లక్షల కొద్ది ఫీజులు వసూలు చేస్తున్న ఆయా యాజమాన్యాలపై చర్య లు తీసుకోవడం లేదని, ఫీజుల నియంత్రణ చట్టం హామీని ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల భూములను కాజేసేందుకే రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వ బడులను మూస్తున్నాడా? అనే అనుమానం కలుగుతుందన్నారు. విద్యాసంవత్సరం మొదలై వారం గడుస్తున్నా ఇప్పటి వరకు కనీసం పిల్లలకు యూనిఫామ్స్, పుస్తకాలు అందలేదంటే ప్రభుత్వం ఎంత నిరక్ష్యంగా వ్యవహరిస్తుందో అర్థమవుతుందన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో మౌలికవసతులు కరువయ్యాయని, ఆడపిల్లకు సరిపడా బాత్రూంలు కూడా లేని పరిస్థితి ఈ రాష్ట్రంలో ఉందన్నారు. పేద విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25శాతం ఉచితంగా సీట్లు అందించే విద్యాహక్కు చట్టం అటకెక్కిందన్నారు. ఎంఈవో, డీఈవో పోస్టులను భర్తీచేయక క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లోపించిందన్నారు. బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను ఎందుకు అన్ని పాఠశాలల్లో అమలు చేయడం లేదో విద్యాశాఖ మంత్రిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. తాము నిర్వహించిన "బంద్"లో తల్లిదండ్రులు, విద్యార్థులు స్వచ్ఛందంగా మద్దతు తెలిపారని, ప్రైవేట్ విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నాయన్నారు. గవర్నమెంట్ పాఠశాలల్లో విద్యార్థులు బంద్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్న సందర్భంలో కొంతమంది పోలీసులు విచక్షణ మరిచి ప్రవర్తించారని మండిపడ్డారు. అందరి మద్దతుతో రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్

# క్యూర్ ఏరియాలో లక్ష ఫ్లాట్ల నిర్మాణం

ఎల్ఐజి హౌసింగ్ స్కీం.. పేరు ఖరారుపై పోటీ

28 వరకు సోషల్ మీడియాలో నిర్వహణ

ఉత్తమమైనదిగా ఎంపికైన దానికి రూ.లక్ష బహుమతి

హౌసింగ్ బోర్డు వినూత్న ప్రయత్నం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 23:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలిసారిగా అల్పాదాయ వర్గాలకు (ఎల్ఐజి) క్యూర్ ఏరియాలో ప్రతిపాదించిన లక్ష ఫ్లాట్ల నిర్మాణ పథకానికి పేరు ఖరారునకు హౌసింగ్ బోర్డు వినూత్న ప్రయత్నం చేపట్టింది. ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన ఈ పథకానికి మంచి పేరును నేరుగా ప్రజల నుంచే స్వీకరించాలని హౌసింగ్ బోర్డు నిర్ణయించింది. ప్రజల నుంచి వచ్చిన పేర్లలో ఉత్తమమైనదిగా ఎంపికైన పేరును సూచించిన వారికి ఒక లక్ష రూపాయల బహుమతిని అందచేస్తామని, సోషల్ మీడియా వేదికగా ఈ అంశంలో బహిరంగ పోటీని నిర్వహిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ విపి గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. క్యూర్ పరిధిలో అల్పాదాయ వర్గాల ప్రజల కోసం ప్రత్యేకంగా లక్ష ఇండ్లను నిర్మించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంతర్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఎటువంటి వివాదాలు లేకుండా, అందుబాటులోని ధరల్లో వివిధ వర్గాల ప్రజల సొంత ఇంటి కలలను నెరవేర్చడంలో హౌసింగ్ బోర్డుకు మంచి పేరు ఉంది. అంతే కాకుండా బోర్డు ఆధ్వర్యంలో చేపట్టి ప్రాజెక్టులకు ప్రజల నుంచి ఆదరణతో పాటు డిమాండ్ కూడా ఉన్నదని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో సుదీర్ఘం కాలం తరువాత చేపడుతున్న ప్రాజెక్టులో ప్రజలను కూడా భాగస్వామ్యులను చేయాలన్న ఆలోచనతో, ప్రజల నుంచి అందే సూచనల తోనే ఈ పథకానికి పేరును కూడా ఖరారు చేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 28 వరకు సోషల్ మీడియాలో ఇందుకు సంబంధించిన పోటీని నిర్వహిస్తున్నా మన్నారు. ప్రజలు సూచించిన పేర్లలో ఉత్తమ మైనదిగా ఎంపికైన దానికి లక్ష రూపాయలను బహుమతిగా ఇస్తామన్నారు. హౌసింగ్ డిపార్ట్ మెంట్‌కు చెందిన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పోటీలో పాల్గొనవచ్చని వివరించారు. క్యూర్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఎల్ఐజి ఫ్లాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నా మని, ఇందుకు అవసరమైన భూములను ఇప్పటికే గుర్తించామని వివరించారు. ఇందుకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, లాటరీ పద్ధతిలో ఇండ్లను కేటాయిస్తామని, పూర్తి విధివిధానాలను త్వరలోనే ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు





## పిల్లల సంరక్షణలో 'తల్లి' హోదా ఒక్కటే సరిపోదు

ఆ తల్లి వద్ద బిడ్డ భవిష్యత్తు సురక్షితం కాదు

పుణే ఫ్యామిలీ కోర్టు సంచలన తీర్పు

చిన్నారి కస్టడీని తండ్రికి అప్పగిస్తూ ఆదేశాలు

**పుణె, జూన్ 23:** ఒక మహిళ తన వివాహ ప్రమాణాలను పాటించాలని, భర్తను శారీరకంగా, మానసికంగా చూసుకోవాలని, ఆయన క్షేమం కోసం ప్రార్థించాలని ఆశిస్తారు. ఒకవేళ ఆమె భర్త పట్ల ఈ 'పవిత్రమైన' బాధ్యతలను నిర్వర్తించకపోతే, అటువంటి తల్లి వద్ద వారి బిడ్డ భవిష్యత్తు 'సురక్షితం కాదు' అని పుణె కుటుంబ న్యాయస్థానం సంచలన తీర్పు నిచ్చింది. మైనర్ బాలుడి సంరక్షణ హక్కును (కస్టడీకి) తండ్రికి అప్పగిస్తూ ఇన్‌ఛార్జ్ ఫ్యామిలీ కోర్ట్ జడ్జి గణేష్ ఘులే ఉత్తర్వులు జారీ చేశారు. భర్త విషయంలో బాధ్యతలు విస్మరించిన భార్య తన పిల్లల సంరక్షణకు అనర్హురాలంటూ కోర్టు అభిప్రాయపడింది. ఈ సందర్భంగా తల్లి వద్ద ఉంటే పిల్లాడి భవిష్యత్తు సురక్షితం కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు తల్లికి షాక్ ఇస్తూ చిన్నారి కస్టడీని తండ్రికి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా పిల్లల సంరక్షణ విషయంలో కేవలం 'తల్లి' అనే హోదా ఒక్కటే సరిపోదని న్యాయ స్థానం వ్యాఖ్యానించింది. భర్త, అత్తమామల పట్ల క్రూరంగా ప్రవర్తించే వివాహితకు పిల్లలను కస్టడీ ఇవ్వలేమని పేర్కొంది. వైవాహిక బాధ్యతలను, కుటుంబ విధులను పూర్తిగా విస్మరించిన మహిళ.. బాధ్యతారహిత ప్రవర్తన బాలుడి మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని కోర్టు అభిప్రాయ పడింది. చట్టం ప్రకారం పిల్లల సర్వతోముఖాభివృద్ధే అత్యంత ముఖ్యమైన విషయమని చెప్పుకొచ్చింది. నిరంతరం గొడవలు పెట్టుకునే వాతావరణంలో చిన్నారులు సురక్షితంగా పెరగలేరని తెలిపింది. ఈ మేరకు అన్ని ఆధారాలను పరిశీలించిన తర్వాత బాలుడి సంరక్షణ బాధ్యతను తండ్రికి అప్పగించింది. తల్లికి కస్టడీ నిరాకరిస్తూ కేవలం నిర్ణీత సమయాల్లో మాత్రమే కుమారుడిని చూసుకునేందుకు అనుమతినిచ్చింది. ఈ సందర్భంగా పిల్లలను భాగస్వామిపై పగ తీర్చుకోవడానికి ఆయుధాలుగా వాడుకోలేరంటూ పుణె న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

## రేవంత్ అడిగారు.. నేను ఏర్పాటు చేశా

ఎక్స్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పోస్ట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 23:** ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్రమంత్రులతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో, మంగళవారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో రేవంత్ సమావేశమయ్యారు. ప్రధానంగా హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 విస్తరణపైనే చర్చ జరిగింది. రేవంత్‌తో కలిసి కేంద్ర మంత్రులను కలవడంపై కిషన్‌రెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. 'కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండుసార్లు నాకు లేఖ రాశారు. 22వ తేదీన రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో, 23న కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయించాను. మెట్రో రైల్ విస్తరణపై సాను కూల వాతావరణంలో చర్చలు జరిగాయి. తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్ మంత్రిగా ఉన్న నేను రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం ఎల్లవేళలా పనిచేస్తా' అని ఎక్స్‌లో కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# 'కొలీజియం' న్యాయ సమీక్షకు అతీతం



## న్యాయమూర్తుల ఎంపిక ప్రక్రియలో జోక్యంలేదు
## పదోన్నతి కోసం ఎవరిని సిఫార్సు చేయాలో కోర్టులు నిర్దేశించలేవు
## సుప్రీంకోర్టు విస్పష్ట తీర్పు

**న్యూఢిల్లీ, జూన్ 23:** హైకోర్టు న్యాయమూర్తులను నియమించే కొలీజియం ప్రక్రియను సవాలు చేస్తూ హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఒక న్యాయాధికారి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు నిరాకరించింది. అటువంటి నిర్ణయాలు కొలీజియం 'వ్యక్తిగత సంతృప్తి'పై ఆధారపడి ఉంటాయని, వాటిని న్యాయపరమైన స్థాయిలో కోర్టులు సమీక్షించలేవని పేర్కొంది. ధర్మశాలలోని ఫ్యామిలీ కోర్టు ప్రధాన న్యాయమూర్తి అరవింద్ మల్హోత్రా దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బి.వి. నాగా రత్న, జయమల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం విచారించింది. రాష్ట్రంలోని అత్యంత సీనియర్ న్యాయాధికారులలో ఒకరిగా ఉన్నప్పటికీ, హిమా చల్‌ప్రదేశ్ హైకోర్టుకు పదోన్నతి కోసం తన అభ్య ర్థిత్వాన్ని విస్మరించి, తనకంటే జూనియర్ అధి కారులను సిఫార్సు చేశారని మల్హోత్రా వాదించారు. పిటిషనర్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది బల్బీర్ సింగ్, మల్హోత్రా ఎంపిక ప్రక్రియలో పాల్గొని అవసరమైన పత్రాలను సమర్పించినప్పటికీ, చివరికి సుప్రీంకోర్టు కొలీజియం ఆయన జూనియర్ల పేర్లను ఆమోదించిందని వాదించారు. అయితే, పదోన్నతి కోసం ఎవరిని సిఫార్సు చేయాలో లేదా పరిగణించాలో కొలీజియంలకు న్యాయస్థానాలు నిర్దేశించలేవని ధర్మాసనం స్పష్టం చేసింది. 'ఇవి అంతిమంగా హైకోర్టు కొలీజియం వ్యక్తిగత సంతృప్తికి సంబంధించిన విషయాలు. న్యాయపరంగా, 'మీరు ఇది చేయండి, అది చేయండి, అతని పేరును పరిగణించండి' అని సుప్రీం కోర్టు కొలీజియంతో చెప్పగలదా? అలా చేయలేము' అని జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానించారు. మల్హోత్రా అభ్యర్థిత్వాన్ని అధికారికంగా తిరస్కరించినట్లు సూచించడానికి ఎటువంటి ఆధారాలు లేవని కూడా కోర్టు పేర్కొంది. పిటిషనర్ పేరు ఇంకా పరిశీలనలో ఉండవచ్చని, కాబట్టి ఆయన వేచి ఉండాలని జస్టిస్ నాగారత్న అన్నారు. కేవలం సీనియారిటీ మాత్రమే పదో న్నతికి హక్కును కల్పిస్తుందన్న వాదనను ధర్మా సనం తోసిపుచ్చింది. సీనియారిటీ ఉన్నంత మాత్రాన ఒక న్యాయాధికారికి సిఫార్సు పొందే అర్హత దానంతట అదే లభించదని పేర్కొంది. కొలీ జియం చర్చలు గోప్యమైనవని న్యాయమూర్తులు స్పష్టంచేశారు. హైకోర్టు లేదా సుప్రీంకోర్టు కొలీజి యం అంతర్గత చర్చలను పరిశీలించడం ద్వారా 'పాండోరా పెట్టెను తెర వడానికి' కోర్టు ఇష్టపడటం లేదని జస్టిస్ నాగరత్న అన్నారు. హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులను సుప్రీంకోర్టు కొలీజియం ఇప్పటికే ఆమోదించడం వల్ల, తొలిదశల న్యాయ సమీక్ష కష్టతరంగా మా రిందని జస్టిస్ బాగ్చి పేర్కొన్నారు. కోర్టు పరిశీ లనల తర్వాత, పిటిషనర్ ఆ అభ్యర్థనను ముం దుకు తీసుకెళ్లకూడదని నిర్ణయించుకుని, పరిపా లనా పరంగా సమర్థ అధికారి ముందు ఇతర పరిష్కార మార్గాలను అనుసరించడానికి స్వేచ్ఛ కోరారు. సుప్రీంకోర్టు, దావాల యోగ్యతపై ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయకుండానే పిటిషన్‌ను పరిష్కరించింది. న్యాయా ధికారులు చిరాగ్ భాను సింగ్, భూపేష్ శర్మ, యోగేష్ జస్వాల్‌లను హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కోసం సిఫార్సు చేసి, ఆమోదించిన తర్వాత ఈ పిటిషన్ దాఖలైంది.



## అమెరికా పౌరసత్వం ఇక మరింత ఖరీదు!
### దరఖాస్తు ఫీజు 75% పెంపు

**వాషింగ్టన్, జూన్ 23:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇమిగ్రేషన్ నిబంధనలను కఠినతరం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన కార్యవర్గం చేసిన ప్రతిపాదనలతో అమెరికా పౌరసత్వం మరింత ఖరీదుగా మారనుంది. పౌరసత్వ దరఖాస్తుల ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెంచాలని యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ (డిహెచ్‌ఎస్) ప్రతిపాదించింది. సక్రమ మార్గంలో వచ్చిన వలసదారులు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకుంటే ప్రాసెసింగ్, వెట్టింగ్ ఖర్చులు భరించాల్సి రావడంతో పాటు ఇప్పటివరకు ఉన్న పలు మినహాయింపులు కూడా కోల్పోనున్నారు. పౌరసత్వ దరఖాస్తు (పేపర్ బేస్డ్) ఫైల్ చేయడానికి ఫీజు 760 డాలర్ల నుంచి 1330 డాలర్లకు పెరగనుంది. ఆన్‌లైన్ దరఖాస్తు విషయానికి వస్తే 710 డాలర్ల నుంచి 1280 డాలర్లకు ఫీజు పెంపును అధికారులు ప్రతిపాదించారు. ఈ కొత్త ఫీజులు అమలులోకి వస్తే.. 75 శాతం మేర భారం పడనుంది. ఏదైనా సిటిజన్‌షిప్ అప్లికేషన్ తిరస్కరణకు గురైతే దానిని తిరిగి పరిశీలించాలని కోరినా సరే ఖర్చుల మోత మోగనుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదిత నిబంధనలపై 60 రోజులపాటు ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారు. అలాగే అమెరికాలో ఆదాయ ఆధారిత మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తుదారులకు ప్రస్తుతం లభిస్తోన్న మినహాయింపులను తొలగించాలని డిహెచ్‌ఎస్ ప్రతిపాదించింది. 400శాతం లేక అంతకంటే తక్కువ ఆదాయం ఉన్న దరఖాస్తుదారులకు రెడ్యూస్డ్ ఫీజ్ ఆప్షన్‌ను తీసేయాలని సూచించింది. ఈ కొత్త రూల్స్ వల్ల సహజంగా పౌరసత్వం పొందడానికి అర్హత ఉన్న శాశ్వత నివాసితులు తమకున్న అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# టిఎంసిలో పెరిగిన ఆధిపత్యపోరు



### అసలైన తృణమూల్ కాంగ్రెస్ మాదే: ఇసికి మమత వర్గీయుల లేఖ
### తిరుగుబాటు వర్గం కమిటీ పునర్నియామకం
### చైర్మన్ అరూప్ రాయ్, ఉపాధ్యక్షుడిగా అరూప్ బిస్వాస్

**కోల్‌కతా, జూన్ 23:** తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)లో ఆధిపత్య పోరు ఉధృతమైంది. అసెంబ్లీలో ప్రతిపక్ష నేత రీటాబ్రత బెనర్జీ సోమవారం తమదే అసలైన టిఎంసి అంటూ, కొత్త కమిటీని పునర్నియామకం చేయగా, కాదు మాదే అసలైన తృణమూల్ కాంగ్రెస్ అని మమతా బెనర్జీ అనుకూల వర్గం, ఇదే మా పార్టీ అసలైన జాతీయ కార్యవర్గం అని పేర్కొంటూ భారత ఎన్నికల సంఘానికి (ఇసిఐకి) అందిస్తూ లేఖ రాసింది. పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీలకు విధేయులైన 'అసలైన కానీ మైనారిటీ' వర్గంగా తమను తాము అభివర్ణించుకున్న ఈ వర్గం, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలోని టిఎంసి శాసన సభ్యుల 'తిరుగుబాటు కానీ మెజారిటీ' వర్గం ప్రకటించిన సమాంతర కమిటీకి ప్రతిగా, తమ జాబితానే 'అసలైన' జాతీయ కార్యవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొంది. రీటాబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గం, మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ ఇద్దరినీ మినహాయించి కొత్త జాతీయ కార్యవర్గాన్ని ఆవిష్కరించిన కొద్దిసేపటికే, సోమవారం రాత్రి ఇసికి ఈ లేఖ పంపినట్లు వర్గాలు తెలిపాయి. మమతా బెనర్జీ వర్గం సమర్పించిన జాబితాలో, మమతను జాతీయ ఛైర్‌పర్సన్‌గా, సుబ్రతా బక్షి ని జాతీయ ఉపా ధ్యక్షుడిగా, అభిషేక్ బెనర్జీని ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ జాబి తాలో రాజ్యసభ సభ్యులు డెరెక్ ఓబ్రియన్, డోలా సేన్‌లను సంయుక్త కార్యదర్శులుగా, రాజ్యసభ మాజీ సభ్యుడు సుభాసిష్ చక్రవర్తిని కోశాధికారిగా కూడా చేర్చారు. దీనిపై రీటాబ్రతా బెనర్జీ స్పందిస్తూ, తనకు ఎలాంటి వ్యాఖ్యలు లేవని, అయితే ఇతర వర్గానికి శుభాకాంక్షలు తెలుపుతున్నానని అన్నారు. సోమవారం సాయంత్రం ప్రకటించిన తిరుగుబాటు వర్గం కమిటీ, మమతా బెనర్జీ స్థానంలో సీనియర్‌శాసనసభ్యుడు, మాజీ మంత్రి అరూప్ రాయ్‌ను ఛైర్‌పర్సన్‌గా నియ మించింది. మాజీ మంత్రి అరూప్ బిస్వాస్‌ను ఉపాధ్యక్షుడిగా, ఎమ్మెల్యేలు ఫిర్హాద్‌హాకీం, రథిన్ ఘోష్‌లను ఉపాధ్యక్షులుగా నియమించారు. రిటాబ్రతా బెనర్జీ, జావేద్ ఖాన్, సందీపన్ సాహా, మరియు సబీనా యాస్మిన్‌లను ప్రధాన కార్యదర్శులుగా నియమించగా, అఖ్రుజ్జమాన్‌ను కోశాధికారిగా నియమించారు. తృణమూల్ కాంగ్రెస్‌లోని 'అసలైనకానీ అల్పసంఖ్యాక' వర్గం, మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీలకు తమ విధేయతను కొన సాగిస్తూ, పార్టీ జాతీయకార్యవర్గంవివరాలను తెలియజేస్తూ భారత ఎన్నికల సంఘానికి (ఇసిఐ) ఒక ప్రకటనను పంపింది. తమదే అసలైన తృణ మూల్ కాంగ్రెస్ అంటూ ఇసిఐకి పంపిన లేఖలో పేర్కొంది.



## ఐడిఎఫ్‌సి స్కామ్‌లో ఐఎఎస్ అధికారి అరెస్టు

**న్యూఢిల్లీ,జూన్ 23:** బ్యాంక్ స్కామ్ రూ. 657 కోట్ల కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఓ ఐఎఎస్ ఆఫీసర్‌ను అరెస్టు చేసింది. 2000 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ పంకజ్ అగర్వాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో అరెస్టు అయిన రెండో ఐఎఎస్ అధికారి ఆయన. ఇదే కేసులో ఇప్పటికే రామ్ కుమార్ సింగ్ అనే ఐఎఎస్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ అధికారులు, ప్రభుత్వ అధికారులతో కలిసి ఓ స్కామ్ చేశారు. హర్యానా ప్రభుత్వానికి చెందిన 8 శాఖల నుంచి, చండీఘడ్ పరిపాలన శాఖకు చెందిన రెండు అకౌంట్ల నుంచి నిధులను మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బ్యాంక్ నిధులను దుర్వినియోగం చేసిన కేసులో నష్టం 657 కోట్లు ఉంటుందని సీబీఐ పేర్కొన్నది. ఇదే కేసును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా విచారిస్తున్నది. సుమారు 645 కోట్ల కుంభకోణం జరిగినట్లు ఈడీ చెబుతోంది. స్కామ్ జరిగిన సమయంలో అడ్మినిస్ట్రేట్ సెక్రటరీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు పంకజ్ అగర్వాల్ పనిచేశారు. హర్యానా వ్యవసాయ మార్కెటింగ్ బోర్డుకు సంబంధించిన సుమారు 10 కోట్లు చండీఘడ్‌లోని ఐడీఎఫ్ ఫస్ట్ బ్యాంక్ నుంచి మాయం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అగ్రికల్చర్ మార్కెటింగ్ డెవలప్మెంట్ ఫండ్ పేరుతో ఖాతానిర్వహించినట్లు తెలుస్తోంది. ఎస్‌ఆర్‌ఆర్ ప్లానింగ్ గురుస్ లిమిటెడ్ సంస్థకు 9.75 కోట్లు, మన్నత్ కాంట్రాక్టర్స్‌కు 25 లక్షలు చెల్లించారు. కానీ షెల్ కంపెనీలకు నిధులు మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బ్యాంక్ కుంభకోణంలో మొత్తం 8మంది ఐఎఎస్ ఆఫీసర్లపై నిఘా పెట్టారు. దీంట్లో ఇద్దర్ని అరెస్టు చేశారు. మొహమ్మద్ షాయిన్, మణి రామ్ శర్మ, ప్రదీప్ కుమార్, వినీత్ గార్గ్, సాకేత్ కుమార్, డీకే బెహారా ఉన్నారు. హర్యానా స్కూల్ శిక్షా పరియోజనా పరిషద్‌కు సెక్రటరీగా ఉన్న సమయంలో విద్యాశాఖ అకౌంట్ నుంచి సుమారు 50కోట్లు దారి మళ్లించినట్లు పంకజ్ అగర్వాల్‌పై ఆరోపణ ఉన్నది. ఫైనాన్స్ శాఖ మార్గదర్శకాలకు వ్యతిరేకంగా అకౌంట్లను ఓపెన్ చేసి నిధులను మళ్లించినట్లు పంకజ్‌పై ఆరోపణలు ఉన్నాయి.

## పుణేలో వ్యాపారి ఆఫీసు వద్ద కాల్పులు
### లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పనే



**ముంబై, జూన్ 23:** మహారాష్ట్ర, పుణేలోని ఒక వ్యాపారి ఆఫీసు వద్ద కాల్పులు కలకలం సృష్టించాయి. సోమవారం రాత్రి పుణేలోని హెచ్ వికాస్ స్టీల్ సంస్థ ఆఫీసు వద్ద ఈ ఘటన జరిగింది. ఈ ఘటనకు పాల్పడింది లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ అని తెలుస్తోంది. పుణేలోని అమూల్ చమారియా, సన్నీ చమారియా అనే ఇద్దరు వ్యాపారులు లక్ష్యంగా ఈ దాడి తెలుస్తోంది. రాత్రి పూట ముసుగు ధరించిన దుండగులు.. పిస్టోల్‌తో ఆఫీసు సమీపంలో కాల్పులు జరిపారు. చుట్టుపక్కల, గోడలపై కాల్పులు జరిపి వెళ్లిపోయారు. దీనికి సంబంధించి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ తరఫున అర్జూ బిష్ణోయ్ శుభమ్ లోంకర్ పేరుతో ఉన్న ఒక అకౌంట్ నుంచి ప్రకటన వెలువడింది. తామే ఈ కాల్పులకు పాల్పడినట్లు వెల్లడించారు. వ్యాపారులిద్దరూ చాలా మందిని మోసం చేసి, మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు వారు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై తమ గ్యాంగ్ ఫోన్ చేసి హెచ్చరిస్తుంటే, వారు తమను పట్టించుకోలేదని, అందుకే ఈ కాల్పులు చేసినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో తమ కాల్స్‌కు స్పందించకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఈసారి బుల్లెట్లు గోడను తాకాయని, తాము చెప్పినట్లు వినకుంటే భవిష్యతులో వారి ఛాతిలో దిగుతాయని సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. దీనికి సిద్ధంగా ఉండాలన్నారు. అలాగే, కాల్పులకు సంబంధించిన విడియోను కూడా సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ కాల్పుల ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు. సోషల్ మీడియా పోస్టుతోపాటు, విడియోపైనా ఆరా తీసుకున్నారు. నిందితులను గుర్తించే పనిలో పోలీసులున్నారు. ఇటీవలి కాలంలో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పలుసార్లు దాడులకు పాల్పడింది. సెలబ్రిటీలతోపాటు అనేకమంది వ్యాపారుల ఇళ్ల వద్ద కాల్పులు జరుపుతోంది.

## సమాచారహక్కు చట్టం మార్పులపై అన్నా హజారే ధ్వజం



**ముంబయి, జూన్ 23:** మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవలతీసుకొచ్చిన సమాచార హక్కు (ఆర్టీఐ)నిబంధనల సవరణలను వెంటనే రద్దు చేయాలని సామాజిక కార్యకర్త అన్నా హజారే డిమాండ్‌చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాసిన హజారే ఈనెల12న తీసుకొచ్చిన మహారాష్ట్ర ఆర్టీఐ రూల్స్-2026, సమాచార హక్కుచట్టం స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కొత్త నిబంధనలవల్ల ఆర్టీఐ చట్టం లక్ష్యం నీరుగారి, ప్రజలకు సమాచారం అందడం మరింత కష్టమవుతుందని విమర్శించారు. ఆర్టీఐ దరఖాస్తుల ఫీజులను పెంచడాన్నీ హజారే తీవ్రంగా వ్యతిరేకించారు. 20ఏళ్ల తర్వాత ఫీజులు పెంచితే, సమాచారమివ్వకుండా ఆలస్యంచేసే అధికారులపై జరిమానాలను పెంచాలని సూచించారు.

# 'వికసిత్ భారత్'లో ఐఎఎస్‌లు కీలకం




2024 బ్యాచ్ ఐఎఎస్ ట్రైనీలతో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జూన్ 23:** వికసిత భారత్2047 లక్ష్య సాధనలో యువ సివిల్ సర్వెంట్లు కీలక పాత్ర పోషించాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపునిచ్చారు. దేశ నిర్మాణానికి అంకితభావంతో పనిచేయాలని, పదవుల కంటే ప్రజలకు అందించిన ఫలితాల ద్వారానే సంతృప్తి పొందాలని ఆయన సూచించారు. మంగళవారం సేవా తీర్థ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 2024 బ్యాచ్‌కు చెందిన 183 మంది ఐఎఎస్ అధికారి శిక్షణార్థులతో ప్రధాని మోడీ సంభాషించారు. వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో అసిస్టెంట్ సెక్రటరీలుగా పనిచేస్తున్న ఈ యువ అధికారులు తమ శక్తి, ప్రతిభ, అంకితభావంతో భారత అభివృద్ధి ప్రయాణాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఫీల్డ్ ట్రైనింగ్, మంత్రిత్వ శాఖల్లో అనుబంధ సేవల సమయంలో పొందిన అనుభవాలను అధికారులు ప్రధానమంత్రితో పంచుకున్నారు. రెండేళ్ల పరిపాలనా శిక్షణ, క్షేత్రస్థాయి అనుభవం అనంతరం వారు అత్యంత కీలక దశలో ఉన్నారని, ఇకపై వారి నిర్ణయాలు కేవలం వారి కెరీర్‌ను మాత్రమే కాకుండా కోట్లాది ప్రజల భవిష్యత్తును ప్రభావితం చేస్తాయని ప్రధాని పేర్కొన్నారు. ప్రజాసేవలో నిజమైన పరీక్ష వాస్తవ జీవిత పరిస్థితులను నిజాయితీ, సున్నితత్వం, నిబద్ధతతో ఎదుర్కోవడంలోనే ఉందని మోడీ అన్నారు. దేశ నిర్మాణంలో స్పష్టమైన లక్ష్యంతో, వినూత్న ఆలోచనలతో, పౌరుల కేంద్రిత పరిపాలనతో ముందుకు సాగాలని యువ అధికారులకు సూచించారు. ప్రతి పరిపాలనా ఫైల్ వెనుక ప్రజల ఆశలు, ఆందోళనలు, జీవితాలు దాగి ఉంటాయని గుర్తుంచుకోవాలని ఆయన చెప్పారు. నాగరిక్ దేవో భవ మంత్రాన్ని ఆచరిస్తూ ప్రతి నిర్ణయంలో పౌరులను కేంద్రంగా ఉం చాలని, పరిపాలన సానుభూతితో, స్పందనాత్మ కంగా, సమగ్రంగా ఉండేలా చూడాలని పిలుపు నిచ్చారు. అభివృద్ధి సవాళ్లను ఒక్కో శాఖ విడి విడిగా పరిష్కరించలేదని, శాఖల మధ్య సమన్వయం ద్వారానే స్థిరమైన ఫలితాలు సాధ్యమవుతాయని ప్రధాని పేర్కొన్నారు. వికసిత భారత్2047 దిశగా రాబోయే దశాబ్దాల్లో తీసుకునే ప్రతి విధాన నిర్ణయం, పరిపాలనా చర్య దేశ అభివృద్ధికి దోహదపడేలా ఉండాలని అన్నారు. ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా, తయారీ రంగ వృద్ధి, ఇంధన భద్రత, యువతకు ఉపాధి అవకాశాల కల్పన ప్రస్తుతం దేశ ప్రాధాన్యతలుగా ఉన్నాయని ఆయన వివరించారు. గత దశాబ్దంలో పరిపాలన విధానంలో గణనీయమైన మార్పు వచ్చిందని, ప్రక్రియల ఆధారిత విధానం నుంచి ఫలితాల ఆధారిత పరిపాలన వైపు దేశం అడుగులు వేసిందని మోడీ పేర్కొన్నారు. డిజిటల్ గవర్నెన్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ), సాంకేతికత సేవల అందుబాటును, పారదర్శకతను పెంచుతున్నాయని చెప్పారు. డేటాను కేవలం సంఖ్యలుగా కాకుండా కోట్లాది ప్రజల జీవితాలు, సమస్యలు, ఆశయాలకు ప్రతిబింబంగా చూడాలని ఆయన సూచించారు. ప్రభుత్వ విధానాలు క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలను ఇస్తున్నాయో లేదో నిరంతరం పరిశీలించాలని అధికారులకు సూచించారు. దేశ నిర్మాణంలో మహిళల పాత్ర రోజురోజుకూ పెరుగుతోందని, ప్రస్తుత ఐఎఎస్ బ్యాచ్‌లో 40 శాతానికి పైగా మహిళా అధికారులు ఉండటం విశేషమని ప్రధాని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి జితేందర్‌సింగ్, ప్రధానమంత్రికి ప్రధాన కార్యదర్శి పి.కె. మిశ్రా, ప్రధాన కార్యదర్శి2 శక్తికాంత దాస్, కేబినెట్ కార్యదర్శి టి.వి. సోమనాథన్, డీఓపీటీ కార్యదర్శి రచనా షా, లాల్‌బహదూర్‌శాస్త్రి నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ అకాడమీ డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సంక్షిప్త వార్తలు

## టెలిగ్రాం యాప్‌పై నిషేధం ఎత్తివేత..



**న్యూఢిల్లీ,జూన్ 23:** నీట్ యూజీ 2026 రీఎగ్జామినేషన్ నేపథ్యంలో భారత్‌లో తాత్కాలికంగా నిలిపివేసిన టెలిగ్రామ్ సేవలను మళ్లీ పునరుద్ధరించారు. వారంపాటు నిషేధం అనంతరం మంగళవారం నుంచి గూగుల్ ప్లేస్టోర్‌లో టెలిగ్రామ్ యాప్ తిరిగి అందుబాటులోకి వచ్చింది. నీట్ యూజీ రీఎగ్జామ్‌ను లక్ష్యంగా చేసుకొని కొందరు చీటింగ్ ముఠాలు టెలిగ్రామ్‌ను ఉపయోగించి అభ్యర్థులను మోసం చేస్తున్నారనే ఆరోపణలతో జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) కేంద్రప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కేంద్రం ఈ నెల 16నుంచి 22 వరకు టెలిగ్రామ్‌ను తాత్కాలికంగా నిషేధించింది. అయితే టెలిగ్రామ్‌లో సందేశాలనుసవరించే (మెసేజ్‌ఎడిట్)ఫీచర్‌పై విధించిన ఆంక్షలు ఈనెల 30వరకు కొనసాగనున్నాయి.

## రాయల్ సర్జన్స్ కళాశాలలో సుశ్రుతుడి కాంస్యవిగ్రహం



**ఎడింబర్గ్,జూన్ 23:** ఆధునిక వైద్యశాస్త్రం ఇంకా అభివృద్ధి చెందని కాలంలోనే భారతీయ వైద్యుడు సుశ్రుతుడు విశేష కృషి చేశాడు. 2,600 ఏళ్ల క్రితమే 1,120వ్యాధులను నమోదు చేశాడు. 700కుపైగా ఔషధ మొక్కలు, 300కు పైగా వైద్య విధానాలు, 120శస్త్రచికిత్స పరికరాల వివరాలను లిఖితపూర్వకంగా భద్రపరిచాడు. ఇప్పుడు ఆయనకు స్కాట్లాండ్‌లో అరుదైన గౌరవం దక్కింది. స్కాట్లాండ్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఎడిన్‌బర్గ్ సుశ్రుతుడి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించింది. శస్త్రచికిత్స రంగానికి ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఈ గౌరవాన్ని ప్రకటించింది.

## లక్నో ప్రమాద భవనం కూల్చివేయాలని నోటీసులు



**లక్నో,జూన్ 23:** ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సంభవించిన ఘోర అగ్నిప్రమాదంలో భవన నిర్మాణం నిబంధనలు ఉల్లంఘనలు మరియు నియంత్రణ వైఫల్యాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. అక్రమ నిర్మాణం కారణంగా ఈ భవనాన్ని కూల్చివేయాలని 2016 మే 10న లక్నో డెవలప్‌మెంట్ అథారిటీ ఆదేశాలు జారీచేసింది. అయితే, కేవలం రెండు నెలల వ్యవధిలోనే, అంటే అదే ఏడాది జులై 5న ఆ ఆదేశాలను అధికారులు రద్దుచేయడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సరైన విచారణ జరపకుండానే నోటీసులు ఇచ్చారని, భవన నిర్మాణం నిబంధనలకు అనుగుణంగానే జరిగిందని అప్పటి యాజమాన్యం ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేయడంతో, ఆ కూల్చి వేత ఆదేశాలు రద్దయ్యాయి.



## గ్వాటెమాలాలో బద్ధలైన అగ్నిపర్వతం

**గ్వాటెమాలాసిటీ,జూన్ 23:** మధ్య అమెరికా లోని గ్వాటెమాలాలో వోల్కన్ డీ ఫ్యూగో అగ్నిపర్వతం బద్ధలైంది. దాంతో అగ్నిపర్వతం నుంచి ఒక్కసారిగా మంటలు ఎగజిమ్మాయి. ఏకంగా 33 వేల అడుగుల ఎత్తు పొగలు విరజిమ్మాయి. అగ్నిపర్వతం నుంచి ఒక్కసారిగా మంటలు ఎగజిమ్మి, మండుతున్న రాళ్లు బుల్లెట్లలా దూసుకొచ్చాయి. దాంతో ఆ పర్వత పరిసరాల్లో ఉన్న పర్యాటకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. ఈ హఠాత్పరిణామానికి సైతం పరుగందుకున్నారు. అగ్నిపర్వతం చుట్టూ శిథిలాలు పడుతుండగా పర్వతారోహకులు అగ్నిపర్వత మార్గా ల వెంట పరుగెత్తుతుండటం కనిపించిందని స్థానికులు చెబుతున్నారు.

## పదేళ్ల బాలికపై ఆటోడ్రైవర్ హత్యాచారం..



**న్యూఢిల్లీ,జూన్ 23:** దేశ రాజధాని ఢిల్లీలో దారుణం జరిగింది. పదేళ్ల బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారం చేసి, అనంతరం హత్య చేశాడు ఒక క్యాబ్ డ్రైవర్. ఆ తర్వాత ఆ బాలికను అడవుల్లో పారేశాడు. ఈఘటన దక్షిణ ఢిల్లీ పరిధిలోని సీడీఆర్ చౌక్ ఏరియా సమీపంలో సోమవారం ఉదయం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ఢిల్లీ, సీడీఆర్ చౌక్ సమీపంలో పదేళ్ల బాలిక కుటుంబంతో కలిసి ఫుట్‌పాత్‌పై నిద్రిస్తుండగా సోమవారం ఉదయం ఐదు గంటల సమయంలో బబ్లూ అనే క్యాబ్ డ్రైవర్ ఆ బాలికను ఎత్తుకెళ్లాడు. తన కార్‌లో బలవంతంగా ఎక్కించుకుని గుర్గావ్ (గురుగ్రామ్) ప్రాంతంలోకి ఎక్కించుకెళ్లాడు. అక్కడ బాలికపై అత్యాచారం చేశాడు. అనం తరం ఆ బాలికవల్ల ఎక్కడ నిజం బయటపడుతుందో అని భావించిన బబ్లూ ఆ బాలికను చంపేశాడు.

## ఇజ్రాయెల్ లెబనాన్‌ల మధ్య మరోసారి శాంతి-చర్చలు
### వాషింగ్టన్‌లో భేటీ..!


**వాషింగ్టన్,జూన్ 23:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలను అదుపులోకి తెచ్చి శాశ్వత శాంతిని నెలకొల్పేందుకు అగ్రరాజ్యం అమెరికా మరో ముందడుగు వేసింది. ఇజ్రాయెల్, లెబనాన్ దేశాల మధ్య అత్యంత సున్నితంగా మారిన సరిహద్దు వివాదాలు, కాల్పుల విరమణ ఒప్పందాన్ని మరింత బలోపేతం చేయడం కోసం వాషింగ్టన్ డీసీలోని స్టేట్ డిపార్ట్‌మెంట్ వేదికగా దౌత్యపరమైన చర్చలు ప్రారంభమయ్యాయి. అమెరికా మధ్యవర్తిత్వంలో జరుగుతున్న ఈ ఐదో విడత నేరుగా జరిగే ద్వైపాక్షిక చర్చలలో ఇరు దేశాల రాయబారులు, ఉన్నతాధికారుల బృందాలు పాల్గొంటున్నాయి. గతంలో జరిగిన నాలుగు విడతల చర్చల ఫలితంగా కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణను ఇరుపక్షాలు గౌరవించేలా చేయడం, అలాగే ప్రాంతీయ స్థిరత్వాన్ని సాధించడం ఈ మూడు రోజుల సమావేశాల ముఖ్య ఉద్దేశం. ఈ ప్రతిష్ఠాత్మక చర్చల్లో భాగంగా ముఖ్యంగా దక్షిణ లెబనాన్ సరిహద్దు ప్రాంతాల నుంచి ఇరు దేశాల సైన్యాల ఉపసంహరణ, హిజ్బుల్లా సాయుధ బలగాలను పూర్తిగా నిరాయుధులను చేయడం వంటి అత్యంతకఠినమైన భద్రతా నిబంధనలపై ఇరు పక్షాలు చర్చిస్తున్నాయి. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాట్లాడుతూ సరిహద్దుల్లో తమ పౌరుల భద్రతకు ముప్పుగా మారిన హిజ్బుల్లా సైనికసామర్థ్యాలను పూర్తిగా తుడి చిపెట్టడమే తమ ప్రథమప్రాధాన్యతని స్పష్టం చేశారు.

# పుణే టెక్కీది ప్రమాద మృతి కాదు..హత్యే
### మరింత లోతుగా పోలీసుల దర్యాప్తు



**పుణె,జూన్ 23:** మహారాష్ట్రలోని పుణె సమీపంలోని లోహగడ్ కోట వద్ద జూన్ 19న 26 ఏళ్ల కేతన్ అగర్వాల్ లోయలో పడి మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే తొలుత ఫొటోలు తీస్తుండగా ప్రమాదవశాత్తూ జారి పడ్డాడని పోలీసులు భావించారు. దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ అనుమానాస్పద అంశాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ప్రమాదవశాత్తూ జరిగిన మరణంగా నమోదు చేసిన కేసును పోలీసులు హత్య కోణంలో విచారిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం కేతన్‌తో నిశ్చితార్థం అయిన సియా గోయల్‌కు చేతన్ చౌదరి అనే యువకుడితో పరిచయం ఉన్నట్లు గుర్తించారు. కుటుంబ సభ్యుల నిర్ణయంతో కేతన్‌తో పెళ్లికి అంగీకరించిన సియా తమ సంబంధానికి అతడు అడ్డుగా ఉన్నాడని భావించినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కేతన్‌ను తొలగించేందుకు ఇద్దరూ కలిసి పథకం రచించి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఈనెల 14న కూడా లోహగడ్ కోట వద్ద కేతన్‌ను హత్య చేసేందుకు ప్రయత్నం జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. పాము కనిపించినట్లు భయపెట్టి లోయలోకి నెట్టేయాలనే ప్రయత్నం విఫలమైనట్లు అనుమానిస్తున్నారు. అనంతరం జూన్ 19న సియా పుట్టినరోజు సందర్భంగా మరోసారి కోటకు వెళ్లేలా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ప్రీ వెడ్డింగ్ ఫొటోషూట్ పేరుతో కేతన్‌ను కోటకు తీసుకెళ్లిన తర్వాత అక్కడకు చేతన్ కూడా చేరుకున్నాడని పోలీసులు చెబుతున్నారు. ఆ సమయంలో కేతన్ సుమారు 350 అడుగుల లోతైన లోయలో పడిపోవడంతో మృతిచెందాడు. ఇది ప్రమాదం కాదని, ముందస్తు ప్రణాళికలో భాగంగా జరిగి ఉండొచ్చని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. కేసు దిశను మార్చిన అంశం డిజిటల్ ఆధారాలేనని పోలీసులు చెబుతున్నారు. విచారణ సమయంలో సియా కొన్ని విషయాలను దాచిపెట్టినట్లు అనుమానం రావడంతో ఆమె మొబైల్ ఫోన్ రికార్డులు, సోషల్ మీడియా, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలించారు. వాటి ఆధారంగా హత్య కోణంలో దర్యాప్తును మరింత వేగవంతం చేశారు.

## స్టాలిన్‌ను అనుకరించిన విజయ్, సభనుంచి వాకౌట్ చేసిన డిఎంకె



**చెన్నై,జూన్ 23:** తమిళనాడు శాసనసభ మంగళవారం నాటి సమావేశాల్లో తీవ్ర వాదోపవాదాలు, నాటకీయ పరిణామాల మధ్య అటుడికింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి విజయ్, ప్రతిపక్ష డీఎంకే మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం నడిచింది. ముఖ్యమంత్రి ప్రసంగానికి నిరసనగా డీఎంకే సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. శాసనసభలో ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, డీఎంకే పార్టీ పేరుతో అక్రమంగా నిధులు సేకరిస్తోందని ఆరోపించడంతో పాటు, అవినీతికి పాల్పడిన వారిని తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల గురించి ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనల్లో వాస్తవం లేదని, అవన్నీ రాజకీయ ప్రేరేపితమైనవేనని ఆయన విమర్శించారు. విజయ్ ప్రసంగానికి డీఎంకే సభ్యులు పదేపదే అడ్డుతగలడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. స్పీకర్ జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేసినప్పటికీ, డీఎంకే సభ్యులు నినాదాలు చేస్తూ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఇదే సమయంలో విజయ్ తన ప్రసంగంలో డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను అనుకరించడం అందరి దృష్టిని ఆకర్షించింది. గతంలో సీట్ల పంపకాల చర్చల సందర్భంగా అంతా సెటిల్ అయిపోయింది అనేలా స్టాలిన్ ప్రదర్శించిన మ్యానరిజంను విజయ్ అసెంబ్లీలో అనుకరించి చూపించారు. దాంతో అధికార పక్ష సభ్యుల చప్పట్లతో సభ హోరెత్తింది. తమ ప్రభుత్వం సీపీఎం, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ వంటి పార్టీలతో పొత్తు పెట్టుకోవడాన్ని ఈ సందర్భంగా విజయ్ సమర్థించుకున్నారు. మహిళల భద్రతతోపాటు మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

24-6Pg6exHMNWJQE.qxd:24-6Pg6exHMNWJQE.qxd 1/1/02 6:18 AM Page 1



# స్వర్ణాంధ్ర 2047 విజన్‌కు 'బంగారు'బాట



కర్నూలు జిల్లా జొన్నగిరి బంగారు గని ప్రాంతం

- దేశంలోనే ఏకైక ప్రైవేట్ రంగ బంగారు గని జొన్నగిరి
- మరిన్ని గోల్డ్ బ్లాక్‌ల వేలానికి సిద్ధం
- బంగారు వనరుల పెట్టుబడులతో ఉపాధికి ఆంధ్రప్రదేశ్ కేంద్రబిందువు

**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా ఖనిజ సంపద ఆధారిత ఆర్థికాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ వేగంగా అడుగులు వేస్తోంది. ఈ ప్రాంతంలో ఈ నెల 24న సిఎం చంద్రబాబు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా మాట్లాడుతూ, 'దేశంలో అత్యంత ఆశాజనకమైన బంగారు ఖనిజ వనరులు ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. శాస్త్రీయ అన్వేషణ, పారదర్శక వేలం విధానం, సుస్థిర మైనింగ్ విధానాల ద్వారా ఈ సంపదను ప్రజల అభివృద్ధికి వినియోగించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.

స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనలో బంగారు వనరులు ఆర్థికాభివృద్ధి, పారిశ్రామికీకరణ, ఉపాధి కల్పనకు కీలక పాత్ర పోషిస్తాయి' అని తెలిపారు. కర్నూలు జిల్లా జొన్నగిరి బంగారు గనిలో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభం కావడం, రాష్ట్రంలోని పలు బంగారు ఖనిజ బ్లాక్‌ల వేలం, నూతన అన్వేషణలకు సిద్ధం చేయడం ద్వారా దేశ బంగారు గనుల రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక స్థానాన్ని సంపాదిం చుకునే దిశగా ముందుకు సాగుతోంది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని 597.82 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రస్తుతం దేశంలో స్వాతంత్రం తర్వాత ప్రారంభమైన తొలి, ఏకైక ప్రైవేట్ రంగ బంగారు గనిగా నిలిచింది. జియోమైసోర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తున్న ఈ ప్రాజెక్టులో రూ.405 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టగా, 2026 మే నెలలో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభమైంది. ప్రస్తుతం 700 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి పొందుతుండగా, వారిలో 80శాతానికి పైగా ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారే ఉన్నారు.

ఈ గని ద్వారా 2026-27 ఆర్థిక సంవత్సరం లో సుమారు 400 కిలోల బంగారం ఉత్పత్తి అవుతుందని అంచనా. రానున్న సంవత్సరాల్లో ఇది ఏడాదికి ఒక టన్ను సామర్థ్యానికి, అనంతరం రెండు టన్నుల వరకు పెరిగే అవకాశం ఉంది. రాయల్టీలు, జిల్లా ఖనిజ ఫౌండేషన్ నిధులు తదితర మార్గాల ద్వారా రాష్ట్రానికి గణనీయమైన ఆదాయం సమకూరనుంది. జొన్నగిరితో పాటు చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో కూడా విస్తారమైన బంగారు ఖనిజ నిల్వలు గుర్తించబడ్డాయి. చిత్తూరు జిల్లా కుప్పం మండలంలోని చిగురుగుంట- బిసానత్తం గోల్డ్ బ్లాక్‌లలో సుమారు 22 లక్షల టన్నుల ఖనిజ వనరులు, టన్నుకు సగటున 5.64 గ్రాముల బంగారం నిల్వలు ఉన్నట్లు అంచనా. దేశంలో అత్యంత ఆశాజనక బంగారు బ్లాక్‌లలో ఒకటిగా భావిస్తున్న ఈ బ్లాక్‌ను తాజాగా వేలానికి తీసుకువచ్చారు.

అనంతపురం జిల్లాలోని బోక్సంపల్లి ఉత్తర, దక్షిణ బ్లాక్‌లు, రామగిరి ఉత్తర, దక్షి ణ బ్లాక్‌లు, అలాగే జవకుల గోల్డ్ బ్లాక్‌లు రామగిరి, వెలిగల్లు గ్రీన్‌స్టోన్ బెల్ట్‌ల పరిధిలో ఉన్నాయి. ఈ ప్రాంతాలు చారిత్రాత్మక కోలార్, హుట్టి బంగారు గనుల ప్రాంతాలతో సమానమైన భౌగోళిక లక్షణాలను కలిగి ఉండటంతో భవిష్యత్తులో భారీ బంగారు నిల్వలు వెలికితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ బ్లాక్‌లలో వాణిజ్యపరంగా ఉపయోగపడే నిల్వలను గుర్తించేందుకు భారత భూగర్భ సర్వే సంస్థ, నోటిఫైడ్ ప్రైవేట్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీల ద్వారా విస్తృత స్థాయిలో అన్వేషణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

అనంతరం వీటిని పారదర్శక వేలం ప్రక్రియ ద్వారా ప్రైవేట్ పెట్టుబడిదారులకు అందించనున్నారు.


## శ్రీకాళహస్తిలో సిఎం సభకు ముమ్మర ఏర్పాట్లు

**శ్రీకాళహస్తి, జూన్ 23 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జులైన నిర్వహించే గ్రామీణ ప్రాంతాల ఉపాధి, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'విబిజి రామ్ జి పథకం' ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకారం చుట్టడానికి ప్రభుత్వం తిరుపతి జిల్లాను ఎంపిక చేసింది. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, బిజెపి నాయకులు హాజరుకానున్నారు. ఈ సభను నగరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో వారం రోజులుగా జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో వివిధ స్థలాలను తనిఖీ చేసారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రేణిగుంట, అలాగే ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల్లోని పలు ప్రాంతాల్లో పరిశీలించారు. మంగళవారం శాసనసభ్యుడు బొజ్జల సుధీర్ రెడ్డి సారథ్యంలో ఆయన అనుచరులతో కలసి ఏర్పేడు మండలం లోని చింతల పాళెం, అలాగే శ్రీకాళహస్తి మండలంలోని ఇనగలూరు పరిసరాల్లో సభా వేదిక ఏర్పాటును పరిశీలించారు. నగరి నియోజకవర్గంలోని నారాయణవనంను కూడా జిల్లా అధికారులు పరిశీలించారు. శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డితోపాటు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, ఏర్పేడు మండల పార్టీ అధ్యక్షుడు నాగరాజు నాయుడు, సీనియర్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో కలసి ముఖ్యమంత్రి బహిరంగ సభా వేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

## ఉద్యోగుల సమస్యలపై ఉద్యమమే: ఎపిజెఎసి



**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు మధ్యంతర భృతి (ఐఆర్), 12వ పిఆర్సీ కమిషనర్ నియామకం, పెండింగ్ డిఎల విడుదల తదితర సమస్యల పరిష్కారానికి ఉద్యోగులంతా ఉద్యమానికి సిద్ధం కావాలని జెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఎపి జెఎసి అమరావతి ఆధ్వర్యంలో చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం విజయవాడలో జరిగింది. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, ప్రధానంగా ఆర్థికపరమైన సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేనందున ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా భవిష్యత్‌లో ఉద్యమం చేపట్టాలని, అవసరమైతే ఐక్య ఉద్యమ కార్యాచరణకు కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, పెండింగ్ సమస్యల పరిష్కారం, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు దశలవారీ ఉద్యమ కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. జులై 12న శ్రీకాకుళం, 21న అనంతపురంలో ఉద్యమ సన్నద్ధం సభలు నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించామని, తదుపరి ఏలూరు, గుంటూరులో కూడా సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. అయినప్పటికీ సమస్యలు పరిష్కారం కాని పక్షంలోరాష్ట్ర స్థాయి ఉద్యమ కార్యాచరణ కమిటీ సమావేశం నిర్వహించి "ప్రత్యక్ష ఉద్యమ కార్యచరణను" ప్రకటిస్తామని జెఎసి ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు, అసోషియేట్ చైర్మన్, పోరాట కమిటి చైర్మన్ టి.వి.ఫణి పేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావులు ఈ సందర్భంగా ప్రకటించారు.

## సిఎం చంద్రబాబుకు 'భారత్ రైజింగ్ ఇన్ ది మోడీ ఎరా' పుస్తకం బహూకరణ



**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** డాక్టర్ దిలీప్ కిలారు తాను రచించిన 'భారత్ రైజింగ్ ఇన్ ది మోడీ ఎరా' పుస్తకాన్ని సిఎం చంద్రబాబు నాయుడుకు బహూ కరించారు. ఈ మేరకు సచివాల యంలోని ఆయన ఛాంబర్‌లో ముఖ్యమంత్రిని కలిసి పుస్తక ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా పుస్తకంలోని అంశాలను పరిశీలించిన సిఎం చంద్రబాబు , వినూత్నమైన అంశంపై రూపొందిం చిన ఈ గ్రంథం ఎంతో విలువైందని పేర్కొంటూ రచయిత కృషిని అభినందించారు. పుస్తక రచనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులోనూ ఇలాంటి సృజనాత్మక రచనలు చేయాలని కాంక్షించారు. ఈ పుస్తకాన్ని ఇటీవల కేంద్ర గనుల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎపి వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆవిష్కరించారు. 110 కేంద్ర పథకాలతో ఉండే ఓ మంచి బుక్‌ను దిలీప్ రచించారని సత్యకుమార్ ప్రశంసించారు. జీవన ప్రమాణాలు పెంపొందిచాలని, కేంద్ర పథకాలపై పేదలకు అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో దీనిని రచించారని కొనియాడారు. గత 12 ఏళ్లలో వచ్చిన క్వాలిటీ, క్వాంటిటేటివ్ అంశాలను ప్రస్తావిస్తూ ప్రజల్లోకి తీసుకెళ్లే మంచి ప్రయత్నం చేశారని వ్యాఖ్యానించారు సత్యకుమార్. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై రచయితను అభినందించారు.

## పర్యాటక రంగ అభివృద్ధి పరుగులు

- ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బాలాజీ



**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతతో పర్యాటక రంగం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే, ఓర్వలేక వైసిపి తప్పుడు ప్రచారానికి తెరలేపిందని ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిటిడిసి) చైర్మన్, టిడిపి జాతీయ ఉపాధ్యక్షుడు నూకసాని బాలాజీ ఆరోపించారు. మంగళవారం బాలాజీ మీడియా సమావేశం నిర్వహించారు. 'ప్రజావేదిక కూల్చివేతతోనే తన విధ్వంసకర పాలన ఎలా ఉంటుందో జగన్ చెప్పకనే చెప్పారు. రోజుకు రూ.2 లక్షల ఆదాయం తెచ్చే రుషికొండ పర్యాటక కేంద్రాన్ని ధ్వంసం చేసి, తన విలాసాల కోసం రూ.500 కోట్లతో ప్యాలెస్ నిర్మించుకున్నారు. రెండేళ్లయినా ఆ భవనాలను వినియోగించుకోలేని దుస్థితి. రూ.28 వేల కోట్ల పెట్టుబడులు తెస్తానని చెప్పి, ఒక్క ఉద్యోగం కూడా సృష్టించలేదు. టూరిజం కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి, ఆస్తులను సొంత అనుచరులకు కట్టబెట్టారు. రాష్ట్రాన్ని గంజాయికి హబ్‌గా మార్చి, యువతను నేరాల వైపు మళ్లించారు' అని బాలాజీ తీవ్ర ఆరోపణలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 24 నెలల్లోనే పర్యాటక రంగంలో రూ.19,400 కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని తెలిపారు. విశాఖలో జరిగిన సిఐఐ సమ్మిట్ ద్వారా వచ్చిన ఈ పెట్టుబడులతో 91,960 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఇప్పటికే 18 ప్రాజెక్టులకు సంబంధించి రూ.4,376 కోట్ల పనులు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. పర్యాటకుల ఆకాంక్షలకు అనుగుణంగా గోవా తరహాలో విశాఖ, సూర్యలంకలో బీచ్ షాక్స్ పాలసీ తీసుకొస్తే, దానిపైనా విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు నూతన పర్యాటక విధానం 2024-29 అమలు చేస్తున్నామని, 21 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేస్తున్నామని బాలాజీ వివరించారు. కేంద్రం సహకారంతో రూ.441 కోట్లతో టెంపుల్, బీచ్ టూరిజం అభివృద్ధి చేస్తున్నామన్నారు. అమరావతిలో 'అవకాయ ఫెస్టివల్' వంటివి నిర్వహిస్తూ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందిస్తున్నామని తెలిపారు. అరకు కాఫీ స్టాళ్లు, 14 చోట్ల ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు, టెంట్ సిటీస్, కొత్తగా 10 రోప్‌వేల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, 20 బీచ్‌లకు బ్లూ ఫ్లాగ్ గుర్తింపు సాధించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రజలిచ్చిన తీర్పునకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎపిని దేశంలోనే అగ్రగామి పర్యాటక రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నారని బాలాజీ పేర్కొన్నారు.

## తిరుమల సమాచారం



## ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని వడమాలపేట మండలం అప్పలాయగుంటలో కొలువైన ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం లో వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందుగా మంగళవారం ఉదయం పవిత్రమైన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. నేటి నుండి జులై 3వ తేదీ వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయ పవిత్రత, ఆధ్యాత్మిక శోభను మరింత పెంపొందించే ఈ కార్యక్రమాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొ లిపి, తోమాలసేవ, కొలువు, అర్చన అనంతరం కోయిల్ ఆళ్వార్ తిరుమంజ నం చేపట్టారు. ఆలయ గర్భగుడి, ప్రాకారాలు, గోడలు, పైకప్పు, పూజా సామగ్రిని శుద్ధి చేసి, నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలతో తయారుచేసిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షి ంచారు. ఈ పవిత్ర కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక సుగంధాలతో పరి మళించి, భక్తిమయ వాతావరణాన్ని సంతరించుకుంది. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడుతూ నేటి రాత్రి 7.30 గంటలకు అంకురార్పణం నిర్వహించనున్నారు. 25న ధ్వజారోహణం తో సకల దేవతలను ఆహ్వానిస్తూ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమ వుతాయి. ఉత్సవాల్లో భాగంగా జూన్ 28న ఆర్జిత కల్యాణోత్సవం, జూన్ 29న గరుడసేవ, జూలై 2న రథోత్సవం, జూలై 3న చక్రస్నానం, ధ్వజావ రోహణం నిర్వహించి బ్రహ్మోత్సవాలను ముగించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టిటిడి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ప్రసన్న వేంకటేశ్వరస్వామి కృపాకటాక్షాలను పొందాలని టిటిడి కోరింది. ఈ కార్యక్రమంలో డిప్యూటి ఇఒ పి.హరీంద్రనాథ్, ఎఇఒ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, అర్చకులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.



## ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం

**తిరుమల, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్‌కు దాతలు తమవంతుగా విరాళాలు అందిస్తున్నారు. మంగళవారం హైదరాబాద్‌కు చెందిన కల్లా సత్య రిషబ్ శ్రీవేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్టుకు రూ.10,01,116లు విరాళంగా అందించారు. తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి విరాళం డిడిని అందజేశారు.

# అటు నకిలీ లేఖలు ఇటు దళారులు

- టిటిడిని కలవరపెడుతున్న మోసగాళ్లు



**తిరుమల, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హిందువుల ఆరాధ్యదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి సామాన్య భక్తులను ఎరగాచేసుకుని దళారులు, మోసగాళ్ళు పలు రకాలుగా మాయమాటలతో నమ్మించి దండు కుంటున్న ఘటనలు లెక్కలేనంతగా సాగిపోతున్నా యి. ఓ వైపు నకిలీ సిఫార్సు లేఖలు, కలర్ జిరాక్స్ చేసిన దర్శన టిక్కెట్లు పెద్దసంఖ్యలో భక్తులు తీసుకువచ్చేస్తుండగా మరోవైపు దళారులు సులభంగా డబ్బు సంపాదనకు అలవాటుపడి ఏకంగా టిటిడి ఉద్యోగుల అవతారం ఎత్తి వారిపేరుతో నకిలీ సిఫార్సు లేఖలు సృష్టించి యధేచ్ఛగా భక్తులను మోసం చేస్తున్నారు. ప్రతినెలా ఇలాంటి ఘటనలు పునరావృతమవుతూనే ఉన్నాయి. పట్టుబడితేనే దొంగలు లేకుంటే యధేచ్ఛగా దొరల అవతారంతో జేబులు నింపుకుంటున్నారు. దీని వెనుక టిటిడిలో కొందరు ఉద్యోగుల, కాంట్రాక్ట్ సిబ్బంది హస్తం కూడా ఉందనేది గుప్పుమంటోంది. తాజాగా గుంటూరు, హైదరాబాద్, కర్ణాటకకు చెందిన కొందరు భక్తులను దళారి నిమ్మల శ్రీనివాస్ సులభంగా నమ్మించి టిటిడి ఉద్యోగుల లేఖలపై శ్రీవారి సుప్రభాతసేవ దర్శన టిక్కెట్లు ఇప్పిస్తామని నమ్మించి 60మంది భక్తుల నుండి ఫోన్ పే ద్వారా రూ.3.60లక్షలు నగదు రాబట్టుకున్నాడు. సోమవారం తిరుమలకు వచ్చిన భక్తులు తమకు కనీసం ఎలాంటి సమాచారం లేదని, ఫోన్ కూడా తీయడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగుచూసింది. భక్తులు తీసుకు వచ్చినవి నకిలీ లేఖలుగా తేలడంతో ఈ గుట్టురట్టయ్యింది. ఆ సమయంలో టిటిడి ఉద్యోగులు వారికి సహకరించలేక పోవడంతోనే ఇలా జరిగిందనే విమర్శలు లేకపోలేదు. ఇప్పటికే తిరుమలలో దళారీ వ్యవస్థ వేళ్ళూనుకుని తిరుమల పవిత్రతను దెబ్బతీశారనే కోణంలో టిటిడి కఠినంగా వ్యవహారిస్తోంది. చాలావరకు దళారులు, మధ్యవర్తుల ఆగడాలు తగ్గినా ఇంకా పదుల సంఖ్యలో దళారులు వ్యాపారాలు చేస్తుండటం మాత్రం టిటిడిని కలవర పెడుతోంది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో వ్యవస్థ లో కీలక ప్రక్షాళన చేపడతారా అనే ప్రశ్నలకు టిటిడి ఉద్యోగుల్లో అవుననే సమాధానం వినిపిస్తోంది. అంతేగాక దేవదేవుని పవిత్రతను దెబ్బతీసిన, పలు రకాలుగా వడ్డీకాసులవాని ఖజానాకు గండివేసిన వారిపైచర్యలకు ఉపక్రమిస్తారా అనే చర్చ మొదలైంది.

**ఎమ్మెల్సీ పేరుతో నకిలీ సిఫార్సు లేఖ:** ఇదే సమయంలో మంగళవారం తిరుమలలో ఎమ్మెల్సీ పేరుతో ఓ నకిలీ సిఫార్సు లేఖ రావడం సంచలనంగా మారింది. టిడిపి ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ పేరుతో నకిలీ సిఫార్సు లేఖ తిరుమలకు చేరడంతో కలకలం రేపింది. ఎమ్మెల్సీ లెటర్ హెడ్‌తో నకిలీ సిఫార్స్ లేఖ తయారు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దీనిపై కాకినాడ సర్పవరం స్టేషన్‌లో ఎమ్మెల్సీ రాజశేఖర్ ఫిర్యాదు చేయడం, అప్పన్న అనే వ్యక్తి తన సంతకాన్ని ఫోర్జరీ చేసి టిటిడికి లేఖ ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొనడం విశేషం.

గత రెండేళ్ళుగా తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేసే భక్తులకు టిటిడి కల్పిస్తున్న దర్శనం, వసతి తదితర సేవలు దళారుల ప్రమేయం లేకుండా మరింత పారదర్శకంగా నేరుగా అందించేందుకు టిటిడి పక్కా వ్యూహంతో ముందుకు వెళుతోంది.

తిరుమలకు వచ్చే భక్తులకు ఆఫ్‌లైన్ (కౌంటర్ సేవలు), ఆన్‌లైన్ (వెబ్‌పోర్టల్) రెండింటిల్లో అందిస్తున్న సేవలను పక్కదారిపట్టించి కొందరు దళారులు భక్తులను మోసంచేసి భారీ మొత్తంలో డబ్బులు వసూలుచేస్తుండటం పరిపాటిగా మారింది. గతంలోనే ఆన్‌లైన్‌లో బల్క్ బుకింగ్‌లకు ఉపయోగించే మొబైల్ నంబర్లు, మెయిల్ ఐడి ప్రూఫ్‌లు రద్దుచేశారు.

ఫేక్ మొబైల్ నంబర్లు, మెయిల్ ఐడిలు, ఐడి ప్రూఫ్‌లు ఉపయోగించి ఇప్పటికే బుక్‌చేసిన సేవలను ఉపయోగించడానికి అనుమతింపబడవని వెల్లడించారు. ఇందుకోసం ప్రత్యేకంగా టిటిడిలో నిఘాభద్రత విభాగం ఉంది. ఐపిఎస్ అధికారి సివిఎస్ఒ హోదాలో ముగ్గురు విఎస్ఒలు (డిఎస్పీ హోదాలో), ఏవిఎస్ఒలు సిఐల హోదాలో, విఐలు ఎస్ఐల హోదాలో విధులు నిర్వహిస్తున్నారు.


ఇలాంటి నకిలీ లేఖలపై, దళారులను కనిపెట్టేందుకు విజిలెన్స్‌లో వింగ్ విభాగం మరో ప్రత్యేకం. అయితే టిటిడిలో విజిలెన్స్ విభాగం పనితీరు అసలు విధుల కంటే కొసరు విధులపైనే దృష్టి పెట్టి పనిచేస్తుండటం మాత్రం విమర్శలకు తావిస్తోంది. అయినా దళారులు అడ్డదారుల్లో అమాయక భక్తులను మోసం చేస్తూనే ఉండటం టిటిడి పనితీరును తేటతెల్లం చేసేలా మారింది.

## మొగిలిచెర్ల దత్తాత్రేయ మందిరంలో 29న రుద్ర పాశుపత హోమం




**తిరుపతి, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** వేద శాస్త్రాల ప్రకారం జ్యేష్ఠ మాస పౌర్ణమి పర్వ దినాన రుద్రపాశుపత హోమం నిర్వహించడం వల్ల శత్రు బాధలు, తీవ్రమైన గ్రహ దోషాలు తొలగిపోయి ఆయురారోగ్యాలు సర్వకార్య సిద్ధి లభిస్తాయి. త్రిమూర్తి స్వరూపుడైన దత్తాత్రేయ స్వామి కొలువైన ప్రకాశం జిల్లా లింగసముద్రం మండలం మొగిలిచర్ల మందిరంలో ఈ రుద్ర పాశుపత హోమం ఈనెల 29న సోమవారం జరిపిస్తున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్, కన్వీనర్ పవని సాయికౌశిక్ తెలిపారు. ఆరోజు మందిరంలో మహాదేవుని పాశుపత అస్త్ర మంత్రాలతో జరిగే హోమంలో పాల్గొనడం వల్ల భక్తుల కర్మదోషాలు నశించి, భగవంతుని అభయ రక్షణతో పాటు అష్టైశ్వర్యాలు, అత్యున్నత ఆధ్యాత్మిక శాంతి కలుగుతాయని అర్చకులు తెలిపారు. ప్రత్యక్షంగా పాల్గొనదలచిన భక్తులు తమ పేర్లను 72078 75712, 91828 82632, 99089 73699 నంబర్లకు ఫోన్ చేసి రిజిస్టర్ చేసుకోవాలని ధర్మకర్త కోరారు.

## షణ్ముఖ స్వామికి ప్రత్యేకాభిషేకాలు



**శ్రీకాళహస్తి, జూన్ 23 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలోని పలు సుబ్రమణ్యం స్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేకాభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. పట్టణంలోని నలుమూలల నుంచి భక్తులు మంగళవారం వేకువ జాము నుంచి భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం స్వామికి షోడషాభిషేకాలు నిర్వహించారు. కొందరు భక్తులు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత ప్రసాదాలను అందించారు. సాయంత్రం స్వామికి కన్నులు మిరుమిట్లు కొల్పునట్లు అలంకారాలు నిర్వహించారు. ఉదయం నిర్వహించిన చందనాలంకారం భక్తులకు ఇట్టే ఆకట్టుకుంది.

## జులై 16న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం



**తిరుమల, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జులై 16 గురువారం ఆణివార ఆస్థానం వేడుకగా జరగనుంది. ఈ ఉత్సవం కోసం తమిళనాడులోని శ్రీరంగం రంగనాథస్వామి ఆలయం నుండి ఆలయ పండితులు, అధికారులు ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు తీసుకువచ్చి శ్రీవారికి సమర్పిస్తారు. ఆస్థాన సేవను బంగారు వాకిలిలో గరుడాళ్వార్ సన్నిధిలో ఆస్థానంలో శ్రీవారి ఉత్సవమూర్తి సమక్షంలో అర్చకులు అత్యంత వేడుకగా జరుపుతారు. సర్వభూపాల వాహనంలో ఉత్సవమూర్తులను కొలువుదీరుస్తారు. మరోపీఠంపై స్వామి సర్వసైనాధ్యక్షుడైన విష్వక్సేనులస్వామి దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. పెద్దజీయర్ స్వామి వెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా తీసుకొచ్చి మూలవిరాట్టుకు, మలయప్ప స్వామికి, విష్వక్సేనులవారికి అలంకరి స్తారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చ కులు తమ తలకు శ్రీవారి పాదవస్త్రం తో పరివట్టం (చిన్నపట్టు గుడ్డ) కట్టుకుని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి నిత్యైశ్వర్యో భవ అని స్వామిని ఆశీర్వదిస్తారు. అర్చకులు పెద్ద, చిన్నజీయర్ స్వాములకు, టిటిడి తరుపున ఇఒకు 'లచ్చన' అను తాళపు చెవి గుత్తిని కుడిచేతికి ఇచ్చి, రూపాయి హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేస్తారు. అనంతరం ఈ తాళపు చెవి గుత్తిని శ్రీవారి పాదాల వద్ద ఉంచడంతో ఆణివార ఆస్థానం ముగుస్తుంది. జులై 16వ తేదీన ఆణివార ఆస్థానం జరగనున్న నేపథ్యంలో 14వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ రెండు ఉత్సవాల నేపథ్యంలో స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా విఐపి బ్రేక్ దర్శనాలను టిటిడి రద్దు చేసింది. జులై 13, 15 తేదీల్లో సిఫారసు లేఖలను కూడా స్వీకరించరు.

## వెంకటపాలెం టోల్‌ప్లాజా వద్ద వాహనదారుల ఆందోళన

**విజయవాడ, జూన్ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** పశ్చిమ బైపాస్‌పై వెంకటపాలెం టోల్‌ప్లాజా వద్ద వాహనదారులు ఆందోళన చేశారు. టోల్‌ప్లాజా యాజమాన్యం తీరుపై వాహనదారులు నిరసన వ్యక్తం చేశారు. సీడ్ యాక్సిస్ రోడ్డు పైకి వెళ్లేందుకు సర్వీసు రోడ్డు ఉన్నా యూటర్న్ మూసివేతపై నిరసన తెలిపారు. సర్వీస్ రోడ్డులోకి ప్రవేశాన్ని మూసివేసి టోల్ దాటేలా ఏర్పాటు చేయడంపై నిరసన తెలిపారు. స్థానికులతో పాటు లాయర్లు, సచివాలయ ఉద్యోగులు నిరసనకు దిగారు. ఆందోళన కారణంగా పశ్చిమ బైపాస్‌పై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచాయి. రాజధానికి 20 కి.మీ. పరిధిలోని అన్ని వాహనాలకు ఉచిత టోల్‌గేట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. యూటర్న్ తీసుకుంటే రెండుసార్లు వసూలు చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం చేయకపోతే రేపు పెద్దఎత్తున ఆందోళన చేస్తామని స్థానికులు హెచ్చరించారు.



## కనకమహాలక్ష్మి సన్నిధిలో..
# ప్రత్యేక అష్టదళ పద్మారాధన పూజలు



**విశాఖపట్నం, జూన్ 23, ప్రభాతవార్త :**

శ్రీ కనక మహాలక్ష్మి దేవస్థానంలో ప్రతి మంగళవారం నిర్వహించే అష్టదళ పద్మారాధన సేవ మంగళవారం భక్తిశ్రద్ధల మధ్య జరిగింది. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ ప్రత్యేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందారు. దేవస్థాన వేదపండితులు, అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఉభయదాతలకు వేదాశీర్వచనం అందజేసి, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, అర్చకులు, దేవస్థాన పర్యవేక్షకులు ఎం.వి. రమణ, తనిఖీదార్ ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



## పరవాడ ఫార్మాసిటీలో
# మృత్యుఘంటికలు

- దక్షిణ ఎనర్జీ పరిశ్రమలో అగ్నిప్రమాదం
- ఇద్దరు కార్మికుల సజీవ దహనం



**అనకాపల్లి (పరవాడ), జూన్ 23, ప్రభాతవార్త :**

పరవాడ ఫార్మాసిటీలో మరో విషాద ఘటన చోటుచేసుకుంది. దక్షిణ ఎనర్జీ పరిశ్రమలో మంగళవారం తెల్లవారుజామున సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో ఇద్దరు కార్మికులు మంటల్లో చిక్కుకుని సజీవదహనమయ్యారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలుపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఫార్మాసిటీలోని దక్షిణ ఎనర్జీ పరిశ్రమలో ప్లాస్టిక్ పైరోలిసిస్ ఆయిల్, కార్బన్ బ్లాక్, ఇంధన ఆయిల్స్ తయారీ జరుగుతోంది. సోమవారం రాత్రి విధులు నిర్వహిస్తున్న సమయంలో మంగళవారం తెల్లవారు జామున ఒక్కసారిగా అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో చోడవరం మండలం అంబేర్‌పురానికి చెందిన వేపాడ వెంకటేష్ (34), అచ్యుతాపురం మండలం జగ్గన్నపేటకు చెందిన బోడేపు త్రినాథ్ (24) మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే రెండు అగ్నిమాపక వాహనాలు ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చాయి. అయితే అప్పటికే (తరువాయి 8వ పేజీలో)






## బాధితులకు న్యాయం చేస్తాం..
### కెజీహెచ్ వద్ద పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల పరామర్శ

**విశాఖపట్నం, జూన్ 23 ప్రభాత వార్త**

అనకాపల్లి జిల్లా, పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని, పరవాడ ఇండస్ట్రియల్ పార్క్‌లో దక్షిణ ఎనర్జీ కెమికల్ కంపెనీలో మంగళ వారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో మృత్యువాత పడిన ఇద్దరు కార్మికుల మృత దేహాలను పరిశీలించిన అనంతరం వారి కుటుంబ సభ్యులను, విశాఖ (తరువాయి 8వ పేజీలో)

## విశాఖ ఫార్మా సిటీ అగ్ని ప్రమాద ఘటనపై సీఎం చంద్రబాబు విచారం

- జిల్లా అధికారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి
- బాధితులను ఆదుకోవాలని సీఎం ఆదేశం



**విశాఖపట్నం, జూన్ 23, ప్రభాతవార్త:**

అనకాపల్లి జిల్లా పరవాడలోని ఫార్మా సిటీలోని దక్షిణ్ ఎనర్జీలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ఇద్దరు కార్మికుల మృతిపై సీఎం తన సంతాపం తెలియచేశారు. జిల్లా అధికారులతో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరుపై సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఫార్మా సిటీ అగ్నిమాపక కేంద్రం నుంచి రెండు, పరవాడ నుంచి మరొక అగ్ని మాపక శకటాలు చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చాయని అధికారులు సీఎంకు వివరించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని సూచించారు.

## బాధిత కుటుంబాలకు చెరో రూ.33 లక్షల పరిహారం

**అనకాపల్లి (పరవాడ), జూన్ 23, ప్రభాతవార్త :**

పరవాడ ఫార్మాసిటీలోని దక్షిణ ఎనర్జీ పరిశ్రమలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో మృతి చెందిన కార్మికులు వేపాడ వెంకటేష్, బోడేపు త్రినాథ్‌రావు కుటుంబాలకు చెరో రూ.33 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించింది. ఈ మేరకు పరిశ్రమ యాజమాన్యం, బాధిత కుటుంబ సభ్యులు, కార్మిక సంఘాల నాయకుల మధ్య జరిగిన చర్చలు సఫలమవగా, పరిహారంపై ఒప్పందం కుదిరింది. అనంతరం యాజమాన్య ప్రతినిధులు మృతుల కుటుంబ సభ్యులకు ఒప్పంద పత్రాలను అందజేశారు. దక్షిణ ఎనర్జీ పరిశ్రమలో సంభవించిన (తరువాయి 8వ పేజీలో)



# భారీగా పట్టుబడిన గంజాయి

## నలుగురు నిందితుల అరెస్ట్..
## కోటి 32 లక్షలు విలువ.!

**నక్కపల్లి, జూన్ 23, ప్రభాతవార్త :**

మండలంలోని వేంపాడు- కాగిత టోల్ ప్లాజా వద్ద భారీ స్థాయిలో గంజాయి స్వాధీనపర్చుకున్న కేసులో నలుగురు నిందితులను మంగళ వారం అరెస్ట్ చేసినట్టు డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ జె.మురళీ చెప్పారు. ఈ మేరకు డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలిపిన వివరాలివి. ఈ నెల 22న మండలంలోని వేంపాడు కాగిత టోల్ ప్లాజా వద్ద జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు సీఐ జూ రెడ్డి మురళి ఆధ్వర్యంలో ఎస్సైలు సన్నిబాబు సాహిబా అంజుమ్ హెడ్ కానిస్టేబుళ్లు పవన్, హోంగార్డులు రాజు, గోవిందు, డ్రైవర్ గణేష్, హైవే సిబ్బంది ప్రసాద్ లు కలసి వాహనాలను తనిఖీ చేస్తుండగా విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్తున్న రెండు కార్లను ఆకస్మికంగా తనిఖీ చేస్తుండగా భారీగా గంజాయి ప్యాకెట్లను తరలిస్తున్నట్టు తనిఖీల్లో గుర్తించారు. పట్టుబడిన వాహనాల్లో గంజాయి విషయమై పంచనామ నిర్వహించగా సుమారు 264 కిలోల గంజాయి, ఆ గంజాయిని తరలిస్తున్న ఇన్నోవా, ఎర్టిగా కార్లలో ఉన్నట్లు ఇచ్చారు . పట్టుబడిన గంజాయి కిలో రూ.10వేల చొప్పున ఏజెన్సీ ప్రాంతంలో గంజాయిని విక్రయించినట్లు విచారణలో చెప్పారు. పట్టుబడిన గంజాయి సుమారు రూ. 26.40 లక్షలకు కొనుగోలు చేసినట్టు గుర్తించారు. సుమారు 264 కిలోల గంజాయి విలువ ప్రస్తుత మార్కెట్ ప్రకారం రూ 1.32 కోట్లు వుంటుందని డీఎస్పీ శ్రీనివాసరావు చెప్పారు. గంజాయిని రవాణా చేసే ఇన్నోవా కారు, మారుతీ సుజ్కో ఎట్టిక కారును సీజ్ చేశామని చెప్పారు. వాటన్నిటి విలువతో కలిసి కోటి 32 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు కేరళ రాష్ట్రానికి చెందిన సోమేశ్, హైదరాబాద్ కు చెందిన కారు డ్రైవర్ కవటి సాయి తేజ, మధ్యప్రదేశ్ కు చెందిన సచిన్ గెహ్లాట్, అనకాపల్లి జిల్లా రోలుగుంటకు చెందిన ఎట్టిక కారు యజమాని రాజబాబును మంగళ వారం అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్టు చెప్పారు. వీరి నుంచి ఐదు మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనపర్చుకున్నారు. ఈ కేసుకు సంబంధించి సీఐ మురళీ, ఎస్ఐలు సన్నిబాబు, సాహిబా ఆంజుమా, సిబ్బందిని జిల్లా ఎస్పీ, డీఎస్పీ పి.శ్రీనివాసరావు ప్రశంసించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి
# పిటిషన్స్ కమిటీ కట్టుబడి ఉంది

- విలేకరుల సమావేశంలో ఏపీ శాసనసభ పిటిషన్స్ కమిటీ చైర్మన్ కె. రఘురామ కృష్ణంరాజు
- గాజువాక సమస్యలపై ప్రత్యేక దృష్టి
- పరిష్కారాలకు నిర్దిష్ట గడువులు : ఎమ్మెల్యే పల్లా



**విశాఖపట్నం, జూన్ 23, ప్రభాతవార్త:**

ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర శాసనసభ పిటిషన్స్ కమిటీ నిర్వహించిన సమావేశం అత్యంత ఫలప్రదంగా జరిగిందని కమిటీ చైర్మన్ కె. రఘురామకృష్ణంరాజు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న న్యాయమైనా సమస్యలకు పరిష్కారం చూపేందుకు పిటిషన్స్ కమిటీ కట్టుబడి ఉందని అన్నారు. ముఖ్యంగా గాజువాక నియోజకవర్గానికి సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలపై ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సమర్పించిన 14 పిటిషన్లను సమావేశంలో సవివరంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో విస్తృతంగా చర్చించినట్లు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ మీటింగు హాలులో అధికారులతో సమీక్షించిన అనంతరం రఘురామ కృష్ణం రాజు విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాల గురించి వివరించారు. కమిటీ సభ్యులు గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, కొణతాల రామకృష్ణలతో పాటు జరిగిన సమావేశంలో ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలను గుర్తించడంతో పాటు, వాటి అమలుకు నిర్దిష్ట కాలపరిమితులను నిర్ణయించడం ప్రత్యేకతగా నిలిచిందన్నారు. సమస్యల పరిష్కారానికి ఎంత సమయం అవసరమో, ఏ శాఖ ఏ విధంగా చర్యలు చేపట్టాలో, అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహించాల్సిన బాధ్యతలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రజా సమస్యలను కమిటీ ముందుంచిన తీరు ప్రశంసనీయమని కమిటీ చైర్మన్ రఘురామకృష్ణంరాజు అన్నారు. సమస్యలకు సంబంధించిన బాధితులను కూడా సమావేశానికి తీసుకువచ్చి, వారి ఆవేదనను ప్రత్యక్షంగా కమిటీ దృష్టికి తీసుకురావడం ద్వారా సమస్యల తీవ్రతను అందరూ అర్థం చేసుకునే అవకాశం కలిగిందన్నారు (తరువాయి 8వ పేజీలో)

## పవన్‌పై బురద జల్లడం ఆపండి.. లేదంటే
# వైసీపీ ఒక్క సీటుకే పరిమితం

### జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ



**విశాఖపట్నం, జూన్ 23, ప్రభాతవార్త:**

ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై వైసీపీ నాయకులు చేస్తున్న వ్యక్తిగత విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం నగరం పరిధి సీతంపేట (తరువాయి 8వ పేజీలో)

# ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక దృష్టి..

## దక్షిణ కోస్తా రైల్వేలో జీఎం సమగ్ర సమీక్ష




**విశాఖపట్నం, జూన్ 23, ప్రభాతవార్త :**

దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలో ప్రయాణికుల భద్రత, రక్షణ చర్యలపై జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్ మంగళవారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జోన్‌కు చెందిన ప్రధాన విభాగాధిపతులు, నాలుగు డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు పాల్గొన్నారు.

రైళ్లలో, రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. భద్రతా నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణ వాతావరణాన్ని కల్పించాలని పేర్కొన్నారు.

సమీక్షలో రైళ్ల నిర్వహణ, సమయపాలన, భద్రతా ప్రోటోకాల్స్, రక్షణ ఏర్పాట్లు, రైల్వే సేవల నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు. రైల్వే కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ, భద్రతా ప్రమాణాలను ఉన్నత స్థాయిలో కొనసాగించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సందీప్ మాథూర్ మాట్లాడుతూ, భారతీయ రైల్వేల్లో భద్రతే అత్యున్నత ప్రాధాన్యమని, ప్రయాణికుల భద్రత, రక్షణ, సమయపాలన, సేవల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. అన్ని స్థాయిల్లోని అధికారులు, సిబ్బంది 'భద్రతే మొదటి ప్రాధాన్యం' అనే సూత్రంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

## బాధితులకు న్యాయం జరగాలి

### పెండింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి: రఘురామకృష్ణంరాజు



**విశాఖపట్నం, జూన్ 23, ప్రభాతవార్త :**

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు న్యాయబద్ధమైన, శాశ్వత పరిష్కారాలు చూపేందుకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ పిటిషన్స్ కమిటీ చైర్మన్ కనుమూరు రఘురామ కృష్ణంరాజు ఆదేశించారు. బాధిత వర్గాలకు అండగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విశాఖపట్నం జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన పిటిషన్స్ కమిటీ సమావేశంలో కమిటీ సభ్యులు (తరువాయి 8వ పేజీలో)

# వైసీపీ ఒక్క సీటుకే పరిమితం

(7వ పేజీ తరువాయి)

కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పవన్ కళ్యాణ్ ఏ ఒక్క కులానికి చెందిన నాయకుడు కాదని, అన్ని వర్గాల ప్రజల ఆదరణ పొందిన నాయకుడని అన్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, కొత్త పరిశ్రమలు, భారీ పెట్టుబడులు చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. విశాఖపట్నం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని, పర్యాటక రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

విశాఖ బీచ్‌ల అభివృద్ధి, బీచ్ షాక్స్ ఏర్పాటు, భోగాపురం విమానాశ్రయం నిర్మాణం వంటి ప్రాజెక్టులు ఉత్తరాంధ్ర అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. విశాఖను అంతర్జాతీయ పర్యాటక, పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిను ఉద్దేశించి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సవాల్ విసిరారు. "పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా పోటీ చేసే ధైర్యం ఉన్న నాయకుడు. జగన్ మోహన్ రెడ్డికి పులివెందుల కాకుండా మరో నియోజకవర్గం నుంచి పోటీ చేసే సాహసం ఉందా?" అని ప్రశ్నించారు. గతంలో పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగతంగా విమర్శలు చేసిన అనేక మంది నాయకులు రాజకీయంగా చిత్తుగా ఓడిపోయారని పేర్కొన్న ఆయన, వైసీపీ నాయకులు ఇప్పటికైనా వ్యక్తిగత దూషణలు మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. "పవన్ కళ్యాణ్‌ను విమర్శించడం మానుకోండి.. లేదంటే 11 సీట్ల నుంచి ఒక్క సీటుకే పరిమితం అయ్యే పరిస్థితి వస్తుంది" అని హెచ్చరించారు.

# ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు మరో అడుగు..

## 538 సీజ్ చేసిన వాహనాలు యజమానులకు అప్పగింత




**విశాఖపట్నం, జూన్ 23, ప్రభాతవార్త:**

ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా వివిధ కేసుల్లో సీజ్ చేసి పోలీస్ స్టేషన్లలో నిల్వ ఉంచిన వాహనాలను వాటి యజమానులకు తిరిగి అప్పగిస్తున్నామని విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. మంగళవారం కమిషనరేట్ లో జరిగిన 'వెహికల్స్ రిటర్న్ మేళా' 6వ విడత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వివిధ నేరాలు, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు సంవత్సరాల తరబడి పోలీస్ స్టేషన్లలో ఉండిపోవడంతో అవి దెబ్బతినే ప్రమాదం ఉందని చెప్పారు. దీంతో ఎక్కువకాలంగా పెండింగ్‌లో ఉన్న వాహనాల వివరాలను పరిశీలించి, యజమానులను గుర్తించి వాహనాలను తిరిగి అందజేస్తున్నామని తెలిపారు. గత రెండేళ్లుగా విశాఖ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో వెహికల్స్ రిటర్న్ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తొలి విడతలో 122, రెండో విడతలో 320 వాహనాలు, మూడో, నాలుగో, ఐదో విడతల్లో కలిపి 1,080 వాహనాలను యజమానులకు అప్పగించినట్లు వెల్లడించారు.

తాజాగా నిర్వహించిన 6వ విడతలో అత్యధికంగా 538 వాహనాలను యజమానులకు అందజేస్తున్నట్లు తెలిపారు. లా అండ్ ఆర్డర్, క్రైం, ట్రాఫిక్ విభాగాల్లో సీజ్ చేసిన వాహనాలను చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం విడుదల చేస్తున్నామని కమిషనర్ చెప్పారు. పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న వాహనాలను తగ్గించడంతో పాటు, ప్రజలకు త్వరితగతిన సేవలు అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# జనసేనలో చేరిన దళిత నేత రేవడి నారాయణరావు

## పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



**విశాఖపట్నం, జూన్ 23, ప్రభాతవార్త :**

విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని 32వ వార్డు భీమనగర్ గ్రామ అధ్యక్షుడు, ప్రముఖ దళిత నాయకుడు రేవడి నారాయణరావు జనసేన పార్టీలో చేరారు. మంగళవారం సీతంపేటలోని కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆయనకు పార్టీ కండువా కప్పి జనసేనలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవడి నారాయణరావు మాట్లాడుతూ, దక్షిణ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేస్తున్న కృషి, అలాగే జనసేన పార్టీ సిద్ధాంతాలు తనను ఆకర్షించాయని తెలిపారు. ప్రజలకు మరింత సేవ చేయాలనే లక్ష్యంతోనే జనసేన పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేసే ప్రతి కార్యకర్తకు జనసేనలో సముచిత స్థానం ఉంటుందని అన్నారు. రేవడి నారాయణరావు వంటి ప్రజా సేవకు అంకితమైన నాయకుల చేరికతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలతో పాటు పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జిల్లా సమీక్షా సమావేశం జులై 14 కు వాయిదా

**విశాఖపట్నం, జూన్ 23, ప్రభాతవార్త :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్ అధ్యక్షతన జరగవలసిన విశాఖపట్నం జిల్లా స్థాయి సమీక్షా సమావేశం జూలై 14 వ తేదీ కి వాయిదా పడిందని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా తెలిపిన ప్రకారం ఈ నెల 27 న జరగవలసిన సమీక్ష సమావేశం అనివార్య కారణాలవల్ల జూలై 14 కు వాయిదా పడిందని ఆయన తెలిపారు.

# రైతులకు అందుబాటులో 1161 టన్నుల ఎరువులు

**విశాఖపట్నం, జూన్ 23, ప్రభాతవార్త :**

జిల్లాలో రైతులకు 1161 టన్నుల వివిధ రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా 835 టన్నులు, డి ఎ పి 77 టన్నులు,పొటాష్ 37 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 146 టన్నులు, ఇతర ఎరువులు 63 టన్నులు నిల్వ ఉన్నాయని, ఈ ఎరువులు జులై మాసం చివరి వరకు పంటల కు సరిపోతాయని ఆయన తెలిపారు.

# బాధితులకు న్యాయం చేస్తాం..

- మృతుల కుటుంబాలకు కెజీహెచ్ వద్ద పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల పరామర్శ
- ప్రమాదం పై సమగ్ర విచారణ జరిపిస్తాం

(7వ పేజీ తరువాయి)

కేజీహెచ్ శవాగారం వద్ద పెందుర్తి శాసనసభ్యులు శ్రీ పంచకర్ల రమేష్ బాబు పరామర్శించారు. అధికారులు, కంపెనీ ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులతో చర్చించి ఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రభుత్వపరంగాను, అటు కంపెనీ యాజమాన్యం నుండి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రమాదం పై సమగ్ర విచారణ జరిపించి,ఈ ఘటనలో యాజమాన్యం నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని బాధితులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా విశాఖ నగరంలో కేజీహెచ్ శవాగారం వద్ద ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి తో కలిసి ఎమ్మెల్యే రమేష్ బాబు మీడియాతో మాట్లాడుతూ ఫార్మా సిటీలో





ఇలాంటి దురదృష్ట ఘటనలు తరచూ జరగడం అత్యంత ఆవేదన కలిగిస్తోందని, ఇలాంటివి పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఇలాంటి ఘటనలు జరగడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికార యంత్రానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇంకా ప్రమాదాలు జరుగుతుండటం విచారకరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాలుష్యం నివారణ, పరిశ్రమల్లో ప్రమాదాల అరికట్టడంపై ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉందని స్పష్టం చేశారు. అయితే ఈ ఘటనపై మరింత లోతుగా దర్యాప్తు చేపట్టి ప్రమాదానికి గల కారణాలపై జిల్లా కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు చేపడతారని వివరించారు. కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏదేమైనా ఘటన జరిగిన వెంటనే ఆ కంపెనీ యాజమాన్యం ప్రతినిధులు చర్యలు చేపట్టాల్సి ఉందని, అలాకాకుండా వారు పరారు కావడం సరైనది కాదని పేర్కొన్నారు. దీనిపై కంపెనీ యాజమాన్యాన్ని ప్రశ్నించగా, భయపడి వేరేచోటకు వెళ్ళినట్లు వారు చెప్పారని ఎమ్మెల్యే వివరించారు. ఈ ప్రమాదంలో చోడవరం సమీపంలోని గోవాడ గ్రామానికి చెందిన 34 ఏళ్ల వేపాడ వెంకటేష్ దుర్మరణం చెందగా, అతనికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారని వారంతా అనాధలు అయ్యారని ఆవేదన వెలిబుచ్చారు. అలాగే అచ్యుతాపురం మండలం జగ్గన్న పేటకు చెందిన 24 ఏళ్ల బోడెపు త్రినాథ్ అసువులు బాయడంతో అతని కుటుంబం రోడ్డున పడిందని వాపోయారు. మృతి చెందిన వెంకటేష్, త్రినాధులను తీసుకురాలేకపోయినా ఆ కుటుంబాలకు మంచి ఆర్థిక తోడ్పాటు అందించి ఆదుకుంటామని ఎమ్మెల్యే రమేష్ బాబు హామీ ఇచ్చారు. ఫార్మాసిటీలలో కంపెనీ యాజమాన్యాలు ఇకనుండైనా కార్మికుల రక్షణ కోసం పటిష్ట చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ బాబు సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# బాధితులకు న్యాయం జరగాలి

(7వ పేజీ తరువాయి)

గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, కొణతాల రామకృష్ణతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సమర్పించిన 14 ప్రజా సమస్యలపై కమిటీ సమగ్రంగా సమీక్ష నిర్వహించింది. ముఖ్యంగా ఏపీఐఐసీ భూసేకరణల కారణంగా నిర్వాసితులైన కుటుంబాల సమస్యలు, పునరావాస చర్యలు, గాజువాక అప్పారెల్ పార్కు పరిధిలోని అంశాలు, భూములు కోల్పోయిన రైతుల సమస్యలు, ప్లాట్ల కేటాయింపులు, భూముల పునఃస్వాధీనం వంటి అంశాలపై అధికారుల నుంచి వివరాలు తీసుకుని తగిన సూచనలు చేసింది.

జీవీఎంసీ పరిధిలో భూసేకరణలు, రహదారి విస్తరణ పనుల కారణంగా ప్రభావితమైన ప్రజలకు పరిహారం చెల్లింపులు, టీడీఆర్ జారీ, గృహ స్థలాల కేటాయింపుల అంశాలపై కూడా కమిటీ చర్చించింది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చట్టబద్ధంగా, పారదర్శకంగా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించింది. రెవెన్యూ శాఖకు సంబంధించిన 22-ఏ



నిషేధిత జాబితా భూములు, ఫార్మాసిటీ పునరావాస కాలనీల్లో ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లు, భూ రికార్డుల నవీకరణ వంటి పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కమిటీ స్పష్టం చేసింది.

ఈ సందర్భంగా ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రజలు ఏళ్ల తరబడి నివసిస్తున్నప్పటికీ 22-ఏ సమస్యల కారణంగా రిజిస్ట్రేషన్లు జరగక ఇబ్బందులు పడుతున్నారని ప్రస్తావించారు. సమస్యలను క్లిష్టతరం చేయకుండా సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి మాట్లాడుతూ కమిటీ సూచనల మేరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాయని తెలిపారు. జిల్లా యంత్రాంగం బాధితులకు న్యాయం జరిగేలా పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని చెప్పారు.

# పిటిషన్స్ కమిటీ కట్టుబడి ఉంది

(7వ పేజీ తరువాయి)

అధికారులు కూడా మానవతా దృక్పథంతో స్పందించి, సమస్యలకు పరిష్కారం కనుగొనే దిశగా సానుకూలంగా వ్యవహరించారని కమిటీ ఛైర్మన్ తెలిపారు. అధికార పరిమితులు ఉన్నప్పటికీ ప్రజలకు న్యాయం చేయాలనే సంకల్పంతో పనిచేయడం సమావేశ విజయానికి దోహదపడిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్దిష్ట గడువులు నిర్ణయించుకోవడం, లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగడం ద్వారా ప్రజలకు త్వరితగతిన న్యాయం చేయగలమనే విశ్వాసం మరింత బలపడిందన్నారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తే మరింత మెరుగైన పాలన అందించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. సానుకూల వాతావరణంలో జరిగిన ఈ సమావేశం ప్రత్యేకంగా నిలిచిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సమావేశాల ద్వారా ప్రజలకు న్యాయం చేయడానికి పిటిషన్స్ కమిటీ కట్టుబడి ఉందని కమిటీ ఛైర్మన్ కె. రఘురామకృష్ణం రాజు ఉద్ఘాటించారు.

### గాజువాక సమస్యలపై కమిటీ సానుకూల స్పందన : ఎమ్మెల్యే పల్లా

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాకలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పిటిషన్స్ కమిటీ దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే కమిటీ ఛైర్మన్ స్పందించి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కమిటీ సభ్యుల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. అధికారులందరూ అన్ని అంశాలపై పూర్తి అవగాహనతో స్పందిస్తూ, కొన్ని సమస్యలను రెండు నెలల బదులు నెల రోజుల్లోనే పరిష్కరించే అవకాశాలను కూడా సూచించారని పేర్కొన్నారు. సమావేశంలో ప్రధానంగా 22ఏ నిషేధిత భూముల జాబితాకు సంబంధించిన అంశంపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో కొన్ని సహకార గృహ నిర్మాణ సంఘాలకు విక్రయించిన స్థలాలు చెరువు గర్భ ప్రాంతాలు లేదా నిషేధిత భూముల పరిధిలో ఉన్నాయని గుర్తించి 22ఏ జాబితాలో చేర్చారని, అయితే ప్రస్తుతం అక్కడ పూర్తి స్థాయిలో నిర్మాణాలు జరిగి ప్రజలు నివసిస్తున్న పరిస్థితిని కమిటీ పరిశీలించిందన్నారు. ప్రస్తుత వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అర్హత ఉన్న ప్రాంతాలను 22ఏ జాబితా నుంచి తొలగించే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ అంశంపై రాబోయే రెండు నుంచి మూడు నెలల్లో స్పష్టమైన పరిష్కారం లభించే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు. గంగవరం పోర్టు, విశాఖ ఉక్కు కర్మాగారానికి సంబంధించిన పలు కీలక అంశాలపై కూడా సమావేశంలో చర్చించామని తెలిపారు. సాధారణ పరిపాలనా స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను పిటిషన్స్ కమిటీ దృష్టికి తీసుకువచ్చి, వాటిపై విధానపరమైన నిర్ణయాలు తీసుకునే దిశగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

# జీవీఎంసీ వెస్ట్ జోన్ పరిధిలో 'ఇంటి పన్ను' మేళా

**గాజువాక, జూన్ 23, ప్రభాతవార్త :**

విశాఖ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం జీవీఎంసీ పశ్చిమ జోన్ ఆధ్వర్యంలో ప్రత్యేక 'హౌస్ టాక్స్ (ఇంటి పన్ను) మేళా' నిర్వహించారు. పారిశ్రామిక ప్రాం తంలోని మరిడిమాంబ కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్య క్రమానికి ప్రభుత్వ విప్ గణబాబు, జోనల్ కమిషనర్ హేమవతి హాజరయ్యారు. జీవీఎంసీ 40, 58, 59, 60, 61, 62, 63 వార్డుల పరిధిలోని ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



ఈ మేళాలో స్థానిక నివాసితుల నుంచి ఆస్తి పన్ను, నీటి పన్ను సవరణలు, ఇతర పౌర సమస్యలపై మొత్తం 98 ఫిర్యాదులు (అర్జీలు) వచ్చాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ.. ప్రజల నుంచి అందిన వినతులను అధికారులు త్వరితగతిన పరిశీలించి, నిబంధనల ప్రకారం వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పన్ను సవరణల ప్రక్రియ పారదర్శకంగా జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది, స్థానిక కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆకలి తీర్చే అన్నదానం అత్యంత విశిష్టమైనది

## ముత్యాలమ్మ ఉత్సవాల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ

**విశాఖపట్నం, జూన్ 23, ప్రభాతవార్త :**

నగర పరిధి పందిమెట్టలోని శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం 26వ వార్షికోత్సవాల సందర్భంగా మంగళవారం నిర్వ హించిన భారీ అన్నసమారాధన కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియో జకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీని వాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, "అన్ని దానాలలో అన్నదానం అత్యంత విశిష్టమైనది. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం గొప్ప సేవ" అని అన్నారు. ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ కమిటీ ప్రతి ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకుడు మన్యాల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ బుద్ధుల అనురాధతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు




# బాధిత కుటుంబాలకు చెరో రూ.33 లక్షల పరిహారం

(7వ పేజీ తరువాయి)

అగ్నిప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందడంతో వారి కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు యాజమాన్యం చెరో రూ.33 లక్షల పరిహారం ప్రకటించడం కొంత ఊరటనిచ్చింది. కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ, మృతుల కుటుంబాలకు న్యాయం జరిగేలా కృషి చేశామని, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేయాలని కోరారు. ప్రమాద ఘటనపై పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# పరవాడ ఫార్మాసిటీలో మృత్యుఘంటికలు..

(7వ పేజీ తరువాయి)

ఇద్దరు కార్మికులు మృతి చెందినట్లు అధికారులు నిర్ధారించారు. ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని అధికారు లను ఆదేశించారు జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు కేజీహెచ్ మార్చురీలో మృతదేహాలను పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడు వెంకటేష్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉండగా, యువకుడు త్రినాథ్ మృతితో అతని కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా, ప్రమాదానికి గల కారణాలు, భద్రతా లోపాలపై విచారణ కొనసాగుతోంది. పరవాడ ఫార్మాసిటీలో వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో పరిశ్రమల భద్రతపై కార్మిక సంఘాలు, స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పోలీసుల పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలి

## వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పల్లా దుర్గారావు




**విశాఖపట్నం, జూన్ 23, ప్రభాతవార్త :**

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పల్లా దుర్గారావు డిమాండ్ చేశారు. పోలీసులకు సంబంధించిన టీఏ (ట్రావెలింగ్ అలవెన్స్), ఎస్ఎల్ఎస్ (సరెండర్ లీవ్), ఏఎస్ఎల్ఎస్, డీఏ (కరువు భత్యం) బిల్లులు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ బకాయిలు సకాలంలో అందకపోవడంతో పోలీసు సిబ్బంది, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల చదువులు, కుటుంబ అవసరాలు, రోజువారీ ఖర్చులు నిర్వహించడం లో పోలీసు లు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం నిరంతరం సేవలందిస్తున్న పోలీసుల హక్కులను ప్రభుత్వం విస్మరించకూడదని, వెంటనే పెండింగ్ బిల్లులను విడుదల చేసి వారికి న్యాయం చేయాలని కోరారు. పోలీసుల సంక్షేమమే ప్రజల భద్రతకు పునాదని పేర్కొన్న పల్లా దుర్గారావు, సమస్యలను పరిష్కరించకపోతే పోలీసుల హక్కుల కోసం వైఎస్సార్‌సీపీ తరపున పోరాటం చేపడతామని హెచ్చరించారు.

# అయోధ్య రామమందిరంపై వివాదాలు వస్తాయని ముందే హెచ్చరించా..

## లక్కోజు శివరామ విశ్వకర్మ



**విశాఖపట్నం, జూన్ 23, ప్రభాతవార్త :**

అయోధ్య రామమందిర ప్రారంభ ముహూర్తాన్ని ఆధారంగా చేసుకుని తాను గతంలో చేసిన జ్యోతిష్య విశ్లేషణ ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలతో నిజమ వుతున్నట్లు కనిపిస్తోందని ప్రముఖ వాస్తు, జ్యోతిష్య పండితుడు లక్కోజు శివరామ విశ్వకర్మ తెలిపారు. 2024 జూన్ 9న ఒక టెలివిజన్ ఇంటర్వ్యూలో రామమందిర ప్రారంభ ముహూర్తాన్ని విశ్లేషిస్తూ, భవిష్యత్తులో అయోధ్య రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ బోర్డు, ప్రభుత్వానికి మధ్య సమన్వయ లోపం ఏర్పడి ప్రజల్లో వ్యతిరేకత పెరిగే అవకాశాలు ఉన్నాయని తాను పేర్కొన్నట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం ట్రస్ట్ బోర్డుకు సంబంధించిన ఆరోపణలు, నిధుల వినియోగంపై వస్తున్న విమర్శలు, విచారణల నేపథ్యంలో తాను చెప్పిన అంశాలు చర్చనీయాంశంగా మారాయని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని కాపాడేలా సంబంధిత వ్యవస్థలు పారదర్శకంగా వ్యవహరించాలని, వివాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు తన జ్యోతిష్య విశ్లేషణకు అనుగుణంగా ఉన్నాయా లేదా అన్నది ప్రజలే నిర్ణయించుకోవాలని లక్కోజు శివరామ విశ్వకర్మ పేర్కొన్నారు.

## పాఠశాలల సంసిద్ధత, విద్యార్థుల ఆరోగ్యం నాణ్యమైన విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి

విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం, రెగ్యులర్ హెల్త్ స్క్రీనింగ్ తప్పనిసరి -పాడేరు -ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ

పాడేరు,జూన్23,(ప్రభాతవార్త):



జిల్లాలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభ మైన నేపథ్యంలో పాఠశాలల సంసిద్ధత విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, విద్యా ప్రమాణాల మెరుగు దలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, గురుకులం ప్రిన్సిపల్స్, ఏటీడబ్ల్యూఓలతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ. గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులతో కలిసి ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం విద్యాశాఖలో మార్పులు, విద్య బోధన, పిల్లలకి అందించవలసిన మెనూ, స్కూల్ క్లీయర్నెస్ అధికారుల పనితీరు ఉన్నతాధికారుల పర్యవేక్షణలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ, ప్రతి పాఠశాలలోనూ విద్యా, వాతావరణం ఉల్లాసంగా ఉండేలా 'స్కూల్ రెడీనెస్ ' కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల నమోదును పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పరిశుభ్రమైన ఆహారం ప్రతిరోజు ఏర్పాటు చేసే భోజనం ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు అందించే ఆహారం అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో, నాణ్యతా ప్రమాణాలతో వండాలని స్పష్టం చేశారు. వంట గదులు, తాగునీటి ట్యాంకులను నిరంతరం శు భ్రపరచాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. ఆరోగ్య పరీక్షలు విద్యార్థుల ఆరోగ్యంపై రాజీ పడకూడదని, రాబోయే రోజుల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలలు,వసతి గృహాలలో విద్యార్థులకు క్రమం తప్పకుండా హెల్త్ స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను సమన్వయంతో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని పీఓ ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయుల క్రమశిక్షణ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ, విధులకు రెగ్యులర్‌గా హాజరుకావాలని ఆయన స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల హాజరు శాతంపై నిరంతర నిఘా ఉంటుందని, విధుల్లో అలసత్వాన్ని సహించేది లేదని హెచ్చరించారు. స్వయంగా క్షేత్రస్థాయిలో బాలికల బాల బాలికల స్కూలు వసతి గృహం, గుత్తులపుట్టులో గల బాలికల వసతి, స్కూల్స్‌ను పరిశీలించడం జరిగిందని, ఇకపై తరచూ ఆకస్మికతనిఖీలు నిర్వహించ నున్నట్లు ఆయన తెలిపారు. బాకూరు గుత్తులు పుట్టు స్కూలు తనిఖీ చేసినప్పుడు చిన్న చిన్న లోపాలు దృష్టిలో ఉన్నాయని, అందులో వంటశాల పరిశుభ్రంగా లేకపోవడం, కూరగాయల నిల్వ ఉంచటంలో లోపలను పరిశీలించడం జరిగిందని, అలాంటివి లేకుండా చూడాలని, హాస్టల్ వార్డెన్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించు కోవాలన్నారు. అలాగే ఉపాధ్యాయుల సమస్యలపై అడిగి తెలుసుకుని సర్వీస్ రూల్స్ కు సంబంధించిన పెండింగ్ సమస్యలపై పరిష్కార దిశగా ఆలోచిస్తామని, వాటిని దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు అలసత్వం వహించరాదని, విద్యార్థులను మన సొంత పిల్లల చూసుకోవాలన్నారుఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు పి.బి.కె పరిమళ, ఏటీడబ్ల్యు ఓ, వివిధ పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు, గురుకులం ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి జిల్లా గృహ నిర్మాణ సంస్థకు 12మంది ఇంజనీర్లు నియామకం

పాడేరు,జూన్23,(ప్రభాతవార్త



స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డులో పనిచేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లను సిబ్బంది కొరత/అవసరం ఉన్న శాఖలకు రాష్ట్రం వ్యాప్తంగా సిబ్బంది సర్దుబాటు రాష్ట్ర ప్రభుత్వం చేసింది. ఇందులో భాగంగా సిబ్బంది కొరతతో శతమతమౌతున్న అల్లూరి జిల్లాలో గృహ నిర్మాణ సంస్థ కు 12 మంది ఇంజనీర్లను కేటాయించారు. ప్రభుత్వం కేటాయించిన 12 మందిని జిల్లాలో ఉన్న 11 మండలాలకు అసిస్టెంట్ ఇంజనీర్లను ఒకరిని అల్లూరి జిల్లా సొంత జిల్లా కార్యాలయంలో నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు దింతో లబ్ధిదారులకు ఇంకా మెరుగైన సేవలు అందించడానికి అవకాశం వచ్చింది.

## అమ్మవారి భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు

పాడేరు,జూన్23,(ప్రభాతవార్త):



గిరిజన ఆరాధ్యదైవం శ్రీ శ్రీ మోదకొండమ్మ అమ్మ వారి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్, పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారధన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మూలం గుమ్మి మృతులకు ఆర్థిక సాయం : అరకు ఎమ్మెల్యే రేగమత్స్య లింగం

హుకుంపేట, జూన్ 23,(ప్రభాతవార్త



మూలంగుమ్మి జలపాతం దుర్ఘటనలో మృతి చెందిన గిరిజన యువతుల కుటుంబాలకు రూ.1.50 లక్షల ఆర్థిక సాయం బాధితులకు అందించామని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. గత రెండు నెలల క్రితం తేదీ ఏప్రిల్ 10వతేదిన అరకు నియోజక వర్గం, అనంతగిరి మండలం, వాలసి గ్రామ పంచాయతీ, జంబువలస గ్రామ పరిధిలో గల మూలంగుమ్మి జలపాతం వద్ద జరిగిన దుర్ఘటనలో త్రిష,రత్నకుమారి,పవిత్ర అనే ముగ్గురు గిరిజన యువతులు ఈతకు వెళ్లి మృతి చెందిన విషయం విదితమే. అరకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవమాజీ ముఖ్యమంత్రి,వైసీపీ అధినేత శ్రీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఒక్కో బాధిత కుటుంబానికి రూ.50,000 చొప్పున మొత్తం రూ.1,50,000 ఆర్థిక సాయం చెక్కుల ద్వారా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ ముగ్గురు ఆడబిడ్డల మృతి అత్యంత బాధాకరమని,వారిని మరల తీసుకురాలేము కానీ మానవత దృక్పథంతో స్పందించి,1,50,000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించిన మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేగం చాణక్య,వైసీపీ అల్లూరి సీతారామరాజు జిల్లా ఉపాధ్యక్షులు బత్తిరి రవిప్రసాద్, వైసీపీ అల్లూరి సీతారామరాజు జిల్లా మహిళా అధ్యక్షురాలు సమిడ వెంకట్ పూర్ణిమ, వైసీపీ అరకు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు రేగం శివరామకృష్ణ, వైసీపీ హుకుంపేట మండల పార్టీ అధ్యక్షులు అనిల్, బూర్గ ఎంపీటీసీ సభ్యులు మజ్జి హరి,"చటారు గ్రామ పంచాయతీ ఎంపీటీసీ కిలగడ సింహాచలం,రత్నము సర్పంచ్ పాడి పోతురాజు, మండల ఉపాధ్యక్షులు కాకరి వెంకటరావు, కొంతిలి గ్రామ పంచాయతీ సర్పంచ్ రేగం రమేష్, వైసీపీ అరకు వ్యాలీ మండలం ఎస్టి సెల్ అధ్యక్షుడు పాంగి నగేష్, వైసీపీ పట్టం గ్రామ పంచాయతీ అధ్యక్షులు పోతురాజు.. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల రక్షణ, భద్రత అంశాలు -బాల్య వివాహాలపై అవగాహన

పాడేరు శాన్ ఇన్స్పెక్టర్ పాపినాయుడు

పాడేరు,జూన్23, (ప్రభాతవార్త):



అల్లూరి జిల్లా పాడేరు ప్రధాన కేంద్రంలోని స్థానిక కృష్ణాపురం బాలికల స్కూల్లో మహిళల, పిల్లల భద్రతపై అవగాహన కార్యక్రమం మంగళ వారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాడేరు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ పాపినాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ మహిళల రక్షణ, భద్రత అంశాలు మహిళలు సమాజంలో జాగ్రత్తగా ఎలా ఉండాలి, ఆపద సమయంలో ఎలా స్పందించాలి, ప్రమాదాల నుంచి ఎలా తప్పించుకోవాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, వాటిపై అమలులో ఉన్న చట్టాలు, బాల్య వివాహాలు జరిపితే తీసుకునే చట్టపరమైన చర్యల గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే విద్యార్థులు, యువత మొబైల్ ఫోన్ల దుర్వినియోగం వల్ల కలిగే నష్టాలపై సూచనలు చేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, వరిసర ప్రాంతాల్లో ఎవరైనా యువతను చెడు వ్యసనాల బారిన పడేలా ప్రోత్సహించినా, ఇబ్బందులకు గురిచేసినా వెంటనే పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ పాపినాయుడు సూచించారు. అనంతరం ఎస్సీ కాలనీ నుండి పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం ప్రధాన కూడలి వరకు మహిళల భద్రత సమాజ భద్రత అంటు నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, పాల్గొన్నారు.

## అడవి తల్లి ఒడి నుండి గిరిజన బిడ్డలను వేరు వేరు చెయ్యడానికి మోడీ, చంద్రబాబు ప్రభుత్వాలు కుట్ర

సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అప్పల నరసయ్య

డుంబ్రిగూడ, జూన్ 23 (ప్రభాతవార్త



అడవి తల్లిఒడి నుండి గిరిజన బిడ్డలను వేరు చేయడానికే బాక్సైట్ రహస్య సర్వేలను ఇచ్చిన అను మతులు తక్షణమే రద్దు చేయాలని సిపిఎం పార్టీ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని స్థానిక అల్లూరి సామాజిక భవనంలో సిపిఎం మండల జనరల్ బాడీ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలతో కుమ్మక్కై ఆదివాసుల అడవులు, భూములు ,సహజ వనరులను దోచుకోవడానికి కుట్ర చేస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. ఈ జిల్లాలో గత కొన్ని ఏళ్లుగా ఉన్న లబ్ధిదారుడికి కూడా అటవీ హక్కుల పట్టాలు మంజూరు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని చెప్పారు. ఆదివాసులకు పౌష్టికాహారం అందించకుండా యోగ పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని, దీంతో మాతృ శిశు మరణాలు రోజురోజుకు పెరుగుతున్నాయని విమర్శించారు. పాడేరు రెవెన్యూ డివిజన్లోని చింతపల్లి మండలంలో 1450 వరదన్న కిలోమీటర్ విస్తీర్ణంలో ఉన్న బాక్సైట్, మాంగనీస్, గ్రానైట్, టంగ్ స్టన్, కోబాల్ట్, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ మరియు మినరల్స్ సర్వేకు కేంద్ర ప్రభుత్వం 2024 లో అనుమతివ్వగా రాష్ట్ర ప్రభుత్వం 2025లో సర్వే చేయడానికి అనుమతులు ఇచ్చిందని చెప్పారు. క్రిటికల్ మినరల్ రాకర్స్ (సీఎంఆర్ )కంపెనీ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసి గత రెండు నెలలుగా రహస్యంగా మట్టి నమూనాలు సేకరిస్తుందని జిల్లాలో ఆరు బ్లాకుల్లో రహస్య సర్వేలు జరుగుతున్నాయన్నారు. జీకే వీధి మండలం జెర్రెల ప్రాంతంలో కూడా గుర్తుతెలియని వ్యక్తులు రహస్యంగా బాక్సైట్ సర్వేలు చేస్తున్న విషయం తెలిసి ఆ ప్రాంత గిరిజనులు భయ భ్రాంతికి గురవుతున్నారని చెప్పారు. ఇటీవల ఒక సర్వే బృందాన్ని కూడా స్థానికుల అడ్డుకున్నారన్నారు. ఈ సర్వేలు అటవీ ప్రాంతాలు, ఆదివాసి గ్రామాలు సంస్కృతి, వన్యప్రాణి నివాసాలను కవర్ చేస్తున్నాయని, గ్రామసభల అనుమతి సమగ్ర పర్యావరణ అంచనా (ఈఐఏ) సామాజిక ప్రభావం అంచనా( ఎస్ఐఏ) లేకుండా జరుగుతున్న ఈ రహస్య సర్వేలు, పీసా చట్టం, ఎఫ్ఆర్ఏ 2006,1/70 చట్టాలను, రాజ్యాంగ హక్కులను స్పష్టంగా ఉల్లంఘిస్తున్నాయన్నారు. అటవీ శాఖ మంత్రిగా ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 1450 వరదన్న కిలోమీటర్లు సర్వేకు అనుమతి ఇవ్వడం అన్యాయమని ఒకవైపు అడవులు పెంచాలని, మరోవైపు కార్పొరేట్ కంపెనీలకు అడవులను దారాపోస్తున్నారని చెప్పారు. తక్షణమే బాక్సైట్ సర్వే అనుమతులు రద్దుచేసి, సీఎంఆర్ సంస్థపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని, రహస్య సర్వేలకు అనుమతి ఇచ్చిన జిల్లా అధికారులను తక్షణం బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. జర్రెల,జీకే వీధి, చింతపల్లి ప్రాంతాల్లో జరుగుతున్న రహస్య సర్వేలపై స్వతంత్రంగా విచారణ జరిపి సర్వే చేస్తున్న వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామసభల అనుమతి లేకుండా ఎలాంటి సర్వేలు లేదా కార్యకలాపాలు చేపట్టవద్దని, ఈ రహస్య సర్వేలపై ముఖ్యమంత్రి చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బహిరంగంగా ప్రకటన చేయాలని ఆయన కోరారు. లేనిపక్షంలో ఆదివాసి ప్రజల భూములు అడవులు వనరులు కార్పొరేట్ లాభాల కోసం ధ్వంసం చేసే ఏ ప్రయత్నాలైనా ఆదివాసి సమాజం సహించదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి సూర్యనారాయణ, సురేష్, దొంబు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేరుకు రైతుకు మీకోసం.. విత్తనాలకు నోచుకోని రైతాంగం..!

విత్తనాల కొరతపై వైసీపీ నేతల తీవ్ర ఆగ్రహం

కొయ్యూరు జూన్ 23 ప్రభాతవార్త



రైతన్న మీకోసం.. పేరుతో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కూటమి ప్రభుత్వం, రైతులకు సరిపడా విత్తనాలు సరఫరా చేయక పోవడం విడ్డూరంగా ఉందని మండల వైసీపీ ఉపాధ్యక్షుడు నర్సి కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని బీడీ పాలెం రైతు సేవా కేంద్రంలో వరి విత్తనాలపై రైతులు బారులు తీరినప్పటికీ, రైతుకు కేవలం ఒక బస్తా విత్తనాలు మాత్రమే ఇస్తాను అనడం, దానికి కూడా చాలా నిబంధనలు విధించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. మూడు నుండి నాలుగు ఎకరాల పొలంగల రైతులకు కూడా కేవలం 25 కేజీల వరి విత్తనాలు సరఫరా చేయడం, కూటమి ప్రభుత్వ వైఫల్యంగా ఆయన అభివర్ణించారు. ఇప్పటికైనా రైతులకు సరిపడా వరి విత్తనాలను సకాలంలో సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు ఎంపీటీసీ మల్లికార్జున్, రైతులు దిబ్బ కుమారి, దిబ్బ రాజబాబు, మా కాడ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## 25న అరకులోయలో ఎంపీ కార్యాలయం ప్రారంభం

అరకులోయ, జూన్ 23, ప్రభాతవార్త



అరకు పార్లమెంట్ కేంద్రం అరకులోయలో ఈనెల 25వ తేదీ గురువారం పార్లమెంట్ కార్యాలయం ను నూతనంగా ప్రారంభిస్తున్నట్లు అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణి తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ ఈనెల 25న అరకులోయలో నూతన ఎంపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, అనాధికారులు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు అవసరార్థం మనుసెన్నడు లేని విధంగా వారందరి ఆకాంక్ష మేరకు, అలాగే ప్రజలకు మెరుగైన మరిన్ని సేవలు అందించడానికి గాను అరకు పార్లమెంట్ కేంద్రం అరకులోయ లో అరకు పార్లమెంట్ కార్యాలయం ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యాలయం ప్రారంభోత్సవానికి వైఎస్ఆర్సీపీ అల్లూరి జిల్లా అధ్యక్షులు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా జడ్పీ చైర్ పర్సన్, జల్లిపల్లి సుభద్ర, ఎమ్మెల్సీ డాక్టర్ కుంభ రవి బాబు, అరుకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి అరకు మాజీ ఎమ్మెల్యే వైఎస్ఆర్ పార్టీ కేంద్ర కార్యవర్గ సభ్యులు చెట్టి ఫాల్గుణ, పాడేరు మాజీ ఎమ్మెల్యే, వైసిపి పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు, ఎస్ కోట నియోజకవర్గ పరిశీలకులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, వైసిపి పార్టీ అరకు పార్లమెంట్ పరిశీలకులు చింతలపూడి వెంకట రామయ్య, వైసిపి అరకు నియోజకవర్గం పరిశీలకులు బాబాల శ్రీనివాస్, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, రాష్ట్ర మాజీ జిసిసి చైర్మన్ వైసీపీ పార్టీ చీపురుపల్లి పరిశీలకులు శోభా స్వాతిరాణి, ఎస్ కోట మాజీ ఎమ్మెల్యే, అనకాపల్లి జిల్లా వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు శోభా హైమావతి దేవి తదితర పార్టీ పెద్దలు హాజరవుతున్నట్టు ఎంపీ తెలియజేశారు. ఎంపీ కార్యాలయ ప్రారంభోత్సవంలో ప్రజా ప్రతినిధులు, వైసిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైసిపి పార్టీ వివిధ అనుబంధ విభాగాల సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమం ను విజయవంతం చేయాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

## 27న ఆర్కే నగర్ వద్ద ఉచిత నేత్ర వైద్య శిబిరం

స్థానిక ఫిర్యాదుల కమిటీ జిల్లా చైర్మన్- కె.కృష్ణకుమారి

అరకు రూరల్, జూన్ 23, ప్రభాతవార్త



అరకులోయ మండలంలోని గన్నెల పంచాయతీ పరిధిలోకి వచ్చే ఆర్కే నగర్ జంక్షన్ వద్ద ఈనెల 27వ తేదీన విశాఖ కు చెందిన ఎల్.వి ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరమును నిర్వహిస్తున్నట్లు అల్లూరి జిల్లా స్థానిక ఫిర్యాదుల కమిటీ అధ్యక్షురాలు కమ్మిడి కృష్ణకుమారి తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. గిరిజనులకు మెరుగైన కంటి వైద్య సేవలు అందించేందుకు గాను పంచాయతీ మాజీ సర్పంచ్ బూర్ల బొజ్జ, సహకారంతో విశాఖ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ శిబిరము సేవలను పంచాయతీ ప్రజలతోపాటు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కృష్ణకుమారి విజ్ఞప్తి చేశారు. ఈ శిబిరానికి వచ్చే ప్రతి ఒక్కరు తమ ఆధార్ కార్డును తీసుకురావాలని అన్నారు.

## గూడెం కొత్తవీధి-1 వీఆర్వో కన్నుమూత..

గూడెం కొత్త వీధి, జూన్ 23, ప్రభాతవార్త



గూడెం కొత్తవీధి-1 గ్రామ రెవెన్యూ అధికారి వనపరి లింగాలు (52) మంగళవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మరణవార్తతో స్థానిక రెవెన్యూ శాఖలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. తహసీల్దార్‌తో పాటు తోటి రెవెన్యూ అధికారులు, సహోద్యోగులు ఆయన మృతికి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధుల్లో ఆయన అందించిన సేవలను స్మరించుకుంటూ సంతాపం ప్రకటించారు. లింగాలు అంత్యక్రియలు బుధవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రజాప్రతినిధులు, తోటి ఉద్యోగులు, స్థానికులు ప్రార్థించారు.




## గిరిజన రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన సదస్సు వ్యవసాయ పరికరాల పంపిణీ

జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ

పాడేరు,జూన్23,(ప్రభాతవార్త):



గిరిజన ప్రాంతాల్లోని రైతుల జీవన ప్రమాణాలు పెంచేందుకు, ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని వారికి క్షేత్రస్థాయిలో అందుబాటులోకి తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, పేర్కొన్నారు. మంగళవారం ఉదయం జి.మాడుగుల మండలం, గెమ్మెలి పంచాయితీ, పుత్తడి గొంది గ్రామంలో వీసీటీ కృషి విజ్ఞాన్ కేంద్రం,పొలాల పరిరక్షణ ప్రచారం ఖేత్ బచావో అభియాన్ - ట్రైబల్ సబ్ ప్లాన్‌లో భాగంగా జరిగిన భారత ప్రభుత్వ వ్యవసాయ పరిశోధన మండలి ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (న్యూ ఢిల్లీ) మరియు భాగవతుల చారిటబుల్ ట్రస్ట్ కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కోఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ కింద గిరిజన ఉప ప్రణాళిక లో భాగంగా ఖేత్ బచావో అభియాన్" (నేలను రక్షించుకుందాం) పేరిట సామర్థ్యం పెంపొందింపు అవగాహన సదస్సులో ఉచిత వ్యవసాయ పరికరాలు (ఇన్పుట్స్ ) పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ ఈ సదస్సును ఘనంగా నిర్వహించారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజన రైతులు సాంప్రదాయ పద్ధతులతో పాటు శాస్త్రవేత్తలు సూచించే ఆధునిక మెరైన యాజమాన్య పద్ధతులను అవలంబించి తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు సాధించాలని పిలుపునిచ్చారు. భూసార సంరక్షణ ప్రాముఖ్యత ను వివరిస్తూ, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ, ప్రకృతిక వ్యవసాయ పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె రైతులకు కోరారు. గిరిజన ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాలు ,వ్యవసాయ అనుబంధ రంగాల్లో మరింత ఎక్కువ చురుగ్గా పాలుపంచుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని ఆమె ఆకాంక్షించారు. శాస్త్రవేత్తలు రూపొందించిన సరికొత్త వ్యవసాయ విజ్ఞాన సమాచార కరపత్రాలు, పుస్తకాలను కార్యక్రమంలో పాల్గొన్న అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో వీసీటీ డాక్టర్ శైలజ కుర్ర, డాక్టర్ మహేష్ సి మీనా నోడల్ అధికారి గిరిజన ఉపప్రణాళిక ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూఢిల్లీ, కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్తలచే నేల సంరక్షణ, విత్తన శుద్ధి, పంటల మార్పిడి, దిగుబడులు పెంచే విధానాలపై క్షేత్రస్థాయి శిక్షణకు సంబంధించిన శాస్త్రవేత్తలు, సీనియర్ సైంటిస్ట్ ఓ హెడ్ డాక్టర్ ప్రసాద్ రావు, బి నాగేంద్ర ప్రసాద్, డాక్టర్ విజయ రాగ్ని, మండల తహసీల్దార్ రాజ్ కుమార్, జెడిపిటి మాజీ సర్పంచ్, ఎంపీపీ,ఈ సదస్సులో వివిధ మండలాల నుండి తరలివచ్చిన గిరిజన పురుష, మహిళా రైతులు, ప్రజాప్రతి నిధులు, కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్తలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఆర్.వి. నగర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఐదు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు

గూడెం కొత్తవీధి, జూన్ 23,(ప్రభాతవార్త



మండలంలోని ఆర్.వి. నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ రోజి విసికాంజలి ఆధ్వర్యంలో ఈరోజు వనసపల్లి, బొంగలపల్లి, బందపాలెం, మూలగరువు, నూతిబంధ గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ప్రస్తుత వానకాలం కాలానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దోమతెరలు వాడాలని, 20ని"లు పాటు కాచి చల్లార్చి వడపోసిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించి వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమలు పెరిగే అవకాశం ఉన్నటువంటి నీటి నిల్వలను నిర్మూలించి దోమల అభివృద్ధిని అరికట్టి మలేరియా,డెంగ్యూ వ్యాధుల నుండి రక్షణ పొందాలని వివరించారు. పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని పోషకాహారంతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని వివరించారు. ఈ వైద్య శిబిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఎం.పి.హెచ్.ఈ.ఓ జాన్సన్, హెల్త్ అసిస్టెంట్ మూర్తి, నెహ్రూ, సత్యనారాయణ ఏ.ఎన్.ఎం రామలక్ష్మి, వరలక్ష్మి మరియు ఆశలు పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యుల క్రమశిక్షణ నియంత్రణలో మహాలక్ష్మి.. విధి నిర్వహణలో అంబటి వరలక్ష్మి

చిరుద్యోగికి ఘన సన్మానంలో కొనియాడిన పలువురు వక్తలు

కొయ్యూరు జూన్ 23 ప్రభాతవార్త




కుటుంబ సభ్యులకు మంచి క్రమశిక్షణ నేర్పిం చడంలోనూ, వారికి మంచి భవిష్యత్తు కల్పించడం లోనూ మహాలక్ష్మి లా వ్యవహరించే ఫోర్త్ క్లాస్ ఎంప్లాయ్ తన విధి నిర్వహణలో మాత్రం విద్యార్థులకు వరలక్ష్మిలా మారిందని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. ఈనెల 30తో ఉద్యోగ విరమణ పొందనున్న ఉన్న కొయ్యూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాయ్ శివ పాఠశాల నాలుగో తరగతి ఉద్యోగిని అంబటి వరలక్ష్మిని ఉద్దేశించి పలువురు వక్తలు కొనియాడారు. విధి నిర్వహణలో నాలుగో తరగతి ఉద్యోగిని అంబటి వరలక్ష్మి ఎంతో క్రమశిక్షణతో వ్యవహరించిందని వక్తలు కొనియాడారు. జెసిసి మాజీ చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎం వి ప్రసాద్,, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు, చింతపల్లి జెడ్పిటిసి పోతురాజు బాలయ్య, ఉపాధ్యాయ సంఘం నేతలు చింతల శ్రీనివాసరావు, జలుమూరి గణబాబు, నర్స్ పాపారావు, అంబటి రామారావు, పాల్గొన్నారు.

## నూతన ఓటర్లకు భాగస్వాములుగా చేద్దాం..

డుంబ్రిగుడ, జూన్23, (ప్రభాతవార్త):

సర్ కార్యక్రమం విషయంలో గిరిజన ప్రజానీకం అపోహలను వీడి వాటిని నివృత్తి చేయడానికి అవసరమైన చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టిందని తెదేపా మండల అధ్యక్షుడు ఆనందరావు అన్నారు. మండలం లోని కురిడి పంచాయితీ జంగిడివలస గ్రామంలో ఇంటింటికెళ్లి ఓటరు జాబిత పత్రాలను గిరిజన కుటుంబాలకు అందజేశారు. గత ప్రభుత్వ హయంలో ఓట్ల చోరీ జరిగిందని విమర్శించారు. క్షేత్రస్థాయిలో వాలంటీర్ల సేవలను వినియోగించి అధికారం చేపడతామనే ఉత్సాహంతో 11 సీట్లకే పరిమితమయ్యిందన్నారు. పారదర్శకంగా 18 ఏళ్ల నిండిన ప్రతిఒక్కరికి ఓటు హక్కును కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం గిరిజన ఓటర్లను చైతన్యం చేస్తోందన్నారు. ఓటు హక్కు పత్రాలను సకాలంలో పూర్తి చేసి బీఎల్ వోలకు అందించి శాశ్వత పౌరులుగా నిలవాలని ఆయన కోరారు. అరకు నియోజకవర్గ అధికార ప్రతినిధి చినగొన్ను, మాజీ సర్పంచ్ బీమన్న, క్లస్టర్ ఇన్చార్జి నర్సు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



## రెండేళ్ల ప్రభుత్వ పాలన పైన- ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

### కూటమి నేతల పిలుపు



నక్కపల్లి, జూన్ 23, ప్రభాతవార్త

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా చేపట్టనున్న “రెండు ఏళ్ల నమ్మకం- అభివృద్ధి అండ్ సంక్షేమం” అనే నినాదంతో ప్రతి ఒక్క కార్యకర్త ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కూటమి నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం నక్కపల్లి లోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి





లాలం కాశీనాయుడు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి వివరించాలని సూచించారు. గ్రామస్థాయిలో జరిగిన అభివృద్ధి పనులను సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేయాలని, బూత్ స్థాయిలో కూటమి నేతలు ప్రతిరోజూ 20 నుంచి 30 ఇళ్లను సందర్శించాలని పిలుపునిచ్చారు. ఇదే స్ఫూర్తితో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సమన్వయంతో పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని కోరారు. జనసేన సీనియర్ నాయకుడు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తోట నగేష్ మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడం ప్రతి ఒక్క కార్యకర్త ప్రధాన ధ్యేయమని ఆ విధంగా ఈ కార్యక్రమమని అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గం ఉత్తరాంధ్రలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతంగా నిలుస్తోందని పేర్కొన్నారు. నక్కపల్లి మండలంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో పరిసర ప్రాంతాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని చెప్పారు. దాదాపు 70 ఏళ్ల తర్వాత నియోజకవర్గానికి మంత్రి పదవి రావడంతో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమయ్యాయని అన్నారు. నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత నాయకత్వంలో పాయకరావుపేట నియోజకవర్గం రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయాలని, ప్రత్యేక ఓటరు సర్వే ప్రక్రియలో బీఎల్ఏలు, బీఎల్‌వోలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం 45 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాకలపాటి రవి రాజు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి గడపకు చేరవేయాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి మూడు పార్టీల కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ సీఎం రమేష్, రాష్ట్ర హోంమంత్రి అనిత సారథ్యంలో పాయకరావుపేట నియోజకవర్గానికి కేంద్ర విశ్వవిద్యాలయం వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎన్డీఏ కూటమికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు దేవర సత్యనారాయణ, పెద్దిరెడ్డి చిట్టిబాబు, విలియం కేరి,కురుందాసు నూకరాజు, గింజల లక్ష్మణరావు, పెట్ల లింగం నాయుడు, అమలకంటి అబద్ధం చించెలపు పద్దు, కొప్పిశెట్టి బుజ్జి, వైబోయిన వెంకటరమణ, గుర్రం రామకృష్ణ దార్ల కృష్ణ ,పోలినాటి నానాజీ, వెలగా సుధాకర్, అయినంపూడి అప్పలరాజు, కోసూరి శ్రీనివాసరావు తోపాటు పలువురు ఉన్నారు.

## ఇంటింటికి ఓటర్ల జాబితా పరిశీలన

నక్కపల్లి, ప్రభాతవార్త



మండలం లోని రాజయ్యపేట తోపాటు నక్కపల్లి వంటి గ్రామాల్లో ఓటర్ల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఓటర్ల జాబితా ఆధారంగా ఇంటింటికి వెళ్లి పరిశీలన చేపట్టారు. నక్కపల్లిలో గణేష్‌తో పాటు రాజకీయ పార్టీలకు చెందిన కొప్పిశెట్టి వీరబాబు, అల్లాడ కొండ, రాజయ్యపేటలో శివాజీ, పిక్కి శ్రీను, పిక్కి చిన్నారి, యజ్జల అప్పలరాజు తదితరులు ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, తదితరులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.

## చేపల మృతి పట్ల క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టిన అధికారులు



(నక్కపల్లి/రూరల్ /అడ్డు రోడ్డు, ప్రభాతవార్త)

బోయపాడు గ్రామం మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జాతీయ జలచర జంతు వ్యాధుల పర్యవేక్షణ కార్యక్రమం ద్వారా మండలంలోని బోయపాడు గ్రామంలో చేపల సామూహిక మరణాలు సంభవించిన నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలన సోమవారం చేపట్టారు. ఈ పరిశీలన లో భాగంగా స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ, కాకినాడ ప్రిన్సిపల్, అదనపు సంచాలకుల ఆదేశాల మేరకు జిల్లా మత్స్యశాఖ అధికారుల పర్యవేక్షణలో ఈ బృందం సభ్యులు సంఘటన స్థలాన్ని సందర్శించి చేపల మరణాలకు గల కారణాలను నిర్ధారించేందుకు మృత చేపల నమూనాలు, నీటి నమూనాలను సేకరించారు. సేకరించిన నమూనాలను విశ్లేషణ నిమిత్తం స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ, కాకినాడ ప్రయోగశాలకు పంపించారు. ఈ మేరకు జాతీయ జలచర జంతు వ్యాధుల పర్యవేక్షణ బృందం సభ్యులు కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లాలోని బంగారమ్మపేట, పెంటకోట ప్రాంతాలలో ఉన్న వివిధ రొయ్యల చెరువుల నుండి కూడా నమూనాలను సేకరించారు. వివిధ వ్యాధుల నిర్ధారణ కోసం ప్రయోగశాల పరీక్షలకు పంపించారు. జలచర జంతువుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడం, వ్యాధుల ప్రబలతను ముందస్తుగా గుర్తించడం, వ్యాధుల వ్యాప్తిని నివారించేందుకు అవసరమైన చర్యలను సూచించడం, రైతులకు సకాలంలో సాంకేతిక మార్గదర్శకాలు అందించడం స్థిరమైన ఆక్వాకల్చర్ అభివృద్ధికి తోడ్పడటం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం అని బృందం సభ్యులు ఈ సందర్భంగా తెలిపారు. సముద్ర తీర ప్రాంతంలో పర్యటించిన బృందంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ పి కిరణ్ కుమార్, యంగ్ ప్రొఫెషనల్ ఎస్.ఎస్.చైతన్య, జూనియర్ కన్సల్టెంట్ పి. శ్రీనివాస్, గ్రామీణ మత్స్యశాఖ అసిస్టెంట్ శివాజీ, జె. పూర్ణిమ,(డి.ఎల్. పురం) కె. త్రినాథ్ బాబు, (పెంటకోట) తదితరులు ఉన్నారు.

## శ్యాం ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు

నక్కపల్లి రూరల్ /అడ్డురోడ్డు, ప్రభాతవార్త



జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ స్వర్గీయ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమం నక్కపల్లి మండల బీజేపీ పార్టీ కార్యాలయం వద్ద మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు పోలినాటి నానాజీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సందర్భంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సభ్యులు కోసూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒకే దేశం -ఒకే జెండా నినాదాన్ని లేవనెత్తి మహానాయకుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని తెలియజేశారు. 370 ఆర్టికల్‌కి వ్యతిరేకించి తన పదవికి రాజీనామా చేసిన నాయకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాడిశెట్టి ఈశ్వరరావు కోసూరు శ్రీనివాసరావు, నున్న జ్యోతి బస్, కొల్లాటి రమణ, ఇమామ్ హుస్సేన్, బంగారి శివ, వెదుళ్ళ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఆపదలో ఆయుధం ‘శక్తి యాప్’..


### మహిళలు, పిల్లల భద్రతపై రూరల్ ఎస్సై ఉపేంద్ర ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



ఎలమంచిలి, జూన్ 23, ప్రభాతవార్త

మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలను అరికట్టడమే లక్ష్యంగా మండలం లోని పురుషోత్తపురం గ్రామంలో మంగళవారం ప్రత్యేక అవగాహన సదస్సును రూరల్ ఎస్సై ఉపేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై ఉపేంద్ర మాట్లాడుతూ గ్రామస్తుల కు, మహిళలకు రక్షణ, భద్రతా చర్యలపై పలు కీలక సూచనలు చేశారు. సమాజంలో మహిళలు, బాలికల భద్రతకు ప్రభుత్వంతో పాటు పోలీసు యంత్రాంగం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎస్సై ఉపేంద్ర స్పష్టం చేశారు. ఆపదలో ఉన్న మహిళలకు తక్షణమే సాయం అందించేందుకు అందుబాటులోకి తెచ్చిన ‘శక్తి యాప్’ వినియోగంపై ఆయన విపులంగా అవగాహన కల్పించారు. ప్రతి మహిళ, విద్యార్థిని తప్పనిసరిగా తమ స్మార్ట్‌ఫోన్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఏమాత్రం ఆపద ఎదురైనా వెంటనే యాప్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అత్యవసర పరిస్థితుల్లో ఈ యాప్ ఒక రక్షణ కవచంలా అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీ రాజాన శేషు మాట్లాడుతూ ఆధునిక డిజిటల్ టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవడం ద్వారా మహిళల్లో మరింత ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, గ్రామీణ స్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అవసరమని అన్నారు. బాలల హక్కుల రక్షణ, మహిళల భద్రతపై ఉద్దేశించిన ఈ కార్యక్రమంలో రెవెన్యూ, ఐసీడీఎస్ అధికారులు, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, స్థానికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అర్హత కలిగిన వారు ఓటు నమోదు చేసుకోవాలి



(నక్కపల్లి, ప్రభాతవార్త)

అర్హత కలిగి ఇంతవరకు ఓటరు జాబితాలో నమోదు కాకపోతే తక్షణమే దరఖాస్తులు చేసుకొని ఓటు అర్హత పొందాలని తహశీల్దార్ చిన్ని కృష్ణ సూచించిన ఎదుట వార్డులో వారీగా అర్హత కలిగిన వారికి నమోద చేయించుకునేందుకు దరఖాస్తులను అందజేస్తున్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని పలు కాలనిలోని ప్రజలకు ఓటరు నమోదు దరఖాస్తులను మంగళవారం పంపిణి చేశారు. ఈ సందర్బంగా స్థానిక వెంకట నగర్ కాలనీ 209 బూత్ నంబర్ గల వార్డ్‌లో వారికి తహసీల్దార్ చిన్ని కృష్ణ, ఎలక్షన్ డిటి వీర వాణి ఆదేశాలు మేరకు బూత్ లెవెల్ అధికారి (బిఎల్ఓ) సాయి దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో బూత్ లెవిల్ ఏజెంట్‌లు (బిఎల్ఏ) వైస్సార్ సిపి నాయకులు వీసం రాజు, టిడిపి నాయకులు అద్దూరి గంగాధర్ సమక్షం లో దరఖాస్తులు పంపిణి చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ 18ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు గా నమోదు చేసుకోవాలని, ఇప్పటికే ఓటు కలిగిన వారు ఆధార్, చిరునామాతో సహా జాబితాలో పేరు సరి చూసుకొని నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజా స్వామ్యంలో ఓటు హక్కు చాలా కీలకమని ఓటు ప్రాధాన్యత, ఎంతో అందరు తెలుసుకోవాలని అన్నారు.

## 27న మాస్ ప్లాంటేషన్ డే జయప్రదం చేయండి : ఎంపీడీవో చలపతిరావు

నక్కపల్లి ,ప్రభాతవార్త



ఈనెల 27వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆధ్వర్యంలో మాస్ ప్లాంటేషన్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీవో చలపతిరావు కోరారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని జానకయ్య పేట, సిహెచ్ఎల్



పురం ప్రాంతాల్లో ఉన్న ఫారెస్ట్ నర్సరీలో ఏ రకాల మొక్కలు ఉన్నాయి అనే విషయమై ఏపీఓ భాగ్యలక్ష్మితో కలిసి పరిశీలించారు. ఉన్న మొక్కల్లో ఏ జాతులకు సంబంధించిన మొక్కలు ఉన్నాయనేది నిర్వాహకులు తెలియజేశారు. మండలంలోని మొదటిగా డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కేజీబీవీ పాఠశాల, బీసీ హాస్టల్ నందు ఈ మాస్ ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. 27న జరిగే కార్యక్రమానికి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితతో పాటు అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్, శాసనమండల సభ్యులు, మండల స్థాయి ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు.

### అన్నదాతల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కారమే

## రైతన్న మీకోసం - వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్

నక్కపల్లి, ప్రభాతవార్త



ఖరీఫ్ సన్నద్ధతలో భాగంగా రైతన్న మీకోసం వారోత్సవాలు వివిధ గ్రామాల్లో నిర్వహించబడుతుందని, ఈ కార్యక్రమం జూన్ 22వ తేదీ నుండి 26వరకు జరుగుతుందని, వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించడమే లక్ష్యం అని వ్యవసాయ అధికారులు ఉమా ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు ఆర్ఎస్‌కే సిబ్బంది, సహజ వ్యవసాయం సిబ్బంది , అనుబంధ శాఖల సిబ్బందికి ముఖ్య మంత్రి సందేశం ఉన్న కరపత్రాలు రైతులకు అందిస్తూ ఈ క్రింది అంశాలపై క్షేత్రస్థాయిలో వ్యవసాయంలో “పంచసూత్రాల” ప్రణాళికను అమలు చేసి, పెట్టుబడి ఖర్చులు తగ్గించి రైతులకు లాభాలు వచ్చేలా చూడటంపై సిబ్బంది అవగాహన కల్పించారు. ఎరువులు ఏపిఏఐఎంఎస్ నమోదు ద్వారా ఆధార్ తప్పనిసరి రైతు ఆధార్ కార్డు లేదా పిఎసిఎస్/రిటైల్ దుకాణాల ద్వారా ఎరువులు తీసుకోవచ్చు అని తెలిపారు. ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్‌కు వచ్చే ఓటిపి ద్వారా కొనుగోలు ధృవీకరించడం జరుగుతుందని చెప్పారు. రైతులు ఎరువులు కొనేటప్పుడు అవసరానికి మించి కొనవద్దు. పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువులు వాడి రసాయన ఎరువుల వాడకం తగ్గించికోవాలి అని సూచించారు. వాతావరణ పరిస్థులు బట్టి పంట మళ్లింపు చేసుకోవాలని, అధిక నీటి అవసరమున్న వరి, బదులు పప్పు ధాన్యాలు, నూనె గింజలు సాగు చేయవలెను. వర్షాభావ పరిస్థితుల్లో గ్రామ పంట ప్రణాళికలు పాటించి అంతర పంటలు వేసుకోవాలని అన్నారు. పప్పు, ధాన్యాలు, నూనె గింజల దిగుబడి పెంచి నేల సారాన్ని కాపాడూకోవాలి. మండలములో 11812 రైతులకు గాను 7.49 కోట్లు 2వ సంవత్సరం మొదటి విడత 23వ విడత పిఎం. కిసాన్ నగదు జమ అయినవి. ఏమైనా సాంకేతిక కారణాలు వలన పడనిచో ఆర్ఎస్‌కే సిబ్బందిని సంప్రదించనవలెను సూచించారు. ఈ క్షేత్ర పర్యటనలో ఏఈవో శ్రీనివాస్, సాయి, గ్రామ సహాయకులు ధనరాజ్, ఆర్ఎస్ కే సిబ్బంది, సహజ వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జనసేనలో కీలక ప్రక్రియకు శ్రీకారం

## సమాచార సేకరణ కమిటీ పరిశీలకు కొణతాల నియామకం



అనకాపల్లి, జూన్ 23, ప్రభాతవార్త

జనసేన పార్టీ సంస్థాగత బలోపేతం దిశగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ రాష్ట్రంలోని 25 పార్లమెంటు నియోజకవర్గాలకు సమాచార సేకరణ కమిటీ పరిశీలకులను నియమిం చారు. ఈ నెల 29వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ ప్రక్రియలో పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళల నుంచి వివిధ పార్టీ పదవుల కోసం దరఖాస్తులను స్వీకరిస్తారు. మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణని విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులుగా నియమించారు.ప్రతి నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు తాము ఏ బాధ్యతలు నిర్వహించాలనుకుంటున్నారో వివరాలను సేకరించి పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపనున్నారు. సేకరించిన దరఖాస్తులు, అభిప్రాయాలను పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ స్వయంగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ చర్య ద్వారా పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కార్యకర్తలకు తగిన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జనసేన ముందుకు సాగుతోంది.

## బుచ్చయ్యపేటలో ‘బ్లాక్ లెవల్ పంచాయితీ డెవలప్‌మెంట్’ సమావేశం

బుచ్చయ్యపేట, జూన్ 23, ప్రభాతవార్త



మండలంలోని గ్రామాల సమగ్ర అభివృద్ధి, పంచాయతీలలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై చర్చించేందుకు బుచ్చయ్యపేట మండలంలో మంగళవారం బ్లాక్ లెవల్ పంచాయతీ డెవలప్‌మెంట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దొండా రాంబాబు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ), ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీవో,పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు తదితరులు హాజరయ్యారు. గ్రామాల్లో చేపట్టాల్సిన మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా దొండా రాంబాబు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసి గ్రామాల సర్వతోముఖ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.సమావేశంలో వివిధ గ్రామాలకు సంబంధించిన సమస్యలు, అభివృద్ధి అవసరాలను అధికారులు వివరించగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పర్యావరణ స్ఫూర్తితో పుట్టినరోజు వేడుకలు..

### కొక్కిరాపల్లిలో మొక్కలు నాటిన ‘గ్రామ జ్యోతి’ యువత..




ఎలమంచిలి, జూన్ 23, ప్రభాతవార్త

మున్సిపాలిటీ 23వ వార్డు పరిధిలోని కొక్కిరాపల్లి గ్రామం లో గ్రామ జ్యోతి యువత ఆధ్వర్యంలో పర్యావరణ స్ఫూర్తితో పుట్టినరోజు వేడుకను నిర్వహించారు. 23వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ మజ్జి మీనా, వీరబాబు దంపతుల కుమారుడు రోషన్ మహాదేవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక వివేకానంద మెమోరియల్ పార్క్ వద్ద యువత ఉత్సాహంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. యువకులు మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా, ఇలా పర్యావరణ పరిరక్షణతో అనుసంధానం చేయడం ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. గ్రామాభివృద్ధిలో పాలుపంచుకుంటూ పర్యావరణాన్ని కాపాడేందుకు ముందుకొచ్చిన రోషన్ కుటుంబ సభ్యులకు గ్రామ జ్యోతి యువత ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. ప్రతి ఒక్కరూ తమ జన్మదినం నాడు కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని బాధ్యతగా సంరక్షించడం ద్వారా పచ్చని ప్రకృతికి, భావితరాలకు తమవంతు మేలు చేయాలని వారు పిలుపునిచ్చారు. సమాజానికి మంచి సందేశాన్నిచ్చేలా సాగిన ఈ కార్యక్రమంలో గండిబోయిన రమణతో పాటు గ్రామ జ్యోతి యువత సభ్యులు ప్రసాద్, గోవిందరాజులు, లీలాకుమార్, నిఖిల్, హరి, సత్యనారాయణ, ఆనంద్, ఓంకార్, విద్యార్థులు పాల్గొన్నారు.




## పల్లెల అభివృద్ధి రైతుల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### సహకార సంఘాలతోనే గ్రామీణాభివృద్ధి : ఎమ్మెల్యే విజయ్ కుమార్




ఎలమంచిలి, జూన్ 23, ప్రభాతవార్త

గ్రామీణ ప్రాంతాల ఆర్థిక వ్యవస్థకు సహకార సంఘాలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. పట్టణంలోని డీసీసీబీ (జిల్లా కేంద్ర సహకార బ్యాంక్) కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సహకార సంఘాల పర్సన్-ఇన్‌ఛార్జిల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే విజయ్ కుమార్ పాల్గొని, మాట్లాడుతూ పల్లెల అభివృద్ధి, రైతుల అభ్యున్నతే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. రైతాంగంతో పాటు చిన్న సన్నకారు వ్యాపారులు, మహిళా సంఘాల ఎదుగుదలలో సహకార రంగం కీలక పాత్ర పోషిస్తోందని గుర్తుచేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన పర్సన్-ఇన్‌ఛార్జిలు క్షేత్రస్థాయిలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆర్థిక సేవలను పారదర్శకంగా లబ్ధిదారులకు చేరవేసి, సంఘాలపై ప్రజల్లో నమ్మకాన్ని రెట్టింపు చేయాల్సిన బాధ్యత వారిపైనే ఉందన్నారు. రానున్న రోజుల్లో సహకార రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు తనవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా రైతులకు పెట్టుబడి కష్టాలు లేకుండా సకాలంలో రుణాలు అందేలా బ్యాంకులు, సంఘాల ప్రతినిధులు సమన్వయంతో అడుగులు వేయాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పాల్గొన్న డీసీసీబీ అధ్యక్షులు కోన తాతారావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సహకార వ్యవస్థ మనుగడకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రానున్న రోజుల్లో రైతుల మేలు కోసం అధికారులతో కలిసి పాలకవర్గం మరింత చురుగ్గా పనిచేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ పరిధిలోని సహకార సంఘాల పర్సన్-ఇన్‌ఛార్జిలు, బ్యాంకు అధికారులు, సిబ్బందితో పాటు కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైంది

అనకాపల్లి జూన్ 23, ప్రభాతవార్త



ప్రతి వ్యక్తి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైంది అని ఏఎంఏఎల్ కళాశాల అధ్యక్షులు శ్రీధరాల కృష్ణ పేర్రాజు అన్నారు. స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో డ్రగ్స్ వద్దు బ్రో -గేమ్స్ ఆడు బ్రో అనే నినాదం తో నష భారత్ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులకు వాలీబాల్ పోటీలను కళాశాల అధ్యక్షులు, కరెస్పాండెంట్ శ్రీధరాల కృష్ణ పేర్రాజు, పెంటకోట వెంకటరామారావు మంగళవారం ప్రారంభించారు. ఆటగాళ్లు అందరికి ఈసందర్భముగా టి షర్ట్స్ పంపిణీ చేసారు. ఈ సందర్బంగా అధ్యక్షులు కృష్ణ పేర్రాజు మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైనది అన్నారు. ఈదశలో ప్రతి ఒక్క విద్యార్థి కెరీర్ మీద దృష్టి సారిస్తూ మానసిక ఆరోగ్యం కోసం క్రీడలు పట్ల శ్రద్ధ చూపాలన్నారు. అంతేగాని సమాజానికి ఎంతో హాని చేస్తున్న మాదక ద్రవ్యాల జోలికి ఎవ్వరు పోరాదని, సమాజం లో మిగిలిన వారికి కూడా వాటి వినియోగం వలన ఏర్పడే పరిణామాలను వివరించాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ సాగర్ మాట్లాడుతూ నష భారత్ ముక్త్ అభియాన్ తరుపున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాల కార్యక్రమాలు ద్వారా ప్రజలలో చైతన్యం తీసుకువస్తూ ఉండటం అభినందనీయమని, అలాగే ప్రతి విద్యార్థి వాటి పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలని, ఈదశలో మంచి స్నేహితులను ఏర్పాటు చేసుకోవాలని, చెడు స్నేహాలు మానుకోవాలని కోరారు. వాలీబాల్ పోటీలలో గెలుపొందిన ఆటగాళ్ళకు ఈగల్ సంస్థ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.దేముళ్ళు, జి.చంద్రిక అసిస్టెంట్ డైరెక్టర్ వికలాంగులు, హిజ్రాలు, వయోవృద్దులు సంక్షేమం బహుమతులను అందచేశారు. ఈకార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు బాలకృష్ణ, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ జయబాబు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ స్వామి నాయుడు, అధ్యాపకులు సుధాకర్, కెప్టెన్ మూర్తి, సూరిబాబు, నాయుడు, శత్రుఘ్న కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సీతయ్యపేట బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్‌కు ఘన వీడ్కోలు

బుచ్చయ్యపేట, జూన్ 23 ప్రభాత వార్త



బుచ్చయ్యపేట మండలం సీతయ్యపేట బ్రాంచ్ పరిధిలో ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన శ్రీనివాస్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా సోమవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది శ్రీనివాస్ అందించిన సేవలను కొనియాడారు. బ్రాంచ్ పరిధిలో స్వయం సహాయక సంఘాల అభివృద్ధి, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలులో శ్రీనివాస్ విశేష కృషి చేశారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఆయన చూపిన నిబద్ధత, బాధ్యతాయుత వైఖరి అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్, వెలుగు ఏపీఎం రాజబాబు, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్ కుమార్, సీసీ దేముడు బాబు, బ్యాంకు సిబ్బంది, వెలుగు సిబ్బంది పాల్గొని శ్రీనివాస్‌కు శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం ఆయన భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు సహకరించిన అధికారులు, సిబ్బంది, విలేజ్ ఆర్గనైజ్ అసిస్టెంట్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ముగిసింది.

## రాష్ట్ర భవిష్యత్తు నిర్మాతలు విద్యార్థులే : ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి జూన్ 23, ప్రభాతవార్త




రాష్ట్ర భవిష్యత్తును నిర్మించే శక్తి విద్యార్థులలోనే ఉందని మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికారని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ఆధునిక మౌలిక వసతులు, నాణ్యమైన బోధన, విద్యార్థి కేంద్రిత సంస్కరణలను అమలు చేయడం వల్ల ప్రభుత్వ విద్యపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందని తెలిపారు. ఈ మార్పులకు నిదర్శనంగా అనకాపల్లి నియోజకవర్గం, అనకాపల్లి మండలం మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఈ విద్యా సంవత్సరంలో సరికొత్త రికార్డు సృష్టించిందన్నారు. పాఠశాలలో ఏకంగా 133 మంది విద్యార్థులు కొత్తగా చేరడం విశేషమని, అందులో 57 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేరడం ప్రభుత్వ విద్యా వ్యవస్థపై పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో పాఠశాల సాధించిన అద్భుతమైన ఉత్తీర్ణత శాతం, విద్యార్థుల ప్రతిభ, ఉపాధ్యాయుల అంకితభావం, పాఠశాలలో నెలకొన్న మెరుగైన విద్యా వాతావరణం కారణంగానే ఈ స్థాయిలో చేరికలు నమోదయ్యాయని తెలిపారు. కొత్తగా చేరిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికి, వారి విద్యాభ్యాసం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పెరుగుతున్న విద్యార్థుల చేరికలు విద్యా రంగంలో చోటుచేసుకుంటున్న సానుకూల మార్పులకు నిదర్శనమని, భవిష్యత్ తరాలకు ఉత్తమ విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు.

## నక్కపల్లి పట్టణంలో కింగ్ కోబ్రా సంచారం .. భయాందోళనలో కాలనీవాసులు

నక్కపల్లి /అడ్డు రోడ్డు, ప్రభాతవార్త



నక్కపల్లి పట్టణంలో ఉన్న వెంకటనగరం కాలనీ ప్రాంతంలో కింగ్ కోబ్రా సంచారం చేస్తున్నట్లు కాలనీవాసులు గుర్తించారు. నక్కపల్లి మండలంలో ఏనాడు కూడా ఇటువంటి జాతిగల కింగ్ కోబ్రా సంచారం చేసిన సందర్భాలు లేవు.! అటువంటిది హఠాత్తుగా పట్నంలోని జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతంలో ఒక్కసారిగా కనిపించడంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. వెంకట్ నగరం కాలనీ కెళ్లే కాలనీవాసులు ఒక్కసారిగా ఈ కింగ్ కోబ్రాని గుర్తించడంతో ఎవరికి వారే వారి వారి ఫోన్లో కోబ్రా ను చిత్రీకరించారు. ఈ విషయం తెలుసుకున్న కాలనీవాసులు ఆందోళన గురై చిన్నపిల్లలను ఇంట్లో నుంచి బయటికి రాకుండా చర్యలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందజేశారు.

## శ్యాం ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు

ఆనందపురం, జూన్ 23, ప్రభాతవార్త:



భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డా.శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి (బలిదాన్ దివాస్) సందర్భంగా ఆనందపురం మండలం వెల్లంకిలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి బూత్ అధ్యక్షులు కె.వి.వి. సూర్యనారాయణ, బోర శ్రీను అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.వి.వి. ప్రసాదరావు పట్నాయక్, విశాఖ జిల్లా సర్వేయర్ సంఘం అధ్యక్షుడు కంటి మహంతి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్యాం ప్రసాద్ ముఖర్జీ దేశ సమగ్రత, జాతీయ సమైక్యత, అఖండ భారత్ నిర్మాణం కోసం చేసిన త్యాగాలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి కార్యకర్త ఆచరణలో పెట్టి దేశభక్తి భావాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వెల్లంకి బీజేపీ నాయకులు పి. కనకరావు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి: ఈఆర్ఓ దయానిధి



గాజువాక, జూన్ 23, ప్రభాతవార్త :

ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియను అధికారులు వేగవంతం చేయాలని గాజువాక నియోజకవర్గ ఈఆర్ఓ, వీఎంఆర్డీఏ ఈఓ దయానిధి ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026' పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఓ సూపర్వైజర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు అందించి, వాటిని వెంటనే డిజిటలైజ్ చేయాలన్నారు. జూలై 21న తొలి నమూనా ఓటరు జాబితా విడుదల చేస్తామని వెల్లడించారు. ఎవరైనా ఇంట్లో లేకపోతే కనీసం మూడు సార్లు సంప్రదించాలి. ఓటరు వలస వెళ్లినా, లేకపోయినా.. పక్కింటి వారు, పార్టీ ప్రతినిధుల సమక్షంలో 'పంచనామా' చేసిన తర్వాతే ఓటు తొలగించాలి. జాబితాలో పేరు లేని వారు ఫారం-6 ద్వారా తిరిగి ఓటు నమోదు చేసుకోవచ్చు. సమావేశంలో బీజేపీ నాయకుడు కరణంరెడ్డి నరసింగరావు, కాంగ్రెస్ ప్రతినిధి ముత్యాలనాయుడు, జనసేన నేత రౌత్ గోవింద్, డిప్యూటీ తహసీల్దార్ రవికాంత్, ఎన్నికల అధికారులు సూర్యకల, ధనలక్ష్మి, బీఎల్ఓలు పాల్గొన్నారు.

## ముఖర్జీ ఆశయాల బాటలో మోదీ పాలన



గాజువాక, జూన్ 23, ప్రభాతవార్త :

దేశ సమగ్రత కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగానే ప్రధాని నరేంద్ర మోదీ పాలన సాగిస్తున్నారని బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు పేర్కొన్నారు. పాత కర్ణవానిపాలెంలోని పార్టీ కార్యా లయంలో ముఖర్జీ 'బలిదాన్ దివాస్' సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ.. 'ఒకే దేశం, ఒకే చట్టం, ఒకే రాజ్యాంగం' కోసం ముఖర్జీ పోరాడారన్నారు. 33 ఏళ్లకే కలకత్తా వర్సిటీ వీసీగా పనిచేసిన ఆయన, 1951లో స్థాపించిన 'జనసంఘ్' పార్టీయే నేడు బీజేపీగా రూపాంతరం చెందిందన్నారు. కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే ఆర్టికల్ 370ని ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకించారని, ప్రధాని మోదీ దానిని రద్దు చేసి ఆయన ఆశయాలను నెరవేర్చారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జి.శంకరరావు, బి.యాళ్లజీ, దిలీప్, యువశ్రీ, కట్టా పద్మ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో రెండుకోట్ల 50 లక్షలతో పలు చెరువుల అభివృద్ధి



పద్మనాభం,జూన్ 23, ప్రభాతవార్త :

భీమిలి నియోజకవర్గంలో పలు సాగునీటి చెరువులు అభివృద్ధికి ఒ అండ్ ఎం పథకం నిధులు రెండు కోట్ల ఏభై లక్షల రూపా యల విడుదలైనట్లు సాగు నీటి శాఖ ఏ.ఈ. విజయ కుమార్ చెప్పారు. ఈ విధులతో చెరువుల చప్టాలు, మదుంలు, చిన్నతరహా ఆనకట్టులను మరమ్మత్తులు చేస్తారని ఆయన అన్నారు.ఆనందపురం మండలంలో పలు గ్రామాలలో ఉన్న తొమ్మిది చెరువులకు 89 లక్షల 65 వేలు, భీమిలి మండలంలో ఐదు చెరువులకు 29 లక్షలు,పద్మనాభం మండలంలో పొట్నూరు గవరరాజు చెరువుకి 9 లక్షల,ఏభై వేలు, నూకాంబిక చెరువుకి ఐదు లక్షలు, మద్దిరాజువెంకటపతిరాజు చెరువుకి 9లక్షల 90 వేలు, పెంట గ్రామ గుండం చెరువుకి ఆరు లక్షలు,పాండ్రంగి కాటమయ్య చెరువుకి 9 లక్షల, 95 వేలు, బి తాళ్లవలస పెద్ద చెరువుకి 9 లక్షలు, కృష్ణాపురం సాగునీటి కాలువ ఆనకట్టుకి 25 లక్షలు, కుర్రపల్లి కాలువ ఆనకట్టుకి 30 లక్షలు,మద్ది దివాన్జీ కాలువకి 15 లక్షలు విడుదలైనట్లు ఆయన అన్నారు

# భూములిచ్చిన 520 మందికి న్యాయం చేయాలని తర్లువాడ రైతులవినతి

### సానుకూలంగా స్పందించిన డిప్యూటీ స్పీకర్

ఆనందపురం, జూన్ 23, ప్రభాతవార్త:



గూగుల్ డేటా సెంటర్ కు భూములిచ్చిన తమకు న్యాయం చేయాలని తర్లువాడకు చెందిన రైతులు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజును కోరారు. పిటిషన్స్ కమిటీ సమావేశం కోసం మంగళవారం జిల్లా కలెక్టరేట్ కు వచ్చిన ఆయన్ను కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్న సీఎం చంద్రబాబుపై గౌరవంతో తర్లువాడ సర్వే నెంబర్ 1 లో 100 ఎకరాలు ఇచ్చామన్నారు. భూసేకరణ సమయంలో సర్క్యూట్ హౌస్ లో నిర్వహించిన సమావేశంలో 520 మందికి మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇస్తామని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ఆర్డీఓ, ఎమ్మార్వో లు హామీ ఇవ్వడం వల్ల తమ స్వాధీనంలోని భూములను అప్పగించామని తెలిపారు. 2020-21 లో ఒక సెంటు ఇళ్ల స్థలాల పూలింగ్ కోసం తీసుకోవడానికి వైసీపీ ప్రభుత్వం ప్రయత్నించగా తాము అంగీకరించలేదని, కోర్టులో 11207/ 2020 నెంబరుతో కేసు వేశామని వివరించారు. 200 ఎకరాల్లో గ్రావెల్ క్వారీ కోసం డీఆర్ఓ ప్రజాభిప్రాయ సేకరణ చేసినప్పుడు కూడా 520 మంది వ్యతిరేకించి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించామని చెప్పారు. డి పట్టాలున్న వారికి 20 శాతం నివేశన స్థలం, 20 ~ 25 సైజు షాపులు, కుటుంబానికి ఒక ఉద్యోగం చొప్పున ఇస్తామన్న హామీలు ఇంకా నెరవేరలేదని పేర్కొన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రఘు రామకృష్ణంరాజు వారికి హామీ ఇచ్చారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, తర్లువాడ మాజీ సర్పంచులు బి.ఆర్.బి. నాయుడు, బాలి అయ్యప్ప, జనసేన జిల్లా కార్యదర్శి మజ్జి శ్రీను, కోరాడ ఆదినారాయణ, బంకు రాజు, కన్నయ్య, బాలి వెంకటరాజు తదితరులు ఉన్నారు.

# పూర్లవాని చెరువుకు రూ.49 లక్షలతో సరికొత్త సొబగులు

- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎమ్మెల్యే గంటా
- వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్క్, సోలార్ లైట్లు ఏర్పాటు
- ఆహ్లాదకర విహార కేంద్రంగా రూపుదిద్దుకుంటున్న చెరువు
- చురుగ్గా సాగుతున్న అభివృద్ధి పనులు

ఆనందపురం, జూన్ 23, ప్రభాతవార్త:



మండలంలోని ఆనందపురం పూర్లవాని చెరువు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అమృత్ సరోవర్ మిషన్, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) నిధుల సమన్వయంతో, వాటర్‌షెడ్ ఆధ్వర్యంలో సరికొత్త హంగులతో అభివృద్ధి చెందుతోంది. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని పనులు ప్రారంభించారు. ఇందుకోసం రూ.49 లక్షలు కేటాయించగా, పనులు ప్రస్తుతం వేగంగా కొనసాగుతున్నాయి. ఆనందపురం నుంచి బోని వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ఈ చెరువు చాలా కాలం నుంచి నిరాదరణకు గురైంది. కాగా చెరువును కేవలం నీటి వనరుగా కాకుండా ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే ప్రకృతి విహార కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. చెరువు చుట్టూ ఆధునిక వాకింగ్ ట్రాక్, చిన్నారుల కోసం చిల్డ్రన్స్ పార్క్, సందర్శకులకు విశ్రాంతి స్థలాలు, రాత్రి వేళల్లో వెలుగులు నింపే సోలార్ లైట్లు, పచ్చదనం పెంపు వంటి పనులు చేపడుతున్నారు. అదే సమయంలో చెరువు పూడికతీత, కట్ట బలోపేతం, నీటి నిల్వ సామర్థ్యం పెంపు, వర్షపు నీటి సంరక్షణ వంటి పనులకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో భూగర్భ జలాల పెరుగుదలతో పాటు స్థానిక రైతులకు, గ్రామ ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరనుంది.

గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన ఈ అభివృద్ధి కార్యక్రమం గ్రామానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# దశాబ్దాల నిరీక్షణకు ముగింపు ఎప్పుడు?

### మాన్సాస్, ఇనాం భూముల సమస్యలు పరిష్కరించాలని సబ్ కమిటీకి వినతి

విశాఖపట్నం, జూన్ 23, ప్రభాతవార్త:



తరతరాలుగా సాగు చేస్తున్న భూములకు హక్కులు లేక ఆందోళన చెందుతున్న రైతులకు న్యాయం చేయాలని కోరుతూ భీమిలి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్, మాన్సాస్, ఇనాం, ఇతర భూముల పరిష్కార సబ్ కమిటీ ఛైర్మన్ రఘురామ కృష్ణంరాజును కలిసి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భీమిలి జడ్పీటీసీ సభ్యుడు, డీఎల్‌డీఏ ఛైర్మన్ గాడు వెంకటప్పుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాగవంశం డైరెక్టర్ బోని సూరల సత్య వరప్రసాద్, గ్రామస్తులు కలిసి ఆనందపురం మండలం బోని గ్రామంలోని సుమారు 300 ఎకరాల మాన్సాస్ భూములు, భీమిలి మండలం నారాయణరాజు పేటలోని సుమారు 300 ఎకరాల ఇనాం భూముల సమస్యలను వివరించారు. హక్కులు లేక ఇబ్బందులు పడుతున్నామని, ఏళ్ల తరబడి ఈ భూములను సాగు చేస్తూ కుటుంబాలను పోషిస్తున్న రైతులకు పూర్తి స్థాయి హక్కులు లేకపోవడంతో బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడంలోనూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, భూమిపై స్పష్టమైన హక్కులు లేకపోవడంతో భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొని, రైతు కుటుంబాలు మానసిక ఆందోళనకు గురవుతున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. రైతులకు న్యాయం చేయాలని మాన్సాస్, ఇనాం భూముల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి, సాగు చేస్తున్న రైతులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని ప్రతినిధులు కమిటీని కోరారు. దీంతో వందలాది రైతు కుటుంబాలకు భరోసా లభించడంతో పాటు వారి జీవనోపాధికి భద్రత ఏర్పడుతుందని వివరించారు.

### సానుకూలంగా స్పందించిన కమిటీ

రైతుల సమస్యలను ఓపికగా విన్న సబ్ కమిటీ ఛైర్మన్ రఘురామ కృష్ణంరాజు సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించినట్లు ప్రతినిధులు తెలిపారు. రైతుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# ఘనంగా కుంచమాంబ అమ్మవారి పండుగ

మాధవధార జూన్ 23, ప్రభాతవార్త:



మాధవధార గ్రామదేవత అయినా శ్రీ కుంచమాంబ పండగ మంగళవారం ఘనంగా నేర్వహించారు.ఈ సందర్భంగా పండగ కమిటీ ఛైర్మన్ సనపల వరప్రసాద్ మాట్లాడుతూ మాధవధార శతకం పట్టి వద్ద అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మంచి నీరు, ప్రసాదాలు పంపిణి చేసినట్టు తెలియజేశారు. పండగకు సహకరించిన దాతలకు సత్కారించినట్లు తెలిపారు అదే విధంగా శ్రీ మాధవ యువజన సమాజం ఆవరణలో క్రేజీ ఈవెంట్స్ ఆధ్వర్యంలో సాంస్కృతిక స్టేజ్ ప్రోగ్రామ్ నిర్వహించినట్లు తెలియజేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎయిర్పోర్ట్ సిఐ శంకరనారాయణ సుమారు 100 మంది పోలీసులుతో బందోబస్తు ఏర్పాటు చేశారు. అదేవిధంగా విద్యుత్ కాంతులతో మాధవధార గ్రామం అంతా పండగ వాతావరణం నెలకొంది. అదేవిధంగా విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఈస్ట్ గోదావరి, వెస్ట్ గోదావరి నుంచి అనేక సంఖ్యలో ప్రజలు అమ్మవార్లను దర్శించుకునారు . అదేవిధంగా ఈనెల 30వ తేదీ మంగళవారం మారువారం, వచ్చే నెల రెండవ తేదీన కనక మహాలక్ష్మి అమ్మవారి పండుగ మరియు 5వ తేదీన పండుగలతో ముగుస్తాయని తెలియజేశారు. ఈ అవకాశాన్ని భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ మాధవ యువజన సమాజం పండగ కమిటీ సభ్యులు పూజారి ఉదయ్ కుమార్, కంచరాన రమేష్ కుమార్, సనపల ఈశ్వరరావు, సనపల నాగ చంద్రుడు, సనపల ఉమాపతి, పప్పల గౌరీశ్వరరావు, సనపల గోవిందరాజు, పైడి పుణ్యవతి, గ్రామ పెద్దలు పూజారి,మధుసూదన రావు, కే సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



# మూర్తీభవించిన జాతీయ సమైక్యతా వాది డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ

విశాఖపట్నం, జూన్ 23, ప్రభాతవార్త :



డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పేరు వినగానే దేశభక్తి, సిద్ధాంత నిబద్ధత, జాతీయ సమైక్యత మనకు గుర్తుకు వస్తాయని, ఈరోజు బీజేపీ పార్టీ ఆఫీసులో దేశ సమగ్రత కోసం, ఒకే పరిపాలనా విధానం కోసం పోరాడిన మహనీయుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అస్తమించిన బలిదాన్ దివస్ రోజున ఆయనకు బీజేపీ జిల్లా అధ్యక్షులు పరశురామరాజు , సురేంద్ర మోహన్, రవిరాజు, బొత్స సురేష్ తదితరులు పాల్గొని ఆ మహనీయునికి ఘన నివాళులర్పించారు. ఆ మహనీయునికి నివాళులు అర్పించిన అనంతరం బీజేపీ జనతా వారధి కో కన్వీనర్ మూల వెంకటరావు మీడియాతో మాట్లాడుతూ 1943లో బెంగాల్ లో సంభవించిన భయంకర కరువులో లక్షలాది ప్రజల ఆకలి, పోషకాహార లోపంతో ప్రాణాలు కోల్పోయినప్పుడు బ్రిటీష్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ప్రశ్నించిన నాయకుడు ఆయన అని అన్నారు. దేశ సమైక్యతకు, జాతీయ ప్రయోజనాలకు జాతీయవాదమే సరైన మార్గమని ఆయన విశ్వసించే వారని తెలిపారు. 1940లో రాజ్యాంగ సభ సభ్యునిగా భారత రాజ్యాంగ రూపకల్పనలో పాల్గొన్నారని, స్వతంత్ర భారతదేశ తొలి పారిశ్రామిక విధాన రూపకల్పనలో కీలక పాత్ర పోషించారన్నారు. ప్రముఖ కమ్యూనిస్ట్ నాయకుడు వీరేన్ ముఖర్జీ వంటి నాయకుల పట్ల శ్రద్ధా శక్తులు కనబరిచేవారు అన్నారు. డాక్టర్ ముఖర్జీ నాటిన చిన్న విత్తనమే బీజేపీ అనే మహా వృక్షంగా ఎదిగి ఆయన భావజాలాన్ని వ్యాపింపజేసిందన్నారు. ఆర్టికల్ 370 రద్దుతో ముఖర్జీ కన్న ఒక నెరవేరినట్లు అయింది అన్నారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జీవితం మనకు ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుందన్నారు. పద వుల కోసం కాదు, సిద్ధాంతాల కోసం జీవించిన నాయ కులు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారని, ఆయన త్యాగం ఒక వ్యక్తి గాథ కాదు, భారత జాతీయ సమైక్యత కోసం సాగిన ఒక మహా యజ్ఞమని మూల వెంకటరావు అన్నారు. భారత మాతకు అంకితమైన ఆ మహనీయ నికి నాయొక్క వినమ్ర నివాళులు అర్పిస్తున్నానని మూల వెంకటరావు తెలిపారు.

# 'ఈ అసమర్థ కమిషనర్ మాకొద్దు'

### జీవీఎంసీ కమిషనర్‌పై స్టాఫ్ వర్కర్స్ యూనియన్ తీవ్ర విమర్శలు

విశాఖపట్నం, జూన్ 23, ప్రభాతవార్త:



గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)లో అభివృద్ధి పనులు పూర్తిగా కుంటుపడ్డాయని, సిబ్బంది కొరత సమస్యను పరిష్కరించడంలో ప్రస్తుత కమిషనర్ విఫలమయ్యారని జీవీఎంసీ స్టాఫ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వి.వి. వామనరావు తీవ్ర విమర్శలు గుప్పించారు. వెంటనే ప్రస్తుత కమిషనర్‌ను మార్చి ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయి సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం జగదాంబ సమీపంలో వున్న తమ నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే అతిపెద్ద కార్పొరేషన్ అయిన జీవీఎంసీకి అవసరమైన నిధులు, వనరులు, సిబ్బంది నియామకాలు తీసుకురావడంలో కమిషనర్ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఏడాది కాలంగా అభివృద్ధి పనులు ముందుకు సాగకపోయినా విజయోత్స వాలు చేసుకోవడం ఆశ్చర్యకరమన్నారు. జీవీఎంసీలో అన్ని విభాగాల్లో తీవ్ర సిబ్బంది కొరత ఉందని, ప్రభుత్వం వద్ద ప్రతిపాదనలు పెట్టి కొత్త నియామకాలు చేపట్టడంలో కమిషనర్ చొరవ చూపలేదని విమర్శించారు. ఫలితంగా ప్రజలకు అందాల్సిన సేవలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. వార్డుల్లో కనీసం 40 శాతం అభివృద్ధి పనులు కూడా జరగడం లేదని, వీధి దీపాల నిర్వహణకు సరిపడా సిబ్బంది లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న వార్డులకు అనుగుణంగా ఉద్యోగులు లేకపోవడంతో పనులు సక్రమంగా నిర్వహించలేకపోతున్నామని చెప్పారు. జీవీఎంసీలో మొత్తం 4,742 పోస్టులు మంజూరై ఉండగా ప్రస్తుతం కేవలం 2,054 మంది మాత్రమే పనిచేస్తున్నారని, ఈ నెలలో మరో 56 మంది పదవీ విరమణ చేయనున్నారని తెలిపారు. ప్రజారోగ్య విభాగంలో వేలాది ఖాళీలు, నీటి సరఫరా విభాగంలో వందలాది పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటి భర్తీపై చర్యలు కనిపించడం లేదన్నారు. కమిషనర్ ఏకపక్ష నిర్ణయాలతో ఉద్యోగులు, కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించిన వామనరావు, ఆయనపై వినిపిస్తున్న అవినీతి ఆరోపణలపై ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. "విశాఖ అభివృద్ధిపై ప్రభుత్వానికి నిజమైన చిత్తశుద్ధి ఉంటే వెంటనే ప్రస్తుత కమిషనర్‌ను మార్చి సమర్థవంతమైన సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించాలి" అని ఆయన స్పష్టం చేశారు.

## ఎల్లయ్యమ్మ వర్ధంతి వేడుకలు



గాజువాక, జూన్ 23, ప్రభాతవార్త :

పెందుర్తి మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ గుడివాడ అప్పన్న సతీమణి, మాజీ మంత్రి స్వర్గీయ గురునాధరావు మాతృమూర్తి అయిన స్వర్గీయ గుడివాడ ఎల్లయ్యమ్మ 5వ వర్ధంతి వేడుకలు మంగళవారం మింది గ్రామం జీవీఎంసీ 68వ వార్డులో ఘనంగా జరిగాయి. మిందిలోని గుడివాడ అప్పన్న మెమోరియల్ పార్కు ఆవరణలో ఉన్న ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గుడివాడ అప్పన్న మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ గుడివాడ అప్పల రామ్మూర్తి, వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్‌లు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎల్లయ్యమ్మ కుటుంబానికి, సమాజానికి అందించిన సేవలు, విలువలు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్‌నాథ్ నానమ్మ అయిన ఎల్లయ్యమ్మను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులు, వైకాపా నాయకులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని అంజలి ఘటించారు.

## ఉపాధి కూలీలకు బిరియానీ, భోజనం క్యారియర్లు పంపిణీ



పద్మనాభం, జూన్23, ప్రభాతవార్త :

మండలంలో రేవిడి గ్రామంలో ఉన్న యానాద్రి చెరువులో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు మంగళవారం మాజీ సర్పంచ్ సారిక అప్పన్న జ్ఞాపకార్థం స్థానిక శ్రీనివాస యువజన సంఘం ఆధ్వర్యంలో బిరియానీ ప్యాకెట్లు,భోజనం క్యారియర్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆర్మీలో ఉద్యోగం చేస్తున్న సారిక అప్పన్న కుమారులు రామానాయుడు, నర్సింహునాయుడు, పోతురాజులు సుమారు 500 మందికి బిరియానీ ప్యాకెట్లు, క్యారియర్లు పంపిణీ చేసారు. దీనిపై కూలీలు వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో కోర్టు సంచలన తీర్పు

విశాఖపట్నం, జూన్ 23 ప్రభాతవార్త

మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో విశాఖ పోక్సో కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది, కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో, ముద్దాయి అయిన కోన సునీల్ కి జీవితకాల కఠిన కారాగార శిక్ష, రూ. 50,000 జరిమానా, అందులో రూ.10,000/- ప్రభుత్వానికి, రూ.40,000/- బాధితురాలికి నష్ట పరిహారంగా ఇవ్వాలని, ప్రభుత్వం తరపున బాధితురాలికి రూ.2,00,000/- నష్ట పరిహారంగా ఇవ్వాలని సంచలన తీర్పు ఇచ్చింది. పోక్సో కోర్టు. ముద్దాయికి శిక్ష పడేవిధంగా కృషి చేసిన అధికారులకు పోలీస్ కమిషనర్ కు డా. శంఖబ్రత బాగ్చి అభినందించారు.

## తప్పిపోయిన వృద్ధుడి కోసం కుటుంబ సభ్యుల ఆందోళన

### చికిత్స పొందుతూ కెజీహెచ్ నుంచి పరారీ

విశాఖపట్నం, జూన్ 23, ప్రభాత వార్త :



తూర్పు గోదావరి జిల్లా తుని సమీపంలోని సూరవరం గ్రామానికి చెందిన అడపా అప్పారావు (70) సోమవారం రాత్రి విశాఖపట్నంలో కనిపించకుండా పోయారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తీసుకువచ్చారు. సోమవారం రాత్రి సుమారు 8 గంటలకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం ఆసుపత్రి పరిసర ప్రాంతాలు, సమీప ప్రాంతాల్లో ఎంతగానో గాలించినప్పటికీ ఆయన ఆచూకీ లభించలేదు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు విశాఖ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశారు. పోలీసులు కేసు నమోదు చేసి వృద్ధుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం. అడపా అప్పారావు ఆచూకీ తెలిసిన వారు లేదా ఎక్కడైనా కనిపించినట్లయితే వెంటనే 9989606634, 6304696803 నంబర్లకు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

## మత్తుకు చెక్.. భవితకు భరోసా!

### డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించిన ఎస్ఎఫ్ఐ

ఎలమంచిలి, జూన్ 23, ప్రభాతవార్త




యువత వ్యసనాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును బలిచేసుకోవద్దని స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) నాయకులు పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువతలో చైతన్యం తీసుకు రావాలనే లక్ష్యంతో మంగళవారం పట్టణం లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.బాలాజీ పాల్గొని మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాల వినియోగం నేటి యువత పాలిట శాపంగా మారిందన్నారు. వీటి బారిన పడితే శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు చదువు, కుటుంబ సంబంధాలు కూడా తీవ్రంగా దెబ్బతింటాయని హెచ్చరించారు. విద్యార్థులు చెడు స్నేహాలు, దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. యువత తమ దృష్టిని క్రీడలు, ఉన్నత విద్యాభ్యాసం, సామాజిక సేవా కార్యక్రమాల వైపు మళ్లించి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. మరోవైపు, సమాజంలో మత్తు పదార్థాల మూలాలను పెకిలించేందుకు ప్రభుత్వం, పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదం మోపడంతో పాటు, విద్యాసంస్థల్లో వీటి నిర్మూలనపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరుతూ చేపట్టిన ఈ ర్యాలీలో ఎస్ఎఫ్ఐ నాయకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, స్థానిక యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల మహమ్మారిపై సమరశంఖం..

### పట్టణంలో భారీ ర్యాలీ..

ఎలమంచిలి, జూన్ 23, ప్రభాతవార్త




మాదకద్రవ్యాల మహమ్మారిని తరిమి కొట్టి, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా పట్టణంలో మంగళవారం భారీ యాంటీ డ్రగ్స్ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, పోలీసు యంత్రాంగం సంయుక్తంగా ఈ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు నుంచి దిమిలి రోడ్డు జంక్షన్ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. దారిపొడవునా విద్యార్థులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు చేతబూని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్సై సావిత్రి మాట్లాడుతూ దేశ భవిష్యత్తుగా నిలవాల్సిన నేటి యువత ఇలాంటి మత్తు పదార్థాల బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను చేరుకునే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించాలంటే కేవలం పోలీసుల చర్యలే సరిపోవని, ప్రతి ఒక్క పౌరుడూ సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. ఈ భారీ అవగాహన ర్యాలీలో ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ, రూరల్ ఎస్సై ఉపేంద్ర, పోలీసు సిబ్బంది, వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు సంఖ్యలో పాల్గొన్నారు.

## సహకార రంగ బలోపేతమే లక్ష్యం..

### దిమిలి పీఏసీఎస్ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే విజయ్ కుమార్

ఎలమంచిలి, జూన్ 23, ప్రభాతవార్త



నియోజకవర్గం రాంబిల్లి మండలంలోని దిమిలి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రత్యేక కార్యక్రమానికి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు దిమిలి పీఏసీఎస్ అధ్యక్షులు కోన తాతారావు, ఇతర పాలకవర్గ సభ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయనను పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి తమ ఆత్మీయతను చాటుకున్నారు. పీఏసీఎస్ అధ్యక్షులు కోన తాతారావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, గ్రామాభివృద్ధితో పాటు సహకార రంగాన్ని బలోపేతం చేసే దిశగా ఎమ్మెల్యే విజయ్‌కుమార్ చేస్తున్న నిరంతర కృషి ఎంతో అభినందనీయమని కొనియాడారు. అనంతరం సమావేశంలో పలు కీలక అంశాలపై ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా దిమిలి పరిధిలోని స్థానిక సమస్యల పరిష్కారం, గ్రామంలో త్వరలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు రాబోయే రోజుల్లో సహకార సంఘం ద్వారా రైతులకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు అనుసరించాల్సిన భవిష్యత్ కార్యాచరణపై సమాలోచనలు జరిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా సాగిన ఈ ఆత్మీయ సమావేశంలో పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు, స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ఒలింపిక్ క్రీడా దినోత్సవం

అనకాపల్లి జూన్ 23, ప్రభాతవార్త



స్థానిక ఏఎంఏఎల్ కళాశాల ప్రాంగణంలో అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో భారతదేశ ఒలింపిక్ క్రీడాకారుడు ధ్యాన్చంద్ విగ్రహానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏఎంఏఎల్ కళాశాల ప్రిన్సిపల్ బొత్స సాగర్ ఒలింపిక్ క్రీడాకారుల పద్మభూషణ్ అవార్డు ధ్యాన్చంద్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ డివిఎంసి సభ్యులు రేబాక మధుబాబు, పీసీ సుధాకర్, పిటి మాస్టర్ కొణతాల స్వామి నాయుడు, ఆదారి సూకినాయుడు, బి.ఎం నాయుడు, పెంటకోట సాగర్, ఏఎంఏఎల్ కళాశాల విద్యార్థి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి

గొలుగొండ జూన్ 23 ప్రభాతవార్త



ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి అకస్మాత్తుగా ప్రమాదానికి గురై ఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు అందించిన వివరాలు ప్రకారం అమ్మపేట గ్రామం నుండి గొలుగొండ వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న చుక్కల సత్యనారాయణ(52) గొలుగొండ కాలనీ సమీప మలుపు వద్ద బైకు అదుపుతప్పి పక్కనున్న పాకలోకి దూసుకుపోయింది.ఈ ప్రమాదంలో సత్యనారాయణ సంఘటన స్థలంలోనే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి రామారావు తెలిపారు.

## చేతి బోర్లు వద్ద పారిశుధ్యం పనులు


గొలుగొండ జూన్ 23 ప్రభాతవార్త



తాగునీరు అందించే చేతి బోర్లు వద్ద చేపట్టారు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గొలుగొండ పంచాయతీ శివారు కొత్త జోగం పేటలో ఉన్న చేతి బోర్లు వద్ద మంగళవారం పారిశుద్ధ్య కార్మికులు పరిసరాలను శుభ్రం చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు అపరిశుభ్రం పేరుకుపోవడంతో తాగునీరు బోర్లు వద్ద వ్యర్థాలను తొలగించి పిచ్చి మొక్కలను తొలగించారు. తాగునీరు ఇబ్బంది లేకుండా గ్రామాల్లో ఉన్న చేతి పంపులన్నీ ఎప్పటికప్పుడు మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు తెలిపారు.

## ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములకు రక్షణ కల్పించాలి

గొలుగొండ జూన్ 23 ప్రభాతవార్త



మండలంలో పప్పుశెట్టిపాలెం రెవిన్యూ పరిధిలో అడ్డలోవ శుద్ధలపాలం ఆదివాసీలు పూర్వం నుండి సాగు చేసుకుంటున్న భూములకు రక్షణ కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. నుండి 140 ఎకరాలు ఐటీడీఏ ఇచ్చిన జీడి మామిడి మొక్కలు వేసుకొని సాగు చేస్తూ మూడు తరాల నుండి జీవన ఉపాధి సాగిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి వెంకన్న కులవృక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి అనకాపల్లి జిల్లా కలెక్టర్ వద్ద నిరసన తెలియజేస్తున్న ఆదివాసులకు మద్దతు ఇచ్చారు అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు వారు మాట్లాడుతూ ఆదివాసీలు ఎప్పటినుండ సాగు చేసుకుంటున్న భూములు ఎవరో తూర్పుగోదావరి జిల్లా నుండి వచ్చి భూములు ఖాళీ చేయమని భయ ఆందోళనకు గురి చేస్తున్నారని అన్నారు ఆదివాసీలకి న్యాయం చేయాలని ఆదివాసులకు భూములకు రక్షణ కల్పించాలని వాళ్ళు సాగు చేసుకుంటున్నా భూములకు సాగుబడి నమోదు చేయాలని డిమాండ్ చేశారు. శుద్ధ పాలెం అడ్డలోవా ఆదివాసీలకు అన్యాయం జరిగితే ఊరుకునే ప్రసక్తి లేదని జిల్లా వ్యాప్తంగా పెద్ద ఆందోళన చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో మల్లేష్ ధర్నా స్వామి అధిక సంఖ్యలో ఆదివాసులు పాల్గొన్నారు.

## పెదపాడు పీఏసీఎస్‌కు నూతన భవనం

### రూ.40 లక్షలు మంజూరు

అచ్యుతాపురం జూన్ 23 ప్రభాతవార్త



అచ్యుతాపురం మండలం పెదపాడు గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)కు చెందిన ఖాళీ స్థలాన్ని ఉమ్మడి విశాఖ జిల్లా డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు పరిశీలించారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సహకారంతో ఈ పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘానికి నూతన భవనం నిర్మించాలని అధికారులను ఆదేశించిన కోన తాతారావు, భవన నిర్మాణం కోసం రూ.40 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. ఈ సహకార సంఘం పరిధిలోని గ్రామాల రైతులకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు జనపరెడ్డి శ్రీనివాసరావు, పెదపాడు పీఏసీఎస్ చైర్మన్ జనపరెడ్డి అప్పల ఆదినారాయణ, అచ్యుతాపురం మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు పీలా తులసీరామ్, సెంట్రల్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ హ్యాండ్‌బాల్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ

### పాల్గొన్న రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుందరపు విజయ్‌కుమార్

అచ్యుతాపురం, జూన్ 23, ప్రభాతవార్త




విశాఖపట్నం జిల్లా జీవీఎంసీ మున్సిపల్ స్టేడియంలో వైజాగ్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ హ్యాండ్‌బాల్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి ఎమ్మెల్యే, రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుందరపు విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ సింహాద్రి గోపీకృష్ణ, జీవీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ అప్పలరాజు, హ్యాండ్‌బాల్ సీనియర్ క్రీడాకారుడు కరుణకుమార్ తదితరులు హాజరయ్యారు. వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించగా, వివిధ స్థాయిల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎమ్మెల్యే సత్కరించారు. అనంతరం క్రీడాకారులకు టీ-షర్ట్ సెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. హ్యాండ్‌బాల్ వంటి జట్టు క్రీడలు పరస్పర సహకారం, సమన్వయ భావనను పెంచుతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే సామర్థ్యం కలిగి ఉన్నారని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం, శిక్షణ, మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ క్రీడాకారులకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని చెప్పారు. యువత క్రీడలను తమ జీవితంలో భాగంగా చేసుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని సూచించారు. ప్రపంచ హ్యాండ్‌బాల్ దినోత్సవం సందర్భంగా క్రీడాస్ఫూర్తిని మరింతగా పెంపొందించుకొని భవిష్యత్తులో మరింత మంది క్రీడాకారులు దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వరహాలరావు, చందు, రాజు, హ్యాండ్‌బాల్ సంఘం ప్రతినిధులు, కోచ్‌లు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## టీడీఆర్ బాండ్లు వద్దు.. నగదు పరిహారమే ఇవ్వాలి

### వీఎంఆర్‌డీఏ చైర్మన్‌కు నిర్వాసితుల వినతి

అచ్యుతాపురం, జూన్ 23, ప్రభాతవార్త




అనకాపల్లి జిల్లా ప్రజాదర్బార్ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్‌కు అనకాపల్లి-అచ్యుతాపురం రహదారి విస్తరణ నిర్వాసితుల సంక్షేమ సంఘం ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. రోడ్డు విస్తరణ కారణంగా భూములు కోల్పోతున్న నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు కాకుండా నగదు రూపంలోనే నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల రామ సదాశివరావు మాట్లాడుతూ 2023లో రాష్ట్ర ప్రభుత్వం తరపున కలెక్టర్, ఆర్డీవో నిర్వాసితులతో గ్రామసభలు నిర్వహించి పునర్వాసం కల్పిస్తామని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నగదు రూపంలో పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఆ హామీలను విశ్వసించి నిర్వాసితులు ప్రభుత్వ నిర్ణయానికి అంగీకరించారని చెప్పారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిర్వాసితులతో ఎలాంటి చర్చలు జరపకుండా వీఎంఆర్‌డీఏ పరిధిలో టీడీఆర్ బాండ్లు ఇస్తామని ఏకపక్షంగా ప్రకటించడంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. చట్టబద్ధత లేని టీడీఆర్ బాండ్లు తమకు అవసరం లేదని ప్రభుత్వం నిర్వహించిన గ్రామస్థాయి అవగాహన సదస్సుల్లో నిర్వాసితులందరూ స్పష్టం చేశారని పేర్కొన్నారు. టీడీఆర్ బాండ్ల విధానాన్ని రద్దు చేసి, 2013 భూ సేకరణ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తూ నిర్వాసితులకు నగదు రూపంలో పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.బ్రహ్మాజీ, కె. సోమునాయుడు, కె. బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## టేకు చెట్లు వివాదంలో కేసు నమోదు

గొలుగొండ జూన్ 23, ప్రభాతవార్త



కొత్త మల్లంపేట రెవెన్యూ పరిధిలో టేకు చెట్లు నరికివేతపై అందిన ఫిర్యాదు తో ఎస్సై పి రామారావు మంగళవారం విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారు రెడ్డిపల్లి ఫణికుమారి తన భూమిలో టేకు చెట్లు అక్రమంగా నరికేశారు అంటూ గత వారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు పై మంగళవారం ఎస్సై ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అయితే ఈ టేకు చెట్లు అమ్మకానికి నాలుగు నెలల క్రితం 416/1లో అనుమతి కోసం పండా సుధారాణి దరఖాస్తు చేశారు. కొనుగోలుదారుడు పోతల వెంకునాయుడు తాము కొనుగోలు చేసిన చెట్లకు 416/1ట్లో అనుమతులు పొందాడు. ఈ చెట్లను అనుమతి వచ్చిన వెంటనే నరకడం కూడా జరిగింది. 31 చెట్లు అక్రమంగా నరికారు అంటూ రెడ్డి పల్లి పని కుమారి ఫిర్యాదు చేశారు. తను వాటా 425 సర్వే నెంబర్లు ఈ చెట్లు ఉన్నాయని విచారణ చేసి తమకు న్యాయం చేయాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి చెట్లు 425 సర్వేనెంబర్‌లో ఉన్నట్లు నట్లు నిర్ధారించారని పని కుమార్ తెలిపారు. 416/1లో చెట్లు లేవని నిర్ధారణ కావడంతో ప్రస్తుతం విచారణలో కొనసాగుతుంది. పోలీసులకు అందిన ఫిర్యాదుపై అక్రమంగా చీట్లు నరికినట్లు నిర్ధారణ కావడంతో కొనుగోలుదారుడైన పోతల వెంకు నాయుడు, అమ్మకం అమ్మకందారు పండా సుధారాణిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ తెలిపారు.

## ట్రాక్టర్ ను ఢీ-కొట్టిన కారు.. ఐదుకి తీవ్ర గాయాలు

(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త )







మండలంలోని నక్కపల్లి వారపు సంత సమీపాన వున్న హైవేపై మంగళవారం ఉదయం జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ను ఢీకొట్టిన కారు గాలిలో మూడు పల్టీలు కొట్టింది. ఈ మేరకు సీఐ జె.మురళీ తెలిపిన వివరాలివి. ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధి మంత్రిపాలెం గ్రామానికి చెందిదుంగా అప్పలస్వామి ట్రాక్టర్ ఇంజన్తో పాయకరావుపేట వెళ్తుండగా, అదే రహదారిలో కొత్తవలస నుంచి ద్రాక్షారామం వెళ్తున్న కారును, డ్రైవర్ నిర్లక్ష్యంగా వేగంగా నడపంతో ట్రాక్టర్ ఇంజన్ ను ఢీకొట్టిందని చెప్పారు. కారు గాలిలో మూడు పల్టీలు కొట్టినట్టు స్థానికులు చెప్పారు. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న అప్పలస్వామి రోడ్డుపై తూలిపడిపోవడంతో గాయపడ్డాడని పోలీసులు చెప్పారు. కారులో వున్న గెద్దాడ పద్మావతి వీపు, వెన్నుముకకు తీవ్రగాయాలయ్యాయని (61), అదే కారులో వున్న గెద్దాడ రాజ్కుమార్, వారి మనుమడు సాయి శరణ్, డ్రైవర్కు గాయాలుకాలేదని చెప్పారు. కారు నడుపుతున్న ప్రవీణ్ (27) అనే యువకుడికి కూడా గాయాలయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్ అప్పల స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ మురళీ చెప్పారు.

## పేటలో ఎక్సైజ్ దాడుల్లో స్వాధీనం చేసిన 6 వాహనాలకు 29న బహిరంగ వేలం

పాయకరావుపేట, జూన్ 23, ప్రభాతవార్త

స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు ఇటీవల నిర్వహించిన వేర్వేరు దాడుల్లో స్వాధీనం చూసుకొన్న 6 వాహనాల బహిరంగ వేలం (పబ్లిక్ ఆక్షన్) ఈనెల 29న దానికి ఎక్సైజ్ స్టేషన్ వద్ద నిర్వహించనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. విశాఖ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు అనకాపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో ఈనెల 29వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ వేలంలో పాల్గొనదలచిన ఆసక్తి గల వ్యక్తులు ముందస్తుగా రూ.3 వేల ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలియజేశారు. వేలం ద్వారా వాహనాన్ని దక్కించుకున్న పాట దారులు నిర్ణయించిన మొత్తాన్ని అదే రోజున 18 శాతం జీఎస్టీ అదనంగా నగదు రూపంలో చెల్లించాల్సి ఉంటుందని సీఐ జి.శ్రీనివాస్ పేర్కొన్నారు.వేలం ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాల కోసం పాయకరావుపేటలో గల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బందిని ముందుగా సంప్రదించాలని ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.

## కొండకర్లలో అక్రమ మద్యం విక్రయాలు.. నిందితుడిపై కేసు నమోదు

అచ్చుతాపురం జూన్ 23 ప్రభాతవార్త



అచ్యుతాపురం మండలం కొండకర్ల గ్రామంలో అనధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు పోలీసులకు అందిన సమాచారంతో అధికారులు దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన గాదం నూకరాజు ఎటువంటి లైసెన్స్ లేకుండా బయట ప్రాంతాల నుంచి మద్యం కొనుగోలు చేసి గ్రామంలో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో అతని వద్ద ఉన్న మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు ఎస్ఐ పోషణ నిందితుడిపై 34 ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## గ్రామీణ బాలికల విద్యకు కొత్త వెలుగు

### రూ.168 లక్షలతో కేజీబీవీ నూతన తరగతి గదుల ప్రారంభం

అచ్చుతాపురం, జూన్ 23, ప్రభాతవార్త



అచ్యుతాపురం మండలం మోసాయిపేట గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో రూ.168.03 లక్షల ప్రభుత్వ నిధులతో నిర్మించిన జూనియర్ కళాశాల విద్యార్థినుల నూతన తరగతి గదుల భవనాన్ని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే మెరుగైన మౌలిక సదుపాయాలు అత్యవసరమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థినులు కూడా పట్టణ ప్రాంతాల విద్యార్థులతో సమానంగా విద్యాభ్యాసం కొనసాగించేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. నూతన తరగతి గదుల ద్వారా విద్యార్థినులకు మరింత సౌకర్యవంతమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం లభిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే చెప్పారు. పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని వివరించారు. బాలికల విద్యాభివృద్ధి సమాజ పురోగతికి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్న ఆయన, విద్యార్థినులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. తమ కుటుంబానికి, ప్రాంతానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల మత్తులో పడి యువత భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు

### పేట పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం వినోద్ బాబు విజ్ఞప్తి

పాయకరావుపేట, జూన్ 23, ప్రభాతవార్త




ఆరోగ్యానికి హానికరమైన మాదకద్రవ్యాల మత్తులో పడి యువత భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని స్థానిక పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎంవినోద్ బాబు విజ్ఞప్తి చేశారు. డ్రగ్ ఫ్రీ అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన పట్టణంలోని ఇందిరా కాలనీలో గంజాయి మహమ్మారి బారిన పడకుండా ఉండేందుకు వీలుగా యువత,విద్యార్థులతో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ మాట్లాడుతూ యువత భవితకు చేటు చేకూర్చే గంజాయి వంటి మత్తుపదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యానికి హాని కలిగించే మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక,మానసిక ఆరోగ్య నష్టాలు వాటి వల్ల కుటుంబాలు ఎలా రోడ్డున పడతున్నాయనే దానిమీద సిఐ వినోద్ బాబు కాలనీ వాసులకు క్షుణ్ణంగా వివరించారు.గంజాయి రవాణా చేసినా, విక్రయించినా లేదా వినియోగించినా చట్టపరంగా ఎదుర్కోవాల్సిన కఠినమైన శిక్షలు, (ఎన్డి.పిఎస్) ఈ చట్టం నిబంధనల వల్ల వ్యక్తిత్వం ఏ విధంగా దెబ్బతింటుంది అనే దానిమీద సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ బాబు వివరించారు. గంజాయి రహిత సమాజ స్థాపన కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని,ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని తమ తమ పరిసరాల్లో ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించినట్లయితే అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ బాబు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియం కేరి మాట్లాడుతూ మానవ ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే మాదకద్రవ్యాల నిర్మూలనకు అంతా కృషి చేయాలని విజ్ఞప్తి చేసారు. పోలీస్ సిబ్బంది సహ టిడిపి నాయకులు బోడపాటి శ్రీను, విద్యార్థులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.


**వార్త VAARTHA CLASSIFIEDS**

**CHANGE OF NAME**

★ I, SHAIK UMARUNNISHA W/O HUSSAIN SHAIK previously called VUMRUNNISA BEGUM SHAIK R/O 24-44-7, AMBUSARANG VEEDHI, OLD POST OFFICE, VISAKHAPATNAM, now changed my name from VUMRUNNISA BEGUM SHAIK to SHAIK UMARUNNISHA. Hence forth I will be called as SHAIK UMARUNNISHA for all purposes.
(Ro.No.11712)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
హోమ్ లోన్ సెంటర్-2 (RACPC-2)
ఎక్సోటికా, హేమా'స్ ట్విన్ టవర్స్, 3వ అంతస్తు, డోర్ నెం. 39-11-76/2/1, బిర్లా జంక్షన్, మురళీనగర్, విశాఖపట్నం-530007.

అధీకృత అధికారి వివరములు: పేరు: శ్రీ. బి. శ్రీనివాసరావు (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. 80966 61316, ఇ-మెయిల్ ఐడి: sbi.18241@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు: 93984 85746.

**ఇ-వేలం అమ్మకము ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) r/w రూల్ 9(1) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి/ఆస్తులను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు భౌతికంగా స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖా పెట్టిన ఆస్తి / ఆస్తుల ఇ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

**ఋణగ్రహీత : 1)** శ్రీ డింగరి సురేష్ కుమార్, తండ్రి : శ్రీ బోపోసింగ్ డింగరి, ఫ్లాట్ నెం. 503, శ్రీ నివాస్, డి.నెం. 31-7-2 దగ్గర, శాతవాహననగర్ దగ్గర, రోడ్ నెం. 5, కూర్మన్నపాలెం, విశాఖపట్నం- 530046. **మరొక చిరునామా:** శ్రీ డింగరి సురేష్ కుమార్, తండ్రి: శ్రీ బోపోసింగ్ డింగరి, 31-11-4/2, కూర్మన్నపాలెం, శాతవాహననగర్, గాజువాక మండలం, దువ్వాడ, విశాఖపట్నం-530046. **2)** శ్రీమతి డింగరి మమతాదేవి, భర్త: శ్రీ డింగరి సురేష్ కుమార్, ఫ్లాట్ నెం. 503, శ్రీ నివాస్, డి.నెం. 31-7-2 దగ్గర, శాతవాహన నగర్, రోడ్ నెం.5, కూర్మన్నపాలెం, విశాఖపట్నం- 530046. **మరొక చిరునామా:** శ్రీమతి డింగరి మమతాదేవి, భర్త: శ్రీ డింగరి సురేష్ కుమార్, 31-11-4/2, శాతవాహనగర్, దువ్వాడ స్టేషన్ రోడ్, కూర్మన్నపాలెం, గాజువాక మండలం, వడ్లపూడి, విశాఖపట్నం-530046.

**డిమాండ్ నోటీసు తేది: 15.10.2025** **డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం:** రూ.68,18,258/-

**ప్రస్తుత బకాయి మొత్తం :** తేది.23.06.2026 నాటికి రూ.72,29,328/- + తేది.24.06.2026 నుండి భవిష్య వడ్డీ మరియు అన్ని ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి (తదుపరి జమలు ఉన్నచో తీసివేయబడును).

**షెడ్యూలు ఆస్తి వివరములు**

విశాఖపట్నం జిల్లా, గాజువాక యొక్క సబ్-జిల్లా, విశాఖపట్నం యొక్క రిజిస్ట్రేషన్ జిల్లా, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ యొక్క పరిధి, కూర్మన్నపాలెం గ్రామం యొక్క సర్వే నెం.124/16 నందు మొత్తం విస్తీర్ణం 1076 చ॥గ॥లులోని విస్తీర్ణం 823.33 చ॥గ॥లుకు సమానమైన 688.413 చ॥మీ॥లులోని అవిభాజ్యమైన మరియు నిర్దిష్టపరచని వాటాతో ఉన్న విస్తీర్ణం 57.173 చ॥గ॥లు లేదా 47.80 చ॥మీ॥లు స్థలంతో శ్రీ నివాస్ యొక్క నాల్గవ అంతస్తులోని ప్లింత్ ఏరియా 1750 చ॥అ॥లుతో (కామన్ ఏరియాలు మరియు బాల్కనీలతో కలిపి) మరియు స్టిల్ట్ ఫ్లోర్ నందు 80 చ॥అ॥ల కార్ పార్కింగ్ ఏరియా కలిగిన రెసిడెన్షియల్ యూనిట్ ఫ్లాట్ నెం.503. **మొత్తం స్థలం హద్దులు : తూర్పు :** M/s. శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ వారికి చెందిన స్థలం మరియు జి.కె. ఆనంద్ గారి మిగిలిన స్థలం, **దక్షిణం :** ఇతరుల ఖాళీ స్థలం, **పడమర :** 30 అ॥ల వెడల్పు రోడ్డు, **ఉత్తరం :** 30 అ॥ల వెడల్పు రోడ్డు. **శ్రీ నివాస్ యొక్క నాల్గవ అంతస్తులోని ఫ్లాట్ నెం.503 హద్దులు : తూర్పు :** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర:** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** మెట్లు మరియు ఓపెన్ డక్ట్.

**రిజర్వు ధర : రూ. 68,00,000/- ధరావత్తు : రూ.6,80,000/- బిడ్ పెంపుదల : రూ. 10,000/-**

**ఇ-వేలం తేది : 09-07-2026, సమయం: ఉ॥ 11:00 గం.ల నుండి సా॥ 04.00 గం.ల వరకు**

**ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది 24-06-2026 నుండి తేది 08-07-2026 వరకు ఉ॥ 10.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు**

**ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు :**

(1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్: www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices లో ఏర్పాటు చేసిన లింకును రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇ.ఎమ్.డి. వేలం వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ ఇ-వేలం పోర్టల్: https://baanknet.com/eauction-psb/bidder-registration & https://www.baanknet.com మరియు టోల్ ఫ్రీ నెంబర్లు +91 - 8291220220, మెయిల్ ఐడి: support.baanknet@psballiance.com ను సంప్రదించండి.


(2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు / అదనపు స్టాంపు డ్యూటీ / బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మొదలగునవి మరియు చట్టపరమైన / నాన్ స్టేట్యూటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, అసెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలుదారే భరించవలెను.

**గమనిక-1:** ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు పిఎస్‌బి అలయన్స్ నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి. మొత్తం మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ బ్యాంక్ అకౌంట్లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరచిన తరువాత మాత్రమే బిడ్డర్ యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు. కావున బిడ్డర్లు చివరి నిమిషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి.ను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలని సూచించడమైనది.

**గమనిక-2:** ఆదాయపు పన్ను చట్టం, 1961 లోని సెక్షన్ 194-1A ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ **రూ. 50,00,000/-** (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నచో సదరు మొత్తముపై TDS @ 1% వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డరు/కొనుగోలుదారు అమ్మకం ధరలో 1% TDS ను తగ్గించుకొని సదరు మొత్తమును ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ యొక్క ఫారం నెం. 16-బి నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజినల్ TDS సర్టిఫికెట్‌ను బ్యాంక్ వారికి సమర్పించవలెను. (వ్యవసాయ భూమి కాకుండా కేవలం స్థిరాస్తికి మాత్రమే వర్తించును).

**తేది: 23.06.2026, ప్రదేశం: విశాఖపట్నం** **సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

శ్రీకాకుళం వార్త



## మెలియాపుట్టుగ పాఠశాల విద్యార్థుల పట్ల రవి ఉదారత



కవిటి, జూన్ 23 ప్రభాతవార్త : మండలం చిన్న మెలియాపుట్టుగ ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థుల పట్ల సోంపేటకు చెందిన పాలిసెట్టి రవి తమ ఉదారతను చాటారు. చిన్న మెలియా పుట్టుగ ఎంపీపీఎస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాలిశెట్టి రవి సుమారు పదివేల రూపాయలు విలువ చేసే నోటు పుస్తకాలు, పెన్నులు, కంపాస్ బాక్సులు, తదితర విద్యాసామాగ్రిని ఎంఈఓలు ధనుంజయ మజ్జి, రామకృష్ణల సమక్షంలో మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒరియా డీఐ డిపి చౌదరి, అపోటా కార్యదర్శి బృందావనం దొర్రై, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవపురియా, శ్రీధర్ ఉపాధ్యాయ సంఘం నాయకులు పాఠశాల కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం పాలిసెట్టి రవికి గ్రామస్తులు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

## ఘనంగా జగన్నాయకులు జయంతి వేడుకలు



కవిటి, జూన్ 23 ప్రభాతవార్త పలాస మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు జుత్తు జగన్నాయకులు జయంతి వేడుకలు మండలం కపాసుకుద్ది గ్రామంలో మంగళవారం ఘనంగా జరిగాయి. కపాసుకుద్ది పంచాయతీ కాపాసుకుద్ది గ్రామంలో మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు 67వ జయంతి వేడుకలు శ్రీకంచి కామాక్షి అగ్నికుల క్షత్రియ సంఘ భవనం వద్ద ఘనంగా నిర్వహించారు. ఆయన ఆశయాలను కొనసాగించి మనమంతా ఐక్యతతో గ్రామాభివృద్ధికి సహకరించాలంటూ కోరారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ జిల్లా ప్రధాన కార్యదర్శి పులకల శ్రీరాములు, సహ కార్యదర్శి కీలు శేఖరునాయుడు పులకల తిరుపతి, తెప్పల కృష్ణారావు, దశ కూర్మారావు, ఢిల్లీరావు, గురుమూర్తి, తులసీదాసులు పాల్గొన్నారు.

## జమున బిసాయికి అండగా మాతృమూర్తి సేవా సంఘం



కవిటి, జూన్ 23 ప్రభాతవార్త మండలం బల్లిపుట్టుగ గ్రామానికి చెందిన నిరుపేద జమున కుటుంబానికి కుసుంపురంనకు చెందిన మాతృమూర్తి యువజన సేవా సంఘం తన ఉదారతను చాటింది. జమున బిసాయికి నెలకు సరిపడే నిత్యావసర సరుకులు అందించే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సురేష్ కార్యదర్శి అసిస్, మోహన్, చలపతి, జగదీష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ తల్లిదండ్రులను సత్కరించిన పాఠశాల సిబ్బంది

### ముగ్గురు కుమార్తెలను ట్రిపుల్ ఐటీ అందించిన తల్లిదండ్రులు

సంతబొమ్మాళి, జూన్ 23 ప్రభాతవార్త



మండలంలోని చెట్లతాండ్ర గ్రామానికి చెందిన చక్క రామారావు, లక్ష్మి దంపతులను దండుగోపాలపురం పాఠశాల సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. తను ముగ్గురు కుమార్తెలు అనిత, సమజ్ఞ, శరణ్య జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల దండుగోపాలపురంలో విద్యాభ్యాసం చేశారు. ముగ్గురు క్రమశిక్షణతో చదివి 2021, 2025, 2026 విద్యా సంవత్సరాలలో 10వతరగతిలో ఉత్తమ మార్కులు పొంది ప్రతిష్టాత్మకమైన ట్రిపులఐటీలో సీట్లు సంపాదించారు. ఈ విధంగా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు కుమార్తెలు ప్రతిష్టాత్మమైన ఐఐటీ లో సీట్లు సంపాదించడం అరుదైన విషయంగా గమనించి మిగతా పిల్లలకు స్ఫూర్తిని కలుగచేయడానికి గాను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థుల సమక్షంలో ఆ తల్లిదండ్రులు రామారావు, లక్ష్మీ దంపతులను జ్ఞాపికను అందజేసి దుశ్శాలువ కప్పి, బహుమతులు ఇచ్చి సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిట్ట గంగన్న మాట్లాడుతూ ఈ ముగ్గురి బాలికల విజయం పాఠశాలకు విద్యార్థులకు గొప్ప స్ఫూర్తినిస్తుందని, ఇటువంటి విజయాలు అరుదుగా జరుగుతుంటాయని ఇటువంటి ఆణిముత్యాలు అయిన విద్యార్థులను మన పాఠశాలలో చేర్పించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరును తెప్పించినందులకు ఆ తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, విద్యార్థులు ఇదేస్ఫూర్తితో పైచదువులలో మరింతగా రాణించి పాఠశాల యొక్క పేరు ప్రఖ్యాతలు మరింతగా ఇనుమడింప చేయాలని కోరారు. విద్యార్థుల తండ్రి రామారావు మాట్లాడుతూ మాపిల్లలను ఇంతచక్కగా క్రమశిక్షణగా విద్యాభ్యాసం గావించిన పాఠశాల ఉపాధ్యాయుల సేవలు ఎన్నటికీ మరువలేనివని మీయొక్క కృషివలనే మాకు ఇది సాధ్యమైందని మీకు ఎప్పటికీ మేము కృతజ్ఞతలుగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, శారదాంబ, అన్నాజీ, జె.శ్రీనివాసరావు, మురళీధరరాజు, రాము, సూర్యప్రకాష్, శ్రీధర్, విజయలక్ష్మి, కె.శ్రీనివాసరావు, లక్ష్మన్నునాయుడు, డి.శ్రీనివాసరావు, దయాసాగర్, శ్రీధర్, మార్కండేయులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## టిడ్కో ఇళ్లు మంజూరు కాని వారికి డిపాజిట్‌లు వాపస్



ఇచ్ఛాపురం, జూన్ 23 ప్రభాతవార్త: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో గతంలో ప్రధానమంత్రి అవాస్ యోజన పథకం కింద టిడ్కో ఇళ్లు అమీన్ సాహెబ్ పేటలో నిర్మించిన సంగతి తెలిసిందే. సుమారు దశాబ్ద కాలంగా ఇళ్ళు కేటాయించలేదు. దీంతో కూటమి ప్రభుత్వం టిడ్కో ఇల్లు మంజూరు కాని వారికి డిపాజిట్‌లు వాపస్ ఇస్తున్నారు. 300, 360, 430 చదరపు గజాల గృహాలు కోసం దరఖాస్తు చేసుకుని డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో డిపాజిట్‌లు చెల్లించి గృహాలు మంజూరు కాని వారికి తిరిగి చెక్కు రూపంలో చెల్లిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ చెప్పారు. వారం లోగా సంబంధిత రసీదులు పత్రాలతో మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## ఘనంగా ప్రారంభమైన అమ్మవారి పునఃప్రతిష్ట మహోత్సవం

కోటబొమ్మాళి, జూన్ 23 ప్రభాతవార్త:



మండలం కొత్తపేటలో గల శ్రీ అసిరితల్లి అమ్మవారి దేవాలయ పునఃప్రతిష్ట మహోత్సవాలు మంగళవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. వందలాది మంది భక్తులు ఉదయానే అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి విగ్రహాలను ఊరేగింపు నిర్వహించి అనంతరం విఘ్నేశ్వర పూజ, కుంకుమపూజలు భక్తులచే ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులంతా ముర్రాటలు పట్టుకొని వెళ్ళి అమ్మవారికి చల్లదనం చేశారు. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్న ప్రసాదం అందజేశారు. అలాగే రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



కంచిలి మండలం ఎంఎస్ పల్లి కొల్లూరు గ్రామం పంచాయతీలో విత్తనాలు పంపిణీ జరిగింది. రామారావు, కిషోర్, సూర్య నారాయణ, రమేష్, శ్రీకాంత్ మణి భాస్కర్ గ్రామం పెద్దలు పాల్గొన్నారు.
ప్రభాతవార్త-కంచిలి

## బీజేపీ ఆధ్వర్యంలో బలిదాన్ దివస్



ఇచ్ఛాపురం, జూన్ 23 ప్రభాతవార్త: జన సంఘ్ వ్యవస్థాపకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన దినోత్సవ సందర్భంగా స్థానిక వీకేపీ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షులు సాలిన ఢిల్లీరావు ఆధ్వర్యంలో అయన ఫోటోకి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి వి.క్రిష్ణ ప్రసాద్, పట్టణ యువమోర్చ అధ్యక్షులు పాలిన రేణు యాదవ్, రత్నాల నారాయణ, పి.శ్రీను, కే.శ్రీను, సిమ్మయ్య, పి.వేణు, ఎన్.ఢిల్లీ, శాడి ధర్మ, ఆనంద్, మొహంతి, ఎల్.వి.రెడ్డి, ఎస్.రామారావు, కే.అది, వాసు రెడ్డి, కేశవ రెడ్డి, భాస్కర్ రెడ్డి, విశ్వనాథ్, కృష్ణవేణి, కేదారనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వి.క్రిష్ణ ప్రసాద్, శ్యామ్ ప్రసాద్ ముఖర్జి జీవిత విషయాలు అందరికి తెలియపరిచారు.

## ఘనంగా పాలపోలమ్మ తల్లి ఉత్సవాలు



కోటబొమ్మాళి, జూన్ 23 ప్రభాతవార్త: మండలం తర్లిపేట గ్రామంలో మంగళవారం గ్రామస్తులు ఘనంగా పాలపోలమ్మ తల్లి ఉత్సవాలను నిర్వహించారు. బంధువులను. ఆడపడుచులతో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షురాలు వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, మాజీ ఎంపీపీ తర్ర రామక్రిష్ణ, మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు బోయిన సత్యశ్రీనివాస్, దేశం నేతలు పట్ట సింహాచలం తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వాడరేవు ముఖలింగం, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## వృద్ధురాలికి రూ 54వేలు ఆర్థిక సహాయం

సంతబొమ్మాళి, జూన్ 23, ప్రభాతవార్త



ఆపదలో ఉన్నవారికి మేము అండగా ఉంటామని పలు సాంఘిక సేవా, సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నారు సంతబొమ్మాలి మండలం, లింగుడు పంచాయితీ, ఎం.సున్నపల్లి గ్రామానికి చెందిన జాగృతి యువజన సేవా సంఘం సభ్యులు. అదే గ్రామానికి చెందిన గోరకల పోలమ్మ అనే వృద్ధురాలు ఇటీవల కాలుజారి పడిపోయి నడవలేని స్థితిలో బాధపడుతున్నారు. నిరుపేదరాలైన పోలమ్మ ఇబ్బంది పడుతున్న సమాచారాన్ని తెలుసుకొని జాగృతి సంఘ సభ్యులు గ్రామంలో తిరిగి రూ.54వేల సేకరించి స్వయంగా ఆమె ఇంటికి వెళ్లి అందజేశారు. నీకు ఏ సమస్య వచ్చిన మేము ఆదుకుంటామని సంఘ సభ్యులు భరోసా ఇచ్చారు.

## కూటమి పాలనలో ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యత

### ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయండి .. ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన

ఆమదాలవలస, జూన్ 23 (ప్రభాతవార్త)



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ వివిధ పథకాలు అమలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు మంగళవారం దూసిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9, 10వ తరగతి విద్యార్థులకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు చిగురుపల్లి ప్రభాకర్రావు అందించిన 26 సైకిలను విద్యార్థులకు ఎమ్మెల్యే రవికుమార్ పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యను మరింత ప్రతిష్ట పెంచుతూ విద్యాభివృద్ధికి వినూత్న పథకాలతో పాటు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు ముఖ్యంగా గత వైకాపా పాలనలో విద్యార్థులకు నాసిరకం కిట్లు మధ్యాహ్న భోజనం నాడు నేడు పేరుతో ఆర్థిక దోపిడీ నిర్వహించి ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయడం జరిగిందన్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంత మందికి తల్లికి వందనం అందించడంతోపాటు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా రుచికరమైన పౌష్టికాహార భోజనం అందించడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పాఠశాలకు సకాలంలో చేరెందుకు దాత అందించిన సైకిళ్ల ఎంతగానో ఉపయోగపడతాయని విద్యార్థుల చదువుకు దూరం అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ఇటువంటి సహాయ సహకారాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే రవికుమార్ పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించడం సమాజ బాధ్యత అని తెలిపారు ఈ కార్యక్రమంలో హెచ్ఎం సిహెచ్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు బొడ్డేపల్లి సురేష్, దుప్పల శివప్రసాద్, చిగురుపల్లి వెంకట బాబు,నారాయణపురం ఆనకట్ట చైర్మన్ సనపల డిల్లీశ్వరరావు, టిడిపి నాయకులు బుడుమూరు సీతారాం, తాండ్ర హరి, తమ్మినేని అప్పలనాయుడు కంచరాన లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ అభివృద్ధి కృషి చేయండి : సుడా చైర్మన్ కోరికాన

ఆమదాలవలస, జూన్ 23 ప్రభాతవార్త



విజయనగరం సమాచార సేకరణ కమిటీ పరిశీలకునిగా నియమితులైన జనసేన పార్టీ నాయకులు, శ్రీకాకుళం సడా చైర్మన్ కోరికాన రవికుమార్‌ని మంగళవారం శ్రీకాకుళం కార్యాలయంలో జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కోరుకొండ మల్లేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో జనసేన కార్యకర్తలు పార్టీలో చేర్చి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. పార్టీ మీద నమ్మకంతో ఎంతో కష్టపడ్డానని దానికి గుర్తింపుగా విజయనగరం సమాచార సేకరణ కమిటీ పరిశీలకులుగా నియమితులైనట్లు రవికుమార్ తెలిపారు. కష్టపడిన కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని, అదేవిధంగా గుర్తింపుకు ఉంటుందని అన్నారు.రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.

## రాయలబంకి రోడ్డు నిర్మాణం నిలుపుదలపై కలమట ఆగ్రహం

కొత్తూరు, జూన్ 23 (ప్రభాతవార్త)



రాయల నుంచి బంకి గ్రామానికి మంజూరైన బీటీ రోడ్డు పనులు మధ్యలోనే ఆగిపోవడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కలమట సోమవారం రాయల చెరువు వద్దకు చేరుకుని పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఈ ఏడాది మార్చిలో చెరువు గట్టుపై రోడ్డు కోసం అగడ్త తవ్వి వదిలేయడంతో గట్టు బలహీనపడిందని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం వర్షాలకు చెరువులోకి భారీగా నీరు చేరుతోందని, ఇదే పరిస్థితి కొనసాగితే గట్టు తెగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. "గట్టు తెగితే రాయల, మాకవరం, కుద్దిగం, పొన్నుటూరు గ్రామాల పరిధిలో వందలాది ఎకరాల పంట నీట మునిగి రైతులు నష్టపోతారు. అధికారులు వెంటనే స్పందించి ట్రెంచ్‌ను పూడ్చివేయాలి" అని కలమట డిమాండ్ చేశారు. అంతేకాకుండా, పనులు పూర్తి కాకముందే కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించేశారనే సమాచారం ఉందని, ఇందులో పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారుల హస్తం ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అక్రమాలను రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తానని, ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాడతానని కలమట స్పష్టం చేశారు.

## వరికి బదులుగా అయిల్పామ్ సాగు చేస్తే అధిక ఆదాయం

కోటబొమ్మాళి, జూన్ 23 ప్రభాతవార్త:



రైతులు అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేస్తున్న వరి పంటకంటే అయిల్పామ్ పంటను సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చునని టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు కె. జగన్మోహన్ రావు అన్నారు. ఆయన మంగళవారం మండలం జర్జంగి గ్రామంలో స్థానిక వ్యవసాయ అధికారులతో కలిసి రైతన్న మీ కోసం కార్యక్రమం న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరికి బదులుగా బహువార్షిక పంటలైన ఆయిల్ ఫామ్ అంతర పంటగా కొకొవా వేసుకోవడం వలన రెండు సంవత్సరాలు తరువాత న మంచి అధిక ఆదాయం పొందవచ్చుని, ఆయిల్పమ్ వేసిన 3 సంవత్సరాలు వరకు ఇతర ఏక వార్షిక పంటలు కూడా పండించుకోవచ్చని ఆయన రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు, వీఏఏ ఎస్.పద్మజ, రైతులు పాల్గొన్నారు.

## దువ్వాడ, మాధురి వ్యాఖ్యలపై జనసేన సీరియస్ వార్నింగ్



కొత్తూరు, జూన్ 23 ప్రభాతవార్త: పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీను, మాధురి చేసిన వ్యాఖ్యలపై జనసేన కొత్తూరు మండల కమిటీ భగ్గుమంది. ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు పునరావృతమైతే ఊరుకునేది లేదని స్పష్టం చేసింది. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో నేతలు మాట్లాడుతూ, 2025లో దువ్వాడ శ్రీను వాడిన భాష, ఇటీవల వారిద్దరూ చేసిన వ్యక్తిగత దాడిని తీవ్రంగా తప్పుబట్టారు. కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో సోమవారం జరిగిన పరిణామాలు, వారి వ్యాఖ్యలు ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ విమర్శలు వేరు, వ్యక్తిగత దూషణలు వేరు. హద్దులు దాటితే జనసైనికులు చూస్తూ ఊరుకోరు అని మండల అధ్యక్షులు దొంపాక జయరాజు హెచ్చరించారు. ఈ ప్రకటనను శ్రీకాకుళం పార్లమెంట్ సమన్వయకర్త కొరికాన రవికుమార్ ఆదేశాల మేరకు విడుదల చేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు అడపాక అశోక్, నాయకులు ఈసాయ్ వెంకటేష్, తలచంద్రి శివ, దారపు వినయ్, మెట వినోద్, మధు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై లారీ బీభత్సం ..భయాందోళనకు గురైన స్థానికులు



కంచిలి, జూన్ 23 ప్రభాతవార్త కంచిలి జాతీయ రహదారిపై లారీ బీభత్సం సృష్టించింది. ఇచ్ఛాపురం నుంచి చెన్నై వైపు వెళ్తున్న కంటైనర్ అదుపు తప్పడంతో జాతీయ రహదారికు అడ్డంగా నిలిచిపోయింది. దీంతో చాలా సమయం వరకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. లారీ డ్రైవర్ ఆ జాగ్రత్త వల్ల ఈ సంఘటన జరిగినట్లు పలువురు పేర్కొన్నారు. వెంటనే సోంపేట సీఐ మంగరాజు కంచిలి ఎస్సై పారినాయుడులు లారీ పక్కకు తీసుకువెళ్లి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## ఎమ్మెల్యే ఎన్ఇఆర్ దృష్టికి శ్యాంపిస్టన్స్ కార్మికుల సమస్యలు

### పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే

రణస్థలం, జూన్ 23 ప్రభాతవార్త



మండలంలో పైడి భీమవరం పంచాయతీ కూటమి నాయకుల ఆధ్వర్యంలో శ్యాం పిస్టన్స్ కార్మికులు క్యాంపు కార్యాలయంలో ఎచ్చెర్ల శాసనసభ్యులు ఎ దుకుదిటి ఈశ్వర రావును మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్యాంపిస్టన్స్ కంపెనీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం పని చేయడం తనకు కొత్త కాదని, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటానని స్పష్టం చేశారు. కార్మికుల హక్కుల కోసం గతంలోనూ అనేక పోరాటాలు చేసిన అనుభవం తనకు ఉందని గుర్తు చేశారు. కార్మిక సోదరులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నా వారి సమక్షంలోనే అధికారులు,పరిశ్రమ యాజమాన్యంతో ముఖాముఖి చర్చలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పైడిభీమవరం కూటమి నాయకులు రౌతు శ్రీనివాసరావు, సురేష్ రాజు, వడ్డాది శ్రీనివాసరావు, మునకాల రామిరెడ్డి, పిసిని జగన్నాధం నాయుడు, దన్నాన చిరంజీవి పాల్గొన్నారు.

## ఏపీ టిడ్కో గృహాల కోసం చెల్లించిన డిపాజిట్లు తిరిగి చెల్లింపులు



పలాస, జూన్ 23 ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పలాస కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధిలో ఏపీ టిడ్కో పథకం కింద 300 చదరపు అడుగులు, 360 చదరపు అడుగులు, 430 చదరపు అడుగుల గృహాల కోసం దరఖాస్తు చేసుకుని సంబంధిత మొత్తాలను డిమాండ్ డ్రాఫ్టుల రూపంలో చెల్లించినప్పటికీ గృహాలు మంజూరు కాని కొంతమంది దరఖాస్తుదారులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. వివిధ కారణాల వల్ల గృహాల కేటాయింపు జరగకపోవడంతో, వారు చెల్లించిన మొత్తాలను తిరిగి చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు పలాస కాశీబుగ్గ పురపాలక సంఘం కమిషనర్ తెలిపారు. గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వివరాలను ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించింది. ధరఖాస్తుదారులు చెల్లించిన డిమాండ్ డ్రాఫ్టులు,మున్సిపల్ రసీదులు, ఇతర సంబంధిత పత్రాలను పరిశీలించిన అనంతరం ఇళ్ల మంజూరు కాని వారిని గుర్తించి, వారు చెల్లించిన మొత్తాలను తిరిగి అందజేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇళ్ల మంజూరుకాని దరఖాస్తుదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం 3 గంటలకు కాశీబుగ్గ పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయనున్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# పొట్ట చుట్టూ కొవ్వు తగ్గాలంటే..



వ్యాయామం చేయకపోవడం, జీవనశైలిలో మార్పుల నేపథ్యంలో బరువుతో పాటు పొట్ట కూడా పెరుగుతుంది. అలాంటప్పుడు కొవ్వు పదార్థాలు తగ్గించడం మాత్రమే కాదు..కొన్ని పదార్థాలను రోజూ తీసుకోవాలి. వాటిలోని పోషకాలు పొట్ట చుట్టూ కొవ్వు పేరుకోకుండా చూస్తాయి.

**ఓట్స్ :** ఉదయం పూట నూనెతో చేసిన అల్పాహారాలకు బదులుగా ఓట్స్‌కి ప్రాధాన్య ఇవ్వాలి. తద్వారా జీవక్రియలరేటు వృద్ధి అవుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. తక్షణ శక్తి అంది ఎకునకవ సమయం ఆకలి వేయదు. దీనిలోని పీచు కూడా జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు చేస్తుంది. ఓట్స్ తీసుకునేటప్పుడు అందులో చక్కెరకు బదులుగా ఏవైనా



తాజా పండ్ల ముక్కలు, రసాలు కలిపితే సహజ చక్కెరలు అందుతాయి. పొట్ట వస్తుందనే భయం కూడా ఉండదు.




**పండ్లు :** ఆకలిగా అనిపించి నప్పుడు ఏ మిఠాయిలో, ఇతర చిరుతిళ్లో తినే బదులు పండ్లు ఎంచుకోవడం మంచిది. వీటివల్ల చక్కెర, కొవ్వు శరీరంలో చేరతాయన్న బాధ ఉండదు. పోషకాలూ ఎక్కువగా అందుతాయి. బరువూ తగ్గుతారు.

**బాదం ..** మోనోశ్యాచురేటెడ్ ఫ్యాట్స్ శరీరంలో కొవ్వును కరిగించే శక్తిని పెంచుతాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. వీటివల్ల శరీరంలో నీరు ఊడా పేరుకోకుండా ఉంటుంది. ఆ పోషకాలు అందాలంటే బాదంతో పాటు ఇతర ఓట్స్ కూడా తినాలి.

**గుడ్లు :** మాంసకృతులు అధికంగా అందించే గుడ్డు పొట్ట చుట్టూ ఉండే కొవ్వుని కరిగించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. ముఖనయంగా తెల్లసొన తీసుకోవడం వల్ల బి 12, డి విటమిన్లు, ఒమేగా–3 ఫ్యాటీ ఆమ్లాలు శరీరానికి అధికంగా అందుతాయి. ఇవి బరువు తగ్గడంలో కీలకపాత్ర పోసిస్తాయి.దీనివల్ల ఎముక సాంద్రత పెరుగుతుంది. గుండె పని తీరు కూడా మెరుగవుతుంది. ☐

# కేన్సర్ కుదేసినా.. కొత్త ఉత్సాహం



ఎవరికైనా కేన్సర్ సోకితే ఇక అవే అంతిమ ఘడియలు అనుకునే రోజుల్నించి 'కేన్సర్ నయ'మౌతుంది. అనే రోజులకు చేరుకున్నాము. రాచపుండు బ్రహ్మారాక్షసి అనే అభిప్రాయం ఏనాడో మన మస్కిష్కం నుండి మాయమైంది. కేన్సర్ నుంచి కోలుకున్న ఎందరిలోనో కొత్త ఉత్సాహం నింపిన సందర్భాలు ఉన్నాయి. ఎంతో మంది కేన్సర్ రోగులు ముఖ్యంగా మహిళలు కేన్సర్ సోకినా సుదీర్ఘ కాలం జీవిస్తున్న కథలెన్నో మనకి తారసపడుతుంటాయి. సర్జరీలు, కీమోథెరపీలు మనల్నేం చేయవు అనుకుంటేనే మరెంత కాలం జీవించగలం అనే



నమ్మకంతో జీవించే స్తున్నారు. రోగుల్లో ఉదయించే 'స్వస్థ' భావన వారిని చాలా కాలం ప్రాణం పోస్తుంది. నఫీసా ఆల్లి (69) ప్రఖ్యాత నటి. హిందీ చిత్రసీమ లోనే కాకుండా ఇతర భారతీయ భాషల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. 1972 నుంచి 1974 వరకు జాతీయ స్విమ్మింగ్ చాంపియన్ మిస్ ఇంటర్నేషనల్ పోటీలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. రెండో రన్నర్‌అప్‌గా నిలిచింది. 2018 నవంబరులో స్టేజి 3 పెరిటోనియల్ అండాశయ కేన్సర్ ఆమెను వేధించింది అయినా ఆమె నిరుత్సాహం పొందలేదు. ఆమె బహుళరంగాల్లో రాణించిన సామాజ్ఞి. సామాజిక కార్యకర్తగానూ చురుకుగా ఉండేవారు. 2022లో 'ఉంఛాయి' చిత్రం ఆమె ఆఖరి చిత్రం. అర్జున అవార్డు గెలుచుకున్న సోలో క్రీడాకారుడు కల్నల్ రవీందర్ సింగ్ సోధి భార్య. వివాహానంతర దశలన్నీ దాటి తన ముగ్గురు పిల్లల సేవలో నిమగ్నమైంది. 18 ఏళ్ల విరామం అనంతరం మళ్లీ నటనా వృత్తిలో ప్రవేశించింది. ఎయిడ్స్ అవగాహనా సదస్సుకు ప్రత్యేక యాంకర్‌గా పనిచేసింది. 2005 సెప్టెంబరులో చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్‌గానూ బాధ్యతలు నిర్వహించారు. ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్‌లో చురుకైన నేతగా పనిచేసింది. ఏనాడూ ఏ కార్యక్రమంలో పాల్గొనకుండా ఇంట్లోనే కూర్చుండి పోవాలని, ఖాళీగా ఉండాలని అనుకోలేదు. ఉద్యమ అంశాలు చేపట్టినపు డల్లా ఎంతో నిబద్ధతతో పనిచేసేవారు. 2004లో దక్షిణ కల్‌కతా నియోజకవర్గం నుంచి లోక్‌సభకు తృణమూల్ కాంగ్రెస్ తరపున పోటీచేసి ఓటమి పాలయ్యారు. హాలీవుడ్ నటి, మాజీ అందాల సుందరి, ఉద్యమ కారిణి, సామాజిక కార్యకర్త 69 ఏళ్ల నఫీసా ఆలీ కేన్సర్ నయమయ్యాక కొత్త ఉత్సాహాన్ని కూడగట్టుకుని మరికొందరు కేన్సర్ రోగులకు మార్గదర్శకంగా ఉంటు న్నారు. ఇంటిల్లి పాదీ తనతో గడిపిన ఎంతో ఉత్సాహాన్ని కల్గించే అనుభవాలను పంచు కుంటున్నారు. ఇటీవల 11 వేల అడుగుల ఎత్తులో నఫీసా ట్రెక్కింగ్ చేసిన అనుభవాలను వివరిస్తూ తనకెంతో ఉత్సాహం కలిగించిన పర్వతారోహణను మరింతగానో మెచ్చుకు న్నారు. కేన్సర్ శస్త్ర చికిత్స, అనేక సార్లు కీమోథెరపీ సెషన్ల తర్వాత తాను కొత్త అనుభవంతో కూడిన నూతనోత్సాహం తన మదిలో మెది లిందని అన్నారు. మొన్న ఏప్రిల్ నెలలో తన పొట్టపై శస్త్రచికిత్స తాలూకు మచ్చను చూపే ఫొటోను అభిమానులతో పంచుకున్నారు. తాజాగా తన కుటుంబ సభ్యులతో టెక్కింగ్, పిక్నిక్ అనుభవాలతో కూడిన ఫొటోలను విడిచిపెట్టారు. తాజాగా రోహ్తంగ్ పాస్ సమీపంలో 11 వేల అడుగుల ఎత్తులో ట్రెక్కింగ్ చేస్తేన్న అనేక వీడియా లను, ఫొటోలను పంచుకు న్నారు. తీరని వ్యధలున్నా, జీవితాన్ని భయపెట్టి అధఃపాతాళానికి పడి పోయినట్లుగా చేసే కేన్సర్ వంటి భయంకర రుగ్మత నుండి కోలు కొన్నాక కృంగిపోకుండా, కుదేలయి పోకుండా తాను కొత్త ఉత్సాహన్ని పొందుతూ ఇతరుల్లో నూతనోత్సాహాన్ని అందివ్వగలుగుతున్న అందాల తార నఫీసాను స్ఫూర్తిగా తీసుకునే వారికెవరికైనా కేన్సర్ కొత్త జీవితాన్ని ప్రసాదిస్తుంది.

# గణేశుడు

విఘ్నాలను తొలగించి కార్యసిద్ధిని ప్రసాదించే దేవుడు.గణేశుడు మహిశ్రీ గణేశుని రూపం ఎంతో ప్రత్యేకమైనది. ఏనుగు తల, పెద్ద చెవులు, చిన్న కళ్ళు, పెద్ద పొట్టతో ఆయన దర్శనమిస్తారు. ఈ రూపంలోని ప్రతి అంశం ఒక గొప్ప సందేశాన్ని తెలియజేస్తుంది. పెద్ద చెవులు ఎక్కువగా వినాలని, చిన్న కళ్ళు ఏకాగ్రతతో చూడాలని, పెద్ద పొట్ట సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించాలని సూచిస్తాయి.జ్ఞానానికి ప్రతీగణపతి జ్ఞానానికి, వివేకానికి ప్రతీక. విద్యార్థులు విద్యాభివృద్ధి కోసం, కళాకారులు తమ కళల్లో విజయాల కోసం, ఉద్యోగులు మరియు వ్యాపారులు తమ కార్యాలలో పురోగతి కోసం గణేశుని ఆశీర్వాదాలను కోరుతారు. ఆయన అనుగ్రహం ఉంటే విజయం సులభంగా లభిస్తుం దని భక్తుల విశ్వాసం.గణేశుని అవతార పురాణాల ప్రకారం, పార్వతీదేవి తన శరీరానికి పూసుకున్న పసుపుతో ఒక బాలుడిని సృష్టించి ద్వారపాలకునిగా నియ మించింది. ఆ బాలుడే గణేశుడు. ఒకసారి పరమశివుడు లోపలికి వెళ్లడానికి ప్రయత్నిం చగా గణేశుడు అడ్డుకున్నాడు. కోపంతో శివుడు అతని తలను ఖండించాడు. తరువాత పార్వతీదేవి దుఃఖాన్ని చూసి, శివుడు ఏనుగు తలను అమర్చి గణేశునికి ప్రాణం పోశాడు. అప్పటి నుంచి గణేశుడు దేవతలందరిలో అగ్రపూజను పొందే దేవుడిగా ప్రసిద్ధి చెందాడు. వినాయక చవితివినాయక చవితి గణేశునికి అంకితమైన పవిత్ర పండుగ. ఈ రోజున భక్తులు మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉండ్రాళ్లు, మోదకాలు వంటి నైవేద్యాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రార్థిస్తారు. ఈ పండుగ భక్తి, ఐక్యత ఆనందానికి ప్రతీకగా నిలుస్తుంది. శ్రీ గణేశుడు మనకు జ్ఞానం, వినయం, సహనం మరియు ధైర్యం అనే విలువలను బోధిస్తాడు. జీవితంలో ఎదురయ్యే అడ్డంకులను విశ్వాసంతో, పట్టు దలతో అధిగమించాలని ఆయన సందేశం. విఘ్నాలను తొలగించి విజయాన్ని ప్రసాదించే దైవంశ్రీ గణేశుడు. ఆయనను భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే జ్ఞానం, ఐశ్వర్యం, శాంతి మరియు సుఖసంతోషాలు లభిస్తాయని విశ్వాసం. ❑

# క్రిస్పీ పనీర్ ఫింగర్స్



**కావలసినవి** : పనీర్–200 గ్రాములు, మైదాపిండి–రెండు టేబుల్ స్పూన్లు, మొక్కజొన్న పిండి–టేబుల్ స్పూన్ ఉప్పు–తగినంత, పసుపు–చిటికెడు, కారం, మిరియాల పొడి, గరం మసాలా, అల్లం వెల్లుల్లి ముద్ద–అర చెంచా చొప్పున, మిక్స్‌డ్ హెర్బ్స్–పావుచెంచా, బ్రెడ్ పొడి–పావు కప్పు, నూనె–వేయించడానికి సరిపడా.

**తయారీ :** పనీర్‌ను పొడుగ్గా ముక్కలు కోసుకోవాలి. వాటి మీద కారం, ఉప్పు, మిరియాల పొడి, గరం మసాలా, పసుపు, అల్లం వెల్లుల్లి ముద్ద, మిక్సడ్ హెర్బ్స్ వేసి.. ముక్కలు తునగకుండా కలియ తిప్పా.లి ఇలా పొడులన్నీ పట్టించిన తర్వాత ఒక పావు గంట పక్కనుంచాలి. మరో పాత్రలో మైదాపిండి, మొక్కజొన్న పిండి, తగినంత ఉప్పు, మిరియాల పొడి వేసి, కొన్ని నీళ్లతో ఉండలు కట్టకుండా చిక్కగా కలపాలి. మసాలా పట్టించిన పనీర్ ముక్కలను మొదట ఈ మిశ్రమంలో, తర్వాత బ్రెడ్ పొడిలో ముంచి తీసి, కాగుతున్న నూనెలో వేయించాలి. అంతేబంగారురంగులో కరకరలాడే పనీర్ ఫింగర్స్ సిద్ధం. ❑

# పాలు తాగుతుంటే తేన్పులా..



పిల్లలు మొదటి ఆరు నెలలు తల్లి పాల మీదే ఆధార పడతారు. కొన్ని సందర్భాల్లో తల్లికి పాలు ఎక్కువగా ఉత్పత్తవుతాయి. ఇలాంటప్పుడు పిల్లలు కూడా గబాగబా పాలు తాగుతుంటారు. కొన్ని సందర్భాల్లో తల్లి ఆహారంలో లోపం ఉన్నట్లయితే పాలు తక్కువగా వస్తుంటాయి. ఇలాంటప్పుడు పాలు సరిపోకనఖాళీ రొమ్మునే సక్ చేస్తుంటారు. ఈ క్రమంలో ఎక్కువ గాలి పొట్టలోకి చేరుతుంది. మరికొన్ని సందర్భాల్లో పాపాయిని బుజ్జగించడానికి తేనె పీకను ఉపయోగిస్తుంటారు. ఈ పీక పెట్టినప్పుడు కూడా గాలిని మింగుతుంటారు. పాపల విషయంలో ఇలాంటి పరిస్థితులు ఉన్నాయోమే పరిశీలించుకోవాలి. ఇలా పొట్టలో గ్యాస్ ఎక్కువైనప్పుడు తేన్పుల ద్వారా గాలి బయటకు వెళుతుంది. దీనివల్ల బేబీకి కాస్త ఉపశమనం కలుగుతుంది. అయితే ఇలాంటి సమస్య ఉన్నప్పుడు పాపలను ఒక పక్కకు తిప్పి పడుకోబెట్టడం లేదా భుజం మీద వేసుకొని బర్పింగ్ చేయడం.. వంటి పద్ధతులు పాటించాలి. ఫలితంగా గాలి బయటికి వెళ్లిపోతుంది. అప్పటి సమస్య తగ్గుముఖం పట్టకపోతే తల్లి తీసుకునే ఆహారంలో మార్పులు చేసు కోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా స్పైసీ ఫుడ్‌కి దూరంగా ఉండడం. బాగా ఉడికించిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం వంటివి చేయాలి. ☐

# తెర

## 'ఇరుముడి' స్పెషల్ పోస్టర్ రిలీజ్



మాస్ మహారాజా రవితేజ, ప్రముఖ పాన్ ఇండియా నిర్మాణ సంస్థ 'మైత్రీ మూవీ మేకర్స్' నిర్మిస్తున్న 'ఇరుముడి' చిత్రం కోసం దర్శకుడు శివ నిర్వాణ జతకట్టారు. ఈ చిత్రానికి సంబంధించిన 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' గ్లింప్స్‌కు వచ్చిన అద్భుతమైన స్పందనతో సినిమాపై ఇప్పటికే భారీ అంచనా లు నెలకొన్నాయి. భక్తి, కుటుంబ భావోద్వేగా లు, యాక్షన్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కు తున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండబోతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మాస్ మహారాజా రవితేజ, తన కూతురు నుదుటిపై ప్రేమగా ముద్దుపెడుతూ కనిపించడం ఆకట్టుకుంటోంది. ఎనర్జిటిక్ కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరించిన రవితేజ 'ఇరుముడి'లో పూర్తిగా భిన్నమైన, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న పాత్రలో కనిపించ నున్నారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తిగా ఆయన నటన ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని కలిగించనుంది. ఈ చిత్రంలో సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక, బేబీ నక్షత్ర కీలక పాత్రలు పాత్రల్లో కనిపించనున్నారు. నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తు న్నారు. విష్ణు శర్మ సినిమాటోగ్రఫీ, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైన్, ప్రవీణ్ పూడి ఎడిటర్ శివ నిర్వాణ కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందించగా, నరేష్ బాబు పి స్క్రిప్ట్ కోఆర్డినేటర్ గావ్యవహరిస్తున్నారు. వరలక్ష్మీ వ్రతం శుభ సందర్భంగా ఇరుముడి ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది

## 'వసుదేవసుతం'.. ట్రైలర్ లాంచ్

'వసుదేవసుతం'.. ట్రైలర్ లాంచ్ రెయిన్‌బో సినిమాస్ బ్యానర్ మీద ధనలక్ష్మి బాదర్ల నిర్మాణంలో వైకుంఠ్ బోను తెరకెక్కించిన చిత్రం 'వసుదేవసుతం'. ఈ సినిమాలో మాస్టర్ మహేంద్రన్, అంబికా వాణి జంటగా నటించారు. ఇప్పటి వరకు మూవీ నుంచి రిలీజ్ చేసిన పోస్టర్లు, గ్లింప్స్, టీజర్ అందరినీ ఆకట్టుకు న్నాయి. ఈ సినిమాని జూలై 10న రిలీజ్ చేయబోతోన్నారు.



ఒరిస్సాలోని వాసుదేవుని ఆలయం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఆలయంలోని బ్రహ్మ పదార్థం కోసం శత్రు మూకలు చేసే విన్యాసాన్ని అడ్డుకునే పాత్రలో హీరో మహేంద్రన్ అదరగొట్టేశారు. ట్రైలర్ ఒక్కసారిగా ప్రేక్షకుల్లో అంచనాల్ని పెంచేసింది. మాస్టర్ మహేంద్రన్ మాట్లాడుతూ.. 'వసుదేవసుతం' కోసం నిర్మాతలు చాలా కష్టపడ్డారు. కథను నమ్మి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఖర్చు పెట్టారు. దర్శకుడు ఎన్నో కష్టాల్ని ఎదుర్కొని ఈ మూవీని పూర్తి చేశారు. దర్శకుడు వైకుంఠ్ బోను మాట్లాడుతూ.. .. నిర్మాతకి ముందు ఓ రెండు కథలు చెప్పాను. అవి బాగానే ఉన్నాయని అన్నారు. మళ్లీ ఒరిస్సాలోని ఫేమస్ టెంపుల్ బ్యాక్ డ్రాప్‌లో ఓ కథను రాసుకున్నాను.నిర్మాత త్రినాథ్ కేశవ మాట్లాడుతూ.. 'వసుదేవసుతం'. మాకు తొలి చిత్రం. మా సినిమాలో అందరూ అద్భుతంగా నటించారు. మాకు సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మా మూవీ జూలై 10న రాబోతోంది. అంబికా వాణి మాట్లాడుతూ.. 'వసుదేవసుతం'.సినిమాకు పని చేయడం ఆనందంగా ఉంది. నాకు తెలుగు సరిగ్గా రాలేదు. నేను నేర్చుకుంటాను. నాకు ఇందులో అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. అజయ్ సాయి మాస్టర్ మాట్లాడుతూ.. ..'వసుదేవసుతం'. సినిమాలో రెండు పాటల్ని కొరియోగ్రఫీ చేశాను. చాలా గ్యాప్ తరువాత మళ్లీ మణిశర్మ గారి పాటకు పని చేశాను. ట్రైలర్ నాకు చాలా నచ్చింది. మాస్టర్ మహేంద్రన్ ఇందులో అద్భుతంగా నటించాడు.

## చివరి శ్వాస వరకు పని చేస్తూనే పోవాలి : అల్లాణి శ్రీధర్



అల్లాణి శ్రీధర్ తెలుగు సినిమా రచయిత, నిర్మాత, దర్శకుడు. 1988లో కొమరంభీమ్ చిత్రంతో దర్శకత్వ అరంగేట్రం చేశారు. ఉత్తమ జాతీయ సమైక్యత చిత్రంగా, ఉత్తమ దర్శకుడుగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుండి 1990లో నంది అవార్డు అందుకున్నారు ఈయన.ఆయన తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గద్దర్ అవార్డ్స్ విది విధానాల కమిటీలో సభ్యునిగా పని చేశాడు. జూన్ 24.6. 2026 అల్లాణి శ్రీధర్ పుట్టినరోజు సందర్భంగా ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ ఆయనకు ఫిలించాంబర్‌లో మీట్ ది ప్రెస్ కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ఎగ్జిక్యూటివ్ మెంబర్ సీనియర్ జర్నలిస్ట్ ధీరజ్ అప్పాజీ వ్యాఖ్యతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ బాలిరెడ్డి మాట్లాడుతూ... గోస్వామి తులసిదాస్ సినిమా అన్నది మనం మర్చిపోలేని సినిమా అని గుర్తు చేయడం జరిగింది. శ్రీధర్‌గారితో నాకు చాలా ఏళ్ళ అనుబంధం ఉంది. ఆయన మరిన్ని చిత్రాలు తీసి సక్సెస్ సాధించాలని కోరుకుంటు న్నాను అన్నారు. సీనియార్ జర్నలిస్ట్ లక్ష్మణరావు మాట్లాడుతూ... శ్రీధర్‌గారితో అనుబంధం కొంత గ్యాప్ వచ్చినప్పటికీ.. ఆ రోజుల్లో ఆయన చేసిన సినిమాలు అభ్యుదయ భావాలకు ప్రతీకగా నిలిచాయి. శ్రీమతి జమునారాణి సీనియర్ జర్నలిస్ట్ మాట్లాడుతూ...ఈ వేదికపైన రెండు విషయాలు చెప్పుకోవాలంటే సంతోషంగా ఉంది. ఫిలిం క్రిటిక్స్ అధ్యక్షులు బత్తుల ప్రసాద్ మాట్లాడుతూ..ఈ మీట్ ది ప్రెస్ కార్యక్రమం ద్వారా ప్రతిభ ఉన్న ప్రతి ఒక్కరికీ చిరు సత్కారం చేయాలని అనుకుంటు న్నాము. అల్లాని శ్రీధర్ గురించి చెప్పాలంటే నా గరించి నేను చెప్పుకున్నట్లు ఉంటుంది. ఫిలిం క్రిటిక్స్ జనరల్ సెక్రటరీ సురేష్‌కొండేటి మాటా డుతూ... వార్తలో ఉన్నప్పుడు నేను 90లలో నేను శ్రీధర్‌గారిని ఇంటర్వ్యూ చేయడం జరిగింది. అంతేకాక ఆతరువాత సంతోషం సినీ వారపత్రికకు కూడా ఆయనను నేను పర్సనల్‌గా ఇంటర్వ్యూ చేశాను. అల్లాణి శ్రీధర్ మాట్లాడుతూ... నేను జన్మదినం అనేది గొప్పగా అనుకోవడం లేదు. ఈ రోజు ఈ వేదికపైన ఇంత మంది మిత్రలును కలుసుకోవడం నా జన్మ దినం కాదుగాని పునర్మనదినంగా అనుకుంటున్నాను అన్నారు.

## 'గాసిప్' 26న విడుదల



మోస్ట్ టాలెంటెడ్, ఎనర్జిటిక్ రాశి సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నా వైభవ్ సినీ స్కల్ప్ స్టూడియోస్ బ్యానర్‌పై యతి నిర్మాతగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం "గాసిప్". నేటి తరానికి కనెక్ట్ అయ్యే ఎమోషన్స్, అందమైన ప్రేమ కథతో మేళవిస్తూ సోషల్ సెటైర్‌గా డైరెక్టర్ వైభవ్ కౌండిన్య ద్వారా ఈ చిత్రం తెరకెక్కుతోంది. శక్తికాంత్ కార్తీక్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రానికి సతీష్ సినిమా టోగ్రఫీ చేయగా జై కుమార్ ఎడిటింగ్ చేశారు. ఈ సంద ర్భంగా నటుడు మహేష్ యడ్లపల్లి మాట్లాడుతూ... ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సాయికిరణ్ అడికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ప్రస్తుత సమాజంలో చూస్తున్న కొన్ని సంఘటనలకు దగ్గరగా ఉన్న ఒక విషయాన్ని సినిమాగా చేశాము. ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుంది. నటుడు గురు చరణ్ మాట్లాడుతూ... "గాసిప్ చిత్రం కోసం నాకు వైభవ్ కాంటాక్ట్ చేశారు. నా క్యారెక్టర్ గురించి చెప్పిన తర్వాత ఆయన చేసిన ఆడిషన్ నాకు ఛాలెంజ్‌గా అనిపించింది. నిర్మాత యతి మాట్లాడుతూ... "ఈ కార్యక్రమానికి వచ్చిన అందరికీ థాంక్స్. ఈ సినిమా కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున థాంక్స్. అతిథిగా హాజరైన దర్శకుడు సాయి కిరణ్ అడివి మాట్లాడుతూ... "వైభవ్ నాకు ఎంతోకాలం నుండి పరిచయం ఉన్న వ్యక్తి, చాలా క్లారిటీ ఉన్న వ్యక్తి. చిత్ర దర్శకుడు వైభవ్ కౌండిన్య మాట్లాడుతూ... నా తొలి చిత్రం "గాసిప్"కు మీరు చూపిస్తున్న ఆదరణకు ధన్యవాదాలు. ఈ సినిమాకు నేను రచయితగా, దర్శకుడిగా పని చేశాను. మన జీవితాల్లో గాసిప్ అనేది సాధారణ విషయమే. కానీ మనం సరదాగా మాట్లాడే మాటలు కొన్నిసార్లు ఇతరుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. హీరోయిన్ రాశి సింగ్ మాట్లాడుతూ.... ముందుగా మా సినిమా ట్రైలర్, పాట విడుదల చేసి మాకు మద్దతుగా నిలిచిన సాయి కిరణ్, వంశీ, పృథ్వీరాజ్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు.

## NBK112 అమరావతిలో 25న లాంచ్



NBK112 అమరావతిలో జూన్ 25న గ్రాండ్ లాంచ్ ముఖ్య అతిథులుగా మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్ గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సంచలన దర్శకుడు కొరటాల శివ తొలిసారిగా NBK112 చిత్రం కోసం జతకడుతున్నారు. ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే అభిమానులు, సినీ వర్గాల్లో భారీ అంచనాలు పెంచింది. Power Meets Purpose, Mass Becomes A Movement అనే పవర్ ఫుల్ ట్యాగ్‌లైన్‌తో వచ్చిన అనౌన్స్‌మెంట్ పోస్టర్, ఈ చిత్రం ఎంత భారీ స్థాయిలో ఉండబోతుందో సూచించింది. ఇద్దరు విజయవంతమైన నిర్మాతలు SLV సినిమాస్ సుధాకర్ చెరుకూరి, యువసుధ ఆర్ట్స్ సుధాకర్ మిక్కిలినేని ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌పై ఉన్న అంచనాలను మరింత పెంచుతూ, అమరావతి సమీపంలోని వెంకటాయపాలెంలో ఉన్న గిగిదీ ఆలయంలో జూన్ 25న గ్రాండ్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా హాజ6రుకానుండటంతో ఈ కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనుంది. బాలకృష్ణ భారీ స్థాయి స్క్రీన్ ఇమేజ్‌కు సరిపోయేలా కొరటాల శివ ఒక పవర్ ఫుల్ కథని సిద్ధం చేశారు. మాస్ సినిమాలు చేయడంలో ప్రసిద్ధి చెందిన ఇద్దరు దిగ్గజాలు తొలిసారిగా కలిసి పనిచేస్తుండటంతో ఈ చిత్రంపై అంచనాలు భారీగా పెరిగాయి.ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు మేకర్స్ త్వరలో ప్రకటించనున్నారు.

## 'రాజా ది రాజా' జూలై 17న రిలీజ్



యూత్‌ఫుల్ ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచిన"రాజా ది రాజా చిత్రం మూవీ లవర్స్‌లో మంచి బజ్‌ను క్రియేట్ చేస్తోంది. రుత్విక్, విశాఖ ధీమన్ జంటగా నటిస్తున్న ఈ యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కు అనిల్ బోయిడపు దర్శకత్వం వహిస్తున్నారు. వృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌పై కె. నిహారికా దాసరి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కె. శ్రీలతా రెడ్డి సమర్పిస్తు న్నారు. తాజాగా చిత్ర బృందం ఈ సినిమాను జూలై 17న విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. రిలీజ్ డేట్ పోస్టర్‌లో హీరో, హీరోయిన్‌ల మధ్య కెమిస్ట్రీతో పాటు వారి సరదా ప్రయాణాన్ని హైలైట్ చేశారు. కలర్ ఫుల్ విజువల్స్, ఆకట్టుకునే డిజైన్ చిత్రంలోని రొమాంటిక్ మూడ్‌ను ప్రజెంట్ చేస్తోంది. ఈ చిత్రానికి మార్క్ కె రాబిన్ సంగీతం అంది స్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సింగిల్ చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రంలో సాయికుమార్, డాక్టర్ నరేష్ విజయకృష్ణ, అవసరాల శ్రీనివాస్, విష్ణు ఓయి, పార్వతీశం, రాజశ్రీ నాయర్, రోహిణి, బద్రం, మైమ్ మధు, ఆనంద్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ వంటి ప్రముఖ పంపిణీ సంస్థ ఈ చిత్రాన్ని విడుదల చేయడం ట్రేడ్ వర్గాల్లో సినిమాపై పెరుగుతున్న నమ్మకాన్ని సూచిస్తోంది. రాజా ది రాజా యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే రిఫ్రెషింగ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులని అలరించనుంది.

# గజపతినగరం శ్రీరంగరాజపురం గ్రామంలో
# శ్రీ కృష్ణ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న చిన్న శ్రీను

గజపతినగరం, జూన్ 23, ప్రభాతవార్త



గజపతినగరం మండలం పాత శ్రీరంగ రాజపురం గ్రామంలో నిర్వహించిన శ్రీ కృష్ణ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో విజయ నగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వ యకర్త మజ్జి శ్రీనివాస రావు (చిన్న శ్రీను) పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహోత్సవ నిర్వాహకులు, గ్రామ పెద్దలు మరియు భక్తులు చిన్న శ్రీనుకి ఘన స్వాగతం పలికారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొని ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో భక్తి భావనతో పాటు ఐక్యత, సామరస్యాన్ని పెంపొందిస్తాయని చిన్న శ్రీను పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, భక్తులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు..

శృంగవరపుకోట,జూన్23,ప్రభాతవార్త



ఎస్.కోటలోని పుణ్య తిరుమలగిరి క్షేత్రాంలో శ్రీవారి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు కార్యక్రమం మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. నాలుగు రోజులు పాటు నిర్వహించనున్న బ్రహ్మోత్స వాలలో భాగంగా మంగళవారం రెండవ రోజు ఉదయం నుంచే పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు దంపతులు పాల్గొని శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన

కురుపాం, జూన్ 23ప్రభాతవార్త.



మాదక ద్రవ్యాలు కారణంగా భవిష్యత్తు నాశనం అవుతుందని ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 26 అంతర్జాతీయ మాదకద్రవ్యాల పురస్కరించుకొని, కురుపాం లో గల ప్రభుత్వ మోడల్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియో గం వల్ల కలిగే అనర్థాలు, యువశక్తి పై దాని ప్రభావం గురించి అవగాహన కార్యక్రమంనిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుపాం ఎక్సైజ్ స్టేషన్ ఎస్సై రాజశేఖర్ సిబ్బంది పాల్గొని విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై వివరంగా తెలియజేశారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామలక్ష్మి ఇంగ్లీష్ లెక్చరర్ వెంకట రాజు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులు ఆదాయం వచ్చే పంటలను పండించాలి : జిల్లా వ్యవశాఖాధికారి రామారావు

శృంగవరపుకోట,జూన్23, ప్రభాతవార్త..



రైతులు వ్యవసాయం చేసే పంటలను ఆదాయం వచ్చే దిశగా పండించాలని జిల్లా వ్యవశాఖాధికారి విటీ.రామారావు తెలిపారు. మంగళవారం మండలంలోని వినాయకపల్లి గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిధిగా జిల్లా వ్యవశాఖాధికారి రామారావు పాల్గొని రైతులతో ఆయన నేరుగా మాట్లాడారు. రైతుల సమస్యలను అర్థం చేసుకుని వారికి ఉన్న సందేహాలు,సూచనలు అందించారు. కార్యక్రమంలో ఏఓ రవీంద్ర,రైతులు సిబ్బంది, పాల్గొన్నారు.

# న్యాయమూర్తి నుండి మీడియేటర్ సర్టిఫికేట్ పొందిన అడ్వకేట్ కమలాకర్
## మీడియేషన్ లో 40 గంటల శిక్షణ పూర్తి చేసిన ఘనత సాధన

గరివిడి, జూన్ 23,ప్రభాత వార్త



భారత సుప్రీంకోర్టు మెడియేషన్ అండ్ కన్సిలియేషన్ ప్రోజెక్టు కమిటీ(ఎం సి పి సి) సౌజన్యంతో జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 40 గంటల మధ్యవర్తిత్వ(మీడియేషన్) శిక్షణా కార్యక్రమాన్ని విజయ వంతం గా పూర్తి చేసిన గరివిడి కి చెందిన సీనియర్ న్యాయవాది టి.కమలాకర రావుకు జిల్లా సెషన్స్ జడ్జి, న్యాయ సేవా సంస్థ చైర్ పర్సన్ ఎం.బబిత సర్టిఫికెట్ ప్రధానం చేశారు. ఆయన ప్రతిభను ప్రశంసించారు. హైకోర్ట్ న్యాయమూర్తి చీకటి మానవేంద్ర నాథ్ రాయ్ సంతకంతో కూడిన మీడియేటర్ ధ్రువపత్రం ని కమలాకర్ న్యాయమూర్తి బబిత నుండి స్వీకరించారు. మధ్యవర్తిత్వం, ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాల విధానాల పై విలువైన పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను, అందించిన న్యాయ వ్యవస్థ కు,న్యాయ సేవా సంస్థకు కమలాకర్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. మీడియేటర్ ధ్రువపత్రం పొందడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. పూర్వ ఫేకర్ జి ఎం గా, శ్రీరాం విద్యా పీఠ్ కార్యాదర్శిగా విధులు నిర్వహించిన కమలాకర్ ప్రతిభకు పలువురు ఆయన్ని అభినందించారు.

# నిత్యవసర సరుకులు పంపిణీ సక్రమంగా నిర్వహించాలి
## డీలర్ల సమావేశంలో తహసిల్దార్ ధనం ఆదేశాలు

తె ర్లాం జూన్ 23 (ప్రభాత వార్త )



రేషన్ కార్డు లబ్ధిదారులకు అందించే నిత్యవసర సరుకులు పంపిణీ సక్రమంగా నిర్వహించాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని తహసిల్దార్ ఆర్ .ధనం ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో డీలర్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సరుకులు కార్డుదారులకు అందించే వారి చేత మెప్పులు పొందాలన్నారు ఒకవేళ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పుమని విధిగా కేసులు నమోదు చేయబడతాయని ఆయన హెచ్చరించారు అలాగే సివిల్ సప్లైస్ డి.టి అల్లు స్వర్ణలత మాట్లాడుతూ ప్రభుత్వం నూతన విధానాన్ని ఆన్లైన్ ద్వారా పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అందుకు డీలర్లు ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవలసిన బాధ్యత మీ పైన ఉందని ఆమె సూచించారు. అలాగే ఈ కేవైసీ పూర్తి చేయాలని లేని పక్షంలో ఆ సభ్యుల బియ్యం తొలగిపోయే అవకాశం ఉందని అందుకు తక్షణమే ఈ కేవైసి పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా డీలర్లు సంఘ అధ్యక్షుడు తెంటు సూర్యనారాయణ మాట్లాడుతూ డీలర్ల పలు సమస్యల పైన అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాల్సిందిగా కోరారు. సమావేశంలో గౌడౌన్ ఇంచార్జ్ డి.టి అప్పయ్య డీలర్లు పాల్గొన్నారు.

# పలు రోడ్లు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బేబీ నాయన
## రూ.4.95 కోట్ల రూపాయలతో రోడ్డు పనులకు శ్రీకారం

తెర్లాం జూన్ 23(ప్రభాత వార్త)



కూటమి ప్రభుత్వం హాయంలో బొబ్బిలి నియోజకవర్గం లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ఎంతో గర్వంగా ఉందని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కే కే రంగారావు బేబీనాయన అన్నారు. మంగళవారం పనులు పణుకు వలస నుంచి బలిజపేట పోవు ఆర్ అండ్ బి రోడ్డువిస్తరణ పనులకు రూ .3.05 కోట్ల రూపాయల విలువతో కూడిన రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించి నియోజకవర్గంలో ఎన్నో కోట్ల రూపాయలు విలువ గలిగిన అభివృద్ధి పనులు చేస్తున్నప్పటికీ పనుకు వలస సుందరాడ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయడం పట్ల తనకెంతో ఆనందంగా ఉందని అన్నారు. పణుకువలస నుంచి బలిజిపేట పోవు బీటీ రోడ్డు నిర్మాణానికి ఎస్సీ ఎస్ సి ఐ నిధులు రూ.3.05 కోట్లతో నూతన రోడ్డు నిర్మాణానికి చేపట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా సుందరాడ నుంచి వయా నెమాలాం మీదుగా గళావిల్లి పోవు ఆర్ అండ్ బి రహదారికి రూ.,1.0 కోటి రూపాయలతో నూతన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయినట్టు తెలిపారు. అదే విధంగా సుందరాడ నుంచి రామినాయుడు వలస ( రాజాం మండలం) వరకు పోవు రహదారి నిర్మాణానికి రూ .90 లతో నూతన రోడ్డు నిర్మాణం కోసం ఉపాధి హామీ నిధులు నిధులు ద్వారా పనులు జరుగుతాయని ఆయన వివరించారు. అందుకు నియోజకవర్గ ప్రజలు కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షణతులు కావాలని తద్వారా మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిపించుకోవాలని ఆయా గ్రామాల ప్రజలను కోరారు. అలాగే బొబ్బిలి బు దా చైర్మన్ తెంటు లక్ష్మీ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే బేబీ నాయన కృషి పట్టుదలకు అభినందించారు.

# యువత మారక ద్రవ్యాలకు బానిసలు కాకూడదు... ఎక్సైజ్ సీఐ చక్రవర్తి

చీపురుపల్లి జూన్ 23 ప్రభాతవార్త..




యువత మానక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చీపురుపల్లి ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ చక్రవర్తి విద్యార్థులకు సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం నాడు పట్టణంలోని పలు కళాశాలలో యువతకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కద్రవ్యాలకు చెడు వ్యసనాలకు యువత బానిసలు కావడం వలన భవిష్యత్తు నాశనం అవుతుందని అన్నారు. మత్తుకు బానిసైనా విద్యార్థులు భవిష్యత్తులో అనారోగ్యం పాలు కావడం తప్పదు అన్నారు. దీని కారణంగా జీవితాలు నాశనం అవుతాయని ఎంతో ఆశలతో చదివిస్తున్న తల్లిదండ్రుల కలలు కూడా చెదిరిపోతాయని ఆయన సూచించారు. మారకద్రవ్యాలు అమ్మిన కొనిన నిల్వచేసిన చట్టరీత్యా నేరస్తులు అవుతారని, తద్వారా కేసులలో ఇరుక్కొని భవిష్యత్తులో నాశనం చేసుకుంటారని ఆయన హెచ్చరించారు. అనుమానస్పద వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే తెలిసిన సమాచారాన్ని సమీప పోలీస్ స్టేషన్కు లేదా ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయము నాకు తెలియజేయాలని ఆయన కోరారూ. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ చక్రవర్తి తో పాటు సబ్ ఇన్స్పెక్టర్ జి గిరీష్ ఎక్సైజ్ సిబ్బంది పలు కళాశాలల విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల వినియోగానికి విద్యార్థులు దూరంగా ఉండాలి



నెల్లిమర్ల,జూన్ 23, ప్రభాతవార్త

మాదక ద్రవ్యాలు మత్తు పదార్థాల వినియో గానికి విద్యార్థులు దూరం గా ఉండాలని నెల్లిమర్ల ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎం వెంకటరావు సూచించారు. ఈనెల 26వ తేదీన జరగనున్న ప్రపంచ మాదకద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినో త్సవాన్ని పురస్కరించుకొని నెల్లిమర్ల ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఉన్నతాధికారులు ఆదేశముల మేరకు స్థానిక సికేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు మత్తుపదార్థా లకు బానిసలు అయితే జీవితం నాశనం అవుతుందని ఈ విషయాన్ని ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని ఆయన సూచించారు. గంజాయి తదితర మత్తు పదార్థాల వినియోగించినా, అమ్మకం కొనుగోలు జరిపినా కఠిన శిక్షలు తప్పవని ఆయన హెచ్చరించారు. స్థానిక ఎక్సైజ్ ప్రొహిబిషన్ ఇన్స్ పెక్టర్ ఎం. వెంకటరావుతో పాటు సబ్ ఇన్స్పెక్టర్ ఎం.శంకరరావు సిబ్బందితో పాటు కాలేజీ ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

# బాలికలు చెడుఅలవాట్లకు దూరం పెట్టాలి : సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడు

దత్తిరాజేరు జూన్ 23 ప్రభాత వార్త

బాలికలు చెడుఅలవాట్లను దూరం పెట్టి మంచి అలవాట్లకు దగ్గర అవ్వాలని చదువే.మీ జీవితాలకు వెలుగునిస్తాయని గజపతినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడు తెలిపారు అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగామంగళవారం మండల కేంద్రమైన కస్తూరిబా గాంధీ బాలికల హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు ఈ అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి సీ.ఐ మాట్లాడుతూ విద్యార్థులు చదువు వైపే దృష్టి పెట్టాలన్నారు ఉపాధ్యాయులు చెప్పిన పాటలు క్రమశిక్షణతో వినాలన్నారు చదువుకొని ఏదైనా సాధించాలని పట్టుదల మీలోవచ్చినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని పొందుతారు తెలిపారు చెడు ఆలోచనలు మనసులో రాకూడదన్నారు బాగా చదువుకొని తల్లిదండ్రులు కలలునెరవేర్చాలన్నారు మీకు ఎవరు వలన ఇబ్బంది కలిగినట్లయితే మాకు వెంటనే సమాచారం తెలియజేయాలన్నారు ఈ కార్యక్రమంలో ఎస్సై కళాధర్ పోలీసులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# దీపాలతో జైశ్రీరామ్ ఆకృతి

నెల్లిమర్ల, జూన్ 23, ప్రభాతవార్త

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానంలో ఆంజనేయ స్వామి సన్నిధి మంగళవారాన్ని పురస్కరించుకొని అర్చకులు జైశ్రీరామ్ ఆకృతి లో దీపాలను ఏర్పాటు చేశారు. దేవస్థానం ప్రధాన అర్చకులు ఖండవిల్లి సాయి రామాచార్యులు, అర్చక బృందం ఈ ఆకృతిని ఏర్పాటు చేశారు. భక్తులు వీటిని తిలకించి తన్మయత్వం చెందారు.

# పునాదులకే పరిమితమైన వెల్నెస్ సెంటర్ -అద్దె భవనంలో అగచాట్లు

రామభద్రపురం..జూన్ 23..ప్రభాత వార్త



మండలపరిధిలోని దుప్పలపూడి గ్రామంలో మంజూరైన వెల్నెస్ సెంటర్ పునాదులకే పరిమితమైంది. 20220 సంవత్సరంలో మంజూరైన ఈ వెల్నెస్ సెంటర్ ఇప్పటికీ పూర్తికాకపోవడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యమో, కాంట్రాక్టర్ అసమర్థతో వెరసి ఈ పనులు అంతంతమాత్రంగా జరుగతున్నాయి. దీంతో గ్రామంలో ఒక భవనంను అద్దెకు తీసుకొని హెల్త్ సబ్ సెంటర్ను నిర్వహిస్తున్నారు. అయితే ఆ భవనంలో ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో వైద్య సిబ్బంది అవస్థలు వర్ణనాతీతం. కనీసం ఆ భవనంలో బాత్రూం కూడా లేకపోవడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకొని వెల్నెస్ సెంటర్ పూర్తిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
25
వార్త

# కబుర్లతో రైతుల కష్టాలు తీర్చలేరు.. మాజీవిప్ గద్దె...

చీపురుపల్లి జూన్ 23 ప్రభాతవార్త



నియోజకవర్గంలో రైతులకు ప్రధాన నీటిమన రుగా ఉన్న తోటపల్లి కాలువలో పేరుకుపోయిన పూడికతీత, డెక్కల తొలగింపు, జరిపి రైతులకు సాగునీరు అందించాలని మాజీ విప్ గద్దె బాబురావు కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తోటపల్లి కాలువపై అధికారులు చెబుతున్న కబుర్లతో రైతుల కష్టాలు తీరవన్నారు. ఖరీఫ్ రబీ సీజనులకు రైతులకు తోటపల్లి కాలువ నీరు అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు తో పాటు తాను ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో రైతుల కష్టాలు తీర్చడానికి ఏర్పాటుచేసిన తోటపల్లి కాలువపై అధికారులు నిర్లక్ష్యం చేయడం తగమన్నారు. అదేవిధంగా రైతులకు నిత్యం తొమ్మిది గంటలసేపు కరెంటు అందజేయకుండా విద్యుత్ శాఖ అధికారులు కూడా రైతులతో ఆటలాడుకుంటున్నారని ఈ సందర్భంగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వేల పాల లేని విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని ఈ సందర్భంగా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి వేళలో సరఫరా నిలిపివేస్తూ ఉండడంతో రైతులు కరెంటు కోసం ఎదురుచూస్తూ విష సర్పాల బారిన పడి ప్రాణాలు పోగొట్టుకునే దుస్థితి నెలకొంది ఆయన అన్నారు.. రైతులు ఎదుర్కొంటున్న కరెంట్ కష్టాల పైన కూడా ఆర్ఇసిఎస్ పునరుద్ధరణ పేరుతో కొంతమంది, ఏపీపీడీసీఎల్ పాలన పేరుతో కొంతమంది అధికారులు రైతుల సమస్యలు పట్టించుకోవడంలేదని ఆయన అన్నారు. ఇప్పటికైనా పాలకులు దృష్టిసారించి రైతులు ఎదుర్కొంటున్న సాగునీరు, విద్యుత్ కష్టాలను తీర్చాలని ఈ సందర్భంగా గద్దె కోరారు

# పి ఎం స్వానిది రుణాలు సద్వినియోగ పరచుకోవాలి

గరివిడి, జూన్ 23,ప్రభాత వార్త:




చిల్లర వర్తకులు పి ఎం స్వానిది రుణాలు సద్వినియోగం ద్వారా తమ ఆర్థిక స్థిరత్వాన్ని మెరుగు పరచుకోవాలని మెప్మా డి పి ఎం డి. గోవిందరావు పేర్కొన్నారు. గరివిడి వెలుగు కార్యాలయంలో పి ఎం స్వానిది రుణాలు మంజూరు కి సంబంధించి నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న ఆయన పలు సూచనలు చేశారు. చిల్లర వర్తకులు కి పి ఎం స్వానిది ఎంతో మేలు చేకూరుస్తున్నాయన్నారు. వారి జీవనాన్ని మెరుగు పరచుకునేందుకు రుణాలు వినియోగించు కోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్ బి ఐ బి ఎం కె.చరణం కుమార్,వెలుగు ఏ పి ఎం ధనలక్ష్మి, హేమాంబర రావు,సి సి లు,వి ఓ ఏ లు పాల్గొన్నారు.

# గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గూర్చి విద్యార్థినిలకు అవగాహన -ఎస్ఐ జ్ఞానప్రసాద

రామభద్రపురం.. జూన్ 23..ప్రభాత వార్త



విద్యార్థులు విద్యకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్ఐ జ్ఞానప్రసాద్ సూచించారు. మండల పరిధిలోని ఆరికతోట జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళ వారం గుడ్ టచ్, బ్యాడ్ టచ్పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థులు సెల్ ఫోన్కు దూరంగా ఉండాలని తెలిపారు. ఎవరైనా విద్యార్థినిలను వేధిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. 18 సంవత్సరాలలోపు పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడితే పోక్సో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని తెలిపారు. లక్ష్యాన్ని ఏర్పరచుకొని దానిని అధిగమి శీచే దిశగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నారాయణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రగతికి క్రీడలే మార్గం
## రిలయన్స్ ఫౌండేషన్, జెకెఎస్ సంస్థ

పార్వతీపురం, 23 జూన్, ప్రభాతవార్త:



గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో, ప్రజల ఆరోగ్య సంరక్షణలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని రిలయన్స్ ఫౌండేషన్ రూరల్ ట్రాన్స్ ఫార్మేషన్ ప్రోగ్రామ్ మరియు జన కళ్యాణ సమాఖ్య ప్రతినిధులు పేర్కొన్నారు. అంతర్జా తీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించు కుని, "లెట్స్ మూవ్ ఇండియా" (కదలిరండి భారతీయులారా) అనే నినాదంతో మండలం లో బొడ్డవలస, శాండివలస, లిడికివలస, అజూరు, కుంబింవలస గ్రామాల్లో వారు సంయుక్తంగా మంగళవారం ఒలింపిక్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "ఆత్మనిర్భర్ గావ్" (స్వయం సమృద్ధ గ్రామాలు) లక్ష్య సాధనలో భాగంగా క్రీడలను ఒక శక్తివంతమైన సాధనంగా మలచడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు. శారీరక శ్రమ యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ ఒలింపిక్ విలువ లైన ప్రతిభ, గౌరవం, స్నేహభావాన్ని పెంపొందించుకోవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. క్రీడలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా నాయకత్వ లక్షణాలు, జట్టుకృషి, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నిర్ణయాధికారం మరియు సామాజిక సామరస్యాన్ని పెంపొందించడానికి ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. బలిష్టమైన, స్వయం సమృద్ధ గ్రామీణ సమాజ నిర్మాణానికి ఈ గుణాలు ఎంతో అవసరమని, క్రీడల ద్వారా సమగ్ర గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. ఈ వేడుకల్లో పాఠశాల విద్యార్థులు, యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ క్రీడలు, ఫిట్నెస్ పోటీల్లో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు సర్టిఫికెట్లు, మెమొంటోలను అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న వారందరితో 'ఒలింపిక్ డే ప్రతిజ్ఞ' ఎల్లప్పుడూ చురుగ్గా ఉంటూ, క్రీడా స్ఫూర్తిని చాటుతూ, తమ గ్రామాల అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యం, విద్య, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ, స్వయం సమృద్ధ గ్రామాలను తయారుచేసేందుకు రిలయన్స్ ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తోందని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జీఖూ జజూా నీదిల్ వర్గీస్, రిలయన్స్ డి పి ఎం బాబురావు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

VIZIANAGARAM
MUNICIPAL CORPORATION

e-Proc.short NIT No.948/11/E/TO/2026-27, Dt.23-06-2026

Digging of plantation pits & transporting of plants, S/D of compact Photometer, New M.S.tree guards, CC Drain, Culvert, Repairing of Walking Track & Curb Wall, Pumproom & Providing Water Supply arrangement to Dhobi Khana under General funds Est Cost Rs. 55.25 Lakhs.

| | |
|---|---|
| Download start date & time | Dt.24-06-2026 from 3.30 P.M. |
| Download end date & time | Dt.02-07-2026 upto 3.30 P.M. |
| Bid Submission Closing Date&Time | Dt.02-07-2026 upto 4.00 P.M. |
| Bid opening date & time | Dt.02-07-2026 upto 4.30 P.M. |

Contact Nos. 9849908295, 9849907020.
Further details can be seen at www.apeprocurement.gov.in
For COMMISSIONER

# మెస్సీ వెనుకే ఎంబాపె

## నాకౌట్‌కు ఫ్రాన్స్, నార్వే అర్హత * జోర్డాన్‌కు షాకిచ్చిన అల్జీరియా



రెండు గోల్స్‌తో ఫ్రాన్స్‌కు విజయాన్నందించిన ఎంబాపె



అల్జీరియాకు గోల్ చేస్తున్న నాథర్ బెన్‌బొలి



గెలుపు సంబరాల్లో నార్వే ఆటగాళ్లు

**ఫెన్సిల్వేనియా(అమెరికా), జూన్ 23**

సాకర్ ప్రపంచకప్‌లో ఫ్రాన్స్ దూసుకుపోతోంది. వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. గ్రూప్-ఐలో భాగంగా ఇరాక్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫ్రాన్స్ 3-0 గోల్స్ తేడాతో గెలుపొందింది. వందో మ్యాచ్‌లో ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు కైలియన్ ఎంబాపె డబుల్ గోల్స్‌తో మెరవగా, ఓస్మన్ డెంబ్లె మరోగోల్ చేశాడు. ఈవిజయంతో గ్రూప్-ఐ నుంచి నాకౌట్‌కు ఫ్రాన్స్ అర్హత సాధించింది. వర్షంఅడ్డంకితో రెండు గంటల ఆలస్యంగా మొదలైన ఈమ్యాచ్‌లో ఎంబాపె అద్భుత ఆటతీరుతో గోల్స్ వర్షం కురిపించాడు. ఆట 14వ నిమిషంలో కార్నర్ నుంచి బంతిని గోల్ పోస్టులోకి తరలించిన ఎంబాపె సాకర్ వరల్డ్ కప్‌లో 15 వ గోల్ సాధించాడు.

ఈ గోల్ ఆధిక్యంతోనే ఫ్రాన్స్ తొలి అర్ధబాగం ముగించింది. రెండో అర్ధభాగంలోనూ ఫ్రాన్స్ దూకుడుకు ఎదురులేకపోయింది. పలుసార్లు ఇరాక్ డిఫెండర్లను చమ్మాఇస్తూ గోల్స్ చేసినంత పనిచేసింది. ఇక 54వ నిమిషంలో మరోసారి మెరిసిన ఎంబాపె రెండో గోల్ సాధించడంతో పాటు ఫ్రాన్స్‌ను 2-0తో ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. మరో పది నిమిషాలకు బాలన్ డీ ఓర్ అవార్డు విజేత ఓస్మన్ డెంబ్లె గోల్ చేయడంతో ఫ్రాన్స్ ఖాతాలో మూడో గోల్ చేరింది. మరోవైపు 1986 తర్వాత రెండో ఫిఫా ప్రపంచకప్ ఆడుతున్న ఇరాక్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది.

### సెంచరీ క్లబ్‌లో ఎంబాపె

ఎంబాపెకు ఇది వందో అంతర్జాతీయ మ్యాచ్. సెంచరీ క్లబ్‌లో చేరిన ఎంబాపె... రెండు గోల్స్‌తో ఫిఫా కప్‌లో గోల్స్ సంఖ్యను 16కు పెంచుకున్నాడు. ఫిఫా చరిత్రలో అత్యధిక గోల్స్ కొట్టిన ఆటగాళ్ల జాబితాలో ఎంబాపె.. జర్మనీ దిగ్గజం మిరోస్లావ్ క్లోస్ (16 గోల్స్) సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాడు. అంతక ముందు 15వ గోల్ కొట్టి బ్రెజిల్ దిగ్గజం రొనాల్డో రికార్డును సమం చేశాడు. ఇక ఫిఫా ప్రపంచకప్‌లో ఈసారి మెస్సీ, ఎంబాపె మధ్య నంబర్ గేమ్ నడుస్తోంది. వస్తా నీ వెనుక అన్నట్లుగా మెస్సీకి పోటీగా ఎంబాపె వరుస గోల్స్‌తో రెచ్చిపోతున్నాడు. రాబోయే మ్యాచ్‌లో మిరాస్లావ్ క్లోస్ రికార్డును బద్దలు కొట్టనున్న ఎంబాపె ఆ తర్వాత మెస్సీని దాటినా ఆశ్చర్యం లేదు.

### సెనెగల్‌పై నార్వే విజయం

ఫిఫా ప్రపంచకప్‌లో నార్వే నాకౌట్‌కు అర్హత సాధించింది. గ్రూప్-ఐలో భాగంగా సెనెగల్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో నార్వే 3-2తో విజయాన్ని అందుకుంది. నార్వే తరఫున స్టార్ ఆటగాడు ఎర్లింగ్ హాలండ్ రెండు గోల్స్ సాధించి కీలకపాత్ర పోషించాడు. మరో గోల్ మార్కస్ పెడెర్సన్ సాధించి పెట్టాడు. తొలి అర్ధ భాగం 43వనిమిషంలో మార్కస్ పెడెర్సన్...నార్వేకు తొలి గోల్ అందించాడు. ఇక రెండో అర్ధభాగం ప్రారంభమైన మూడో నిమిషంలోనే ఎర్లింగ్ హాలండ్ అద్భుత గోల్ కొట్టాడు. మరో పది నిమిషాల తర్వాత రెండో గోల్ చేశాడు. అటు సెనెగల్ తరఫున ఇస్మాయిల్ 53వ నిమిషంలో, ఇంజ్యూరీ టైమ్(90+3వ నిమిషం)లో రెండు గోల్స్ కొట్టాడు. ఈ విజయంతో నార్వే నాకౌట్ దశకు చేరుకోగా సెనెగల్ ఆడిన రెండింటిలో ఓడి ఇంటిబాట పట్టింది. ఫిఫా ప్రపంచకప్‌లో వరుసగా రెండు మ్యాచ్‌లు గెలవడం నార్వేకు ఇదే తొలిసారి. ఇక ఎర్లింగ్ హాలండ్ అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో గోల్స్ సంఖ్య 59కు చేరింది. లీగ్ దశలో నార్వే తన చివరి మ్యాచ్‌ను ఫ్రాన్స్‌తో ఆడనుంది.

### జోర్డాన్‌పై అల్జీరియా సంచలనం

గ్రూప్-జెలో సంచలనం నమోదైంది. జోర్డాన్‌పై 2-1 గోల్స్ తేడాతో అల్జీరియా సంచలన విజయం సాధించింది. ఫిఫా ప్రపంచకప్‌లో గెలుపు బోణీ చేయాలన్న జోర్డాన్ ఆశలపై నీళ్లు చల్లింది. తొలి అర్ధభాగంలో జోర్డాన్ ఆధిక్యం చాటగా, రెండో అర్ధభాగంలో అల్జీరియా ఆధిపత్యం ప్రదర్శించింది. తొలి అర్ధభాగం 36వ నిమిషంలో నిజర్ అల్‌రషదన్ గోల్‌తో జోర్డాన్ 1-0 ఆధిక్యం కనబరిచింది. రెండో అర్ధభాగం ప్రారంభమైన 25 నిమిషాల వరకు ఆధిక్యాన్ని కాపాడుకుని గెలుపుపై ధీమాతో నిలిచింది. 69వ నిమిషంలో నాధిర్ బెన్‌బొలి గోల్ చేసి అల్జీరియాను 1-1తో సమవుజ్జీగా నిలిపాడు. ఇక మరో పది నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందగా అమినె గుయిరి గోల్ చేసి అల్జీరియాకు విజయం సాధించిపెట్టాడు. జోర్డాన్ ఆడిన రెండింటిలోనూ ఓటములతో ఫిఫా ప్రపంచకప్ నుంచి నిష్క్రమించింది. అర్జెంటీనా రెండు విజయాలతో గ్రూప్-జె నుంచి ఇప్పటికే నాకౌట్ బెర్తును ఖరారు చేసుకోగా, రెండో బెర్తు కోసం ఆస్ట్రియా-అల్జీరియా మధ్య పోటీ నెలకొంది. ఈ మ్యాచ్‌లో నెగ్గిన జట్టు నాకౌట్‌లో ప్రవేశిస్తుంది.

# ఒకే ఒక్కడు

ఆట



**డాలస్, జూన్ 23 :** సాకర్ అభిమానులను లియోనెల్ మెస్సి మానియా ఊపేస్తోంది. అంచనాలకు అనుగుణంగా ఈ ఫిఫా వరల్డ్‌కప్‌లో అర్జెంటీనా స్టార్ గోల్స్ వర్షం కురిపిస్తున్నాడు. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనే ఏకంగా అయిదు గోల్స్ కొట్టిన మెస్సి... ఫుట్‌బాల్ చరిత్రలో అరుదైన ఘనత అందుకున్నాడు. ఆస్ట్రియాతో మ్యాచ్‌లో మరో రెండు గోల్స్ చేసిన మెస్సి.. సాకర్ ప్రపంచ కప్‌లో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచాడు. మొత్తం 18 గోల్స్‌తో జర్మనీ దిగ్గజం మిరోస్లావ్ క్లోజ్(16 గోల్స్)ను అధిగమించాడు. తొలి మ్యాచ్‌లో హ్యాట్రిక్‌తో అర్జెంటీనాకు అద్భుత విజయం అందించిన మెస్సి... రెండో మ్యాచ్‌లోనూ చెలరేగాడు. 38వ నిమిషంలో ఓ గోల్, అదనపు సమయం (90+5 నిమిషం)లో మరో గోల్ సాధించాడు. ఇప్పటివరకు అర్జెంటీనా అయిదు గోల్స్ చేస్తే అవన్నీ మెస్సి అందించినవే కావడం విశేషం. 18 గోల్స్‌తో మెస్సి అగ్రస్థానానికి దూసుకెళ్లాడు. నిజానికి మెస్సి ఖాతాలో మరో గోల్ చేరాల్సింది. 9వ నిమిషంలో లభించిన పెనాల్టీని లియోనెల్ మెస్సి వృథా చేశాడు. లేదంటే గోల్స్ సంఖ్య 19కు, ఈ ఫిఫా ప్రపంచ కప్‌లో రెండో హ్యాట్రిక్ నమోదయ్యేది.

2006 జర్మనీలో జరిగిన ఫిఫా ప్రపంచకప్‌లో తొలి సారి ఆడిన లియోనెల్ మెస్సికిది ఇది ఆరో సాకర్ వరల్డ్‌కప్. సెర్బియాపై తొలి గోల్ సాధించిన మెస్సి అప్పటినుంచి గోల్స్ వర్షం కురిపిస్తూనే ఉన్నాడు. 2010 సౌతాఫ్రికాలో జరిగిన ఫిఫా వరల్డ్‌కప్‌లో గోల్స్ ఖాతా తెరవలేదు. ఇక 2014 ఫిఫా కప్‌లో నాలుగు గోల్స్, 2018లో ఒక గోల్, ఖతర్‌లో జరిగిన 2022 ఫిఫా కప్‌లో ఏకంగా ఏడు గోల్స్ సాధించాడు. ఈ ప్రపంచకప్‌లో ఇప్పటికే అయిదు గోల్స్ నమోదుచేశాడు. వరుసగా రెండో ఫిఫా కప్ అందించే జోరులో కొనసాగుతున్నాడు. ఒక ఫిఫా ప్రపంచకప్‌లో అత్యధిక గోల్స్ చేసిన ప్లేయర్‌గా జస్ట్ ఫొంటైన్(ఫ్రాన్స్, 13 గోల్స్) పేరిట రికార్డు ఉంది.



## పద్మశ్రీ రోహిత్, పద్మభూషణ్ విజయ్ అమృత్‌రాజ్

**న్యూఢిల్లీ, జూన్ 23:** ఇండియన్ టెన్నిస్ లెజెండరీ విజయ్ అమృత్‌రాజ్ పద్మభూషణ్, క్రికెటర్ రోహిత్ శర్మ పద్మశ్రీ అవార్డులు అందుకున్నారు. రాష్ట్రపతి నిలయంలో జరిగిన కార్యక్రమంలో వీరిద్దరికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పురస్కారాలను ప్రదానం చేశారు. టీమిండియా ఉమెన్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ గత నెలలో అవార్డు అందుకోగా, తాజాగా రోహిత్ పద్మశ్రీ స్వీకరించాడు. టీమిండియాకు అందించిన సేవలకు గుర్తింపుగా రోహిత్ శర్మకు కేంద్ర ప్రభుత్వం ఈ పురస్కారం ప్రకటించింది. రోహిత్ కెప్టెన్సీలో భారత్ 2024 టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకోవడంతో పాటు, 2025 ఛాంపియన్స్ ట్రోఫీని కూడా కైవసం చేసుకుంది. పద్మశ్రీ అందుకున్న భారత క్రికెట్ ప్రముఖుల జాబితాలో ఇప్పుడు రోహిత్ శర్మ కూడా చేరాడు. కాగా భారత టెన్నిస్‌కు గుర్తింపు తెచ్చిన విజయ్ అమృత్‌రాజ్... పలు విజయాలు అందించాడు. 1974, 1987లో డేవిస్ కప్‌లో భారత్‌ను రన్నరప్‌గా నిలపడంతో కీలక పాత్ర పోషించాడు. కెరీర్‌లో 16 సింగిల్స్, 13 డబుల్స్ టైటిల్స్ గెలుపొందాడు.


## పాక్‌ను చిత్తుచేసిన భారత్ హాకీ వీరులు

**లండన్, జూన్ 23:** ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్ హాకీలో టోర్నీలో భారత్ విజయపరంపర కొనసాగిస్తోంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 4-3 గోల్స్ తేడాతో గెలుపొందింది. ఓ దశలో వెనకబడ్డా పుంజుకున్న హర్మన్‌ప్రీత్ సేన... అద్భుత ప్రదర్శన చేసింది. భారత్‌కు అభిషేక్, నీలకాంత శర్మ, సుఖ్‌జీత్ సింగ్, రాజిందర్ సింగ్ చేసిన గోల్స్ అందించారు. పాకిస్థాన్ తరఫున అహ్మద్ నదీమ్, అబు మహమూద్, మొయిన్ షకీల్ గోల్స్ చేశారు. ఎనిమిదో నిమిషంలో పాకిస్థాన్‌కు లభించిన పెనాల్టి కార్నర్ అవకాశాన్ని నదీమ్ సమీపం నుండి గోల్‌గా మలచడంతో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. రెండో క్వార్టర్‌లో సర్కిల్ మధ్య నుండి అభిషేక్ చక్కటి గోల్‌తో స్కోరును సమం చేశాడు. రెండు నిమిషాల తర్వాత, హర్మన్‌ప్రీత్ కొట్టిన డ్రాగ్‌ఫ్లిక్ గోల్ పోస్ట్‌కు తగిలి రీబౌండ్ కాగా నీలకంఠ దాన్ని గోల్‌గా మలిచాడు. 40వ నిమిషంలో సుఖ్‌జీత్ అద్భుతమైన డైవింగ్ షాట్‌తో భారత్ ఆధిక్యాన్ని 3-1కు చేర్చాడు. జూన్ 25న ఇంగ్లాండ్‌తో తదుపరి మ్యాచ్ ఆడనుంది.



# పెట్టుబడుల విత్‌డ్రాతో నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబై, జూన్ 23:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం తీవ్ర స్థాయి అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బలహీనమైన అంతర్జాతీయ సంకేతాలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, ర్యాలీ తర్వాత లాభాల స్వీకరణ ప్రభావంతో సెన్సెక్స్ దాదాపు 900 పాయింట్లు క్షీణిస్తే నిఫ్టీ 23,850స్థాయి దిగువకు జారిపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్ 893.39పాయింట్లు క్షీణించి76,200.68వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ278.80పాయింట్లు నష్టపోయి 23,824.10 వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లలో కూడా భారీ అమ్మకాలు నమోదయ్యాయి. ముఖ్యంగా దక్షిణ కొరియా కోస్పీ సూచీ 9 శాతానికి పైగా కుప్పకూలడంతో ట్రేడింగ్ తాత్కాలికంగా నిలిపివేసింది. ఐటీ, మెటల్ రంగ షేర్లలో భారీ అమ్మకాలు నమోదయ్యాయి. మరోవైపు అమెరికా డాలర్ బలపడటం, రూపాయి బలహీనపడటం, ఇన్ఫోసిస్ 3.42శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.75 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.55 శాతం నష్టపోయినిఫ్టీకి ఎక్కువ నష్టం తెచ్చాయి . బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.88 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.62 శాతం క్షీణించాయి.




ఎన్ఎస్ఈలో 1,020 షేర్లు లాభపడగా, 2,280 షేర్లు నష్టపోయాయి. 99షేర్లు మార్పులేకుండా ముగిశాయి. 10ఏళ్ల ప్రభుత్వ బాండ్ రాబడి 6.851 శాతం నుంచి 6.826 శాతానికి తగ్గింది. రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 94.73 వద్ద స్థిరపడింది. ఎంసీఎక్స్‌లో బంగారం ఫ్యూచర్స్ ధర 0.96 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,46,722కు చేరితు బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 77.41 డాలర్లకు పడిపోయింది. గ్లోబల్ మార్కెట్లు ఒత్తిడిలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరిన్ని వడ్డీ రేటు పెంపులు చేపట్టే అవకాశాలు పెరగడంతో ప్రపంచ మార్కెట్లలో ఆందోళనలు నెలకొన్నాయి. ఈ ఏడాది ముగిసేలోపు కనీసం రెండు సార్లు 25 బేసిస్ పాయింట్ల చొప్పున వడ్డీ రేట్లు పెరగవచ్చని మార్కెట్లు అంచనా వేస్తున్నాయి. వాల్ స్ట్రీట్‌లో సోమవారం ఎస్అండ్‌పీ 500 సూచీ 0.37 శాతం, నాస్‌డాక్ 1.32 శాతం పడిపోయాయి. డౌ జోన్స్ సూచీ స్వల్ప లాభంతో ముగిసింది. ఎమ్‌క్యూర్ ఫార్మాస్యూటికల్స్ షేరు 1.55 శాతం పెరిగితే వేదాంత షేరు భారీ బ్లాక్ డీల్స్ కారణంగా 7.73 శాతం కుప్పకూలింది.

ఇన్ఫో ఎడ్జ్ (ఇండియా) 2.79 శాతం, ఎస్‌పీఎస్‌టీ 5.54 శాతం ఎగిసింది. సిర్మా ఎస్‌జీఎస్ టెక్నాలజీ 3.05 శాతం, ఇంటరార్చ్ బిల్డింగ్ సొల్యూషన్స్ రూ.165 కోట్ల ఆర్డర్ పొందడంతో 1.19 శాతం లాభపడింది. బిర్లా కార్పొరేషన్ 1.32 శాతం, డిఫ్యూజన్ ఇంజినీర్స్ 2.55 శాతం పెరిగాయి. టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్ సొల్యూషన్స్ ఐపీఓకు 1.19 రెట్లు సబ్‌స్క్రిప్షన్ లభించింది. వాటర్‌వేస్ లీజర్ టూరిజం ఐపీఓకు కేవలం 0.18 రెట్లు మాత్రమే స్పందన వచ్చింది. అద్వైత్ జ్యువెల్స్ ఐపీఓకు మాత్రం భారీ స్పందన లభించి 10.49 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది.



## ధరల్లో భారీ పతనం.. 3 శాతం తగ్గుదల

# పసిడి, వెండిపై ఫెడ్ రిజర్వు ఎఫెక్ట్

**ముంబై, జూన్ 23 :** అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరిన్ని వడ్డీ రేట్ల పెంపులకు పాల్పడవచ్చన్న అంచనాలు ప్రపంచ పెట్టుబడిదారుల సెంటిమెంట్‌పై ప్రభావం చూపడంతో మంగళవారం బంగారం, వెండి ధరలు బలహీనయ్యాయి. పసిడి వెండి ధరలు 3 శాతం వరకు తగ్గాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ఆగస్టు డెలివరీ బంగారం ఫ్యూచర్స్ ధర 10 గ్రాములకు రూ.1,46,776 వద్ద ప్రారంభమైంది. గత ముగింపు ధర రూ.1,48,188తో పోలిస్తే రూ.1,412తక్కువ. మధ్యాహ్నం 12 గంటల సమయానికి బంగారం ధర రూ.1,46,379 వద్ద ట్రేడవుతూ, గత ముగింపుతో పోలిస్తే రూ.1,739 నష్టాన్ని నమోదు చేసింది. ట్రేడింగ్ సెషన్‌లో గరిష్టంగా రూ.1,47,090, కనిష్టంగా రూ.1,46,070 స్థాయిలను తాకింది. ఇక జూలై డెలివరీ వెండి ఫ్యూచర్స్‌లో బంగారంతో పోలిస్తే మరింత ఒత్తిడి కనిపించింది. వెండి ధర కిలోకు రూ.2,27,676 వద్ద ప్రారంభమై, గత ముగింపు ధర రూ.2,34,310తో పోలిస్తే రూ.6,634తగ్గింది. తదుపరి ట్రేడింగ్‌లో వెండి ధర2,27,119 వద్ద కొనసాగుతూ రూ.7,191 నష్టాన్ని చవిచూసింది. రోజంతా కనిష్టంగా రూ.2,26,556 స్థాయిని తాకి 3.30 శాతం వరకు పడిపోయింది. గరిష్టంగా 2,28,800 వద్ద నమోదైంది. రానున్న కాలంలో రూ.2,30,500 రూ.2,31,600 మధ్య ప్రతిఘటన ఉండగా, రూ.2,28,000మద్దతుస్థాయికి దిగువకు వెళితే ధరలు రూ.2,26,000, ఆపై రూ.2,24,000 వరకు పడిపోయే అవకాశం ఉందని బులియన్ నిపుణులు అంచనా వేశారు. మరోవైపు, వెండి ధర మళ్లీ రూ.2,30,000 మార్కును అధిగమిస్తే కోలుకునే అవకాశాలు మెరుగుపడతాయన్నారు. అమెరికా డాలర్ బలపడటం, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచేందుకు ఫెడరల్ రిజర్వ్ కఠిన ద్రవ్య విధానాన్ని కొనసాగించవచ్చన్న అంచనాలే విలువైన లోహాల ధరల బలహీనతకు ప్రధాన కారణమని నిపుణులు వివరించారు. అదనంగా, ఈ వారం విడుదల కానున్న అమెరికా ఉపాధి, నిరుద్యోగ గణాంకాలపై పెట్టుబడిదారులు దృష్టి సారించారని, అవే బంగారం, వెండి ధరల దశదిశలు నిర్ణయించే కీలక అంశాలుగా మారవచ్చని నిపుణుల అంచనా.

# బ్యాంకింగ్ వ్యవస్థలోకి 1.41లక్షల కోట్ల నగదు ప్రవేశపెట్టిన ఆర్బీఐ




**ముంబయి, జూన్ 23:** బ్యాంకింగ్ వ్యవస్థలోకి భారీగా నగదును విడుదల చేసింది. ఏడు రోజుల వీఆర్ఆర్ అంటే వేరియబుల్ రేట్ రెపో వేలం ద్వారా రూ.1.41లక్షల కోట్ల తాత్కాలిక నిధులను విడుదలచేసింది. జీఎస్టీ చెల్లింపుల కారణంగా వ్యవస్థలో ఏర్పడిన నగదు కొరతను అధిగమించేందుకు ఆర్‌బీఐ ఈచర్యలు చేపట్టింది. ఇటీవలి జీఎస్టీ చెల్లింపుల వలన బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో నగదు బయటకు వెళ్లింది. దీంతో బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత ఒక్కసారిగా పడిపోయింది. ఈనెల 21న రూ.30,685 కోట్ల మిగులుతో ఉన్న వ్యవస్థ, 22నాటికి రూ.19,971 కోట్ల లోటుకు చేరుకుంది. ఈ పరిణామంతో స్వల్పకాలిక మనీ మార్కెట్ వడ్డీ రేట్లపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. సగటు కాల్ మనీ రేటు 5.43 శాతానికి చేరింది. ఇది ఆర్‌బీఐ రెపో రేటు కన్నా 0.18 శాతం ఎక్కువ. ఈ క్రమంలో రంగంలోకి దిగిన ఆర్‌బీఐ, వ్యవస్థలో తగినంత నగదు ఉండేలా చర్యలు తీసుకుంది. 5.26శాతం కటాఫ్ రేటుతో బ్యాంకులకు నిధులను అందించింది. ఇలాంటి సమయాల్లో ఆర్‌బీఐ జోక్యం చేసుకోకపోతే, నిధుల సమీకరణ వ్యయంపెరిగి, ఆర్థిక వ్యవస్థలో రుణ ప్రవాహానికి ఆటంకం కలుగుతుంది. ఇది ఆర్థిక మందగమనానికి దారితీసే ప్రమాదం ఉంది. ఆర్బీఐ సాధారణంగా పన్ను చెల్లింపులు, ముందస్తు పన్ను చెల్లింపులు లేదా ఇతర కాలానుగుణ రుణ డిమాండ్ వంటి కారణాల వల్ల ఏర్పడే స్వల్పకాలిక నగదు లోటును సరిచేయడానికి వివిధ ద్రవ్య విధాన సాధనాలను ఉపయోగిస్తుంది.

తాత్కాలిక నగదు అవసరాల కోసం వీఆర్ఆర్ వేలం ప్రక్రియను నిర్వహిస్తుంది. బ్యాంకులు తమ వద్ద ఉన్న ప్రభుత్వ సెక్యూరిటీలను ఆర్‌బీఐ వద్ద తాకట్టు పెట్టి నిధులు పొందుతాయి. దీర్ఘకాలిక ద్రవ్య లభ్యత కోసం ఆర్‌బీఐ సెకండరీ మార్కెట్ నుంచి ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేయడం లేదా డాలర్‌రూపాయి స్వాప్ వేలాలను నిర్వహించడం వంటి చర్యలు చేపడుతుంది. తాజాచర్యతో బ్యాంకింగ్ వ్యవస్థలో స్వల్పకాలిక నిధుల ఒత్తిడి తగ్గి, ఆర్థిక కార్యకలాపాలు సజావుగా సాగేందుకు మార్గం సుగమమైంది.

## మూడు రోజుల్లోనే 52లక్షల కోట్లు హాంఫట్

**ముంబై, జూన్23:** పీవోతో మార్కెట్‌లోకి అడుగుపెట్టిన సంచలనం నమోదుచేసిన అంతరిక్ష సంస్థ స్పేస్‌ఎక్స్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఎలాన్ మస్క్‌కు చెందిన ఈ కంపెనీ షేర్లు వరుసగా మూడోరోజూ పతనమయ్యాయి. కేవలం మూడు రోజుల్లోనే కంపెనీమార్కెట్ విలువ 600 బిలియన్ డాలర్లకుపైగా (సుమారు రూ.52 లక్షల కోట్లు) కరిగిపోయింది. స్పేస్‌ఎక్స్ షేరు మరో 16 శాతం క్షీణించి 154.60 డాలర్ల వద్ద ముగిసింది. కంపెనీ స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయిన తర్వాత నమోదైన కనిష్ఠ స్థాయి ఇదే.

గత మూడు ట్రేడింగ్ సెషన్లలో షేరు మొత్తం 23శాతం పడిపోయింది. దీంతో మార్కెట్ విలువ భారీగా తగ్గినా కంపెనీ మొత్తం విలువ ఇంకా 2 ట్రిలియన్ డాలర్లకు పైగానే ఉంది. ఏఐ రంగంలో విస్తరణకోసం స్పేస్‌ఎక్స్ భారీమొత్తంలో నిధులు సమీకరించేందుకు బాండ్లు జారీ చేయనున్నట్లు ప్రకటించింది. దీనివల్ల కంపెనీపై అప్పుల భారం పెరిగే అవకాశం ఉందని, ఏఐ పెట్టుబడులు ఆశించిన ఫలితాలు ఇస్తాయా అనే సందేహాలు కూడా ఇన్వెస్టర్లలోవ్యక్తమయ్యాయి. దీంతో షేర్లపై అమ్మకాల ఒత్తిడి పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. రికార్డు ఐపీవో తర్వాత స్పేస్‌ఎక్స్ షేర్లపై రిటైల్ ఇన్వెస్టర్ల ఆసక్తి భారీగా కనిపించింది. తొలి ఐదు రోజుల్లోనే వ్యక్తిగత పెట్టుబడిదారులు 405మిలియన్ డాలర్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. స్పేస్‌ఎక్స్ భవిష్యత్ వృద్ధిపై ఇప్పటికే భారీ అంచనాలు ఉండటంతో షేర్ ధర చాలా పెరిగిందని, అందుకే అమ్మకాల ఒత్తిడి కనిపిస్తోందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.



## ఎఐతో 21వేల మందికి కోతపెట్టిన ఒరాకిల్




**న్యూయార్క్:** కృత్రిమ మేధ(ఏఐ) టెక్నాలజీ వేలాది ఉద్యోగాలపై ప్రభావం చూపిస్తోంది. అమెరికా టెక్నాలజీ దిగ్గజం ఒరాకిల్ 2026 ఆర్థిక సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా సుమారు 21వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగించినట్లు వెల్లడించింది. ఏఐ ఆధారిత కార్యకలాపాల విస్తరణ, వ్యాపార పునర్వ్యవస్థీకరణలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ తన వార్షిక నివేదికలో పేర్కొంది. గత ఏడాది 1.62 లక్షల మంది ఉద్యోగులు ఉండగా 2026 మే 31 నాటికి ఆ సంఖ్య 1.41 లక్షలకు తగ్గింది. సంస్థ ఉద్యోగుల సంఖ్యలో ఇది దాదాపు 13 శాతం తగ్గుదల. ఏఐ టెక్నాలజీల వినియోగం ఇప్పటికే ఉద్యోగ కోతలకు దారితీసిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కోతలు కొనసాగొచ్చని ఒరాకిల్ స్పష్టం చేసింది. ఒరాకిల్ ప్రస్తుతం డేటాబేస్ సాఫ్ట్‌వేర్ సంస్థగానే కాకుండా, ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ రంగాల్లో కీలక సంస్థగా ఎదగడానికి భారీ పెట్టుబడులు పెడుతోంది. ఓపెన్‌ఏఐ వంటి సంస్థల అవసరాల కోసం భారీ డేటా సెంటర్ల నిర్మాణంలో నిమగ్నమైంది. ఇందుకోసం ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు 70 బిలియన్ డాలర్ల మూలధన వ్యయం చేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రణాళికలకు నిధులు సమకూర్చేందుకు మరో 40 బిలియన్ డాలర్లు రుణాలు, ఈక్విటీ రూపంలో సమీకరించాలని సంస్థ భావిస్తోంది. ఈ భారీ ఏఐ పెట్టుబడులు సంస్థపై ఆర్థిక ఒత్తిడిని పెంచుతున్నాయి. పునర్వ్యవస్థీకరణ, ఉద్యోగుల తొలగింపుల కోసం 2026 ఆర్థిక సంవత్సరంలో ఒరాకిల్ 1.84 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. ఈ వ్యయం కేవలం 374 మిలియన్ డాలర్లు మాత్రమే ఉండటం గమనార్హం.

## 109.27 కోట్లకు ఇంటర్నెట్ కనెక్షన్లు: ట్రాయ్




**న్యూఢిల్లీ, జూన్ 23:** భారత టెలికాం రంగం శరవేగంతో వృద్ధిని కొనసాగిస్తోంది. దేశంలో ఇంటర్నెట్, టెలిఫోన్ వినియోగదారుల సంఖ్య భారీ స్థాయిలో పెరిగినట్లు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) తాజా నివేదిక వెల్లడించింది. 2026 మార్చి నాటికి దేశంలో మొత్తం ఇంటర్నెట్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 109.27కోట్లకు చేరింది. 2025 డిసెంబర్ చివరి నాటికి ఈ సంఖ్య 102.86 కోట్లుగా ఉండగా, కేవలం మూడు నెలల్లోనే 6.24 శాతం వృద్ధి నమోదైంది. ట్రాయ్ నివేదిక ప్రకారం మొత్తం ఇంటర్నెట్ వినియోగదారులలో 104.62 కోట్ల మంది వైర్‌లెస్ (మొబైల్) ద్వారా, 4.65 కోట్ల మంది వైర్డ్ కనెక్షన్ల ద్వారా ఇంటర్నెట్ సేవలు పొందుతున్నారు. వీరిలో బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారుల సంఖ్య 106.58 కోట్లుగా ఉండగా, న్యారోబ్యాండ్ (56 కేబీపీఎస్ కంటే తక్కువ వేగం) సబ్‌స్క్రైబర్లు 2.69 కోట్లుగా ఉన్నారు. త్రైమాసిక ప్రాతిపదికన బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్ల బేస్ 5.81 శాతం పెరగడం విశేషం. ఇంటర్నెట్‌తో పాటు మొత్తం టెలిఫోన్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య కూడా 133.05 కోట్లకు పెరిగింది.

దీంతో దేశవ్యాప్తంగా టెలిడెన్సిటీ (ప్రతి 100 మందికి ఉన్న ఫోన్ కనెక్షన్లు) గత త్రైమాసికంలోని 91.74 శాతం నుంచి 93.26 శాతానికి మెరుగుపడింది. వైర్‌లైన్ టెలిడెన్సిటీ సైతం 3.33 శాతం నుంచి 3.38 శాతానికి పెరిగింది. వినియోగదారుల నుంచి వచ్చే సగటు నెలవారీ ఆదాయం (ఏఆర్‌పీయూ) కూడా టెలికాం సంస్థలకు సానుకూలంగా ఉంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.